
'ప్రతి రైతూ వాణిజ్యవేత్తగా మారాలి'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 12 వెల: ₹ 6.50

సంపుటి: 15 సంచిక: 361

బుధవారం 13-9-2023

SIMULTANEOUSLY PRINTED AT MUMBAI | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



లంకను గెలిచి...

ఆసియా కప్ ఫైనల్లో భారత్. రాణించిన కుల్దీప్, రోహిత్ శర్మ -10లో



జీ20 ఖర్చు 4,100 కోట్లా?

రూ.4,100 కోట్లు ఖర్చు చేయడంపై విపక్షాల మండిపాటు -6లో



పార్లమెంట్‌లో కొత్త యూనిఫామ్

పార్లమెంటు కొత్త భవనం ప్రారంభం నేపథ్యంలో ఉద్యోగుల యూనిఫామ్‌ను మార్చాలని కేంద్రం నిర్ణయించింది.

వివరాలు 6లో ▸



రష్యా గడ్డపై కిమ్ జోంగ్ ఉన్

ఉత్తర కొరియా అధినేత కిమ్ జోంగ్ ఉన్ పటిష్ట భద్రత మధ్య బుల్లెట్‌ప్రూఫ్ రైలులో మంగళవారం రష్యాకు చేరుకున్నారు.

వివరాలు 6లో ▸



లిబియాలో వరద విధ్వంసం

లిబియాలో భీకర వరదల తాకిడికి 2,800 మందికిపైగా మృతి చెందినట్లు అధికార వర్గాలు వెల్లడించాయి.

వివరాలు 6లో ▸



పల్లె జీవితాలపై పిడుగు..

వాతావరణ మార్పుల కారణంగా 'పచ్చని పల్లె జీవితాల్లో తీరని శోకాన్ని మిగుల్చుతున్న పిడుగుపాట్లపై ప్రత్యేక కథనం.

వివరాలు 12లో ▸

న్యూస్‌రీల్

తెలంగాణలోనూ 'గృహలక్ష్మి'?



ప్రతి మహిళకు నెలకు రూ. 2 వేల నగదు సాయం అందిస్తామంటూ కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల్లో ప్రకటించిన 'గృహలక్ష్మి' పథకాన్ని తెలంగాణలోనూ అమలు చేస్తామని హామీ ఇచ్చేందుకు కాంగ్రెస్ పార్టీ సిద్ధమవుతోంది. ఈ నెల 17న తుక్కుగూడలో నిర్వహించే బహిరంగ సభలో ఈ పథకాన్ని సోనియా చేత ప్రకటింపజేయాలని యోచిస్తోంది.

- వివరాలు 2లో▶

16న మధ్యాహ్నం సీడబ్ల్యూసీ భేటీ షురూ



కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సమావేశాల షెడ్యూల్ విడుదలయింది. మంగళవారం అర్ధరాత్రి ఏఐసీసీ సంస్థాగత వ్యవహారాల ఇన్‌చార్జి ప్రధాన కార్యదర్శి కె.సి.వేణుగోపాల్ షెడ్యూల్ విడుదల చేశారు. ఈ షెడ్యూల్ ప్రకారం 16న మధ్యాహ్నం సీడబ్ల్యూసీ సభ్యులు హైదరాబాద్ చేరుకుంటారు.

- వివరాలు 5లో▶

జమిలి.. చీప్ జిమ్మిక్కు

మీడియాతో ఇష్టాగోష్టిలో బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీఆర్



- ప్రజల అటెన్షన్‌ను పక్కదారి పట్టించేందుకు మోదీ కుట్ర
- తెలంగాణ సహా ఐదు రాష్ట్రాల్లో ఎన్నికలు ఎత్తగొట్టేందుకే జమిలి
- ఆయా రాష్ట్రాల్లో బీజేపీ ఓటమి ఖాయంగా కనిపిస్తుండటమే కారణం
- ఓడితే లోక్‌సభ ఎన్నికల్లో ప్రతికూల ప్రభావం చూపుతుందనే భయం
- జమిలి ఎన్నికలు వచ్చినా మాకు ఎలాంటి నష్టం లేదు
- లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌కు అనుకూలంగానే ప్రజల తీర్పు
- లెక్కలు కుదరకపోవడం వల్లే కమ్యూనిస్టులతో పొత్తు పెట్టుకోలేదు
- మేము బీజేపీతో కుమ్మక్కయ్యామనడం అర్థరహితం

సాక్షి, హైదరాబాద్: 'వన్ నేషన్ వన్ ఎలక్షన్ అనేది కేంద్రంలోని మోదీ ప్రభుత్వం అనుసరిస్తున్న చీప్ జిమ్మిక్కు. ప్రజల అటెన్షన్‌ను పక్కదారి పట్టించే కుట్ర. గతంలోనూ ఈ తరహా జిమ్మిక్కులు చూశాం . గతంలో మోదీ ఇచ్చిన హామీలేవీ నెరవేరనందునే బీజేపీ ఇలాంటి అంశాలను తెరమీదకు తెస్తోంది. త్వరలో ఎన్నికలు జరిగే 5 రాష్ట్రాల్లో బీజేపీ ఓటమి ఖాయంగా కనిపిస్తున్నందున తెలంగాణ సహా ఇతర రాష్ట్రాల్లో ఎన్నికలు ఇప్పట్లో జరగకుండా ఆపే కుట్ర జరుగుతోంది. ఆయా రాష్ట్రాల్లో ఓటమి పాలైతే పార్లమెంటు ఎన్నికల్లో ప్రతికూల ప్రభావం చూపుతుందనే భయంతో ప్రజలను గందరగోళ పరిచే ప్రయత్నాలు జరుగుతున్నాయి. జమిలి ఎన్నికల పేరిట ప్రజల దృష్టిని మళ్లించడంలో బీజేపీ కొంతమేర సక్సెస్ అయ్యింది..' అని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కె.తారక రామారావు అన్నారు. మంగళవారం ప్రగతిభవన్‌లో మీడియా ప్రతినిధులతో ఆయన ఇష్టాగోష్టి నిర్వహించారు.

ఆ శక్తి ఎవరికీ లేదు: 'వన్ నేషన్ వన్ ఎలక్షన్‌ను ఆపే శక్తి కాంగ్రెస్, బీఆర్‌ఎస్ సహా ఎవరికీ లేదు. మోదీ లాంటి వ్యక్తి ఏదో ఎజెండా లేకుండా దీనిని తెరమీదకు తెస్తారని అనుకోవడం లేదు. 17 రాష్ట్రాల్లో బీజేపీ అధికారంలో ఉన్నందున ఈ విధానాన్ని అమలు చేస్తారనే అనుమానం ఉంది. అయితే ఈ నెల 18న ప్రారంభమయ్యే పార్లమెంటు సమావేశాల్లో ఏం జరుగుతుందో మోదీ, అమిత్ షా మినహా ఎవరికీ తెలియదు. రామ మందిరం ప్రారంభం తర్వాతే మోదీ ఎన్నికలకు వెళితే ఏప్రిల్, మే నెలల్లో పార్లమెంట్

మిగతా 2వ పేజీలో ▶



తెలంగాణ సాధనలో కేసీఆర్ పాత్ర ఒక్క శాతమే

- మంత్రి కేటీఆర్ వ్యాఖ్యలపై ఎంపీ కోమటిరెడ్డి ఫైర్
- తెలంగాణ వచ్చిన తర్వాత మీ నాన్న అసెంబ్లీలో ఏం మాట్లాడాడో తెలుసుకో.. -2లో▶



షెడ్యూల్ ప్రకారమే అసెంబ్లీ ఎన్నికలు

- సీఎం పదవి ఇస్తానని దళితులను దగా చేసిన కేసీఆర్
- కాంగ్రెస్, బీఆర్‌ఎస్‌లు మజ్లిస్ చేతిలో కీలుబొమ్మలు
- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి -2లో▶

ఇల్లు కాదు జైలే..

మీ ఇంట్లో వద్దు... జైల్లోనే ఉండండి | **ఇంటి వద్ద కంటే అక్కడే భద్రత ఎక్కువ**



చంద్రబాబుకు ఏసీబీ కోర్టు స్పష్టీకరణ

- 'హౌస్ రిమాండ్' పిటిషన్ కొట్టివేత
- ఏ చట్టంలోనూ దీనిపై నిర్దిష్ట ప్రస్తావన లేదని వ్యాఖ్య
- సుదీర్ఘ వాదనలను ఆలకించిన కోర్టు..
- ఇరుపక్షాలతో సందేహాల నివృత్తి అనంతరం తీర్పు వెల్లడి

సాక్షి, అమరావతి: స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణంలో అరెస్టై రాజమహేంద్రవరం సెంట్రల్ జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్న మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు ఏసీబీ కోర్టులో గట్టి ఎదురు దెబ్బ తగిలింది. తనను జైలులో కాకుండా హౌస్ రిమాండ్ (ఇంటి వద్ద)లో ఉంచాలంటూ చంద్రబాబు దాఖలు చేసిన పిటిషన్‌ను విజయవాడ ఏసీబీ ప్రత్యేక న్యాయస్థానం కొట్టివేసింది. హౌస్ రిమాండ్‌కు సంబంధించి ఏ చట్టంలో కూడా ఎలాంటి నిర్దిష్ట ప్రస్తావన లేదని స్పష్టం చేసింది. అందువల్ల హౌస్ రిమాండ్ విషయంపై విచారణ జరిపే పరిధి ఈ కోర్టుకు (ఏసీబీ కోర్టు) లేదని పేర్కొంది. అంతేకాక హౌస్ రిమాండ్‌లో ఎందుకు ఉంచాలనేందుకు చంద్రబాబు సరైన కారణాలను తమ ముందుంచలేదని తెలిపింది. హౌస్ రిమాండ్ విషయంలో న్యాయస్థానాన్ని పిటిషనర్ ఒప్పించలేకపోయారని, భద్రత విషయంలో ఇంటి వద్ద కంటే జైలు వద్దే ఎక్కువ భద్రత ఉంటుందన్న అభిప్రాయాన్ని ఏసీబీ కోర్టు వ్యక్తం చేసింది. ప్రత్యేక భద్రతా దళం (ఎస్పీజీ) భద్రత ఉన్న వ్యక్తికి అదే స్థాయిలో ఇంటి వద్ద భద్రత కల్పించడం సాధ్యం కాకపోవచ్చునంది. చంద్రబాబు భద్రత కోసం జైలులో పూర్తిస్థాయి చర్యలు తీసుకున్నామన్న రాష్ట్ర ప్రభుత్వ వాదనను న్యాయస్థానం పరిగణనలోకి తీసుకుంది.

మాకేవీ కారణాలు చెప్పాల్సిన అవసరం లేదు

తనను జైలులో కాకుండా హౌస్ రిమాండ్‌లో ఉంచేలా ఆదేశాలు ఇవ్వాలంటూ మాజీ సీఎం చంద్రబాబు ఏసీబీ కోర్టులో దాఖలు చేసిన పిటిషన్‌పై సోమవారం రోజు సుదీర్ఘంగా వాదనలు జరిగాయి. చంద్రబాబు తరఫున


మిగతా 8వ పేజీలో ▶

మా పేరుతో.. పచ్చి మోసం

- 'స్కిల్' 100% ఫ్రాడ్.. ఈ–మెయిల్‌లో తేల్చేసిన 'సీమెన్స్'
- మేం ఒప్పందమే చేసుకోలేదు... అసలు మాకు సంబంధం లేదు

- వివరాలు 8లో▶

8 నెలలు.. 685 రైతుల ఆత్మహత్యలు



మరాఠ్వాడాలో రైతుల ఆత్మహత్యలు ఆగడం లేదు. వర్షాభావంతోపాటు పంటలు పండక పోవడంతోపాటు పండించిన పంటలకు గిట్టుబాటు ధర లభించక తదితర కారణాల వల్ల రైతులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. ముఖ్యంగా అధికారుల నుంచి అందిన వివరాల మేరకు 2023 జనవరి 1వ తేదీ నుంచి ఆగస్టు 31వ తేదీ వరకు ఒక్క మరాఠ్వాడాలోనే 685 మంది రైతులు ఆత్మహత్యలకు పాల్పడ్డారు.

- వివరాలు 7లో▶



మంగళవారం రాత్రి రాజస్తాన్‌లోని కోటాలో విద్యుత్ వెలుగుల్లో కాంతులీనుతున్న చంబల్ నది పుష్కర ఘాట్ ప్రాంతం. చంబల్ నది సుందరీకరణ ప్రాజెక్టులో భాగంగా రూ. 1,200 కోట్ల వ్యయంతో రాజస్తాన్ ప్రభుత్వం ఈ ఘాట్‌ను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దింది. సుమారు 3 కిలోమీటర్ల పొడవైన ఈ నదీ మార్గంలో 22 ఘాట్లను నిర్మించడంతోపాటు చంబల్ మాత భారీ విగ్రహాన్ని, 82 వేల కిలోల బరువైన గంటను ఏర్పాటు చేసింది. ఏళ్ల తరబడి సాగిన ఈ ప్రాజెక్టు ఐదుసార్లు గడువు పొడిగింపు అనంతరం ఎట్టకేలకు పూర్తయింది. ఈ సుందరీకరణ ప్రాజెక్టు కోటాలో పర్యాటకానికి మరింతగా ఊతమిస్తుందని... స్థానికులకు ఉపాధి అవకాశాలు కల్పిస్తుందని ప్రభుత్వం చెబుతోంది. మంగళవారం ఈ ఘాట్లను రాజస్తాన్ సీఎం అశోక్ గహ్లోత్ లాంఛనంగా ప్రారంభించాల్సి ఉండగా అనివార్య కారణాలతో చివరి నిమిషంలో ఆయన పర్యటన వాయిదా పడింది.

విగ్రహాలపై ముద్ర నిర్ణయం రద్దు



వినాయకుడి విగ్రహం ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ (పీఓపీ)తో లేదా మట్టితో తయారు చేసిందో లేదో గుర్తించేందుకు విగ్రహం వెనుకభాగంలో స్టాంప్ వేయాలన్న నిర్ణయాన్ని బృహన్ముంబై మున్సిపల్ కార్పొరేషన్ (బీఎంసీ) ఉపసంహరించుకుంది. ఈ మేరకు బీఎంసీ అధికారులు మంగళవారం మీడియాకు వెల్లడించారు. గణేశోత్సవాలు సమీపిస్తున్న నేపథ్యంలో విగ్రహాల వెనుక ముద్ర వేయాలని బీఎంసీ తీసుకున్న నిర్ణయంపై సర్వత్రా వ్యతిరేకత రావడంతో బీఎంసీ ఈ నిర్ణయాన్ని తీసుకుంది.

- వివరాలు 7లో▶

చిరుద్యోగుల పోరుబాట!

సాక్షి, కామారెడ్డి

క్రమబద్ధీకరణ కోసం రోడ్డెక్కిన సమగ్ర శిక్ష ఉద్యోగులు

- సమ్మె నోటీసిచ్చిన ఆశ వర్కర్లు, పంచాయతీ, మధ్యాహ్న భోజన కార్మికులు

జిల్లాలో సర్వశిక్షా అభియాన్ స్కీంలో భాగంగా విద్యాశాఖలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగులంతా కొంతకాలంగా రిలే దీక్షలు చేస్తున్నారు. తాజాగా అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు తమ వేతనాల పెంపు కోసం పోరుబాట పట్టారు. అయితే ప్రభుత్వం అంగన్‌వాడీల ఆందోళనలను విచ్ఛిన్నం చేయడంలో భాగంగా కేంద్రాల తాళాలను పగులగొట్టి ఇతర విభాగాలకు చెందిన ఉద్యోగులతో కేంద్రాలను నిర్వహించే ప్రయత్నం చేశాయి. అయితే అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు ప్రభుత్వం అవలంబిస్తున్న తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వేతనాలు పెంచమని ఆందోళన చేస్తే ఇబ్బందులు పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆశ వర్కర్లు, గ్రామ పంచాయతీ కార్మికులు, మధ్యాహ్న భోజన కార్మికులు కూడా సమ్మె నోటీసు ఇచ్చారు.

పక్షం రోజులుగా సమగ్రశిక్ష ఉద్యోగులు

సమగ్ర శిక్షా అభియాన్ పథకం ద్వారా విద్యాశాఖలో పనిచేస్తున్న సీఆర్పీలు, ఐఈఆర్పీలు, కేజీబీవీ, యూఆర్‌ఎస్, ఎంఐఎస్ కోఆర్డినేటర్లు, కంప్యూటర్ ఆపరేటర్లు, మెసెంజర్లు, పార్ట్‌టైం ఇన్‌స్ట్రక్టర్లు గడచిన పక్షం రోజులుగా సమ్మెలో కొనసాగుతున్నారు. తమ ఉద్యోగాలను క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేస్తున్నారు. పాఠశాల విద్యావ్యవస్థలో కీలకంగా ఏళ్ల తరబడిగా పనిచేస్తున్న తమ ఉద్యోగాలను రెగ్యులరైజ్ చేయాలని కోరుతున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడంపై ఆవేదన చెందుతున్నారు. ప్రభుత్వం సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తున్నారు.

సమ్మెకు సై అంటున్న ఆశా వర్కర్లు....

వైద్య, ఆరోగ్య శాఖలో క్షేత్ర స్థాయిలో అనేక రకాల సేవలందిస్తున్న ఆశ వర్కర్లు కూడా సమ్మెకు సై అంటున్నారు. ఈ నెల 25 నుంచి సమ్మెకు దిగుతున్నట్టు ఇప్పటికే ప్రభుత్వానికి నోటీసు ఇచ్చారు. పల్లెలే కాకుండా పట్టణాల్లోనూ అనేక సేవలందిస్తున్నారు. కరోనా సమయంలో ప్రాణాలను పణంగా పెట్టి ఇళ్లిళ్లు తిరిగారు. ఉద్యోగ భద్రత, వేతనాల పెంపు కోసం పోరుబాట పడుతున్నారు.



.. బాగా చెప్పారు. మళ్లీ మనం 'భారత్ అని మారిస్తే వాళ్లు మళ్లీ 'ఇండియా' అని మారిస్తే ఇరుక్కుంటాం!

మళ్లీ క్రీడా సంబురం

ఎస్‌జీఎఫ్' పోటీల నిర్వహణకు కసరత్తు • షెడ్యూల్ విడుదల చేసిన 'ఫెడరేషన్'

మూడేళ్ల తర్వాత చిన్నారుల ఆటల పోటీలు • వివిధ పాఠశాలల్లో క్రీడల సందడి షురూ

కథలాపూర్(వేములవాడ)

దాదాపు మూడేళ్ల తర్వాత జిల్లాలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్(ఎస్‌జీఎఫ్) క్రీడా పోటీల నిర్వహణకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. పాఠశాలలు, కళాశాలల విద్యార్థులను క్రీడల్లో ప్రోత్సహించాలనే ఉద్దేశంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో ఏటా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో క్రీడా పోటీలు నిర్వహిస్తున్నారు. అయితే, కరోనా మహమ్మారి ఈ పోటీలపై తీవ్ర ప్రభావం చూపింది. తద్వారా సుమారు మూడేళ్లపాటు ఎస్జీఎఫ్ పోటీలు నిర్వహించలేకపోయింది. దీంతో ప్రతిభగల విద్యార్థులు క్రీడలకు దూరమయ్యామని నిరాశకు గురయ్యారు.

మూడు విభాగాల్లో పోటీలు..

పాఠశాలలు, కళాశాలల స్థాయిలో అండర్–14, అండర్–17, అండర్–19లో బాల బాలికలకు వేర్వేరుగా ఎస్జీఎఫ్ క్రీడా పోటీలు నిర్వహిస్తున్నారు. మండలస్థాయి నుంచి ప్రారంభమై జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో పోటీలు నిర్వహిస్తారు. రాష్ట్ర, జాతీయస్థాయి పోటీల్లో సత్తా చాటితే క్రీడాకారులకు మెరిట్ సర్టిఫికెట్లు అందజేస్తారు. వీటిద్వారా ఉన్నత విద్య, ఉద్యోగాల్లో ఎంపికలో రిజర్వేషన్ సౌకర్యం వర్తిస్తుందని అధికారులు చెబుతున్నారు. అందుకే ఎస్‌జీఎఫ్ క్రీడల్లో పాల్గొనేందుకు విద్యార్థులు అత్యంత ఉత్సాహం చూపిస్తున్నారు.

నాలుగు దశల్లో నిర్వహణ..

ఎస్‌జీఎఫ్ క్రీడలను నాలుగు దశల్లో నిర్వహిస్తామని అధికారులు తెలిపారు. తొలుత మండల, ఆ తర్వాత జిల్లా, తదుపరి ఉమ్మడి జిల్లా, రాష్ట్రస్థాయిలో పోటీలు ఉంటాయన్నారు. ఇందులో పాత జిల్లాల జట్టు ఏర్పాటు చేసి రాష్ట్రస్థాయి పోటీలకు పంపిస్తామని వివరించారు.

పకడ్బందీగా పోటీలు

జిల్లాలోని పీఈటీలతో సమావేశమయ్యాం. డీఈవోతో చర్చించి ఎస్‌జీఎఫ్ షెడ్యూల్ విడుదల చేశాం. షెడ్యూల్ ప్రకారం ఈనెల 15లోగా మండల, 26లోగా జిల్లా స్థాయిలో పోటీలు నిర్వహిస్తాం. జిల్లాస్థాయి పోటీలను జగిత్యాల స్వామీ వివేకానంద మినీ స్టేడియంలో నిర్వహిస్తాం. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

– లక్ష్మీరామ్ నాయక్, ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి



కోరుట్ల మోడల్ స్కూల్‌లో ఖో ఖో పోటీలు నిర్వహిస్తున్న పీఈటీ

సందడి షురూ..

- ఏడాది గత జూన్‌లో పాఠశాలలు ప్రారంభమయ్యాయి. అయితే, ఎస్‌జీఎఫ్ క్రీడల నిర్వహణపై ఇప్పటిదాకా ఎలాంటి పురోగతి కనిపించలేదు.
- దీంతో ఆటలపై ఆసక్తిఉన్న విద్యార్థులు నిరాశకు గురయ్యారు.
- ఏటా విద్యాసంవత్సరం ప్రారంభమయ్యాక జిల్లాలోని పీఈటీలతో సమావేశం నిర్వహించి ఎస్‌జీఎఫ్ క్రీడాపోటీల ఎంపికపై అధికారులు నిర్ణయం తీసుకునేవారు.
- ప్రతీ ఆగస్టులో మండల, జిల్లాస్థాయి, సెప్టెంబర్‌లో రాష్ట్రస్థాయి.. ఆ తర్వాత జాతీయస్థాయిలో క్రీడాపోటీలకు ఎంపికలు నిర్వహిస్తారు. కరోనా ప్రభావంతో మూడేళ్లుగా పోటీలు నిర్వహించలేదు.
- దీంతో ఈసారి పోటీలు ఉంటాయో లేదోనని విద్యార్థులు, ఉపాధ్యాయుల్లో అయోమయం నెలకొంది.
- ఎట్టకేలకు జిల్లా అధికారులు సోమవారం ఎస్జీఎఫ్ షెడ్యూల్ విడుదల చేయడంతో క్రీడాకారుల్లో సంతోషం వ్యక్తమవుతోంది.

క్లుప్తంగా...



బీజేపీలోకి అజ్మీరా చందూలాల్ కుమారుడు

సాక్షి, హైదరాబాద్: మాజీ మంత్రి, దివంగత అజ్మీరా చందూలాల్ కుమారుడు, బీఆర్ఎస్ నాయకుడు అజ్మీరా ప్రహ్లాద్ బీజేపీలో చేరారు. మంగళవారం పార్టీ కార్యాలయంలో బీజేపీ ఎన్నికల నిర్వహణ కమిటీ చైర్మన్ ఈటల రాజేందర్, జాతీయ కార్యవర్గసభ్యుడు గరికపాటి మోహన్‌రావుల సమక్షంలో ఈ చేరిక కార్యక్రమం జరిగింది. ఈటల రాజేందర్, ప్రహ్లాద్‌కు కాషాయకండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఈటల మాట్లాడుతూ బీజేపీ అన్ని వర్గాలకు సముచిత స్థానం ఇస్తుందన్నారు. కేంద్ర కేబినెట్‌లోని 75 మంది మంత్రుల్లో 27 మంది బీసీలు, 12 మంది ఎస్సీలు, 8 మంది గిరిజనులు ఉన్నారని, బీజేపీ ప్రభుత్వంతోనే ఇది సాధ్యమైందని చెప్పారు. అలాగే ఆదివాసీ మహిళకు అత్యున్నత రాష్ట్రపతి పదవి ఇచ్చింది కూడా బీజేపీనేనన్నారు. పార్టీ మారితే పెన్షన్ తీసేస్తామని బెదిరించడం సరికాదని, పెన్షన్ డబ్బులు ప్రజలవే తప్ప సీఎం కేసీఆర్ ఇంట్లో నుంచి ఇవ్వడం లేదని ఈటల మండిపడ్డారు. హుజూరాబాద్ ఉప ఎన్నిక ఈ రాష్ట్రానికి ఒక సంకేతం ఇచ్చిందని, కేసీఆర్ డబ్బు సంచులు, మందు సీసాలకు ప్రజలు లొంగకుండా తనను గెలిపించారని అన్నారు.

రాజ్యాధికారంతోనే దళితులకు న్యాయం

బీఎస్పీ అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్



పంజగుట్ట: తరతరాలుగా అణచివేతకు గురైన దళితులకు రాజకీయ అధికారం దక్కితేనే విముక్తి లభిస్తుందని, దానికి ఓటే వజ్రాయుధమని బహుజన్ సమాజ్ పార్టీ(బీఎస్పీ) రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. మంగళవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో 'తెలంగాణ రాష్ట్ర చర్మ పరిశ్రమ(లిడ్‌క్యాప్), దళిత అసైన్డ్ భూములను రక్షించుకుందాం 'అనే అంశంపై జరిగిన రాష్ట్ర సదస్సులో ఆయన మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా లిడ్‌క్యాప్ కోసం కేటాయించిన వందల ఎకరాల భూములను బీఆర్ఎస్ ప్రభుత్వం దోచుకుంటోందని ఆరోపించారు. లిడ్‌క్యాప్ ద్వారా చర్మకారులకు బ్యాంకు రుణాలు మంజూరు చేసి లెదర్ ఇండస్ట్రీ స్టార్టప్ కంపెనీలకు తోడ్పాటు ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. ఎస్సీ కార్పొరేషన్ కింద హైటెక్ సిటీలో 7 ఎకరాల స్థలంలో స్కూల్ కట్టిద్దామని తాను అప్పట్లో ప్రయత్నిస్తే ముఖ్యమంత్రి ఆపారని, మరోమంత్రి వచ్చి ఏం కావాలో తీసుకో ఈ భూమిని వదిలెయ్యి అన్నారని గుర్తుచేశారు. కార్యక్రమంలో విశ్రాంత ఐపీఎస్ అధికారి కృష్ణప్రసాద్, లిడ్‌క్యాప్, దళిత అసైన్డ్ భూముల పరిరక్షణ కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు పూసపాటి శ్రీనివాస్ మాట్లాడారు.

పర్యావరణ పరిరక్షణకు 'గ్రీన్ గణేశ'

సాక్షి, సిటీబ్యూరో: పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్రతి సంవత్సరం 'గ్రీన్ గణేశ' కార్యక్రమం కింద ప్రత్యేకంగా విత్తనాలు, ఎరువులతో కూడిన మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేస్తున్న రీ సస్టెయినబిలిటీ లిమిటెడ్ (ఆర్ఈఎస్ఎల్) ఈ సంవత్సరం కూడా 92.7 బిగ్ ఎఫ్ఎంతో కలిసి పంపిణీ కార్యక్రమాలకు సిద్ధమైంది. ఈ సంవత్సరం 16వ ఎడిషన్‌ను ఆర్ఈఎస్ఎల్ కార్యాలయంలో సంస్థ ఎండీ గౌతంరెడ్డి, సీఈఓ మసూద్‌మాలిక్ మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఈ కార్యక్రమం ద్వారా ఈ సంవత్సరం హైదరాబాద్‌తోపాటు ముంబై, ఢిల్లీలోనూ విగ్రహాలను పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. మట్టితో తయారు చేసిన వినాయక విగ్రహాలలో విత్తనాలు, ఎరువులు ఉంచినట్లు పేర్కొన్నారు. విగ్రహాలను తీసుకున్నవారు పూజల అనంతరం వాటిని ఇంట్లో, పూల కుండీల్లో నిమజ్జనం చేయవచ్చునని, వాటిల్లోని విత్తనాలతో కొత్తమొక్కలు వస్తాయని తెలిపారు.

తెలంగాణలోనూ 'గృహలక్ష్మి'?

కర్ణాటకలో ఓట్ల వర్షం కురిపించిన పథకంపై హామీ ఇచ్చే యోచనలో కాంగ్రెస్ పార్టీ

- ఈ పథకం కింద ప్రతి మహిళకు నెలకు రూ. 2 వేల సాయం
- రూ. 2 లక్షల రైతు రుణమాఫీ, రూ. 4 వేల పింఛన్ కూడా ...
- బీసీలు, మైనార్టీల కోసం మరో రెండు పథకాలు
- సోనియా ప్రకటించే ఐదు గ్యారంటీ కార్డు స్కీంలపై టీపీసీసీ ముమ్మర కసరత్తు



సాక్షి, హైదరాబాద్: కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల్లో మహిళల ఓట్ల వర్షం కురిపించిన 'గృహలక్ష్మి' పథకాన్ని తెలంగాణలోనూ అమలు చేస్తామని హామీ ఇచ్చేందుకు కాంగ్రెస్ పార్టీ సిద్ధమవుతోంది. ఈనెల 17వ తేదీన తుక్కుగూడలో నిర్వహించే భారీ బహిరంగ సభ వేదికగా ఈ పథకాన్ని సోనియా గాంధీ చేత ప్రకటింపజేయాలని యోచిస్తోంది. కుటుంబ యజమాని హోదాలో ప్రతి మహిళకు నెలకు రూ.2వేల నగదు సాయం చేయడం ద్వారా పెరిగిన గ్యాస్, నిత్యావసరాల ధరలను సర్దుబాటు చేసుకునేందుకు వీలుగా ఈ పథకాన్ని అమలు చేసి మహిళలకు అండగా నిలుస్తామని ప్రకటించనున్నట్టు తెలుస్తోంది.

ఈసారి ఎన్నికల్లో అధికారంలోకి రావడమే ధ్యేయంగా హిమాచల్‌ప్రదేశ్, కర్ణాటక ఎన్నికల సందర్భంగా ఇచ్చిన ఐదు గ్యారంటీ కార్డు స్కీంల సంప్రదాయాన్ని తెలంగాణలోనూ కొనసాగించాలని కాంగ్రెస్ పార్టీ నిర్ణయించింది. ఈ ఐదు గ్యారంటీ కార్డు స్కీంలలో ఏయే పథకాలను ప్రకటించాలన్న దానిపై టీపీసీసీ పెద్ద కసరత్తే చేస్తోంది.

ఓటు బ్యాంకు బ్రేక్ చేయాల్సిందే..!

ప్రస్తుత రాజకీయ పరిస్థితుల్లో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలపై క్షేత్రస్థాయిలో తీవ్ర వ్యతిరేకత ఉందనే అంచనాల్లో కాంగ్రెస్ పార్టీ ఉంది. వరుసగా మూడోసారి బీఆర్ఎస్‌కు ఓటేయాల్సి రావడం కూడా ప్రజలను ఆలోచింప చేస్తోందని కూడా ఆ పార్టీ నేతలు భావిస్తున్నారు. కానీ, పింఛన్, రైతుబంధు, కేసీఆర్ కిట్లు, కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ లాంటి సంక్షేమ పథకాల ద్వారా మహిళలు పెద్ద స్థాయిలోనే లబ్ధి పొందుతున్నారు. ప్రత్యక్ష రాజకీయాలు పెద్దగా పట్టని గ్రామీణ మహిళా లోకం ఆలోచనలు ఎలా ఉంటాయనే గుబులు కాంగ్రెస్ పార్టీలో మొదటి నుంచీ వ్యక్తమవుతోంది. ఈ నేపథ్యంలో రూ.500కే గ్యాస్‌సిలిండర్ ఇస్తామని ప్రకటించడం ద్వారా మహిళలను ఆకర్షించాలని భావించింది. అయితే, ఈ కార్యక్రమం అమలు కోసం నిన్న మొన్నటి వరకు రూ.1,100 ఉన్న వంటగ్యాస్ సిలిండర్‌ను రూ.500కు ఇవ్వాలంటే ఆ మేరకు రూ.600 నగదు బదిలీ జరగాల్సి ఉంటుంది. ఎలాగూ నగదు బదిలీ చేయాల్సినందున కర్ణాటక తరహాలో రూ.2వేల నగదు సాయం అందించే గృహలక్ష్మి లాంటి పథకాన్ని ప్రకటిస్తే గంపగుత్తగా మహిళల ఓట్లు పొందే అవకాశముందని భావిస్తోంది. బీఆర్ఎస్ ఓటు బ్యాంకును కచ్చితంగా బ్రేక్ చేయవచ్చనే ఆలోచనతోనే ఈ పథకాన్ని గ్యారంటీ కార్డు స్కీంలలో పొందుపర్చనున్నట్టు తెలుస్తోంది. ఇక, రూ. 2 లక్షల వరకు రైతు రుణమాఫీ, నెలకు రూ. 4 వేల పింఛన్ పథకాలను ఐదు స్కీంలలో చేరుస్తామని, మిగిలిన రెండింటిలో ఒకటి బీసీ వర్గాలకు, మరొకటి మైనార్టీ వర్గాలకు లేదంటే ఎస్సీ, ఎస్టీల కోసం ప్రకటించే అవకాశముందని గాంధీభవన్ వర్గాల్లో చర్చ జరుగుతోంది.

రూ. లక్ష కోట్ల పైనే ఆదా చేయొచ్చు..

దీనిపై టీపీసీసీ ముఖ్య నేత ఒకరు మాట్లాడుతూ 'కాళేశ్వరం లాంటి ప్రాజెక్టులు కట్టి రూ.లక్ష కోట్లు పెట్టారు. ఇప్పుడు ఆ ఖర్చు పెట్టాల్సిన అవసరం ఉండదు. ఈ డబ్బులన్నింటినీ సంక్షేమ పథకాలకు అమలు చేస్తే ఐదేళ్ల సంక్షేమ పాలన వర్ధిల్లుతుంది. వీటికి తోడు సెక్రటేరియట్‌కు పెట్టిన రూ.1,500 కోట్లు, మిషన్‌భగీరథకు వెచ్చించిన రూ.45 వేల కోట్లు... ఇలా లెక్కపెట్టుకుంటూ పోతే కమీషన్ల కోసం బీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన మరో లక్ష కోట్ల రూపాయలను ఆదా చేయవచ్చు. ఆ నిధులతో సంక్షేమాన్ని డబుల్ ఇంజిన్‌తో ముందుకు తీసుకెళ్లవచ్చు. పథకాలను ఆషామాషీగా ప్రకటించడం కాంగ్రెస్‌కు అలవాటు లేదు. నాడు రైతులకు ఉచిత విద్యుత్, రైతు రుణమాఫీ నుంచి నేటి కర్ణాటక పథకాల అమలు వరకు కాంగ్రెస్ చెప్పిందే చేస్తుంది. అన్ని లెక్కలు కట్టిన తర్వాతే ఈ పథకాలపై ప్రజలకు హామీ ఇస్తున్నాం. అందుకే తుక్కుగూడ సభలో సోనియాగాంధీ చేత ఐదు గ్యారంటీ స్కీంలపై హామీ ఇప్పించబోతున్నాం. సోనియా హామీ ఇచ్చిన విధంగా తెలంగాణ ఎలా ఇచ్చారో ఈ హామీలను కూడా అలాగే నిజం చేస్తామనే భరోసా ప్రజల్లో కల్పిస్తాం.' అని వ్యాఖ్యానించారు.

నిధుల సమీకరణ ఎలా?

కాంగ్రెస్ పార్టీ ప్రకటిస్తున్న పథకాలు అమలయ్యేవి కావని, అధికారంలోకి వచ్చే అవకాశాలు లేనందునే రోజుకో డిక్లరేషన్‌ను ప్రకటిస్తున్నారని బీఆర్ఎస్, బీజేపీలు విమర్శిస్తున్నాయి. అర్థం లేకుండా పథకాలు ప్రకటిస్తున్నారని, ఇవన్నీ ఇచ్చాక అభివృద్ధి ఎలా చేస్తారనే ప్రశ్న కూడా రాజకీయ వర్గాల్లో వినిపిస్తోంది. అయితే, ఇందుకు దీటైన సమాధానం తమ దగ్గర ఉందని కాంగ్రెస్ నేతలు చెబుతున్నారు. తాము మొదటి నుంచీ ఆరోపిస్తున్న విధంగా పాలనలో అవినీతిని నిర్మూలించి, రిటైరయిన వారికి నామినేటెడ్ పదవుల పేరిట కోట్ల రూపాయల జీతాలను నివారిస్తే తమ పథకాల అమలు అసాధ్యమేమీ కాదని వారంటున్నారు. అలాగే పథకాల అమలులో పారదర్శకతతో పాటు కేంద్ర ప్రభుత్వం నుంచి వచ్చే పథకాలు, నిధులను సద్వినియోగం చేసుకుంటే ఆయా పథకాలను ఇబ్బంది లేకుండా అమలు చేయొచ్చని చెబుతున్నారు.

16న రాత్రే నగరానికి అమిత్ షా

సెప్టెంబర్ 17న టూర్ షెడ్యూల్ ఖరారు



సాక్షి, హైదరాబాద్: బీజేపీ అగ్రనేత, కేంద్ర హోంమంత్రి అమిత్ షా పర్యటన షెడ్యూల్ ఖరారైంది. ఒకరోజు ముందే ఆయన హైదరాబాద్‌కు చేరుకుంటారు. 17న సికింద్రాబాద్ పరేడ్‌గ్రౌండ్స్‌లో జరిగే హైదరాబాద్ విమోచన దినోత్సవంలో ముఖ్యఅతిథిగా పాల్గొంటారు. 16న మహారాష్ట్రలోని ఔరంగాబాద్ ఎయిర్‌పోర్టు నుంచి ఐఏఎఫ్ ప్రత్యేక విమానంలో రాత్రి 8 గంటలకు శంషాబాద్ విమానాశ్రయానికి చేరుకుంటారు. ఆదివారం ఉదయం 8.30 గంటలకు సీఆర్‌పీఎఫ్ ఆఫీసర్స్ మెస్ నుంచి రోడ్డుమార్గాన సికింద్రాబాద్‌లోని పరేడ్‌గ్రౌండ్స్‌కు చేరుకుంటారు. ఉదయం 9 నుంచి 11 గంటల దాకా హైదరాబాద్ విమోచన దినోత్సవంలో పాల్గొంటారు. ఈ సందర్భంగా సీఆర్‌పీఎఫ్, సీఐఎస్‌ఎఫ్ ఇతర పోలీసు బలగాల వందనం స్వీకరిస్తారు. అనంతరం రోడ్డుమార్గాన శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు చేరుకుని ఉదయం 11.50 నిమిషాలకు ఐఏఎఫ్ ప్రత్యేక విమానంలో ఢిల్లీ వెళతారు.

బీజేపీ ప్రచార నిర్వహణకు 300 కాల్ సెంటర్లు

- దేశవ్యాప్తంగా 10 జోన్లకు ఏర్పాటు!
- తెలంగాణ-ఏపీ జోన్ ఇన్‌చార్జిగా అమిత్ థాకర్

సాక్షి, న్యూఢిల్లీ: రానున్న లోక్‌సభ ఎన్నికల ప్రచార నిర్వహణకు బీజేపీ భారీగా ఏర్పాట్లు చేస్తోంది. దేశవ్యాప్తంగా క్షేత్రస్థాయిలో పార్టీని బలోపేతం చేయడం, ప్రచార అంశాలను రూపొందించడం, ఓటర్లను ఆకట్టుకునే కార్యక్రమాలు నిర్వహించడమే లక్ష్యాలుగా 300 కాల్ సెంటర్లు ఏర్పాటు చేస్తోంది. దేశాన్ని 10 జోన్లుగా విభజించించి, ప్రతి 27 అసెంబ్లీ నియోజకవర్గాలకు ఒకటి చొప్పున కాల్ సెంటర్‌ను నిర్వహించనుంది. ఇవి ఓటర్లకు నిత్యం ఫోన్ చేసి మేనిఫెస్టోను వివరిస్తాయని బీజేపీ కీలక నేత ఒకరు తెలిపారు. పది జోన్లకు ఒకరు చొప్పున ఇన్‌చార్జిల నియామకాలను పూర్తి చేసిన పార్టీ అధిష్టానం తెలంగాణ-ఆంధ్రప్రదేశ్ జోన్ ఇన్‌చార్జిగా గుజరాత్ ఎమ్మెల్యే అమిత్ థాకర్‌ను నియమించింది. మధ్యప్రదేశ్-ఛత్తీస్‌గఢ్ జోన్‌కు బిహార్ బీజేపీ నేత దేవేశ్ కుమార్, ఉత్తరప్రదేశ్-ఉత్తరాఖండ్ ఇన్‌చార్జి గా ఢిల్లీ బీజేపీ ఉపాధ్యక్షుడు రాజీవ్ బబ్బర్‌ను నియమించారు. ఈ నేతలు కేంద్ర కార్యాలయంలోని ఐదుగురు ముఖ్యనేతలు, రాష్ట్రాల పరిధిలో కాల్‌సెంటర్ల ఇన్‌చార్జిలను కలుపుకొని ప్రచారాన్ని పర్యవేక్షించనున్నారు.

తెలంగాణ సాధనలో కేసీఆర్ పాత్ర ఒక్క శాతమే..

- తెలంగాణ వచ్చిన తర్వాత మీ నాన్న అసెంబ్లీలో ఏం మాట్లాడాడో తెలుసుకో
- మీ ఫ్యామిలీ అంతా వెళ్లి సోనియాతో గ్రూప్ ఫొటో ఎందుకు దిగారు?
- కాంగ్రెస్ జోలికొస్తే ఊరుకోం.. మంత్రి కేటీఆర్ వ్యాఖ్యలపై ఎంపీ కోమటిరెడ్డి ఫైర్



సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్ పార్టీకి నూకలు చెల్లుతాయని తెలిసే తెలంగాణ ప్రకటించారని, సోనియాగాంధీ తెలంగాణ ఇచ్చారంటే భారతదేశానికి బ్రిటిష్ వారు స్వాతంత్ర్యం ఇచ్చారని చెప్పినంత దరిద్రంగా ఉంటుందని రాష్ట్ర మంత్రి కేటీఆర్ చేసిన వ్యాఖ్యలపై భువనగిరి ఎంపీ, కాంగ్రెస్ స్టార్ క్యాంపెయినర్ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మండిపడ్డారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైన తర్వాత 2014లో అసెంబ్లీలో కేసీఆర్ ఏం మాట్లాడారో కేటీఆర్ తెలుసుకుని మాట్లాడాలని, పనికిమాలిన మాటలు మాట్లాడవద్దని హితవు పలికారు. సోనియా లేకపోతే తెలంగాణ వచ్చి ఉండేది కాదని, ఎవరు ఒప్పుకున్నా ఒప్పుకోకపోయినా ఇది నిజమని నాడు కేసీఆర్ ఆన్ రికార్డు వ్యాఖ్యలు చేశారని గుర్తు చేశారు. మంగళవారం గాంధీభవన్‌లో ఎంపీ కోమటిరెడ్డి మీడియాతో మాట్లాడారు.

వైఎస్సార్ ప్రతిపక్ష నేతగా ఉన్నప్పుడే తెలంగాణ కావాలని..

'మలిదశ తెలంగాణ ఉద్యమాన్ని ప్రారంభించిందే కాంగ్రెస్ పార్టీ. వైఎస్ ప్రతిపక్ష నాయకుడిగా ఉన్నప్పుడు నాతో సహా 41 మంది ఎమ్మెల్యేలం తెలంగాణ కావాలని అడిగినందుకే ప్రణబ్‌ముఖర్జీ కమిటీ వేశారు. అప్పుడు కేటీఆర్ రాజకీయాల్లో లేడు. అమెరికాలో ఉన్నాడు. ఆ తర్వాత కేసీఆర్‌కు చంద్రబాబు మంత్రిపదవి ఇవ్వలేదని తెలంగాణ ఉద్యమాన్ని ప్రారంభించాడు. తెలంగాణ ఇచ్చిన సోనియాగాంధీని, కాంగ్రెస్ పార్టీని విమర్శించడం తగదు. ఇంకోసారి కాంగ్రెస్ పార్టీ జోలికి వస్తే ఊరుకోం.' అని కోమటిరెడ్డి హెచ్చరించారు.

వాళ్లకు టికెట్లు క్యాన్సిల్ చేయండి

కట్టె పట్టుకుని తెలంగాణ ఉద్యమకారులను కొట్టిన దానం నాగేందర్, కేసీఆర్‌ను ఫుట్‌బాల్‌లా తంతానన్న తలసాని శ్రీనివాస్‌యాదవ్, పట్నం మహేందర్‌రెడ్డి, సబితా ఇంద్రారెడ్డి, మల్లారెడ్డి, పువ్వాడ అజయ్‌కుమార్, మాగంటి గోపీనాథ్, అరికెపూడి గాంధీ... ఇలా చెప్పుకుంటూ పోతే చిట్టా చాలా ఉందని, ఈ మంత్రులను ముందు కేబినెట్ నుంచి తొలగించి, తెలంగాణ ఉద్యమ ద్రోహులకు ఇచ్చిన టికెట్లను క్యాన్సిల్ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. బానిసత్వ పార్టీ ఎవరిదో అందరికీ తెలుసునని, డిప్యూటీ స్పీకర్ పద్మాదేవేందర్‌రెడ్డి, మంత్రి మహమూద్‌అలీలు ప్రగతిభవన్ వరకు వస్తే 100 కిలోమీటర్ల స్పీడ్‌తో వెనక్కు పంపింది ఎవరని ప్రశ్నించారు. ప్రగతిభవన్ లోపలికి రానివ్వకపోతే ఏడ్చానని రాజేందర్ చెప్పారని గుర్తు చేశారు. వైఎస్ సీఎంగా ఉన్నప్పుడు సర్పంచ్ కూడా ఆయనను సులువుగా కలవగలిగేవారని చెప్పారు.

ఎన్నికల ఆలస్యంపై కేటీఆర్ మాట్లాడటం హాస్యాస్పదం

రాష్ట్రంలో ఎన్నికలు ఆలస్యమవుతాయని, ఫిబ్రవరి వరకు తీసుకెళ్తారని కేటీఆర్ చెప్పడం హాస్యాస్పదమని కోమటిరెడ్డి చెప్పారు. బీజేపీతో అమిత్‌షాతో భేటీ అయి కవితను జైలుకు పంపవద్దని ఒప్పందం కుదుర్చుకున్నారని, ఇప్పుడు ఆయన ఫిబ్రవరిలో ఎన్నికలు వస్తాయని చెప్పకపోతే తమకు తెలియదా? అని వ్యాఖ్యానించారు.

జమిలి.. చీప్ జిమ్మిక్కు

▶ మొదటి పేజీ తరువాయి

ఎన్నికలు జరుగుతాయి. ఈలోగా ఎన్నికలు జరిగే తెలంగాణ సహా ఐదు రాష్ట్రాలకు సెపరేట్‌గా పోలింగ్ నిర్వహించే ఉద్దేశం మోదీకి లేదు. ఎలాగైనా ఐదు రాష్ట్రాల ఎన్నికలను ఎత్తగొట్టాలనే జమిలి ఎన్నికలను తెరమీదకు తెస్తున్నారు. అయితే దీనికి అనుసరించే విధానం ఏంటి? పార్లమెంటు సమావేశాల్లో రాజ్యాంగ సవరణ చేసి ఐదు రాష్ట్రాల ప్రస్తుత అసెంబ్లీ గడువు పెంచుతారా? లేక రాష్ట్రపతి పాలన విధిస్తారా? వంటి అంశాలపై స్పష్టత లేదు. రాష్ట్రపతి పాలన విధిస్తే కేంద్రం విమర్శలు ఎదుర్కోవాల్సి వస్తుంది. మోదీ ఒక్కరోజు కూడా అధికారం వదులుకునే రకం కాదు కాబట్టి మమ్మల్ని కూడా అటు వైపు గుంజుకు వెళ్లే ప్రయత్నం చేస్తారు. మామూలుగా అయితే వచ్చే నెల 5 లేదా 10 తేదీ లోపు తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్ రావాలి..' అని కేటీఆర్ వ్యాఖ్యానించారు.

90కి పైగా సీట్లలో బీఆర్ఎస్ గెలుపు

'కమ్యూనిస్టుల ఐడియాలజీ, విచ్ఛిన్నకర శక్తుల పట్ల వారి వైఖరి, భావ సారూప్యతతో మాకు ఏకీభావం ఉంది. కానీ సీట్ల లెక్కలు కుదరకపోవడంతోనే వారితో పొత్తు సాధ్యం కాలేదు. మాకు 105 మంది సిట్టింగ్ ఎమ్మెల్యేలు ఉండటంతో వారు అడిగిన సీట్లు ఇవ్వడం సాధ్యం కాలేదు. 115 మంది అభ్యర్థులను ఏకకాలంలో ప్రకటించడంతో విపక్షాలు కకావికలం అయ్యాయి. కేసీఆర్‌ను ఎదుర్కోవడంలో గందరగోళంలో పడ్డాయి. మరోవైపు బీఆర్ఎస్‌లో టికెట్ రాని వారు తమ పార్టీల్లోకి వస్తారనే కాంగ్రెస్, బీజేపీల ఆశలు అడియాసలయ్యాయి. సర్వేలు, వివిధ వర్గాల సమాచారం ప్రకారం 90కి పైగా సీట్లలో బీఆర్ఎస్ గెలుస్తుంది. మేము 99 శాతం టికెట్లు ప్రకటించాం. ప్రతిపక్షాలు అప్లికేషన్లు అమ్ముకుంటూ రేపు టికె ట్లు కూడా అమ్ముకునే పరిస్థితిలో ఉన్నాయి..' అని ఆరోపించారు.

తెలంగాణ, మహారాష్ట్రలోనే పోటీ

'పార్లమెంటులో ప్రస్తావనకు వచ్చే అంశాలను చూసిన తర్వాతే బీఆర్ఎస్ వైఖరి వెల్లడిస్తాం. అయితే జమిలి ఎన్నికలు వచ్చినా మాకు ఎలాంటి నష్టం లేదు. ఈసారి తెలంగాణ ప్రజలు అటు లోక్‌సభ, ఇటు అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు ఏకపక్షంగా అనుకూల తీర్పును ఇస్తారు. జమిలి ఎన్నికలు వస్తే మోదీ, షా దేశమంతటా ఫోకస్ చేయాల్సి వస్తుంది. మేము తెలంగాణ, మహారాష్ట్రలోనే పోటీ చేస్తాం. ఒకవేళ ఎన్నికలు వాయిదా పడితే 'పాలమూరు - రంగారెడ్డి', 'సీతారామ' వంటి ప్రాజెక్టులు పూర్తి చేసుకుంటాం. పార్టీలో అంతర్గత అంశాలు సరి చేసుకోవడానికి మాకు మరింత సమయం దొరుకుతుంది. అయితే తెలంగాణ, ఛత్తీస్‌గఢ్, రాజస్తాన్ వంటి ఒకటి రెండు రాష్ట్రాల కోసం ఎన్నికలు వాయిదా వేసి మోదీ బదనాం అవుతాడని అనుకోవడం లేదు..' అని మంత్రి అన్నారు.

జాతీయ స్థాయిలో బీజేపీ, కాంగ్రెస్ కుమ్మక్కు

'మేము బీజేపీతో కుమ్మక్కయ్యామనడం అర్థరహితం. జాతీయ స్థాయిలో బీజేపీ, కాంగ్రెస్ కుమ్మక్కయ్యాయి. ఇతర రాష్ట్రాల్లో మాదిరిగా తెలంగాణలో రాజకీయ అస్థిరత లేదు. మా సీఎం అభ్యర్థి కేసీఆర్. కాంగ్రెస్, బీజేపీల సీఎం అభ్యర్థులెవరో చెప్పగలరా? ఢిల్లీ నుంచి వచ్చే సీల్డ్ కవర్ ముఖ్యమంత్రులు కావాలా.. కేసీఆర్ కావాలో ప్రజలే తేలుస్తారు..' అని కేటీఆర్ అన్నారు. జీ 20 సమావేశాలకంటే టీ 20 మ్యాచ్‌లపై ప్రజలు ఎక్కువ ఆసక్తి చూపారని, రొటేషన్‌లో వచ్చిన అవకాశానికి బాకా కొట్టుకునే ప్రయత్నం బెడిసి కొట్టిందని విమర్శించారు.

ఆంధ్ర పరిణామాలపై ఆసక్తి లేదు

'ఏపీలో చోటు చేసుకుంటున్న పరిణామాలపై మేమెందుకు కామెంట్ చేయాలి. ఆంధ్రా రాజకీయాలు, అక్కడి పరిణామాలతో మాకు సంబంధం లేదు. వాటిపై మాకు ఆసక్తి లేదు. అది వారి తలనొప్పి. ఏపీ పరిస్థితులు, కేసు పూర్వాపరాలు తెలియకుండా తీర్పులు ఇవ్వలేం. మేం తెలంగాణ పాలనపై మాత్రమే దృష్టి కేంద్రీకరించాం. మాకు ఇక్కడ ఇతర తలనొప్పులు ఉన్నాయి. ఇక్కడ యూట్యూబ్ చానెళ్లు పెట్టి సీఎంను రోజూ తిడుతున్నారు. రన్నింగ్ కామెంటరీ చేయడం జాతీయ పార్టీ పనికాదు. జాతీయ అంశాలపై మాట్లాడాలి..' అని కేటీఆర్ వ్యాఖ్యానించారు.

గెలుపు గుర్రాలకే పెద్దపీట

అన్ని అంశాలను పరిగణనలోకి తీసుకుని గెలుపు గుర్రాలకే అవకాశమిస్తూ సిట్టింగ్ ఎమ్మెల్యేలకు పెద్దపీట వేశాం. తాండూరు, కొల్లాపూర్ తదితర చోట్ల హామీ మేరకు టికెట్లు ఇచ్చి కేసీఆర్ విశ్వసనీయత చాటుకున్నారు. అభ్యర్థుల జాబితాలో మార్పు ఉండదు, అందరికీ బీ ఫారాలు ఇస్తాం. అనుకోని కారణాలు ఉంటే ఒకటో రెండో మారుస్తామని మాత్రమే సీఎం అన్నారు. మల్కాజిగిరి ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు విషయంలో మేము కూడా వేచి చూసే ధోరణిలోనే ఉన్నాం..

ఇంకెంత కాలం సెంటిమెంట్‌తో ప్రజల్ని మోసం చేస్తారు?


కేటీఆర్ వ్యాఖ్యలపై స్పందించిన వైఎస్సార్‌టీపీ అధ్యక్షురాలు షర్మిల



సాక్షి, హైదరాబాద్: ఇంకెంత కాలం తెలంగాణ సెంటిమెంట్‌తో ప్రజల్ని మోసం చేస్తారంటూ మంత్రి కేటీఆర్‌ను వైఎస్సార్ తెలంగాణ పార్టీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల నిలదీశారు. హామీలు నెరవేర్చకుండా ప్రజాసంక్షేమాన్ని గాలికొదిలేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణ ద్రోహులంటూ బురద చల్లడం ఆపి, అధికారంలోకి వచ్చిన దశాబ్ద కాలంలో తెలంగాణకు ఏం చేశారో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. మంగళవారం ఈ మేరకు షర్మిల బహిరంగలేఖ విడుదల చేశారు. 'గతంలో మిమ్మల్ని తెలంగాణ ద్రోహులు అని విమర్శించినవాళ్లే ఇప్పుడు మీ కేబినెట్‌లో మంత్రులుగా ఉన్నారు'అని ఆమె గుర్తుచేశారు. చెప్పాలంటే అసలు సిసలైన తెలంగాణ ద్రోహులు మీరేనని ధ్వజమెత్తారు. బంగారు తునక రాష్ట్రాన్ని రూ.5 లక్షల కోట్ల అప్పులకుప్పగా చేయడమే కాకుండా 38 వేల ఎకరాల ప్రభుత్వభూమిని అమ్ముకున్నారని షర్మిల ఆరోపించారు. ప్రజలకు ఏమేం హామీలిచ్చి అధికారంలోకి వచ్చారు.

రేవంత్‌ను కలసిన జిట్టా

మాజీ ఎమ్మెల్యే యెన్నంతో కలసి పీసీసీ చీఫ్‌తో భేటీ



సాక్షి, హైదరాబాద్: భువనగిరి నియోజకవర్గానికి చెందిన జిట్టా బాలకృష్ణారెడ్డి టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డిని కలిశారు. మంగళవారం ఉదయం జూబ్లీహిల్స్‌లోని రేవంత్ నివాసానికి మహబూబ్‌నగర్ మాజీ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డితో కలసి వెళ్లిన జిట్టా, రేవంత్‌తో చాలా సేపు మాట్లాడారు. ఈనెల 17న తుక్కుగూడలో జరిగే బహిరంగసభలో జిట్టా బాలకృష్ణారెడ్డి కాంగ్రెస్ పార్టీలో చేరే అవకాశాలున్నాయని తెలుస్తోంది. మక్తల్ నియోజకవర్గానికి చెందిన బీఆర్ఎస్ మాజీ ఎంపీపీలు హనుమంతు, శ్రీనివాస్‌రెడ్డి, సర్పంచ్ రాజు, ఉప సర్పంచ్ వెంకటేశ్‌గౌడ్, బీకేఆర్ ఫౌండేషన్ చైర్మన్ బాలకృష్ణారెడ్డి, రంగారెడ్డి జిల్లా మహేశ్వరం ఎంపీపీ రఘుమారెడ్డి, మాజీ సర్పంచ్ వెంకట్‌రెడ్డి కాంగ్రెస్‌లో చేరారు.

షెడ్యూల్ ప్రకారమే ఎన్నికలు

- దళితులను దగా చేసిన కేసీఆర్
- నేడు, రేపు బీజేపీ ఆధ్వర్యంలో నిరుద్యోగ దీక్ష
- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి



బీజేపీ దళితమోర్చా సమావేశంలో డప్పు కొట్టి కార్యకర్తల్లో జోష్ నింపుతున్న కిషన్‌రెడ్డి

మన్సూరాబాద్/ఘట్‌కేసర్: తెలంగాణలో షెడ్యూల్ ప్రకారమే 80 రోజుల్లో ఎన్నికలు రానున్నాయని కేంద్రమంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి అన్నారు. మంగళవారం బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర స్థాయి సమ్మేళనాన్ని మన్సూరాబాద్‌లో నిర్వహించారు. మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొప్పు భాషా ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశానికి కిషన్‌రెడ్డితో పాటు ఎమ్మెల్యే ఈటల రాజేందర్ ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. అలాగే మేడ్చల్ జిల్లా ఘట్‌కేసర్ మండలం అవుషాపూర్‌లో నిర్వహించిన బీజేవైఎం రాష్ట్రస్థాయి సమావేశానికి కిషన్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమాల్లో కిషన్‌రెడ్డి మాట్లాడుతూ, దళితుడిని ముఖ్యమంత్రి చేస్తానని ప్రకటించిన కేసీఆర్.. ఎన్నికల ఫలితాలు వెలువడగానే వారికి వెన్నుపోటు పొడిచి దగా చేశారని ధ్వజమెత్తారు. దళితబంధు పేరుతో ఎస్సీ సబ్‌ప్లాన్ నిధులను నిర్వీర్యం చేశారని మండిపడ్డారు. ఈ నెల 17న పరేడ్ గ్రౌండ్స్‌లో తెలంగాణ విమోచన దినోత్సవాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. ఉద్యోగాలు రాక తెలంగాణ యువత కన్నీరు పెడుతోందని ఈటల రాజేందర్ ఆవేదన చెందారు. ఈ కార్యక్రమంలో కిషన్‌రెడ్డి డప్పుకొట్టి కార్యకర్తల్లో జోష్ నింపారు. కాగా, తెలంగాణలో కల్వకుంట్ల కుటుంబ పాలనను అంతమొందించడానికి బీఆర్ఎస్‌ను, దేశంలో గాంధీ కుటుంబ పాలన రాకుండా కాంగ్రెస్‌ను ఓడించాలని కిషన్‌రెడ్డి పిలుపునిచ్చారు. బీజేవైఎం సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్, కాంగ్రెస్ డీఎన్ఏ ఒక్కటేనన్నారు. బుధ, గురువారాల్లో నిరుద్యోగ దీక్ష, 15న హైదరాబాద్-పరకాల బైక్ ర్యాలీ ఉంటాయని తెలిపారు.

నగరంలో ఇక 'గ్రేటర్' నిర్మాణాలు

- ఉప్పల్‌లో నేషనల్ సైన్స్ సెంటర్
- సంగీత నాటక అకాడమీ శాఖ
- జూబ్లీహిల్స్‌లో కల్చరల్ సెంటర్
- రూ.15 కోట్లతో ఓయూలో రెండు హాస్టల్ భవనాలు
- ఓయూలో ఆర్ట్స్ కాలేజీ డైనమిక్ లైటింగ్ షో ప్రారంభోత్సవంలో కిషన్‌రెడ్డి వెల్లడి

ఉస్మానియా యూనివర్సిటీ: కేంద్ర ప్రభుత్వ నిధులతో మహా నగరంలో పలు నూతన నిర్మాణాలు చేపట్టనున్నట్లు కేంద్రమంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం ఉస్మానియా విశ్వవిద్యాలయం ఆర్ట్స్ కాలేజీ భవనానికి రూ.12 కోట్లతో ఏర్పాటు చేసిన డైనమిక్ లైటింగ్ షోను ఆయన జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి కిషన్‌రెడ్డి మాట్లాడుతూ ఈ నెల 27న ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా ఆర్ట్స్ కాలేజీ భవనానికి ఏర్పాటు చేసిన లైటింగ్, లేజర్ షో, మ్యూజిక్ ఫౌంటెన్లు పూర్తి స్థాయిలో ప్రారంభమవుతాయన్నారు. గోరటి వెంకన్న రాసిన పాటలతో పాటు ఓయూ, ప్రముఖుల చరిత్రను ఆర్ట్స్ కాలేజీపై లేజర్ షో, గ్రాఫిక్స్, వాయిస్ ఓవర్ ద్వారా వివరించనున్నట్లు తెలిపారు. డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత శోభన్‌రెడ్డి తన ప్రసంగంలో ఓయూతో పాటు ఇతర చారిత్రిక ప్రదేశాలను కూడా పర్యాటక కేంద్రాలుగా అభివృద్ధి చేయాలని కోరగా...నగరంలో చేపట్టనున్న నూతన నిర్మాణాల గురించి మంత్రి వివరించారు. ఇప్పటికే చార్మినార్‌కు పర్మనెంట్ లైటింగ్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. త్వరలో గోల్కొండ కోటలో కూడా డైనమిక్ లైటింగ్‌ను ఏర్పాటు చేస్తామన్నారు. ఉప్పల్ రోడ్డులో నేషనల్ సైన్స్ సెంటర్, సంగీత నాటక అకాడమీ భవనాల నిర్మాణాలను నెలలో ప్రారంభిస్తామన్నారు. జూబ్లీహిల్స్‌లో రూ.26 కోట్లతో కల్చరల్ సెంటర్ భవన నిర్మాణం పనులను వచ్చే నెల చేపడుతామన్నారు. ఓయూ క్యాంపస్‌లో బాల, బాలికల కోసం వేర్వేరుగ రూ.15 కోట్ల వ్యయంతో హాస్టల్ భవనాలను నిర్మించనున్నట్లు వివరించారు. కార్యక్రమంలో వీసీ ప్రొ.రవీందర్, రిజిస్ట్రార్ ప్రొ.లక్ష్మీనారాయణ, ఎమ్మెల్సీలు ఏవీఎన్ రెడ్డి, సురభివాణిదేవి, మాజీ ఎమ్మెల్సీ రాంచందర్‌రావు తదితరులు పాల్గొన్నారు. కాగా జాతీయ విద్యా విధానానికి వ్యతిరేకంగా నినాదాలు చేసిన విద్యార్థులు, బీజేపీ ఫ్లెక్సీలను చించివేసిన బీఆర్ఎస్వీ విద్యార్థి నేతలను పోలీసులు అరెస్ట్ చేశారు.

అధికారికంగా విమోచన దినోత్సవం నిర్వహించాలి

కేంద్రమంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి డిమాండ్

- 17న కేంద్రం ఆధ్వర్యంలో పరేడ్‌గ్రౌండ్స్‌లో విమోచన దినోత్సవం
- కేంద్ర హోం మంత్రి అమిత్ షా పాల్గొంటారని వెల్లడి
- రాష్ట్రపతి నిలయంలోనూ ఈసారి ఉత్సవాలు...
- వర్చువల్‌గా పాల్గొననున్న రాష్ట్రపతి ద్రౌపది ముర్మ

సాక్షి, హైదరాబాద్: ఈ నెల 17న సమైక్యతా దినోత్సవం కాకుండా అధికారికంగా హైదరాబాద్ విమోచన దినోత్సవంగా రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించాలని కేంద్రమంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్ రెడ్డి డిమాండ్ చేశారు. వేలాదిమంది యువకులు, మహిళలు పెద్దఎత్తున నిజాంపై పోరాడితే.. ఎంతోమంది ప్రాణాలు కోల్పోతే.. సమైక్యతా దినోత్సవం ఎలా అవుతుందని సీఎం కేసీఆర్‌ను ప్రశ్నించారు. హైదరాబాద్ ముక్తి దివస్ పేరిట కర్ణాటక, మహారాష్ట్రల్లో ఉత్సవాలు నిర్వహిస్తుంటే.. బీఆర్ఎస్ ప్రభుత్వం తెలంగాణలో ఎందుకు నిర్వహించడం లేదని నిలదీశారు. మంగళవారం కిషన్‌రెడ్డి హైదరాబాద్‌లో మీడియాతో మాట్లాడారు. గతేడాది మాదిరిగా ఈ ఏడాది 17న కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో పరేడ్‌గ్రౌండ్స్‌లో నిర్వహిస్తున్న విమోచన దినోత్సవంలో కేంద హోంమంత్రి అమిత్ షా ముఖ్యఅతిథిగా పాల్గొంటారని తెలిపారు. ఇందులో పాల్గొనాలని తెలంగాణతో సహా కర్ణాటక, మహారాష్ట్ర ముఖ్యమంత్రులను ఆహ్వానిస్తున్నామని చెప్పారు. హైదరాబాద్ స్టేట్ విమోచనకు సంబంధించి చారిత్రక పరిణామాలకు సజీవ సాక్ష్యంగా నిలిచిన బొల్లారం రాష్ట్రపతి నిలయంలోనూ ఈ సారి ఉత్సవాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో రాష్ట్రపతి ద్రౌపదీ ముర్మ వర్చువల్‌గా పాల్గొంటారని వెల్లడించారు.

ఎంఐఎంకు కేసీఆర్ లొంగిపోయి.. విమోచన దినోత్సవాన్ని కాలరాస్తున్నారు

కేవలం ఓటుబ్యాంకు రాజకీయాలతో, మజ్లిస్‌కు వంతపాడుతూ సీఎం కేసీఆర్ విమోచన దినోత్సవ చరిత్రను కాలరాస్తున్నారని కిషన్‌రెడ్డి విమర్శించారు. ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఒవైసీ అనుమతి ఉంటేనే కేసీఆర్ ఈ కార్యక్రమానికి హాజరవుతారని ఎద్దేవా చేశారు. విమోచన దినోత్సవం నిర్వహించని మొదటి ద్రోహి కాంగ్రెస్ అయితే.. రెండో ద్రోహి బీఆర్ఎస్ అని మండిపడ్డారు. ''తెలంగాణ విమోచన దినోత్సవాలను ఎందుకు అధికారికంగా జరపడం లేదు? ఎంఐఎంకు లొంగిపోయి, తెలంగాణ అస్తిత్వాన్ని, తెలంగాణ ఆత్మగౌరవాన్ని తాకట్టు పెడుతున్నారని'' 2007లో నాటి అధికార కాంగ్రెస్‌ను ప్రశ్నించిన కేసీఆర్... మరి ఇప్పుడెందుకు అధికారికంగా నిర్వహించడం లేదని ప్రశ్నించారు. చరిత్రను ఈ తరానికి అందించడంలో కాంగ్రెస్ కుట్ర చేస్తే.. ఇప్పుడు ఎంఐఎంకు కేసీఆర్ లొంగిపోయి విమోచన దినోత్సవ చరిత్రను కనుమరుగు చేస్తున్నారని ఆరోపించారు.

బాబు అరెస్టుపై నో కామెంట్

ఏపీ మాజీ సీఎం చంద్రబాబు అరెస్టుపై ఓ విలేకరి ప్రశ్నించగా ఎఫ్ఐఆర్‌లో పేరు లేకుండానే అరెస్ట్ చేశారని ఏపీ బీజేపీ అధ్యక్షురాలు పేర్కొన్నారని, ఐతే దానికి సంబంధించిన పూర్తి సమాచారం తమ వద్ద లేదని కిషన్‌రెడ్డి బదులిచ్చారు.

గ్రౌండ్ ఇవ్వలేదనడం మూర్ఖత్వం

తమకు గ్రౌండ్ ఇవ్వలేదని కొందరు(కాంగ్రెస్ పార్టీ నేతలనుద్దేశించి) మూర్ఖత్వంతో ఆరోపణలు చేస్తున్నారని కిషన్‌రెడ్డి విమర్శించారు. కేంద్రం ఆధ్వర్యంలో అక్కడ విమోచన దినోత్సవాలను నిర్వహించుకోవాలని నిర్ణయిస్తే.. దాన్ని అడ్డుకునేలా కాంగ్రెస్, ఇతర పార్టీలు కుట్ర చేస్తున్నాయని నిందించారు. విమోచన ఉత్సవాలు నిర్వహించాల్సిందిగా.. రాష్ట్రంలోని సర్పంచ్ లకు లేఖలు రాస్తున్నట్టు తెలిపారు.

'ప్రీతి మృతి కేసులో సైఫ్ వాదనలు వినండి'

కాకతీయ మెడికల్ కాలేజీకి హైకోర్టు ఆదేశం

సాక్షి, హైదరాబాద్: వైద్య విద్యార్థిని ధరావత్ ప్రీతి మృతి కేసులో సస్పెన్షన్‌కు గురైన సీనియర్ విద్యార్థి ఎంఏ సైఫ్ అలీ వాదన వినాలని కాకతీయ మెడికల్ కాలేజీని హైకోర్టు ఆదేశించింది. ఆ తర్వాత అతనిపై సస్పెన్షన్ ఎత్తివేయాలా? వద్దా? అనేదానిపై నిర్ణయం తీసుకోవాలని స్పష్టం చేసింది. 'వరంగల్ కాకతీయ మెడికల్ కాలేజీలో ధరావత్ ప్రీతి ఎండీ అనస్థీషియా విద్యార్థినిగా 2022లో చేరింది. రెండో సంవత్సరం చదువుతున్న సైఫ్ ఆమెను ర్యాగింగ్ చేస్తూ వేధింపులకు గురిచేశారు. ఈ నేపథ్యంలో ఫిబ్రవరి 21న సైఫ్ తన స్నేహితులతో కలసి ప్రీతికి విషపూరిత ఇంజక్షన్ ఇచ్చారు. చికిత్స పొందుతూ ప్రీతి మృతి చెందింది. దీనికి కారకులైనవారిపై కఠినచర్యలు తీసుకోవాలి'అని ఆమె తల్లిదండ్రులు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ కేసులో భాగంగా సైఫ్‌ను అధికారులు అరెస్టు చేయడమే కాకుండా సస్పెండ్ చేశారు. అయితే తన వాదనలు కూడా వినకుండా సస్పెండ్ చేశారని సైఫ్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. అధికారులు పట్టించుకోకపోవడంతో హైకోర్టును ఆశ్రయించాల్సి వచ్చిందని పేర్కొన్నారు. సస్పెన్షన్ కొట్టివేస్తూ ఆదేశాలివ్వాలని కోరారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ సూరేపల్లి నందా విచారణ చేపట్టారు. సైఫ్ వాదనలు విని నిర్ణయం తీసుకోవాలని అధికారులను న్యాయమూర్తి ఆదేశించారు.

మద్యం పోసి... సిగరెట్లు తాగించి

బట్టలు విప్పించి డ్యాన్సులు చేయించి • గాంధీ మెడికల్ కాలేజీలో ర్యాగింగ్ రాక్షస క్రీడ

సాక్షి, హైదరాబాద్: గాంధీ మెడికల్ కాలేజీలో ర్యాగింగ్ ఘటన కలకలం రేపింది. ఈ ఘటనకు సంబంధించి 10 మంది ఎంబీబీఎస్ విద్యార్థులను సస్పెండ్ చేయడంతో వైద్య విద్యార్థి లోకం ఉలిక్కిపడింది. ర్యాగింగ్ పేరిట కొందరు సీనియర్ ఎంబీబీఎస్ విద్యార్థులు ఇటీవల జూనియర్ ఎంబీబీఎస్ విద్యార్థులను అర్ధరాత్రి 2 గంటల సమయంలో తమ హాస్టల్ రూములకు రప్పించి వారికి బలవంతంగా మద్యం పోసి... సిగరెట్‌లు తాగించినట్లు తేలింది. దీంతో మానసిక వేదనకు గురైన బాధిత విద్యార్థులు అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో వైద్య విద్యా సంచాలకుల (డీఎంఈ) కార్యాలయ అధికార వర్గాలు చేపట్టిన విచారణలో విస్మయకర నిజాలు వెలుగుచూశాయి. కొందరిని బట్టలు విప్పించి డ్యాన్స్‌లు చేయించారని కూడా అంటున్నారు. బూతులు తిడుతూ, బాధితులతో కూడా బూతులు మాట్లాడించారని తేలింది. కాగా, కొందరు విద్యార్థినులను కూడా ర్యాగింగ్ చేసినట్లుగా ప్రచారం జరుగుతోంది. ఇది వాస్తవమేనా కాదా అన్న దానిపై అధికారులు విచారణ చేస్తున్నారు. కాగా ఈ ర్యాగింగ్ ఉదంతంపై ప్రభుత్వం సీరియస్‌గా ఉంది. అన్ని మెడికల్ కాలేజీల్లో ర్యాగింగ్‌పై ఉక్కుపాదం మోపాలని వైద్య ఆరోగ్యశాఖ నిర్ణయించింది. ఈ మేరకు ప్రభుత్వ, ప్రైవేట్ మెడికల్ కాలేజీలకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది.



- సర్కారు సీరియస్... విచారిస్తున్న రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ
- అన్ని కాలేజీల్లో ర్యాగింగ్‌పై ఉక్కుపాదం మోపాలని నిర్ణయం
- ఇకపై ర్యాగింగ్ చేస్తే కఠిన చర్యలకు రంగం సిద్ధం
- ముందుగా ర్యాగింగ్ నిరోధక కమిటీలు పటిష్టం
- ఈ–మెయిల్ ఐడీ, టోల్ ఫ్రీ నంబర్ ఏర్పాటుకు యోచన

ర్యాగింగ్ నిరోధక కమిటీల పటిష్టం...

రాష్ట్ర వ్యాప్తంగా ఈనెల ఒకటో తేదీ నుంచి ఎంబీబీఎస్ మొదటి ఏడాది తరగతులు ప్రారంభమయ్యాయి. దీంతో కొన్నిచోట్ల కొందరు సీనియర్ విద్యార్థులు మొదటి ఏడాది విద్యార్థులపై ర్యాగింగ్‌కు పాల్పడుతున్న ఘటనలు అధికారుల దృష్టికి వచ్చాయి. ప్రైవేట్ మెడికల్ కాలేజీల్లోనూ ఇలాంటివి జరుగుతున్నట్లు తెలిసింది. అయితే ర్యాగింగ్ చేసిన వారిపై చర్యలు తీసుకుంటే విద్యార్థుల భవిష్యత్తు నాశనం అవుతుందన్న భావనతో చూసీచూడనట్లుగా వదిలేశారు. కానీ గాంధీ ఘటన నేపథ్యంలో ఇకపై ర్యాగింగ్ జరగకుండా కఠిన చర్యలు తీసుకోవాలని డీఎంఈ కార్యాలయం ఆదేశించింది. అన్ని మెడికల్ కాలేజీల్లో ర్యాగింగ్ నిరోధక కమిటీలను పటిష్టం చేయాలని, ఇప్పటికీ లేకుంటే తక్షణమే ఏర్పాటు చేయాలని స్పష్టం చేసింది. విద్యార్థులకు కౌన్సెలింగ్ ఇవ్వాలని, హాస్టళ్ల వద్ద రాత్రి వేళ నిఘా పెంచాలని సూచించింది. మరోవైపు ర్యాగింగ్‌కు గురైన విద్యార్థుల ఫిర్యాదు నిమిత్తం టోల్‌ఫ్రీ నంబర్ ఏర్పాటు, ఈ మెయిల్ ఐడీని రూపొందించాలని కూడా డీఎంఈ కార్యాలయ అధికారులు యోచిస్తున్నారు.

వైద్య విద్యార్థులపై సస్పెన్షన్ ఎత్తివేయాలి

గాంధీ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ కార్యాలయం ముట్టడి



ప్రిన్సిపాల్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న వైద్య విద్యార్థులు

గాంధీ ఆస్పత్రి (హైదరాబాద్): గాంధీ వైద్య కళాశాల వైద్య విద్యార్థుల సస్పెన్షన్‌పై పునరాలోచించాలని కోరుతూ వైద్య విద్యార్థులు ప్రిన్సిపాల్ కార్యాలయాన్ని ముట్టడించి శాంతియుతంగా ధర్నా నిర్వహించారు. గాంధీ వైద్య కళాశాలలో ర్యాగింగ్‌కు పాల్పడిన పది మంది వైద్య విద్యార్థులను ఏడాది పాటు సస్పెండ్ చేయడం తెలిసిందే. ఈ నేపథ్యంలో గాంధీ వైద్య విద్యా ర్థులు మంగళవారం ప్రిన్సిపాల్ కార్యాలయం ఎదుట బైఠాయించి ధర్నా నిర్వహించారు. ఈక్రమంలో గాంధీ వైద్య కళాశాల వైస్ ప్రిన్సిపాల్ కృష్ణమోహన్, చిలకలగూడ సీఐ మట్టంరాజులు వైద్యవిద్యార్థులతో పలుమార్లు చర్చలు జరిపారు. ఢిల్లీలోని యూజీసీ యాంటీ ర్యాగింగ్ సెల్‌కు ఫిర్యాదు అందిన నేపథ్యంలో.. అక్కడి ఉన్నతాధి కారుల సూచన మేరకు గాంధీ వైద్య కళాశాల యాంటీ ర్యాగింగ్ కమిటీ జరిపిన అంతర్గత విచారణలో ర్యాగింగ్ జరిగినట్లు నిర్ధారణయిందని అధికారులు వివరించారు. యాంటీ ర్యాగింగ్ కమిటీ తీర్మానం మేరకే చర్యలు చేపట్టామని, ఇది డీఎంఈ నిర్ణయం కాదని స్పష్టం చేశారు. ర్యాగింగ్‌కు పాల్పడిన వారిపై చట్టప్రకారం పోలీస్ కేసులు నమోదు చేయాలని, విద్యార్థులకు తీవ్ర నష్టం జరుగుతుందనే ఉద్దేశంతో ఎఫ్ఐఆర్ నమోదు చేయలేదని ఓ అధికారి పేర్కొన్నారు. డీఎంఈ, గాంధీ ప్రిన్సిపాల్ రమేశ్‌రెడ్డి ప్రస్తుతం అందుబాటులో లేరని, బుధవారం ఆయనతో సమావేశం ఏర్పాటు చేస్తామని వైస్ ప్రిన్సిపాల్ నచ్చజెప్పడంతో విద్యార్థులు ధర్నా విరమించి, తరగతులకు హాజరయ్యారు.

బీజేపీలో చీకోటి చేరికకు బ్రేక్?

- కర్మన్ ఘాట్ నుంచి ఊరేగింపుగా పార్టీ కార్యాలయానికి చేరుకున్న చీకోటి ప్రవీణ్
- తీరా అక్కడకు వెళ్లిన తర్వాత చేరిక కార్యక్రమం లేదని వర్తమానం.. దాంతో వెనుతిరిగిన వైనం



పార్టీ కార్యాలయానికి ఊరేగింపుగా వెళ్తున్న చీకోటి

సాక్షి, హైదరాబాద్: బీజేపీలో క్యాసినో నిర్వాహకుడు చీకోటి ప్రవీణ్ చేరికకు బ్రేక్ పడింది. పార్టీలో చేరేందుకు మందీ మార్బలంతో కర్మన్‌ఘాట్ నుంచి భారీ ఊరేగింపుగా బీజేపీ కార్యాలయానికి చేరుకున్న చీకోటికి పార్టీ నేతలెవరూ అందుబాటులో లేరన్న సమాచారం వచ్చింది. అయితే ఆలస్యమైనా కేంద్రమంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి వచ్చే దాకా వేచి చూడాలన్న అభిప్రాయం అనుయాయుల్లో వ్యక్తమైంది. కానీ ఈ చేరికపై రాష్ట్ర పార్టీ ఎన్నికల ఇన్‌చార్జి ప్రకాష్ జవదేకర్ భిన్నాభిప్రాయంతో ఉన్నారని తెలియడంతో మంగళవారం రాత్రి ఆయనను సంప్రదించాకే తదుపరి కార్యాచరణను ప్రకటిస్తానని ప్రవీణ్ వెల్లడించారు. ఆయన మీడియాతో మాట్లాడుతూ 'ఇంకా ఎవరి నుంచో క్లారిటీ రావాలన్నారు. ఎన్నో ఆటు పోట్లు చూశాను ఇంతకంటే పెద్ద సవాళ్లు ఎదుర్కొన్నా ...ఇదేం పెద్ద సమస్య కాదు. బీజేపీ అంటే క్రమశిక్షణకు మారుపేరు. పార్టీ పెద్దలతో భేటీ తర్వాత నా కార్యాచరణ ప్రకటిస్తా. ఆవేశం పనికిరాదు.. ఓపికగా ఉందాం'అని వ్యాఖ్యానించి అక్కడి నుంచి వెనుదిరిగారు.

కిషన్‌రెడ్డి సహా ఎవరికి వారు వెళ్లిపోయారు..

క్యాసినో నిర్వాహకుడిగా ప్రవీణ్ ఇమేజీ, ఆయనపై ఉన్న కేసులు తదితర అంశాల ప్రాతిపదికన చేరిక కార్యక్రమాన్ని కొంతకాలం వాయి దా వేయాలని రాష్ట్ర ముఖ్య నేతలు నిర్ణయించినట్టు తెలుస్తోంది. ఈ నేపథ్యంలోనే ఇది వాయిదా పడిందనే అభిప్రాయం వ్యక్తమౌతోంది. కాగా, పార్టీ సమావేశాలు, అధికారిక కార్యక్రమాలతో మంగళవారం కేంద్రమంత్రి, బీజేపీ అధ్యక్షుడు బిజీబిజీగా గడిపారు. ఉదయమే పార్టీ కార్యాలయం నుంచి వెళ్లిపోయారు. ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు డా.కె.లక్ష్మణ్, ఈటల రాజేందర్‌లు పార్టీ ఆఫీసులో కొంత సేపు ఉండి వెళ్లిపోయారు.

ఇది సరికాదంటూ బండి అసంతృప్తి?

ఇదిలా ఉండగా ప్రవీణ్ చేరికను నిలిపేయడంపై బండిసంజయ్ అసంతృప్తి వ్యక్తంచేసినట్టు తెలుస్తోంది. చేర్చుకుంటామని పార్టీ కార్యాలయనికి పిలిచి చేర్చుకోకపోవడం సరైనది కాదని వ్యాఖ్యానించినట్టు చెబుతున్నారు. ఇటీవల మాజీ మంత్రి కృష్ణయాదవ్ కూడా బీజేపీలో చేరేందుకు అంబర్‌పేట నుంచి ఊరేగింపుగా రాగా ఈ చేరిక కార్యక్రమం ఇప్పుడే కాదు కొంతకాలం తర్వాత చేరాలంటూ చివరి నిమిషంలో సమాచారం ఇవ్వడంతో ఆయన మధ్యలోనే వెనుదిరుగాల్సి వచ్చింది. ఇలాంటి చేరికలపై రాష్ట్ర కోర్ కమిటీలో చర్చించకుండా తొందరపాటు నిర్ణయాలు తీసుకోవడం వల్ల చిక్కులు ఎదురవుతున్నాయనే అభిప్రాయం రాష్ట్రపార్టీలో వ్యక్తమవుతోంది.

అంగన్‌వాడీల్లో 65 ఏళ్లకు రిటైర్మెంట్

- ఖరారు చేసిన రాష్ట్ర ప్రభుత్వం
- పదవీ విరమణ పొందిన సిబ్బందికి ఆర్థిక సాయం
- టీచర్లు, హెల్పర్లకు రూ.2 లక్షల బీమా సౌకర్యం
- రిటైర్ అయిన మరుసటి నెల నుంచి ఆసరా పెన్షన్
- 3,989 మినీ అంగన్‌వాడీ కేంద్రాల అప్‌గ్రెడేషన్
- వేర్వేరు ఉత్తర్వులు జారీ



మాట్లాడుతున్న మంత్రి సత్యవతి రాథోడ్

సాక్షి, హైదరాబాద్/ వెంగళరావు నగర్: రాష్ట్ర మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో పనిచేస్తున్న అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్ల పదవీ విరమణ వయసును 65 ఏళ్లుగా రాష్ట్ర ప్రభుత్వం ఖరారు చేసింది. అదేవిధంగా పదవీ విరమణ పొందిన అంగన్‌వాడీ టీచర్‌కు లక్ష రూపాయలు, మినీ అంగన్‌వాడీ టీచర్ లేదా హెల్పర్‌కు రూ.50 వేలు ఆర్థిక సాయం అందించనుంది. పదవీ విరమణ పొందిన మరుసటి నెల నుంచి ఆసరా పెన్షన్ కూడా అమలు చేయనుంది. 50 సంవత్సరాలలోపు ఉన్న అంగన్‌వాడీ టీచర్లకు, హెల్పర్లకు రూ.2 లక్షల బీమా సౌకర్యం కల్పించనుంది. సరీ్వసులో ఉన్న అంగన్‌వాడీ టీచర్ మరణిస్తే రూ.20 వేలు, మినీ అంగన్‌వాడీ టీచర్/హెల్పర్‌కు రూ.10 వేలు దహన సంస్కారాల నిమిత్తం అందజేయనుంది. మరోవైపు రాష్ట్రంలో ప్రస్తుతం కొనసాగుతున్న 3,989 మినీ అంగన్‌వాడీ కేంద్రాలను అప్‌గ్రేడ్ చేస్తూ ప్రధాన అంగన్‌వాడీ కేంద్రాలుగా మార్చింది. ఈ మేరకు రాష్ట్ర మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ప్రత్యేక కార్యదర్శి భారతి హోలికేరి వేర్వేరు ఉత్తర్వులు జారీ చేశారు.

ప్రతినెలా 14లోపు వేతనాలు: మంత్రి సత్యవతి రాథోడ్

అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లకు ప్రతినెలా 14వ తేదీలోపు వేతనాలు అందిస్తున్నట్లు మంత్రి సత్యవతి రాథోడ్ తెలిపారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా తెలంగాణలో అంగన్‌వాడీల సంక్షేమం, అభివృద్ధికి కేసీఆర్ ప్రభుత్వం పెద్దపీట వేసిందని చెప్పారు. అంగన్‌వాడీ టీచర్లకు రూ.13,650, మినీ అంగన్‌వాడీ టీచర్లకు రూ.7,800, హెల్పర్లకు రూ.7,800 చొప్పున వేతనాలు ఇస్తున్నామన్నారు. మంగళవారం రాష్ట్ర మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ కమిషనర్ కార్యాలయంలో అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. అంగన్‌వాడీలు రాష్ట్ర ప్రభుత్వ పరిధిలో లేని అంశాలను అమలు చేయాలని కోరుతూ సమ్మెకు దిగడం న్యాయసమ్మతం కాదన్నారు. ఆయా డిమాండ్ల విషయంలో రాష్ట్ర ప్రభుత్వం కేంద్రంపై ఒత్తిడి పెంచుతుందని, తక్షణమే సమ్మె విరమించి విధుల్లో చేరాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో శాఖ ఉన్నతాధికారులు, అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్ల సంఘాల నేతలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి అంగన్‌వాడీలతో కలసి సహపంక్తి భోజనం చేశారు.

ఒక్కో కార్మికుడికి రూ. 2.64 లక్షలు

- ఉద్యోగులకు గరిష్టంగా రూ. 6 లక్షలు..
- సింగరేణి కార్మికుల ఖాతాల్లో 21న వేతన బకాయిలు జమ

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: కార్మికులు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న వేతన బకాయిలపై సింగరేణి సంస్థ మంగళవారం కీలక ప్రకటన చేసింది. సింగరేణిలో జాతీయ బొగ్గు గనుల వేతన ఒప్పందం అమలు అవుతున్న విషయం తెలిసిందే. పదో వేజ్‌బోర్డు కాలపరిమితి 2021 జూలై 1తో ముగిసింది. అప్పటి నుంచి 11వ బోర్డు అమల్లోకి వచ్చింది. ఈ మేరకు 2021 జూలై నుంచి 2023 మే 31 వరకు మొత్తం 22 నెలలకు సంబంధించి ఉద్యోగులు, కార్మికులకు పెరిగిన వేతన బకాయిలు చెల్లించాల్సి ఉంది. దీనిపై కార్మిక సంఘాలు క్రమం తప్పకుండా యాజమాన్యంపై ఒత్తిడి తెస్తున్నాయి. ఈ క్రమంలో 11వ వేజ్‌బోర్డు వేతన బకాయిలు ఈనెల 21న చెల్లిస్తామని సింగరేణి ప్రకటించింది. ఆరు జిల్లాల పరిధిలోని 11 ఏరియాల్లో పని చేస్తున్న 42 వేల మందికి పైగా ఉన్న ఉద్యోగులు, కార్మికుల బ్యాంకు ఖాతాల్లో నేరుగా ఈ బకాయిల మొత్తం జమచేస్తారు. ఇందుకు సంస్థ రూ.1,720 కోట్లు కేటాయించింది.

కనిష్టంగా రూ.2.60 లక్షలు

సింగరేణిలో ప్రారంభ వేతనం పదో వేజ్‌బోర్డులో రూ.25,000 ఉండగా 11వ వేజ్‌బోర్డ్‌లో ఇది రూ. 37,000కు చేరుకుంది. సీనియర్ విభాగంలో గరిష్ట వేతనం రూ.76వేల నుంచి రూ.90 వేలకు పైగా చేరుకుంది. దీంతో ఒక్కో కార్మికుడు పొందే వేతనాల బకాయిల మొత్తం కనిష్టంగా రూ. 2.64 లక్షలు ఉండగా, గరిష్టంగా రూ.3.08 లక్షల వరకు ఉంటుంది. ఇక ఉద్యోగుల విషయంలో గరిష్టంగా రూ.6 లక్షల వరకు వేతన బకాయిలు అందనున్నాయి.

తుపాకీతో బెదిరిస్తూ..

గంజాయి సరఫరా!

- యూపీ గాంజా ముఠా బరితెగింపు
- అడ్డుకుంటే అంతమొందించడమే లక్ష్యం
- నలుగురు అంతర్రాష్ట్ర నిందితుల అరెస్టు
- తుపాకీ, 14 బుల్లెట్లు, 508 కిలోల గంజాయి స్వాధీనం
- ప్రధాన సరఫరాదారు, గ్రహీత ఇద్దరూ పరారీలోనే
- సైబరాబాద్ సీపీ స్టీఫెన్ రవీంద్ర వెల్లడి



వివరాలు వెల్లడిస్తున్న సైబరాబాద్ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర



స్వాధీనం చేసుకున్న వస్తువులు

సాక్షి, హైదరాబాద్: చేతిలో తుపాకీ పట్టుకుని, ఎస్కార్ట్ వాహనంలో వెళుతూ హైదరాబాద్ మీదుగా ఒరిస్సా సరిహద్దు నుంచి మహారాష్ట్రకు గంజాయిని సరఫరా చేస్తున్న అంతర్రాష్ట్ర ముఠాను సైబరాబాద్ పోలీసులు అరెస్ట్ చేశారు. ఉత్తర్‌ప్రదేశ్‌కు చెందిన నలుగురు నిందితులను అదుపులోకి తీసుకుని వారి నుంచి తుపాకీ, రెండు మ్యాగ్జిన్లు, 14 రౌండ్ల బుల్లెట్లతో పాటు 508 కిలోల గంజాయి, రెండు కార్లు, ఏడు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. సైబరాబాద్ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర మంగళవారం మీడియాకు వివరాలు వెల్లడించారు.

◆ ఉత్తర్‌ప్రదేశ్‌లోని ముజఫర్ నగర్‌కు చెందిన మహ్మద్ ఇనామ్, మహ్మద్ సాద్, హర్యానాకు చెందిన బంతి కష్యప్, లలిత్ కుమార్ కష్యప్ రాజ్‌పుత్‌లు ముఠాగా ఏర్పడి కొన్నేళ్లుగా గంజాయి దందా నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో మహారాష్ట్రలోని సోలాపూర్‌కు గంజాయి విక్రయదారుడు బబ్లూ షిండే.. ఇనామ్‌కు గంజాయి రవాణా ఆర్డర్ ఇచ్చాడు. అడ్వాన్స్‌గా రూ.4.5 లక్షలు చెల్లించాడు. దీంతో ఇనామ్ అరకు లోయకు చెందిన గంజాయి సరఫరాదారుడు సుభాష్‌కు సరుకు సిద్ధం చేయాలని సూచించాడు.

◆ మార్గమధ్యంలో పోలీసులు, ఎవరైనా అడ్డుకునే ప్రయత్నం చేస్తే తుపాకీతో బెదిరించేందుకు పాత నేరస్తుడు మహ్మద్ అశు నుంచి ఇనామ్ ఒక తుపాకీ, రెండు మ్యాగ్జిన్లు, 14 బుల్లెట్లను కొనుగోలు చేశాడు. ఈ ఆయుధాలు, సాద్‌ను వెంట తీసుకుని మారుతి స్విఫ్ట్‌లో, బంతి, రాజ్‌పుత్‌లు మహీంద్రా ఎక్స్‌యూవీ500లో అరకు వెళ్లారు. సుభాష్ నుంచి కిలో రూ.3 వేల చొప్పున 508 కిలోల గంజాయిని కొనుగోలు చేశారు. సరుకును సుభాష్ ఎక్స్‌యూవీ కారులో 3 కిలోల ప్యాకెట్ల చొప్పున లోడ్ చేశాడు.

◆ వాహనం ముందు ఇనామ్, సాద్ మారుతీ స్విఫ్ట్ కారులో ఎస్కార్ట్‌గా బయలుదేరారు. జాతీయ రహ దారి వెంట ప్రయాణిస్తే పోలీసులు దొరికిపోతామని భావించిన వారు టోల్‌ప్లాజాలు, చెక్‌పోస్టులు తగలకుండా గూగుల్ మ్యాప్స్‌ను అనుసరిస్తూ గ్రామీణ ప్రాంతాల గుండా ప్రయాణించారు. దుండిగల్ పోలీసు స్టేషన్ పరిధిలోని ఔటర్ సమీపంలో మేడ్చల్ స్పెషల్ ఆపరేషన్ టీమ్ (ఎస్ఓటీ), దుండిగల్ పోలీసులు నలుగురు నిందితులను అరెస్టు చేశారు. అయితే ఈ కేసులో గంజాయి సరఫరాదారు సుభాష్, రిసీవర్ బబ్లూ పరారీలో ఉండటం గమనార్హం.

రహస్య సొరుగులో గంజాయి..



◆ డీసీఎం వాహనంలో రహస్య సొరుగులో గంజాయిని దాచి, సరఫరా చేస్తున్న ఇద్దరు నిందితులను సైబరాబాద్ పోలీసులు పట్టుకున్నారు. రాజమండ్రికి చెందిన రెహమాన్ మహారాష్ట్ర సతారా జిల్లాకు చెందిన విశాల్ చంద్రకాంత్ షిండే, సాగర్ భబన్ దేశ్‌ముఖ్‌లతో కలిసి మహారాష్ట్రకు అక్రమంగా గంజాయి సరఫరా చేసేవాడు.

◆ తనిఖీల్లో పోలీసుల కంట పడకుండా రెహమాన్ డీసీఎంలో రహస్య కంపార్ట్‌మెంట్‌ను సైతం తయారు చేశాడు. రాజమండ్రిలోని గంజాయి సాగుదారుల నుంచి 720 కిలోల గంజాయిని కొనుగోలు చేసిన అతను వీటిని 5 కిలోల చొప్పున ప్యాకెట్లు చేసి, రహస్య కంపార్ట్‌మెంట్‌లో దాచి ఉంచాడు. వాహనం లోపల ఖాళీ కూరగాయల డబ్బాలు ఉంచాడు.

◆ ఔరంగాబాద్‌లోని గంజాయి విక్రయదారులకు సరుకు అందించేందుకు ఈనెల 11న డీసీఎంతో చంద్రకాంత్, సాగర్ బయలుదేరారు. మంగళవార ం తెల్లవారుజామున నార్సింగి పోలీసు స్టేషన్ పరిధిలోని మంచిరేవుల సర్వీస్ రోడ్‌లో మాదాపూర్ స్పెషల్ ఆపరేషన్ టీం (ఎస్ఓటీ), నార్సింగి పోలీసులు డీసీఎంను తనిఖీ చేయగా గంజాయి గుట్టు బయటపడింది. నిందితుల నుంచి రూ.1.64 కోట్లు విలువ చేసే 720 కిలోల గంజాయి, డీసీఎం, మూడు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు.

కాంగ్రెస్ భవన నిర్మాణానికి అనుమతి

- దివంగత ముఖ్యమంత్రి వైఎస్ హయాంలో స్థలం కేటాయింపు
- టీపీసీసీ ఉపాధ్యక్షుడు మల్లు రవికి అనుమతి పత్రాల అందజేత



అనుమతి పత్రాలు అందుకుంటున్న టీపీసీసీ ఉపాధ్యక్షుడు మల్లు రవి

హైదరాబాద్: ఎట్టకేలకు కాంగ్రెస్ భవన నిర్మాణానికి కంటోన్మెంట్ బోర్డు అనుమతులు ఇచ్చింది. దాదాపు ఏడాదిగా కొనసాగుతున్న ఈ వ్యవహారంపై గత మే నెలలోనే బోర్డు తీర్మానం ఆమోదించగా, అందుకు సంబంధించిన పత్రాలను మంగళవారం జారీ చేసింది. టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షుడు మల్లు రవి బోర్డు కార్యాలయానికి వచ్చి పత్రాలను అందుకున్నారు. దీంతో 15 ఏళ్ల క్రితం దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి కాంగ్రెస్ పార్టీకి కేటాయించిన స్థలంలో భవన నిర్మాణానికి అన్ని అడ్డంకులు తొలగిపోయాయి.

ఫలించిన రేవంత్ పోరాటం..

2008లో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీకి బోయిన్‌పల్లిలో 10–15 ఎకరాల స్థలాన్ని కేటాయించింది. మరుసటి ఏడాదే వైఎస్ మరణం, తదనంతర పరిణామాల నేపథ్యంలో కాంగ్రెస్ పెద్దలు ఈ స్థలం విషయాన్ని పూర్తిగా పక్కన పెట్టారు. తాజాగా గత ఏడాది టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి కంటోన్మెంట్ బోర్డు అధికారులను కలిసి స్థలం విషయమై ఆరాతీశారు. సదరు స్థలంలో 'గాంధీయన్ ఐడియాలజీ సెంటర్' పేరిట జాతీయ శిక్షణ కేంద్రాన్ని నిర్మించాలని నిర్ణయించారు. తదనుగుణంగా నిర్మాణ అనుమతుల కోసం బోర్డును ఆశ్రయించారు. కంటోన్మెంట్‌లో ప్రత్యేక ఆహ్వానితుడిగా ఉన్న రేవంత్ రెడ్డి గతేడాది సెప్టెంబర్ 29న జరిగిన బోర్డు సమావేశానికి హాజరై ప్రతిపాదన ఉంచారు. అయితే బీఆర్ఎస్‌కు చెందిన అప్పటి ఎమ్మెల్యే దివంగత సాయన్న, బీజేపీకి చెందిన బోర్డు సివిలియన్ నామినేటెడ్ సభ్యుడు రామకృష్ణ అభ్యంతరాలు లేవనెత్తడంతో అనుమతిని పెండింగ్‌లో పెట్టారు. తిరిగి ఈ ఏడాది మే 10న జరిగిన సమావేశంలో మరోసారి ఈ అంశం చర్చకు రాగా, బోర్డు భవన నిర్మాణ అనుమతులు జారీ చేస్తూ తీర్మానం చేసింది. అన్ని అడ్డంకులు తొలగడంతో బోయిన్‌పల్లి పరిధిలోని జీఎల్ఆర్ సర్వే నెంబర్ 502/పీ1, పీ2లోని 50,215 గజాల విస్తీర్ణంలో భవన నిర్మాణానికి అనుమతులు జారీ అయ్యాయి. గెస్ట్ హౌజ్, హాస్టల్ బ్లాకులను రెసిడెన్షియల్ కేటగిరీగా, ఆఫీస్, ఆడిటోరియం, మల్టీపర్పస్ హాల్‌ను కమర్షియల్‌గా పరిగణిస్తూ సెమీ రెసిడెన్షియల్ అనుమతులు ఇచ్చారు. టీపీసీసీ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ మల్లు రవి పేరిట భవన నిర్మాణ అనుమతులు మంజూరు కావడంతో మంగళవారం బోర్డు కార్యాలయానికి వచ్చిన ఆయన అనుమతి పత్రాలను అందుకున్నారు.

గ్యాస్ లీకేజీ ఘటనలో

మరొకరు మృతి

హైదరాబాద్: ఫిలింనగర్‌లోని మహాత్మగాంధీనగర్ వడ్డెర బస్తీలో సోమవారం తెల్లవారుజామున గ్యాస్ లీకేజీ ఘటనలో ఆస్పత్రిలో చికిత్స పొందు తూ మంగళవారం మరొకరు మృతి చెందారు. వివరాలు ఇలా ఉన్నాయి..మహాత్మగాంధీనగర్ వడ్డెర బస్తీలో నివాసం ఉంటున్న రమేష్ చేవెళ్ల ఎంపీ రంజిత్‌రెడ్డి వద్ద కారు డ్రైవర్‌గా పని చేస్తు న్నాడు. ఆదివారం రమేష్(38), అతడి భార్య శ్రీలత(32), కుమారుడు హర్షవర్ధన్(13), కూతు రు సీతామహాలక్ష్మి(8) ఇంట్లో నిద్రపోయారు. సోమవారం ఉదయం రమేష్ నిద్ర లేచి లైట్ వేయగా అప్పటికే గ్యాస్ లీకై ఇళ్లంతా వ్యాపించి ఉండటంతో ఒక్కసారిగా మంటలు అంటుకున్నా యి.

వారు అప్రమత్తమై బయటికి పరుగుతీసేలో గా నిప్పంటుకుని రమేష్, అతడి భార్య శ్రీలత తీవ్రంగా గాయపడ్డారు. రమేష్ చికిత్స పొందు తూ సోమవారం మృతి చెందాడు. ఉస్మానియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న శ్రీలత మంగళవారం మధ్యాహ్నం కన్నుమూసింది. కుమారుడు హర్షవర్ధన్ పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు వెల్లడించారు. ఈ ఘటనలో వడ్డెర బస్తీలో విషాదఛాయలు అలుముకున్నాయి. ఫిలింనగర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. ఎంపీ రంజిత్‌రెడ్డి మంగళవారం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రమేష్ కుటుంబ సభ్యులను పరామర్శించారు.

జర్నలిస్టుల రైల్వేపాస్‌ల పునరుద్ధరణకు కృషి

- ఇళ్ల స్థలాల విషయంలోనూ సర్కారు సానుకూలం
- హెచ్‌యూజే ప్రతినిధులకు చేవెళ్ల ఎంపీ రంజిత్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: పాత్రికేయుల రైల్వేపాసుల పునరుద్ధరణకు తనవంతు కృషి చేస్తానని చేవెళ్ల ఎంపీ డాక్టర్ జి.రంజిత్‌రెడ్డి స్పష్టం చేశారు. జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇచ్చే విషయంలోనూ, రాష్ట్ర ప్రభుత్వం సానుకూలంగా ఉందని తెలిపారు. మంగళవారం తన నివాసంలో హైదరాబాద్ జర్నలిస్టు యూనియన్(హెచ్‌యూజే) ప్రతినిధి బృందం ఆయనను కలిసింది. ఈ సందర్భంగా పలు అంశాలను హెచ్‌యూజే ఎంపీ రంజిత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లింది. వచ్చే పార్లమెంట్ సమావేశాల్లో కేంద్ర రైల్వేమంత్రి అశ్వనీ వైష్ణవ్‌తో దృష్టికి తీసుకెళ్తానని ఈ సందర్భంగా ఎంపీ హామీ ఇచ్చారు. అన్ని జిల్లాల్లోనూ జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇస్తుందని చెప్పారు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని జర్నలిస్టులకు కూడా ఇళ్ల స్థలాల విషయంలో ప్రభుత్వానికి ఎలాంటి భేషజాలు లేవని, ఈ విషయంలో సీఎం కేసీఆర్ సానుకూలంగా ఉన్నారని స్పష్టం చేశారు. ఎంపీని కలిసిన వారిలో హెచ్‌యూజే ప్రెసిడెంట్ అరుణ్ కుమార్, వర్కింగ్ ప్రెసిడెంట్ గంధ్ర నవీన్, ట్రెజరర్ భట్టిపాటి రాజశేఖర్, వైస్ ప్రెసిడెంట్‌లు సాగర్ వనపర్తి, భయ్యా దామోదర్, రమేష్ తదితరులు ఉన్నారు.

జువైనల్ హోంను సందర్శించిన యునిసెఫ్ బృందం

హైదరాబాద్: సైదాబాద్‌లోని ప్రభుత్వ బాలల సదనాన్ని యునిసెఫ్ ప్రతినిధుల బృందం సందర్శించింది. మంగళవారం స్పెయిన్, డెన్మార్క్, ఇటలీ, యూకే, జర్మనీ, ఆస్ట్రేలియా, ఫ్రాన్స్ తదితర దేశాలకు చెందిన 14 మంది యునిసెఫ్ ప్రతినిధులకు జువైనల్ హోంలో బాలల కు అందిస్తున్న వసతులు, ఏర్పాట్లు, శిక్షణ తదితర అం శాలపై జువైనల్ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ మీర్జా రజా అలీ బేగ్ వివరించారు. యునిసెఫ్ ప్రతినిధులు బాలలతో సరదాగా ముచ్చటించా రు. వారికి అందుతున్న వసతులను అడిగి తెలుసుకు న్నారు. ప్రతినిధి బృందంలోని విదేశీ మహిళల చేతులపై హోం బాలికలు గోరింటాకుతో ఆకృతులు తీర్చిదిద్దారు. హోంలోని ఆర్చరీ ట్రైనింగ్ సెంటర్‌లో బాల, బాలికల ఆర్చరీ నైపుణ్యాలను తిలకించారు. అనంతరం డీడీ మీర్జా రజా అలీ బేగ్ మాట్లాడుతూ తెలంగాణలోని ప్రభుత్వ బాలల సదనంలో ఆర్చరీ సెంటర్ ఏర్పాటు చేశామన్నారు.

హావెల్స్ పేరుతో నకిలీ వైరు



- ఢిల్లీ నుంచి తీసుకువచ్చి విక్రయం
- గుట్టురట్టు చేసిన టాస్క్‌ఫోర్స్ టీమ్

సాక్షి, హైదరాబాద్: ప్రముఖ విద్యుత్ ఉపకరణాల ఉత్పత్తి సంస్థ హావెల్స్ పేరుతో నకిలీ వైర్లు విక్రయిస్తున్న వ్యక్తిని మధ్య మండల టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్నారు. అతడి నుంచి 57 కాయిల్స్ నకిలీ వైరు స్వాధీనం చేసుకున్నట్లు ఓఎస్డీ పి.రాధాకిషన్‌రావు మంగళవారం వెల్లడించారు. రాజస్థాన్ నుంచి వలసవచ్చి మహరాజ్ గంజ్ ప్రాంతంలో నివసిస్తున్న లలిత్‌కుమార్ ట్రూప్‌బజార్‌లో ప్రయాగ్ ఎలక్ట్రికల్స్ పేరుతో దుకాణం నిర్వహిస్తున్నాడు. ఎక్కువ లాభాలు సంపాదించాలనే ఉద్దేశంతో నకిలీ వైరు విక్రయానికి తెరలేపాడు. ఢిల్లీకి చెందిన దేవరం అనే వ్యక్తి నుంచి హావెల్స్ కంపెనీ పేరుతో ఉన్న నకిలీ వైరు ఖరీదు చేస్తున్నాడు. ఇతగాడు వివిధ మార్గాల్లో ఆ సరుకును సిటీకి పంపిస్తున్నాడు.

దీనిని లలిత్ కుమార్ అమాయకులకు విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నాడు. ఇతడి వ్యవహారంపై మధ్య మండల టాస్క్‌ఫోర్స్‌కు సమాచారం అందడంతో ఇన్‌స్పెక్టర్ బి.రాజు నాయక్ నేతృత్వంలో ఎస్సైలు ఎస్.సాయి కిరణ్, సీహెచ్ నవీన్ కుమార్ తమ బృందాలతో దాడి చేసి లలిత్‌ను పట్టుకున్నారు. ఇతడి నుంచి రూ.3.7 లక్షల విలువైన 4 ఎంఎం వైరు 36 కాయిల్స్, 1.5 ఎంఎం వైరు 5 కాయిల్స్, 1 ఎంఎం వైరు 16 కాయిల్స్ స్వాధీనం చేసుకున్నారు. తదుపరి చర్యల నిమిత్తం నిందితుడితో పాటు స్వాధీ నం చేసుకున్న సరుకును అఫ్జల్‌గంజ్ పోలీసులకు అప్పగించారు.



తాను సమర్థుడిని అని అనుకున్నవాడు సమర్థుడు.

– బౌద్ధ ధర్మం

సాక్షి

బుధవారం, 13 సెప్టెంబర్ 2023

వ్యూహాత్మక స్నేహబంధం

కొన్నిసార్లు అంతే... కీలక పరిణామాలన్నీ కొద్ది వ్యవధిలో జరిగిపోతుంటాయి. ఢిల్లీలో జీ20 సదస్సు ముగియగానే మరో ముఖ్యపరిణామం సంభవించింది. సోమవారం భారత ప్రధాని మోదీ, సౌదీ అరేబియా యువరాజు మహమ్మద్ బిన్ సల్మాన్ అల్ సౌద్‌ల సహ అధ్యక్షతన భారత – సౌదీ అరేబియా వ్యూహాత్మక భాగస్వామ్య మండలి (ఎస్పీసీ) తొలి శిఖరాగ్రస్థాయి సమావేశం జరిగింది. విస్తృత చర్చల అనంతరం రెండు దేశాలూ తమ వాణిజ్య, రక్షణ బంధాలను విస్తరించుకోవాలని నిర్ణయించాయి. భారత్‌లో ఒక రోజు పర్యటనకు వచ్చిన సౌదీ యువరాజుతో జరిగిన ఈ కీలక నిర్ణయం దీర్ఘకాలిక ప్రభావం చూపగలిగేది. ప్రపంచంలో వేగంగా వృద్ధి చెందుతున్న రెండు పెద్ద ఆర్థికవ్యవస్థల మధ్య పెరుగుతున్న సహకారం మధ్యప్రాచ్య – హిందూ మహాసముద్ర ప్రాంతంలో శాంతి, సుస్థిరతలకు కీలకం. అందుకే, ఈ సమావేశం అందరి దృష్టినీ ఆకర్షిస్తోంది.

జీ20లో కీలక 'ఇండియా– మధ్యప్రాచ్యం– యూరప్ ఆర్థిక నడవా' (ఐఎంఈసీ) ప్రకటించిన వెనువెంటనే... ఆ నడవాలో భాగమయ్యే సౌదీతో భారత బంధాల విస్తరణ శుభపరిణామం. రెండు దేశాల మధ్య ఎస్పీసీ 2019 అక్టోబర్‌లో భారత ప్రధాని, రియాద్ పర్యటనలోనే ఏర్పాటైంది. బ్రిటన్, ఫ్రాన్స్, చైనాల తర్వాత సౌదీ అలాంటి భాగస్వామ్యం కుదుర్చుకున్న నాలుగో దేశం ఇండియానే! సరిగ్గా ఏడాది క్రితం 2022 సెప్టెంబర్‌లో మన వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్ సౌదీ వెళ్ళి, ఎస్పీసీ మంత్రిత్వ స్థాయి సమావేశానికి హాజరయ్యారు. అప్పట్లోనే సౌదీలో మన రూపే కార్డ్ వినియోగం సహా అనేక అంశాలు ప్రధాన సహకార అంశాలుగా చర్చకు వచ్చాయి. సోమవారం రెండు దేశాల నేతల మధ్య చర్చలు అందుకు కొనసాగింపు.

నిజానికి, కొన్నేళ్ళుగా భారత, సౌదీల బంధం బలపడుతోంది. విభిన్న సాంస్కృతిక, చారిత్రక నేపథ్యాలున్న రెండు దేశాలూ వాణిజ్యం నుంచి సాంస్కృతికం దాకా బాంధవ్యాలు పెట్టుకుంటున్నాయి. ద్వైపాక్షిక బంధాలు పటిష్ఠం కావాలంటే సాంస్కృతిక సంబంధాలు కీలకం. అందులోనూ రెండు దేశాలూ అడుగులు వేశాయి. సౌదీలో పవిత్ర మక్కా నగరానికి మనదేశం నుంచే ఏటా వేల మంది హజ్ యాత్ర సాగిస్తుంటారు. భారత్ నుంచి ఏటా 1.75 లక్షల మందికి పైగా హజ్ యాత్రికులకు అవకాశం కల్పిస్తూ, ఈ ఏడాది మొదట్లోనే సౌదీ ఒప్పందం కుదుర్చుకుంది. ఒక దేశం నుంచి చరిత్రలో ఎన్నడూ లేనట్టు ఇంత భారీ సంఖ్యలో యాత్రికుల్ని అనుమతిస్తామంటూ సౌదీ కోటా ఇవ్వడం విశేషం. అలాగే, ఆ రాజ్యంలో అత్యధిక ప్రవాసుల సంఖ్య కూడా మనదే! 22 లక్షల మందికి పైగా భారతీయ ప్రవాసులు సౌదీలో ఉన్నారు. ఇవన్నీ భారత్, సౌదీలను మరింత సన్నిహితం చేస్తున్నాయి. ప్రవాసులంతా తమ దేశంలో భాగమేననీ, వారిని సొంత పౌరులలా కడుపులో పెట్టుకుంటామనీ సౌదీ యువరాజు తాజా పర్యటనలోనూ స్పష్టం చేయడం విశేషం.

ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో మన రెండు దేశాలూ ప్రధానమైనవి. భారత్‌కు నాలుగో అతి పెద్ద వాణిజ్య భాగస్వామి సౌదీయే! ఇక, సౌదీకి రెండో అతి పెద్ద వాణిజ్య భాగస్వామి భారత్ అని 2022 లెక్క. మన ముడిచమురు దిగుమతుల్లో 18 శాతం పైగా అందిస్తున్నది ఈ అరబ్బు రాజ్యమే. కలసి ప్రగతి బాటలో సాగాలనే లక్ష్యంతో ఇరు దేశాలూ డిజిటల్ పేమెంట్స్, రక్షణ ఉత్పత్తులు, ఇంధనం, ప్రాథమిక వసతులు, సాంకేతిక పరిజ్ఞానం లాంటి రంగాల్లోనూ వాణిజ్య అవకాశాలను అన్వేషిస్తూ వచ్చాయి. సౌదీ యువరాజు, భారత ప్రధాని సహా ఉన్నతస్థాయి వ్యక్తులు కొద్దికాలంగా జరుపుతున్న పర్యటనలు ఈ బంధాన్ని బలోపేతం చేస్తున్నాయి. దానికి తగ్గట్టే ఇరుదేశాలూ తమకు ఉమ్మడి అంశాలైన తీవ్రవాదంపై పోరు, ప్రాంతీయ భద్రత, ఆర్థిక సహకారంపై దృష్టి సారిస్తున్నాయి.

సోమవారం నాటి చర్చల్లో మహారాష్ట్ర తీరంలో నిర్మించనున్న 5 వేల కోట్ల డాలర్ల విలువైన వెస్ట్ కోస్ట్ రిఫైనరీ ప్రాజెక్ట్‌ను వేగవంతంగా అమలు చేయాలని ఇరుదేశాలూ నిర్ణయించాయి. అందుకు ఓ సంయుక్త సత్వర కార్యాచరణ బృందాన్ని ఏర్పాటు చేయాలని తీర్మానించాయి. ఇంధనం, రక్షణ, సెమీకండక్టర్, అంతరిక్ష రంగాల్లో ముమ్మర సహకారానికి వీలున్నట్టు గుర్తించాయి. డిజిటలీకరణ, పెట్టుబడులు సహా వివిధ రంగాల్లో సహకారాన్ని పెంచుకొనేందుకు 8 ఒప్పందాలపై సంతకాలూ చేశాయి. వాస్తవానికి, భారత్, సౌదీల మధ్య సత్సంబంధాల విస్తరణ కేవలం రెండు దేశాలకే కాక, మధ్యప్రాచ్యం – హిందూ మహాసముద్ర ప్రాంతం అంతటికీ కీలకం. ఈ ప్రాంతంలో సుస్థిరత, ఆర్థికాభివృద్ధి, భద్రతకు తోడ్పడుతుంది. అందుకే భారత్ సైతం ఒకపక్క వ్యూహాత్మకంగా ఇజ్రాయిల్‌తో బంధాన్ని పదిలంగా చూసుకుంటూనే, ఇతర అరబ్ దేశాలతో మాటామంతీ సాగిస్తోంది.

సౌదీతో మన వ్యూహాత్మక ప్రయోజనాలూ అనేకం. చైనాను మినహాయిస్తే, పాకిస్తాన్‌పై ఒత్తిడి చేయగల ఏకైక దేశం సౌదీనే. అందువల్లే, పాక్‌తో దానికున్న సంబంధాలకు అతీతంగా మన దేశమూ అరబ్బు రాజ్యంతో బలమైన బంధం పెట్టుకుంటోంది. ఇటీవలే ఇరాన్‌తో శత్రుత్వానికి స్వస్తి పలికిన సౌదీ జొహాన్స్‌బర్గ్ సదస్సులో 'బ్రిక్స్'లో సైతం సభ్యత్వం తీసుకుంది. ఆ పరిణామాల తర్వాత ప్రిన్స్ పర్యటనగా ఇది ప్రాధాన్యం సంతరించుకుంది. 2019 ఫిబ్రవరిలో భారత్ సందర్శించిన సౌదీ ప్రిన్స్ ఇప్పుడు మళ్ళీ రావడం, ఈసారి భారత– జీసీసీ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం పైనా దృష్టి పెట్టడానికి ఇరుపక్షాలూ అంగీకరించడం గమనించదగ్గవి. మొత్తానికి, ఈ బంధం వేగంగా పరిణతి చెందుతోంది. తగ్గట్టే మధ్యప్రాచ్యంపై భారత విధానమూ వివిధ రూపాలు తీసుకుంటోంది. సరికొత్త వ్యూహాత్మక కూటమికి పురుడుపోస్తోంది. సౌదీతో స్నేహంలో తాజా భేటీ మరో ముందడుగు.

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, దక్షిణాయణం, వర్ష ఋతువు, నిజ శ్రావణ మాసం, **తిథి:** బ.చతుర్దశి తె.4.03 వరకు (తెల్లవారితే గురువారం), తదుపరి అమావాస్య, **నక్షత్రం:** మఖ రా.2.35 వరకు, తదుపరి పుబ్బ, **వర్జ్యం:** ప.1.17 నుండి 3.04 వరకు, **దుర్ముహూర్తం:** ప.11.31 నుండి 12.21 వరకు, **అమృత ఘడియలు:** రా.11.55 నుండి 1.42 వరకు.

సూర్యోదయం : 5.50
సూర్యాస్తమయం: 6.03
రాహుకాలం : ప.12.00 నుండి 1.30 వరకు
యమగండం : ఉ.7.30 నుండి 9.00 వరకు

భారత ఏఐ మోడల్ ఎలా ఉండాలి?

కృత్రిమ మేధ విప్లవాన్ని అమెరికాలో పెద్ద టెక్నాలజీ కంపెనీలు ముందుకు తోస్తూంటే, చైనాలో అది ప్రభుత్వ మద్దతుతో సాగుతోంది. మరి ఈ విషయంలో భారత్ ఏం చేయాలి? భారతీయ కంపెనీలు, ప్రభుత్వం చేతులు కలిపితే స్థానికంగానే లార్జ్ లాంగ్వేజ్ మోడల్ (ఎల్ఎల్ఎం) ఒకదాన్ని తయారు చేయడం కష్టమేమీ కాదు. కాకపోతే వీటికి పాశ్చాత్య దేశాల మాదిరిగా పెట్టుబడిదారీ విధానాన్ని అనుసరించాలా, చైనా తరహాలో ప్రభుత్వ నియంత్రణలో ఈ ఎల్ఎల్ఎంలను ఉంచాలా? అన్నది ముందు నిర్ణయించుకోవాలి. మనం మూడో మార్గం అనుసరించడం మేలు. ఇటీవలి కాలంలో భారతదేశం ప్రపంచానికి పరిచయం చేసిన మార్గమే ఇది. భారత్ తన జనరేటివ్ ఏఐని ప్రజల మంచి కోసం ఉపయోగించాలి. అందరి డిజిటల్ హితం కోసం దాన్ని 'జన్ ఏఐ' మోడల్‌గా తీర్చిదిద్దాలి.

వీడియోలు సృష్టించడంలో ఛాట్‌జీపీటీకి ఉన్న సామర్థ్యం ప్రపంచాన్ని విపరీతంగా ఆకట్టుకోవడమే కాదు... పది కోట్ల మంది దాన్ని వినియోగించేలా చేసింది. 'ద లార్జ్ లాంగ్వేజ్ మోడల్స్' (ఎల్ఎల్ఎం), అలాగే జనరేటివ్ ఏఐకి శక్తినిచ్చే విషయాలన్నీ... ఇంటర్నెట్, స్మార్ట్‌ఫోన్ వంటివాటిని సమూలంగా మార్చేసే అద్భుత టెక్నాలజీలనడంలో సందేహం లేదు. అందుకే గూగుల్ సీఈఓ సుందర్ పిచాయ్ కృత్రిమ మేధను 'ఫైర్'(మంట) అని వర్ణిస్తే, మైక్రోసాఫ్ట్ అధినేత సత్య నాదెళ్ల సమూల మార్పునకు నాందిగా అభివర్ణించారు. మరోవైపు గోల్డ్‌మాన్ శాక్స్ లాంటి సంస్థలు జనరేటివ్ ఏఐ కారణంగా రానున్న దశాబ్ద కాలంలో ప్రపంచ స్థూల జాతీయోత్పత్తికి కనీసం ఏడు లక్షల కోట్ల డాలర్ల మొత్తం చేరుతుందని అంచనా వేస్తోంది. అయితే ఈ సానుకూల అంశాలతోపాటు ఉద్యోగాలు కోల్పోవడం, మానవ ప్రమేయం తగ్గిపోవడం వంటి కొన్నింటిపై ఆందోళన కూడా వ్యక్తమవుతోంది. ఏఐ సూపర్ ఇంటెలిజెన్స్‌తో మనిషికి ముప్పు అన్న భావన కూడా పెరుగుతోంది. అలాగే వివక్ష, పర్యావరణ నష్టం, ప్రజాస్వామ్యానికి ముప్పు వంటి అంశాలూ చాలామందికి ఆందోళన కలిగిస్తున్నాయి.

ప్రస్తుతానికి జనరేటివ్ ఏఐ విషయంలో కార్యకలాపాలు ఎక్కువగా అమెరికా, చైనాల్లోనే జరుగుతున్నాయి. రెండింటిలోనూ వ్యవస్థల నిర్మాణం, ప్రపంచాన్ని చూసే దృష్టి పూర్తిగా వేరు. అమెరికాలో పెద్ద టెక్ కంపెనీలు ఏఐ విప్లవాన్ని ముందుకు తీసుకెళ్లే ప్రయత్నం చేస్తూండగా, చైనా భిన్నమైన మార్గంలో ప్రయాణిస్తోంది. చైనా కంపెనీలు ప్రభుత్వంతో కలిసి సొంత జనరేటివ్ ఏఐ మోడళ్లు తయారు చేస్తున్నాయి. సమాచారం, సందర్భాలు రెండింటినీ పరిగణనలోకి తీసుకునేలా చైనా తన జనరేటివ్ ఏఐ మోడళ్లను నిర్మిస్తోంది. ప్రపంచంలోని మిగిలిన ప్రాంతాలు ఎవరికివారు తమదైన రీతిలో వ్యవహరిస్తున్నారు. అది కూడా పరిమితమైన పరిధిలో. జనరేటివ్ ఏఐ నైతికంగా, బాధ్యతాయుతంగా వ్యవహరించేలా దాన్ని నియంత్రించడంపై యూరోపియన్ యూనియన్ దృష్టి పెట్టింది. యునైటెడ్ కింగ్‌డమ్ కూడా ఏఐ ఆధారిత పరిపాలన విషయంలో ప్రపంచంలోనే అగ్రస్థానంలో ఉండాలని లక్ష్యిస్తోంది.

భారత్ స్థానమెక్కడ?

అంతా బాగానే ఉంది కానీ... ఏఐ ఆధారిత ప్రపంచంలో భారత్ స్థానమెక్కడ? మేమూ సొంతంగా ఎల్ఎల్ఎం ప్లాట్‌ఫామ్స్ సిద్ధం చేసుకుంటామని ఈ మధ్యకాలంలో కొన్ని ప్రకటనలు వచ్చాయి. హడావుడి కూడా కనిపించింది కానీ... ఛాట్‌జీపీటీ సృష్టికర్త, ఓపెన్ ఏఐ సీఈవో సామ్ ఆల్ట్‌మన్ వీటిపై తన అభ్యంతరాలను స్పష్టం చేశారు. అయితే, భారతీయ కంపెనీలు, ప్రభుత్వం చేతులు కలిపితే స్థానికంగానే లార్జ్ లాంగ్వేజ్ మోడల్ ఒకదాన్ని తయారు చేయడం పెద్ద కష్టమేమీ కాకపోవచ్చు. భారతీయ భాషలు, కాంటెక్స్ట్‌తో



కూడిన సమాచారాన్ని అందివ్వడం ద్వారా ఈ ఎల్ఎల్ఎంను వినూత్నంగా తీర్చిదిద్దవచ్చు. కానీ ఇలాంటి ప్రయత్నం చేసేముందు మన లక్ష్యం, ఉద్దేశం ఏమిటన్నది స్పష్టం చేసుకోవడం చాలా ముఖ్యం. పాశ్చాత్య దేశాల మాదిరిగా పెట్టుబడిదారీ విధానాన్ని అనుసరించాలా? లేక చైనా తరహాలో ప్రభుత్వ నియంత్రణలో ఈ ఎల్ఎల్ఎంలను ఉంచాలా? అన్నది తేల్చుకోవాలి.

మాకైతే మూడో మార్గం మేలని అనిపిస్తోంది. ఇటీవలి కాలంలో భారతదేశం ప్రపంచానికి పరిచయం చేసిన మార్గమే ఇది. చాలా సాహసోపేతమైందే కావచ్చు. కానీ భారత్ తన జనరేటివ్ ఏఐని ప్రజల మంచి కోసం ఉపయోగించాలి. డిజిటల్ పబ్లిక్ గుడ్ కోసమన్నమాట. దీన్ని ప్రజల కోసం 'జన్ ఏఐ' లేదా 'జెన్ ఏఐ' అని పిలుచుకుందాం.

సామాజిక వృద్ధి కోసం...

భారత్ సృష్టించిన డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఎంతటి ఘన విజయం సాధించిందో మనందరికీ తెలుసు. 'ఇండియా–స్టాక్' ఆధారంగా మొత్తం జనాభా స్థాయిలో డిజిటైజేషన్ సాధ్యం చేయగలిగాం. ఫలితంగా 140 కోట్ల మందికి డిజిటల్ బయోమెట్రిక్ గుర్తింపులు, యూపీఐతో సులభతర చెల్లింపులు, ఆధార్ గుర్తింపులు, ప్రపంచంలోనే అతిపెద్ద టీకా కార్యక్రమం వంటి ఘనతలు ఎన్నింటినో సాధించగలిగాం. ఈ డిజిటల్ టెక్నాలజీల ఆధారంగా నిర్మించిన సేవల పుణ్యమా అని ఆరోగ్య రంగం కూడా ప్రజలకు మరికొంచెం చేరువైంది. లాజిస్టిక్స్, ఈ–కామర్స్, ప్రభుత్వ సబ్సిడీల వంటివి సులువైపోయాయి. దేశాద్యంతం సర్వసామాజిక వృద్ధి కూడా సాధ్యమైంది. ఇండియా స్టాక్ ద్వారా అందరికీ అందుబాటులో ఉన్న ఏపీఐల ఆధారంగా అసంఖ్యాకమైన స్టార్టప్‌లు వినూత్నమైన సేవలను భారతీయ పౌరులకు అందుబాటులోకి తేగలిగాయి. ఇండియా స్టాక్ ఇప్పటికే సింగపూర్, ఫ్రాన్స్, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ వంటి దేశాలకు విస్తరించే ప్రయత్నాల్లో ఉంది. ఇతర దేశాలు కూడా ఈ వరుసలో ఉన్నాయి. నిజానికి భారత్ తన జీ–20 అధ్యక్ష స్థానాన్ని సద్వినియోగం చేసుకోవడం ద్వారా డిజిటల్ పబ్లిక్ గుడ్, ఇండియా స్టాక్‌లను ప్రపంచం మొత్తానికి వ్యాపించేలా చేస్తోంది.

అంతరాలు తొలగేలా...

ఇండియా స్టాక్ అసలైన సామర్థ్యం పౌరులందరికీ డిజిటల్ సేవలు అందించడం ద్వారా నిరూపితమైంది. పైగా ఇది అందరికీ అందుబాటులో ఉండటం వల్ల కంపెనీలు, స్టార్టప్‌లు దానికి ఎప్పటికప్పుడు విలువను జోడించేందుకూ అవకాశం ఏర్పడింది. జనరేటివ్ ఏఐని కూడా ఇదే పద్ధతిలో అభివృద్ధి చేయాలని మేము భావిస్తున్నాం. ఇండియా 'భారత్‌ఎల్ఎల్ఎం' పేరుతో సొంత జనరేటివ్ ఏఐ మోడల్‌ను తయారు చేసుకోవచ్చు. ఇండియా స్టాక్ ద్వారా సమాచారాన్ని అందివ్వడం ద్వారా మనకు మాత్రమే ప్రత్యేకమైన సమస్యలకు పరిష్కారాలు వెతకవచ్చు. ఇండియా స్టాక్‌పై ఇంకో పొరమాదిరిగా కొన్ని ఎల్ఎల్ఎంల సమాహారంగా జన్ ఏఐని ఏర్పాటు చేయవచ్చు. దీన్ని ప్రజాసేవలో భాగంగా అందరికీ అందివ్వడం కీలకం. తద్వారా డిజిటల్ అంతరాన్ని తొలగించవచ్చు. జనాభా మొత్తానికి లాభాలు అందించవచ్చు. ఆధార్, యూపీఐ మాదిరిగా అన్నమాట. వ్యక్తిగత గోప్యత, వివక్ష వంటి ఏఐ సంబంధిత ఆందోళనలకు సమాధానం వెతికేందుకు కూడా ఈ ప్రయత్నం ఉపకరిస్తుంది. వైయక్తిక గోప్యత విషయంలో పాశ్చాత్యుల ఆలోచన దీనికంటే భిన్నమైంది. సమష్టితనం, సామాజిక గోప్యత, నమ్మకం వంటి భారతీయ దృక్పథాలను వాడుకుంటూ ఈ పని చేయవచ్చు.

సానుకూల ప్రభుత్వం, ప్రపంచానికి నేతృత్వం వహిస్తున్న మన ఐటీ కంపెనీలు, ఐఐటీల వంటి సంస్థలు కలిసికట్టుగా ఈ 'జన్ ఏఐ'ని సుసాధ్యం చేయగలవని మేము విశ్వసిస్తున్నాం. ఆ తరువాత భారతీయ కంపెనీలు భారత్‌ఎల్ఎల్ఎం నుంచి నిర్దుష్ట, లోపాలు సరిదిద్దిన ఎల్ఎల్ఎంలను అభివృద్ధి చేయవచ్చు. అందరికీ అందుబాటులో ఉండే ఏపీఐల సాయంతో స్టార్టప్‌లు కూడా ఎల్ఎల్ఎంలను వాడుకోవచ్చు. డిజిటల్ టెక్నాలజీలో ఇప్పుడున్న రెండు విప్లవాత్మకమైన విషయాలను భారత్ ఇలా జోడించవచ్చు. అంటే జనరేటివ్ ఏఐ, డిజిటల్ పబ్లిక్ గుడ్‌లను మేళవించడం అన్నమాట. తద్వారా ప్రపంచంలోని అన్ని జన్ ఏఐ మోడళ్లకు నమూనాగా భారతీయ మోడల్‌ను నిలబెట్టవచ్చు.

– జస్‌ప్రీత్ బింద్రా, టెక్ విస్పరర్ లిమిటెడ్ వ్యవస్థాపకులు, మేనేజింగ్ డైరెక్టర్; సుధీర్ తివారీ, థాట్‌వర్క్స్ ఇండియా డిజిటల్ ఇంజినీరింగ్ సెంటర్ గ్లోబల్ హెడ్ ('ది హిందుస్తాన్ టైమ్స్' సౌజన్యంతో)

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!



అంతా రివర్స్



నాయకుల గురించిన మన తీర్పు వారు బయటికి ఎలా కనబడుతున్నారనే విషయం ఆధారంగా 95 శాతం, వారి విధాన నిర్ణయాల ఆధారంగా 5 శాతం ఉంటుంది. కానీ ఇది వ్యతిరేకంగా ఉండాలి కదా! చూపుల కంటే విధానాలు ముఖ్యం!!

– పర్మీందర్ సింగ్, వ్యాపారవేత్త

దేశం తీరు



వేరే దేశాల్లో అయితే ఫుట్‌బాల్ క్రీడాకారులను వారి ప్రతిభ ఆధారంగా కోచ్‌లు ఎంపిక చేస్తారు. ఇండియాలో మాత్రం, వారిని 'జ్యోతిష్కుడి సలహా' మీద తీసుకుంటారు. (ఇటీవల వచ్చిన ఒక వార్తాకథనం ప్రకారం) దానికోసం ఆయనకు పది లక్షలు చెల్లిస్తారు. ఏమైనా నమ్మశక్యంగా ఉందా?

– అద్వైద్, హిస్టారియన్

అదే గొప్ప



ప్రతి ఒక్కరూ బ్రహ్మాండమైనది ఏదో సాధించనక్కర్లేదు. కొంతమందిమి ఊరకే అలా శ్వాస తీసుకుంటూ, మన జీవితాల్ని విశ్రాంతిగా బతికితే చాలు.

– సాదియా అహ్మద్, డిజిటల్ జర్నలిస్ట్

వర్గ వాదం



మీ అస్తిత్వాన్ని ఎలాగైనా ప్రకటించుకోండి. కానీ 'వర్గం' విషయంలో గుడ్డిగా ఉంటే మాత్రం, మీరు విఫలమైనట్టే లెక్క. ప్రపంచవ్యాప్త రాజకీయాల్లో అంతటా ఉండేదీ, అందరికీ వర్తించేదీ... వర్గం ఒక్కటే!

– సూరజ్ యెంగ్డే, అంబేడ్కర్‌వాది

కొత్త నిర్ణయం



పాఠశాలల్లో బాలికలు నిఖాబ్ ధరించడాన్ని నిషేధిస్తూ ఈజిప్ట్ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ కొత్త విద్యాసంవత్సరం సెప్టెంబర్ 30 నుంచి ఇది అమల్లోకి వస్తుందని వార్త. చూశారా... మరో పాశ్చాత్య ఇస్లామోఫోబిక్ దేశం ముస్లింల పట్ల వివక్ష చూపుతోంది. అరెరె... మర్చేపోయా... ఇది ఈజిప్ట్ కదా!

– రిద్వాన్ అయ్‌దేమిర్, యాక్టివిస్ట్

దేశానికి మచ్చ



ఒకప్పుడు కెనడా అంటే వివాదాలకు అతీతంగా ఉండే దేశం. అలాంటిది ప్రధాని జస్టిన్ ట్రూడో హయాంలో ఆ దేశం ఎంతలా మారిపోయింది! గద్దెనెక్కడానికి ఆయన ఖలిస్తానీ తీవ్రవాదులతో చేతులు కలిపారు. కానీ అది ఎంత మూల్యానికి? కెనడా మీద ఉన్న ఉన్నత భావమే ఇప్పుడు పోయింది.

– సునందా వశిష్ట్, రాజకీయాంశాల వ్యాఖ్యాత

ఒకే చదువు



ఒక దేశం – ఒక ఎన్నిక; ఒక దేశం – ఒక పన్ను... ఇలాగే ఒక దేశం – ఒక కటాఫ్ ఎందుకు ఉండకూడదు? 90 శాతం మార్కులు వచ్చినప్పటికీ జనరల్ విద్యార్థులకు ఎందుకు సీటు రాదు? మరోవైపున 20–30 శాతం మార్కులతో రిజర్వుడువాళ్లకు సీట్లు ఎలా వస్తున్నాయి?

– అనురాధా తివారీ, రిజర్వేషన్ల వ్యతిరేక ఉద్యమకారిణి

ఇన్ బాక్స్

ప్రకృతి హితంగా...

ప్రతి రోజూ తమ ఆరోగ్యం కోసం సమయం కేటాయించ లేనివారు అనారోగ్యం కోసం చాలా సమయాన్ని చాలా రోజులు త్యాగం చేయక తప్పదు. మారుతున్న జీవన శైలి అనేక రుగ్మతలకు దారి తీస్తోంది. బీపీ, డయాబెటిస్, కార్డియోవాస్కులర్ సమస్యలు వంటివాటి బారిన పడుతున్నారు. మితాహారం, కాలానుగుణ ఆహారం ఆరోగ్యానికి కీలకం. అసంక్రమిత వ్యాధుల సంఖ్య రోజు రోజుకీ పెరుగుతోంది, దీనిని నివారించడానికి ఏమాత్రం ఖర్చు కాకుండా మన ఆరోగ్యాన్ని 'ప్రకృతి వైద్యం' ద్వారా నయం చేసుకోవచ్చు.

ఎలాంటి శారీరక శ్రమ లేకుండా ఆరోగ్యంగా ఉండాలనుకుంటే అత్యాశే అవుతుంది. కష్టతరమైన పనులు చేసేవారు, రైతులు, కూలీలు, హెవీ మోటార్ డ్రైవర్లు, నిర్మాణ కార్మికులు, హమాలీలు, శరీర కష్టం చేసే వారు ప్రత్యేకంగా వ్యాయామం చేయాల్సిన అవసరం లేదు. ఇంట్లో ఎవరి పనులు వారు చేసుకుంటే వ్యాయామం చేసే అవసరం తగ్గుతుంది. రోజువారీ పనులను నడక, సైకిల్ ద్వారా చేసుకుంటే సహజంగానే వ్యాయామం లభిస్తుంది. ఏ వ్యాయామం అయినా క్రమం తప్పకుండా చేయాలి. వ్యాయామం ఏదైనా ఒక్కటే నియమం, 'శక్తికి మించి వ్యాయామం చేయకూడదు'. మిట్ట మధ్యాహ్నం ఎండలో వ్యాయామం చేయకుంటే మంచిది.

నిత్య జీవితంలో రోజూ చేసే పనులు శారీరక శ్రమకు లింక్ చేయడం మంచిది. ఒబేసిటీ, బీపీ, మధుమేహ నియంత్రణకు వ్యాయామం చాలా అవసరం. అలాగే మనం ఇంట్లో కూర్చుని యోగ పైసా ఖర్చు లేకుండా చేసుకోవచ్చు. యోగాసనాలు శరీరానికి, మెదడుకీ ఎంతగానో మేలు చేస్తాయి.

ప్రకృతివైద్య సిద్ధాంతంలో, అనారోగ్యం అనేది ఆరోగ్యానికి భంగం కలిగించే ప్రక్రియగా, సహజ వ్యవస్థల సందర్భంలో ఆ తర్వాత కోలుకునే ప్రక్రియగా పరిగణించబడుతుంది. పేలవమైన పోషణ, దీర్ఘకాలిక ఒత్తిడి వంటి అనేకమైన విషయాలు ఆరోగ్యానికి ఎక్కువగా భంగం కలిగిస్తాయి. వీటిని గుర్తించడం, తగ్గించడం ద్వారా ఆరోగ్యాన్ని పునరుద్ధరించడం ప్రకృతి వైద్యుల లక్ష్యం.

– డా॥ ఎం. అఖిల మిత్ర, గౌతమ బుద్ధ అభివృద్ధి సమాఖ్య

అంతర్జాతీయ యవనికపై మెరిసిపోతూ...

అభిప్రాయం



డా॥ పెద్దిరెడ్డి నరేందర్ రెడ్డి

భారతదేశం సార్వభౌమ దేశంగా అన్ని రంగాలలో సుస్థిర అభివృద్ధి సాధించిన దేశంగా స్వాతంత్ర్య అమృతోత్సవ ముగింపు సంబరాల్లో ఉంది. కరోనా మహమ్మారి మూలంగా ప్రపంచంలోని అగ్ర రాజ్యాలు సైతం కుదేలైనాయి. కానీ భారత్ మాత్రం అన్ని రంగాలలో సుస్థిర అభివృద్ధిని సాధిస్తూ 3.7 ట్రిలియన్ డాలర్ల పరిమాణంతో ప్రపంచంలోనే ఐదవ అతి పెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించడం ముదావహం. ఇదే సమయంలో అంతర్జాతీయంగా దేశ ప్రాముఖ్యం పైపైకి దూసుకుపోతుండడమూ గర్వించదగిన సంగతి.

ఇటీవలి ప్రపంచ బ్యాంకు నివేదిక ప్రకారం, 2045 సంవత్సరానికి భారత్ అభివృద్ధి చెందిన దేశంగా ఆవిర్భవించనున్నది. గడిచిన తొమ్మిదేండ్లలో కేంద్రం పెద్దనోట్ల రద్దు, జీఎస్టీని ప్రవేశపెట్టడం, ద్రవ్యోల్బణాన్ని అరికట్టడం; 'డిజిటల్ ఇండియా', 'మేక్ ఇన్ ఇండియా'లను ప్రవేశ పెట్టడం; వ్యవసాయిక, పారిశ్రామిక విధానాలలో మార్పుల వంటి విప్లవాత్మక నిర్ణయాల వలన అభివృద్ధి సాధ్యమయింది.

2014 మే నెలలో నరేంద్ర మోదీ ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన నాటి నుండి విదేశీ విధాన రూపకల్పనలో అనేక మార్పులను తీసుకువచ్చారు. ప్రధానిగా మోదీ బాధ్యతలు చేపట్టిన తొలినాళ్ళలో 'సార్క్' (దక్షిణాసియా) దేశాలతో సంబంధాలను మెరుగు పరచటానికి చర్యలు తీసుకున్నారు. చైనా అక్రమ సైనిక చొరబాట్లను ఎప్పటికప్పుడు ఆయన నాయకత్వంలో దేశం తిప్పికొట్టింది. 'సర్జికల్ స్ట్రైక్స్' నిర్వహించటం ద్వారా పాకిస్తాన్‌లోని తీవ్రవాదుల స్థావరాలను కూల్చివేసింది. తదుపరి పశ్చిమాసియా దేశాలతో సంబంధాలను పటిష్ఠ పరచడానికి మోదీ ప్రయత్నించారు. ముఖ్యంగా యూఏఈతో చేసుకున్న 'సమగ్ర ఆర్థిక భాగస్వామ్య ఒప్పందం – 2022' ఇరుదేశాల ఆర్థికాభివృద్ధికి మెరుగైన బాటలు వేసింది.

ఉత్తర అమెరికా, దక్షిణ అమెరికా దేశాలతో భారత్ సంబంధాలను మెరుగు పరచటంలో మోదీ ప్రభుత్వం నూతన ఒరవడికి నాంది పలికింది. అమెరికా అధ్యక్షులు ఒబామా, ట్రంప్‌ల కాలంలోనూ, ఇప్పటి బైడెన్ హయాంలోనూ అమెరికాకు భారత్ 'వ్యూహాత్మక భాగస్వామి'గా



చాలా దగ్గరయింది. మెక్సికో, కెనడా, బ్రెజిల్, అర్జెంటీనా తదితర దేశాలతోనూ మోది నాయకత్వంలో భారత్ ఎనర్జీ, అంతరిక్ష పరిశోధన, రక్షణ, సైబర్ సెక్యూరిటీ, స్కిల్ డెవలప్‌మెంట్, రైల్వేస్ తదితర రంగాలకు సంబంధించి ద్వైపాక్షిక ఒప్పందాలను చేసుకుంది. ఇటీవల దక్షిణాఫ్రికాలోని జోహన్నెస్ బర్గ్‌లో ఆగస్టు 22 నుండి 24 వరకు నిర్వహించిన 'బ్రిక్స్' సదస్సులోనూ సభ్య దేశాలయిన బ్రెజిల్, రష్యా, చైనా, దక్షిణాఫ్రికా దేశాలతో అనేక వ్యూహాత్మక ఒప్పందాలు చేసుకుంది భారత్. రష్యా, జపాన్, జర్మనీ, ఇటలీ, తదితర దేశాలతో భారత్ మొదటి నుంచి అవినాభావ సంబంధాలు కల్గి వుంది. అవి ఇప్పుడు మరింత బలపడ్డాయి.

మోదీ నాయకత్వంలో భారత్ అంతర్జాతీయ యవనికపై తనదైన ముద్రవేసింది. 2023లో జీ20కి భారత్ అధ్యక్షత్వాన్ని ప్రధాని మోదీ 'ప్రజల అధ్యక్ష పదవి'గా అభివర్ణించారు. జీ20 అధ్యక్ష బాధ్యతల్లో భాగంగా సహకార సమాఖ్య వాదాన్ని భారత్ విభిన్న నమూనాలలో ప్రదర్శించింది. సదస్సులో పాల్గొన్న అన్ని సభ్య దేశాలూ వివిధ అంశాలకు సంబంధించి 'న్యూఢిల్లీ సంయుక్త లీడర్స్ డిక్లరేషన్' పేరుతో ప్రకటన చేశాయి. ఉగ్రవాదాన్ని అంతమొందించటం, శిలాజ, ఇంధనాల వాడకం తగ్గింపు, అవినీతిపై పోరు, వాణిజ్య సంబంధాల బలోపేతం, 'భారత్–గల్ఫ్– యూరప్– మహారైల్ పోర్ట్ కారిడార్ నిర్మాణం' వంటివి ఆ ప్రకటనలో భాగంగా ఉన్నాయి. ఈ సందర్భంగా ఆఫ్రికన్ యూనియన్ ఛైర్మన్ విజ్ఞప్తి మేరకు భారత్ ఆఫ్రికన్ యూనియన్ సభ్యత్వం తీసుకుంది. ఈ సందర్భంగా భారత్, అమెరికా అధినేతలు మోదీ, జోబైడెన్‌ల మధ్య ద్వైపాక్షిక ఒప్పందం జరిగింది. అలాగే ఐక్యరాజ్య సమితిలో శాశ్వత సభ్యత్వం కోసం భారత్ అనేక దేశాల మద్దతును కూడగట్టింది. ఈ వేదిక ద్వారా అమెరికా, బ్రిటన్‌లు భారత్‌కు ఐరాసలో శాశ్వత సభ్యత్వం కోసం మద్దతు ప్రకటించటం గర్వించదగిన విషయం.


ఇటీవలి 'చంద్రయాన్–3', 'ఆదిత్య ఎల్–1' ప్రయోగాలు కూడా శాస్త్ర సాంకేతిక రంగంలో భారత్ శక్తి సామర్థ్యాలను ప్రపంచానికి మరోసారి వెల్లడించాయి. దేశానికి అంతర్జాతీయంగా మరింత గౌరవం ఇనుమడించింది.

వ్యాసకర్త ఓయూలో పోస్ట్ డాక్టోరల్ ఫెలో

భగవన్నామ స్మరణ

మనిషి తాను చేయవలసిన పనిని సకాలంలో చేసినప్పుడే భగవంతుడూ సరైన సమయంలో ఆదుకుంటాడు.

భగవంతుడి అనుగ్రహం లభించడానికి సమయ సందర్భాలు ఉంటాయి. అందుకు తగిన పుణ్యం చేసి ఉండాలి. సమయం వచ్చినప్పుడు అది లభిస్తుంది. మనం చేయవలసిందల్లా భగవన్నామ స్మరణే. దేవుణ్ణి నోరారా కీర్తించాలి. ఆలయానికి వెళ్ళి ఆయన్ని దర్శించి నమస్కరించాలి. అప్పుడప్పుడైనా



గురువుగారి వద్దకు వెళ్ళి వారి ఉపదేశం వినాలి. సన్మార్గంలో నడవాలి. ఇవన్నీ చేయడానికి దేవుడు మనకీ జన్మ ఇచ్చాడు. అయితే మనం అవన్నీ మరచిపోయి ఏవేవో చేస్తూ ఈ పుట్టుకను వృథా చేసుకుంటూ ఉంటాం.

జీవితకాలంలో ఏ క్షణానికి ఆ క్షణమే ముఖ్యం. ఒక నిమిషాన్ని వదులుకుంటే అది మళ్ళీ తిరిగి రాదు. రోజులు గడిచేకొద్దీ మన ఆయువు తగ్గుతోందన్న సత్యాన్ని తెలుసుకోవాలి. చెయ్యవలసిన మంచిని చెయ్యకుండా సాగిపోతుంటాం. ఒకరు ఎప్పుడూ 'శంభో శంకరా, శంభో శంకరా' అని స్మరిస్తూ ఉంటారు. అంత్యదశలోనూ ఆయన నోటంట ఈ మాట వస్తుంది. ఆయనకు ముక్తి లభిస్తుంది. చివరి క్షణంలోనూ భగవంతుడు జ్ఞాపకమొచ్చి ఆ నామాన్ని పలకడం అపూర్వం. నిజానికి చివరి క్షణాల్లో చాలా మందికి జ్ఞాపకశక్తి క్షీణిస్తుంది. మాటలు రావు. కళ్ళు కనిపించవు. ఇక భగవంతుడి నామాన్ని ఎలా ఉచ్చరిస్తారు! కనుక ఆరోగ్యం బాగుండి వయసులో ఉన్నప్పుడే భక్తి మార్గంలో నడవాలి.

– యామిజాల జగదీశ్

క్లుప్తంగా...

పౌర సరఫరాల సంస్థలో అన్నీ సమష్టి నిర్ణయాలే

సంస్థ చైర్మన్ సర్దార్ రవీందర్‌సింగ్



సాక్షి, హైదరాబాద్: పౌర సరఫరాల సంస్థలో డైరెక్టర్లు, చైర్మన్ తీసుకునే సమష్టి నిర్ణయాల మేరకే కార్యక్రమాలు సాగుతాయని, చైర్మన్, ప్రిన్సిపల్ సెక్రెటరీల ద్వారా తీసుకునే నిర్ణయాలను ప్రభుత్వం అమలు చేస్తుందని ఆ సంస్థ చైర్మన్ సర్దార్ రవీందర్‌సింగ్ తెలిపారు. ఈ నెల 9న 'సాక్షి'లో 'సారు X ఉన్నతాధికారులు' శీర్షికన ప్రచురితమైన వార్తాకథనంపై స్పందిస్తూ మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. తన వ్యక్తిగత ప్రతిష్టను దెబ్బతీసేలా వార్తాకథనం ఉందని పేర్కొన్నారు. సంస్థలో డీజీఎం అడ్మిన్, జీఎం ఫైనాన్స్ నియామకాలకు సంబంధించి, ఆర్థిక లావాదేవీలు, మిల్లులు, మండల్ లెవెల్ స్టాక్(ఎంఎల్ఎస్) పాయింట్ల తనిఖీలకు సంబంధించి ఆర్థిక అంశాల విషయంలో తనపై తప్పుడు ఆరోపణలు ప్రచురితమైనట్లు ఆయన పేర్కొన్నారు. సంస్థ ప్రతిష్ట, తన ప్రతిష్టకు భంగం కలిగించేలా వచ్చిన ఆరోపణలను ఖండిస్తున్నట్లు తెలిపారు.

ఆద్యకళ, ఐజీఎన్‌సీఏ బాధ్యులకు రాష్ట్రపతి తేనీటి విందు



సాక్షి, హైదరాబాద్: ఢిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో ఇందిరాగాంధీ నేషనల్ సెంటర్ ఫర్ ఆర్ట్స్ (ఐజీఎన్‌సీఏ), హైదరాబాద్‌కు చెందిన ఆద్యకళ మ్యూజియం బాధ్యులకు రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము మంగళవారం తేనీటి విందు ఏర్పాటు చేశారు. జూలైలో ఈ రెండు సంస్థల ఆధ్వర్యంలో 'జనజాతి దర్పణ్' పేరుతో ఆదివాసుల కళాఖండాలతో రాష్ట్రపతి భవన్‌లో మ్యూజియం ఏర్పాటైంది. సందర్శకులు, పలువురు మేధావులను అలరించిన ఈ మ్యూజియంలో 170 ఆదివాసీ కళాఖండాలను ఆద్యకళ సేకరించింది. ఈ నేపథ్యంలో ఈ రెండు సంస్థలను రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము అభినందించారు. కార్యక్రమంలో ఐజీఎన్‌సీఏ మెంబర్ సెక్రెటరీ డాక్టర్ సచ్చిదానంద జోషి, జానపదశాఖ అధిపతి ప్రొఫెసర్ కె.అనిల్‌కుమార్, జయధీర్ తిరుమలరావు పాల్గొన్నారు.

సింగరేణి ఆధ్వర్యంలో సౌర విద్యుత్ ప్లాంట్లు

- ప్రీబిడ్ సమావేశానికి 10 కంపెనీల హాజరు

సాక్షి, హైదరాబాద్: సౌర విద్యుదుత్పత్తి సామర్థ్యం విస్తరణలో భాగంగా రెండో విడత కింద 232 మెగావాట్ల ప్లాంట్ల ఏర్పాటుకు సింగరేణి సంస్థ మంగళవారం నిర్వహించిన ప్రీబిడ్ సమావేశానికి 10 కంపెనీలు హాజరయ్యాయి. టాటా సోలార్ పవర్, ఎన్రిచ్ ఎనర్జీ, నోవాస్ గ్రీన్ ఇంజనీరింగ్, ఎర్త్ ఇన్ ప్రాజెక్ట్ వంటి ప్రముఖ కంపెనీల ప్రతినిధులు టెండరు విధివిధానాలపై తమ సందేహాలను నివృత్తి చేసుకున్నారు. మొత్తం 232 మెగావాట్లకు సంబంధించి 3 టెండర్లను ఆహ్వానించినట్టు సంస్థ డైరెక్టర్లు డి.సత్యనారాయణరావు, డైరెక్టర్ ఎన్వీకే శ్రీనివాస్ తెలిపారు. నిర్మాణ ప్రదేశాలను, రవాణా సౌకర్యాలను స్వయంగా పరిశీలించవచ్చని ఆహ్వానించారు. 25లోగా టెండర్లు సమర్పించాలని, ఏడాదిలోపు నిర్మాణాలు పూర్తి చేయాలని పేర్కొన్నారు.

14 నుంచి అందుబాటులో ఉండాలి

యూత్ కాంగ్రెస్ నేతలకు పార్టీ ఆదేశాలు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని యూత్ కాంగ్రెస్ ముఖ్య నేతలందరూ ఈనెల 14వ తేదీ నుంచి 17 వరకు హైదరాబాద్‌లో అందుబాటులో ఉండాలని టీపీసీసీ ఆదేశించింది. సీడబ్ల్యూసీ సమావేశాలు, విజయభేరి బహిరంగ సభలు పూర్తయ్యేంతవరకు యూత్ కాంగ్రెస్ నేతలు చురుకుగా పనిచేయాలని సూచించింది. ఈ మేరకు మంగళవారం గాంధీభవన్‌లో జరిగిన యూత్ కాంగ్రెస్ రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో కాంగ్రెస్ నేతలు దిశానిర్దేశం చేశారు. రాష్ట్ర పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జి మాణిక్‌రావ్ ఠాక్రే, ఆలిండియా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు బి.ఎల్.శ్రీనివాస్, రాష్ట్ర అధ్యక్షుడు శివసేనారెడ్డి, రాష్ట్ర ఇన్‌చార్జి ఉపాధ్యక్షుడు ఎంఆర్‌జి వినోద్‌రెడ్డి, పార్టీ ముఖ్య నేతలు మధుయాష్కీగౌడ్, శ్రీధర్‌బాబు, మల్లు రవి తదితరులు పాల్గొన్నారు.

సీనియర్లకు బాధ్యతలు: కాగా, సీడబ్ల్యూసీ సమావేశాలు, విజయభేరి బహిరంగసభ నిర్వహణతో పాటు తిరగబడదాం–తరిమికొడదాం, ప్రజాకోర్టుల నిర్వహణ, రాబోయే ఎన్నికల్లోపు నిర్వహించాల్సిన కార్యక్రమాల బాధ్యతలను సీనియర్ నేతలకు అప్పగించాలని కాంగ్రెస్ పార్టీ నిర్ణయించింది. ఈ మేరకు సీనియర్ నేతలకు బాధ్యతలు అప్పగిస్తూ టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. కాగా, తుక్కుగూడలో నిర్వహించనున్న బహిరంగసభకు 2వేల బస్సులను ఇవ్వాలని టీపీసీసీ ఆర్టీసీని కోరింది.

సలహాలు, సూచనలు ఇవ్వండి: తెలంగాణ ప్రజల ఆకాంక్షలు నెరవేర్చే విధంగా కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోను తయారు చేస్తామని టీపీసీసీ మేనిఫెస్టో కమిటీ చైర్మన్ దుద్దిళ్ల శ్రీధర్‌బాబు చెప్పారు. మంగళవారం గాంధీభవన్‌లో టీపీసీసీ మేనిఫెస్టో కమిటీ తొలిసారి భేటీ అయింది. అనంతరం మాట్లాడుతూ.. ప్రజలు కమిటీకి సలహాలు, సూచనలు ఇవ్వాలని కోరారు.



ఉస్మానియా విశ్వవిద్యాలయం ఆర్ట్స్ కళాశాల భవనానికి రూ.12 కోట్లతో ఏర్పాటు చేసిన డైనమిక్ లైటింగ్ షోను కేంద్రమంత్రి, తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి మంగళవారం జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ నెల 27న ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా ఆర్ట్స్ కళాశాల భవనానికి ఏర్పాటు చేసిన లైటింగ్, లేజర్ షో, మ్యూజిక్ ఫౌంటెన్లు పూర్తి స్థాయిలో ప్రారంభమవుతాయని తెలిపారు. - ఉస్మానియా యూనివర్సిటీ

కస్తూర్బా విద్యార్థినులకు ఫుడ్‌పాయిజన్

120 మందికి అస్వస్థత



నిజామాబాద్ ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థినులు

ఖలీల్‌వాడి(నిజామాబాద్): నిజామాబాద్ జిల్లా భీమ్‌గల్ పట్టణంలోని కస్తూర్బా పాఠశాలలో 120 మంది విద్యార్థినులకు ఫుడ్ పాయిజన్ అయింది. సోమవారం రాత్రి స్కూల్‌లో అన్నం, పప్పు, వంకాయకూర వంట చేశారు. రాత్రి భోజనం చేసిన తర్వాత 11.30 గంటలకు విద్యార్థినులకు వాంతులు, విరేచనాలు, కడుపునొప్పి ప్రారంభమైంది. దీంతో పాఠశాల సిబ్బంది పిల్లలను స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అయితే 84 మంది విద్యార్థినుల పరిస్థితి విషమించడంతో అర్ధరాత్రి ఒంటి గంట ప్రాంతంలో నిజామాబాద్ ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తరలించారు. కాగా, భీమ్‌గల్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న 36 మందిలో 16 మంది విద్యార్థినుల పరిస్థితి అలాగే ఉండటంతో వారిని మంగళవారం నిజామాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. భీమ్‌గల్ ప్రభుత్వ ఆస్పత్రి నుంచి 20 మంది విద్యార్థినులను మంగళవారం మధ్యాహ్నం డిశ్చార్జి చేశారు. నిజామాబాద్‌లో చికిత్స పొందుతున్న విద్యార్థినులను జిల్లా కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు పరామర్శించారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ ప్రతిమారాజ్, విద్యాశాఖ అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ ఘటన పై మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి సీరియస్ అయ్యారు. ఫుడ్ పాయిజన్ ఘటనపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్‌కు ఆదేశాలు జారీ చేశారు. దీంతో కలెక్టర్ ముగ్గురు సభ్యుల కమిటీని ఏర్పాటు చేశారు. ఈ బృందం వంట సిబ్బంది నుంచి వివరాలు అడిగి తెలుసుకుంది. రాత్రి చేసిన వంటకాల శాంపిల్స్‌ను ల్యాబ్‌కు పంపించారు.

'కేజీబీవీ, మోడల్ స్కూళ్ల నాన్‌టీచింగ్ ఉద్యోగుల వేతనాలు పెంచాలి'

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాలు (కేజీ బీవీ), మోడల్ స్కూళ్లలోని బోధనేతర సిబ్బంది వేతనాలను తక్షణమే పెంచాలని ప్రగతిశీల కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాల బోధనేతర ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షకార్యదర్శులు ఎస్.ఎల్.పద్మ, పి.అరుణ్‌కుమార్ ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు మంగళవారం రాష్ట్ర ఆర్థిక, వైద్య, ఆరోగ్య శాఖల మంత్రి టి.హరీశ్‌రావును కలిసి వినతిపత్రం అందించారు. రాష్ట్రవ్యాప్తంగా దాదాపు ఆరువేల మంది బోధనేతర ఉద్యోగులకు ప్రభుత్వం పీఆర్సీ అమలు చేస్తున్నట్లు ప్రకటించినప్పటికీ ఇంత వరకు బేసిక్ పే నిర్ణయించలేదన్నారు.

ఆర్టీసీలో అనగనగా ఓ రోజు.. సెప్టెంబర్ 11

టీఎస్ఆర్టీసీ చరిత్రలో తొలిసారి రికార్డు

- మొత్తం 96 డిపోలకు గాను 90 డిపోల్లో లాభాలు
- నిర్వహణ ఖర్చులను మించి ఆదాయం నమోదు
- ఈనెల తొలి 11 రోజుల్లో ఏకంగా 71 డిపోల్లో 'లాభాలు'

సాక్షి, హైదరాబాద్: ఆర్టీసీ అనగానే.. నష్టాలు, అప్పులు, ఆలస్యంగా తిరిగే ట్రిప్పులు, డొక్కు బస్సులు.. ఇలాంటివి చాలామందికి మదిలో మెదులుతాయి. కానీ, కొంతకాలంగా కట్టుదిట్టంగా వ్యవహరిస్తున్న సంస్థ తనను తాను మార్చుకుంటూ వస్తూ ఇప్పుడు అరుదైన రికార్డు సృష్టించింది. గతంలో ముఖ్యమంత్రి కేసీఆర్ ఆర్టీసీపై సమీక్ష నిర్వహిస్తున్న తరుణంలో కేవలం నాలుగు డిపోలు మాత్రమే ఖర్చులను మించి ఆదాయాన్ని సాధించాయన్న విషయం అధికారులు ఆయన ముందుంచారు. తాజాగా ఆర్టీసీ చేసిన ఫీట్ ఏంటంటే.. ఆర్టీసీలో 96 డిపోలు ఉండగా, గత సోమవారం (సెప్టెంబరు 11) రికార్డు స్థాయిలో 90 డిపోలు నిర్వహణ ఖర్చుల కంటే ఎక్కువ ఆదాయాన్ని పొందాయి. ఇక ఈనెల సెప్టెంబరు 11వ తేదీ వరకు వరసగా 71 డిపోలు లాభాల(నిర్వహణ ఖర్చులను మించి)ను ఆర్జించాయి. టీఎస్ఆర్టీసీ చరిత్రలో తొలిసారి ఈ రెండు ఫీట్లు నమోదయ్యాయి. ప్రభుత్వంలో విలీనం అవుతున్న నేపథ్యంలో మంచి ఊపుమీద ఉన్న ఆర్టీసీ ఉద్యోగులు, కలిసికట్టుగా, పక్కా ప్రణాళికాబద్ధంగా వ్యవహరించి ఈ రికార్డులను సాధించటం విశేషం.



ఫలితాన్నిస్తోన్న 'ఆల్ డిపోస్ ప్రాఫిట్ చాలెంజ్'

'ఆల్ డిపోస్ ప్రాఫిట్ చాలెంజ్' పేరుతో కొద్ది రోజులుగా ఆర్టీసీ అమలు చేస్తున్న ప్రత్యేక ప్రణాళిక ఇప్పుడు ఈ రూపంలో సరికొత్త ఫలితాలని అందించింది. సాధారణంగా సోమవారం రోజు ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించే వారి సంఖ్య ఎక్కువగా ఉంటుంది. సాధారణ సోమవారాల్లో రూ.16–రూ.17 కోట్ల మేర ఆదాయం వస్తుండగా, ఈనెల 11న (చివరి 'శుభముహూర్త' సోమవారం) ఏకంగా రూ.20.22 కోట్ల ఆదాయం నమోదైంది.

- సోమవారం రోజున ముషీరాబాద్–2, ఉట్నూరు, కోస్గి, భైంసా, మిధాని, నారాయణ్‌ఖేడ్ డిపోలు మినహా మిగతా 90 డిపోలు నిర్వహణ ఖర్చులను మించి ఆదాయాన్ని పొందాయి. నారాయణఖేడ్ డిపో ఖర్చు కంటే కేవలం రూ.వేయి మాత్రమే తక్కువ ఆదాయాన్ని పొందింది. నష్టాలు పొందిన మిగతా ఐదు డిపోలు కూడా రూ.22 వేల నుంచి రూ.1.45 లక్షల నష్టాన్ని మాత్రమే పొందటం గమనార్హం.
- ఆర్టీసీలో సాధారణంగా కొన్ని బస్సులను స్పేర్‌లో ఉంచుతారు. మరికొన్ని మరమ్మతు కోసం పక్కన పెడతారు. శ్రావణ శుభముహూర్తాల నేపథ్యంలో అస్సలు నడవలేని డొక్కు బస్సులు తప్ప అన్నింటినీ బాగుచేసి రోడ్డెక్కించారు. 11న ఆక్యుపెన్సీ రేషియో 85.19 శాతంగా నమోదైంది. సాధారణ రోజులతో పోలిస్తే గత పది రోజుల్లో కనీసం 5 శాతం వరకు పెరిగిందని ఆర్టీసీ పేర్కొంటోంది.
- కొన్ని మార్గాల్లో ప్రయాణికుల సంఖ్య ఎక్కువగా ఉంటుంది, కొన్ని రూట్లలో తక్కువగా ఉంటుంది. డెడికేటెడ్ సర్వీసుల పేరుతో, ఆక్యుపెన్సీ రేషియో తక్కువగా ఉండే మార్గాల్లోనూ బస్సులు తిప్పే అలవాటు ఉండేది. ఇప్పుడు, ప్రయాణికుల డిమాండ్ ఎక్కువగా ఎటు ఉందో ఆయా మార్గాల్లోనే ఎక్కువ బస్సులు తిప్పుతున్నారు. గత పక్షం రోజులుగా రోజువారీ ఆదాయం దాదాపు రూ.కోటిన్నర మేర పెరిగింది.
- ఇటీవలే దాదాపు 650 కొత్త సూపర్ లగ్జరీ బస్సులు, 200 డీలక్స్ బస్సులు చేతికందాయి. వాటిని పూర్తి సామర్థ్యంతో తిప్పుతున్నారు. సాధారణ రోజుల్లో 28 లక్షల కి.మీ. మేర బస్సులను తిప్పుతుండగా 11న 34 లక్షల కి.మీ. తిప్పారు.
- ఇతర సిబ్బందికి ప్రత్యేక బాధ్యతలు అప్పగించి ప్రధాన పాయింట్ల వద్ద వినియోగించారు. దీనివల్ల సమయానుకూలంగా బస్సులు, రావటం, వచ్చిన బస్సుల్లో ఎక్కువ మంది ఎక్కేలా చూడటం, ప్రైవేటు వాహనాల వైపు వెళ్లేవారిని మళ్లించటం లాంటివి జరిగాయి.
- సెలవులను నియంత్రించి వీలైనంతమంది సిబ్బంది విధుల్లో ఉండేలా చూశారు.

అరకు కాఫీ రుచి చూసిన జి 20 సమ్మిట్

అంతర్జాతీయంగా మరోసారి ప్రాధాన్యం



జి20 సమ్మిట్‌లో అరకు వ్యాలీ కాఫీ ప్రదర్శన

సాక్షి, అమరావతి: అంతర్జాతీయ గుర్తింపు కలిగిన అరకు కాఫీకి మరోసారి అరుదైన ప్రాధాన్యత దక్కింది. న్యూఢిల్లీలో రెండు రోజులపాటు జరిగిన జీ20 సమ్మిట్‌లో అరకు వ్యాలీ కాఫీ ప్రదర్శనకు అవకాశం రావడమే ఇందుకు కారణం. సమ్మిట్‌లో ఆంధ్రప్రదేశ్ పెవిలియన్‌లో గిరిజన సహకార సంస్థ (జీసీసీ) గిరిజన ఉత్పత్తులను ప్రదర్శించింది. ఈ ఎగ్జిబిషన్‌లో అల్లూరి సీతారామరాజు జిల్లా గిరిజన రైతులు పండించిన, ప్రత్యేకమైన, అధిక నాణ్యత ప్రమాణాలు కలిగిన కాఫీని ప్రదర్శించడం గమనార్హం. ఈ గ్లోబల్ ఈవెంట్‌లో అరకు వ్యాలీ కాఫీ ప్రదర్శన ద్వారా ప్రీమియం కాఫీ బ్రాండ్‌గా మాత్రమే కాకుండా వాణిజ్య పరంగా సహకారాన్ని పెంపొందించుకునేందుకు ఉపయోగపడుతుందని జీసీసీ చైర్‌పర్సన్ శోభా స్వాతిరాణి సాక్షికి తెలిపారు. జీ20 శిఖరాగ్ర సమావేశాలకు వచ్చిన పలు దేశాల ప్రతినిధులకు అరకు కాఫీ రుచిని పరిచయం చేయడం సంతోషంగా ఉందన్నారు. జీసీసీకి ఇంతటి గొప్ప అవకాశం కల్పించిన ప్రధాని మోదీ, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి శోభా స్వాతిరాణి, మేనేజింగ్ డైరెక్టర్ జి.సురేష్‌కుమార్ కృతజ్ఞతలు తెలిపారు. కాగా అతిథులకు ఇచ్చే బహుమతుల్లో అరకు కాఫీని సైతం అందజేయడం విశేషం.

గగన్‌యాన్ తరహాలో 'సముద్రయాన్'

- వచ్చే ఏడాదిలో ప్రయోగానికి ఏర్పాట్లు
- కేంద్ర ఎర్త్ సైన్సెస్ సెక్రెటరీ డాక్టర్ రవిచంద్రన్ వెల్లడి



మాట్లాడుతున్న రవిచంద్రన్

రేణిగుంట/ఏర్పేడు(తిరుపతి జిల్లా): గగన్‌యాన్ తరహాలో సముద్రయాన్‌కు భారత శాస్త్రవేత్తలు సిద్ధమవుతున్నారని, వచ్చే ఏడాది ఈ ప్రాజెక్టును ప్రారంభించే అవకాశం ఉందని కేంద్ర ఎర్త్ సైన్సెస్ సెక్రెటరీ, ప్రఖ్యాత శాస్త్రవేత్త డాక్టర్ రవిచంద్రన్ తెలిపారు. డీప్ ఓషన్ టెక్నాలజీ మిషన్‌లో భాగంగా సముద్ర వనరులు, సముద్రగర్భంలోని జీవ వైవిధ్యంపై అధ్యయనం చేసేందుకు ఈ ప్రాజెక్టును చేపడుతున్నట్లు చెప్పారు. తిరుపతి ఇన్నోవేషన్ సైన్స్ అండ్ టెక్నాలజీ, విజ్ఞానభారతి సంయుక్తంగా తిరుపతి ఐఐటీలో మంగళవారం నేషనల్ సైన్స్ అండ్ టెక్నాలజీ మిషన్‌పై నిర్వహించిన జాతీయ స్థాయి సదస్సులో రవిచంద్రన్ పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ..ముగ్గురు ఆక్వానాట్స్‌తో ప్రయాణం చేయడానికి అనువైన జలాంతర్గామిని ఈ పరిశోధనకు సిద్ధం చేస్తున్నట్లు చెప్పారు. ఆయిల్ అండ్ గ్యాస్, మెటల్స్ వంటి సముద్ర ఆర్థిక వనరులను సమగ్రంగా గుర్తించేందుకు కేంద్రం చర్యలు తీసుకుంటుందన్నారు. నీతి ఆయోగ్ సభ్యుడు డాక్టర్ సారస్వత్ మాట్లాడుతూ..సమాజ స్థితి గతులను సైన్స్ మారుస్తుందన్నారు. డీఆర్డీవో డైరెక్టర్ జనరల్ డాక్టర్ బికే దాస్ డీఆర్డీవో సాధించిన ప్రగతిని పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. శాంతాబయోటెక్ వ్యవస్థాపకులు డాక్టర్ వరప్రసాదరెడ్డి మాట్లాడుతూ..జ్ఞానం లేని విద్య, మానవత్వం లేని మనిషి వ్యర్థమన్నారు. తిరుపతి ఐఐటీ డైరెక్టర్ సత్యనారాయణ, ఐఎస్‌టీఎఫ్(తిరుపతి) ప్రెసిడెంట్ నారాయణరావు, విజ్ఞాన భారతి ప్రతినిధి త్రిప్తా ఠాకూర్ తదితరులు పాల్గొన్నారు.



హుజూర్‌నగర్‌లోని జిల్లా అదనపు కోర్టును వర్చువల్‌గా ప్రారంభిస్తున్న హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే. చిత్రంలో జస్టిస్ శ్రీసుధ, జస్టిస్ వినోద్‌కుమార్, జస్టిస్ కె.లక్ష్మణ్, జస్టిస్ సుజన

కోర్టుల సంఖ్య పెంచాలి

- హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే
- హైదరాబాద్ నుంచి వర్చువల్‌గా హుజూర్‌నగర్ అదనపు జిల్లా కోర్టు ప్రారంభం

హుజూర్‌నగర్: పెండింగ్ కేసుల భారాన్ని తగ్గించడానికి కోర్టుల సంఖ్యను పెంచాల్సిన అవసరం ఉందని తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే అన్నారు. మంగళవారం సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ అదనపు జిల్లా కోర్టును హైదరాబాద్ నుంచి వర్చువల్‌గా ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. హుజూర్‌నగర్‌తో పాటు పరిసర ప్రాంతాల ప్రజలు తమ కేసుల కోసం జిల్లా న్యాయ స్థానాన్ని ఆశ్రయించటానికి పడుతున్న వ్యయ ప్రయాసలను దృష్టిలో పెట్టుకుని బార్ అసోసియేషన్ అధ్యక్షుడు, సభ్యుల విజ్ఞప్తి మేరకు హుజూర్‌నగర్‌కు జిల్లా అదనపు న్యాయస్థానాన్ని మంజూరు చేసినట్లు తెలిపారు. మారుమూల గ్రామాల ప్రజల సౌకర్యార్థమే అదనపు జిల్లా కోర్టు మంజూరు చేశామని, కోర్టు ప్రారంభమైనందున ఈ ప్రాంత వాసులకు సౌకర్యంగా ఉండటమే కాకుండా సత్వర న్యాయం లభించడానికి మార్గం సుగమమైందన్నారు. హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ వినోద్ కుమార్, జస్టిస్ లక్ష్మణ్, సూర్యాపేట పోర్టుపోలియో జడ్జి జస్టిస్ శ్రీసుధా, జస్టిస్ సుజన వర్చువల్‌గా మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సూర్యాపేట జిల్లా ప్రధాన న్యాయమూర్తి రాజగోపాల్, జిల్లా కలెక్టర్ వెంకట్రావు, ఎస్పీ రాజేంద్రప్రసాద్, సీనియర్ సివిల్ జడ్జి జిట్టా శ్యాంకుమార్, జూనియర్ సివిల్ జడ్జి మారుతి ప్రసాద్, బార్ అసోసియేషన్ అధ్యక్షు డు సాముల రాంరెడ్డి, న్యాయవాదులు పాల్గొన్నారు.

16న మధ్యాహ్నం సీడబ్ల్యూసీ భేటీ షురూ

- షెడ్యూల్ విడుదల చేసిన ఏఐసీసీ
- సమావేశానికి ముందు సభ్యులకు టీపీసీసీ విందు
- 17న ఉదయం విస్తృతస్థాయి సమావేశం..సాయంత్రం విజయభేరి సభ.. 18న నియోజకవర్గాల్లో కార్యకర్తల సభలు

సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ (సీడబ్ల్యూసీ) సమావేశాల షెడ్యూల్ విడుదలయింది. మంగళవారం అర్ధరాత్రి ఏఐసీసీ సంస్థాగత వ్యవహారాల ఇన్‌చార్జి ప్రధాన కార్యదర్శి కె.సి.వేణుగోపాల్ విడుదల చేసిన షెడ్యూల్ ప్రకారం.. ఈనెల 16న మధ్యాహ్నంలోగా కమిటీ సభ్యులు హైదరాబాద్ చేరుకుంటారు. మధ్యాహ్నం ఒంటి గంటకు తాజ్ కృష్ణా హోటల్‌లో టీపీసీసీ ఏర్పాటు చేసిన విందులో పాల్గొంటారు. 2 గంటలకు సీడబ్ల్యూసీ సమావేశం ప్రారంభమవుతుంది. ఎజెండా ముగిసేవరకు ఈ భేటీ జరగనుంది. 17న ఉదయం 10:30 గంటలకు సీడబ్ల్యూసీ విస్తృత స్థాయి సమావేశం ప్రారంభమవుతుంది. అన్ని రాష్ట్రాల పీసీసీ అధ్యక్షులు, సీఎల్పీ నాయకులు, కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ ఆఫీస్ బేరర్లు పాల్గొంటారు. ఈ సమావేశం ముగిసిన తర్వాత సాయంత్రం 5 గంటలకు తుక్కుగూడలో విజయభేరి సభ ప్రారంభం అవుతుంది. ఈ సభ తర్వాత రాష్ట్రంలోని 119 అసెంబ్లీ నియోజకవర్గాలకు ముఖ్య నేతలు వెళ్లే కార్యక్రమాన్ని అధికారికంగా ప్రారంభిస్తారు. అదేరోజు రాత్రి కల్లా ఈ నేతలందరూ వారికి కేటాయించిన నియోజకవర్గాలకు వెళ్లి అక్కడే బస చేస్తారు. 18వ తేదీ ఉదయం కార్యకర్తల సభలు నిర్వహిస్తారు. ఐదు గ్యారంటీ కార్డు స్కీంలను ఇంటింటికీ తెలియజేసి కార్డులు పంపిణీ చేస్తారు. మధ్యాహ్నం ఆయా నియోజకవర్గాల్లోని ముఖ్యులతో కలసి భోజనం చేస్తారు. అదేరోజు సాయంత్రం అంబేడ్కర్, గాంధీ, కొమురం భీం విగ్రహాల వద్దకు భారత్ జోడో మార్చ్ నిర్వహిస్తారు.

నడిరోడ్డుపై అక్కను హత్య చేసిన తమ్ముడు

తల్వార్‌తో నరికి చంపి.. పోలీస్ స్టేషన్‌లో లొంగిపోయిన వైనం

మాచారెడ్డి: తోడబుట్టిన అక్కను తమ్ముడే నడి రోడ్డుపై తల్వార్‌తో నరికి హత్య చేసి న దారుణ ఘటన కా మారెడ్డి జిల్లా మాచారెడ్డి మండలంలోని గజ్యానాయక్ తండా చౌరస్తాలో మంగళవారం రాత్రి కలకలం సృష్టించింది. కామారెడ్డి రూరల్ సీఐ శ్రీనివాస్ తెలిపిన వివరాల మేరకు..గజ్యాతండా చౌరస్తాకు చెందిన చాందీబీకి కుమార్తె రుక్సానా(45)తో పాటు నలుగురు కుమారులు ఉన్నారు. అందులో రెండో వాడైన షేక్ యూసుఫ్‌కు అక్క రుక్సానాకు మధ్య కొన్నిరోజులుగా ఆస్తి గొడవలు జరుగుతున్నాయి. ఇటీవల రుక్సానాకు చెందిన టాటాఏస్ వాహనానికి ఆమెనే నిప్పంటించి తమ్ముడు యూసుఫ్ తగలబెట్టాడని స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యా దు చేసింది. దీనిని దృష్టిలో పెట్టుకొని ఎలాగైనా అక్కను అడ్డు తొలగించాలని షేక్ యూ సుఫ్ పథకం వేశాడు. రుక్సానా మంగళవారం రాత్రి బస్సు దిగి ఇంటికి వెళ్తుండగా కాపుకాసి తల్వార్‌తో తలపై పలుమార్లు నరికాడు. ఆమె అక్కడికక్కడే కుప్పకూలి ప్రాణాలు వదిలింది. అక్క చనిపోయిందని నిర్ధారించుకున్న తర్వాత యూసుఫ్ నేరుగా పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి లొంగిపోయాడు. మృతురాలికి భర్త, ఇద్దరు కుమారులు ఉన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం కామారెడ్డి జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీనివాస్ గౌడ్ తెలిపారు.

చట్టసభల్లో మహిళా రిజర్వేషన్లకు కృషి చేయండి

సోనియా, ఖర్గేలకు జ్యోతిబాపూలే ఓబీసీ జాతీయ అధ్యక్షుడు వినతి

సాక్షి, న్యూఢిల్లీ: చట్టసభల్లో మహిళా రిజర్వేషన్ల కోసం కృషి చేయాలని ఏఐసీసీ మాజీ అధ్యక్షురాలు సోనియాగాంధీ, అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేలకు జ్యోతిబాపూలే అఖిల భారత ఓబీసీ జాతీయ అధ్యక్షుడు పోతల ప్రసాద్ నాయుడు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు మంగళవారం వారిద్దరికీ లేఖలు రాశారు. రానున్న తెలంగాణ ఎన్నికల్లో పార్టీ ముఖ్యమంత్రి అభ్యర్థిగా బీసీ వ్యక్తిని ప్రకటించాలని ప్రసాద్ నాయుడు కోరారు.

17న విజయభేరికి జాతరలా తరలి రావాలి

సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క



సమావేశంలో మాట్లాడుతున్న సీఎల్పీ నేత భట్టి

సాక్షిప్రతినిధి, ఖమ్మం: హైదరాబాద్ వేదికగా తొలిసారి ఈనెల 15, 16, 17 తేదీల్లో జరిగే సీడబ్ల్యూసీ సమావేశాలు చరిత్రాత్మకం కానున్నాయని, చివరి రోజు రాజీవ్‌గాంధీ ప్రాంగణంలో జరిగే విజయభేరి సభకు ప్రజలు జాతరలా తరలిరావాలని సీఎల్పీ నేత మల్లు భట్టివిక్రమార్క పిలుపునిచ్చారు. ఖమ్మంలోని డీసీసీ కార్యాలయంలో మంగళవారం ఆయన మాట్లాడారు. సభను విజయవంతం చేయడానికి నేతలు, కేడర్ ప్రజాక్షేత్రంలోకి కదలి వెళ్లాలని సూచించారు. సభలో ప్రజల సంక్షేమమే లక్ష్యంగా పలు డిక్లరేషన్లు పార్టీ అగ్రనేత సోనియా గాంధీ ప్రకటిస్తారని, ఇవి ప్రజల భవిష్యత్‌ను మార్చే పునాదిరాళ్లు అవుతాయన్నారు. కాంగ్రెస్ పార్టీ ఖమ్మం పార్లమెంట్ ఇన్‌చార్జి, మహారాష్ట్ర మాజీ మంత్రి ఆరీఫ్ నసీంఖాన్ మాట్లాడుతూ సీఎం కేసీఆర్ తెలంగాణలో లూటీ చేసి.. మహారాష్ట్రలో ఖర్చు పెడుతున్నారని ఆరోపించారు.

సన్నాహకంలో ఆగ్రహావేశాలు

ఖమ్మం పార్లమెంటరీ స్థాయి సన్నాహక సమావేశానికి ఏడు నియోజకవర్గాల నుంచి టికెట్ ఆశిస్తున్న వారితోపాటు వారి అనుచరులు హాజరయ్యారు. తమ నేతకే టికెట్ ఇవ్వాలని, పాత నేతలను కాదని కొత్త వారికి ఇస్తే సహించేది లేదని నినాదాలు చేశారు. మాజీ ఎంపీ వీహెచ్ మాట్లాడుతుండగా నినాదాలు ఒక్కసారిగా మిన్నంటాయి. వేదికపై కేంద్ర మాజీ మంత్రి రేణుకాచౌదరి, సీఎల్పీ నేత భట్టి, మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఉండగానే కార్యకర్తలు ఆందోళనకు దిగగా... భట్టి, పొంగులేటి వారిని వారించడంతో గొడవ సద్దుమణిగింది. మొత్తంగా ఈ సన్నాహక సమావేశం చివరి వరకు రసాభాసగా సాగింది. ఈ సమావేశంలో మాజీ మంత్రి సంభాని చంద్రశేఖర్, టీపీసీసీ ఉపాధ్యక్షుడు ఒబేదుల్లా కొత్వాల్, భద్రాచలం ఎమ్మెల్యే పొదెం వీరయ్య, ఖమ్మం డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఉన్నత విద్యా సంస్థల అధ్యాపకులకు శిక్షణ

- ఉన్నత విద్యా సంస్థల్లో ప్రమాణాల మెరుగు దిశగా యూజీసీ నిర్ణయం
- బోధనలో నాణ్యత, విద్యార్థుల్లో నైపుణ్యాల పెంపే లక్ష్యం

సాక్షి, అమరావతి: జాతీయ నూతన విద్యా విధానంలో నిర్దేశించిన లక్ష్యాలను నెరవేర్చేందుకు యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్(యూజీసీ) వివిధ కార్యక్రమాలకు శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా దేశవ్యాప్తంగా ఉన్న ఉన్నత విద్యా సంస్థలకు చెందిన 15 లక్షల మంది అధ్యాపకులకు ప్రత్యేక శిక్షణ అందివ్వనుంది. బోధనలో నాణ్యతను పెంచడం, విద్యార్థులకు అత్యున్నత ప్రమాణాలతో కూడిన విద్యనందించడంతో పాటు నైపుణ్యాల పెంపు లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టింది. సమగ్ర విద్యాభివృద్ధి, భారతీయ విజ్ఞానం, విద్యార్థుల్లో నాయకత్వ సామర్థ్యాల పెంపు, సమగ్ర విద్యాపాలన, నాణ్యమైన పరిశోధనలు, నైపుణ్యాభివృద్ధి, ఉన్నత విద్యలో చేరికల పెంపు వంటి అంశాలకు యూజీసీ ప్రాధాన్యత ఇస్తోంది. మాలవ్య మిషన్ టీచర్ ట్రైనింగ్ ప్రోగ్రామ్‌లో భాగంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టింది. ఇప్పటికే దేశవ్యాప్తంగా గుర్తించిన 111 సంస్థలను మాలవ్య మిషన్ టీచర్ శిక్షణా కేంద్రాలుగా మార్చబోతోంది. ఈ కేంద్రాల ద్వారా అధ్యాపకులకు ఆఫ్‌లైన్, ఆన్‌లైన్ విధానాల్లో శిక్షణ ఇస్తారు. దశలవారీగా రాబోయే రెండు, మూడేళ్లలో మొత్తం 15 లక్షల మంది అధ్యాపకులు శిక్షణ తీసుకోనున్నారు. శిక్షణలో అందించే కంటెంట్ ప్రపంచ స్థాయిలో ఉంటుందని యూజీసీ పేర్కొంది. అధ్యాపకుల కోసం ప్రత్యేక పోర్టల్‌ను ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించింది.

రూ.కోట్లు కొట్టేసిన హ్యాకర్

బనశంకరి (బెంగళూరు): ట్రిపుల్ ఐటీలో చదివి సాఫ్ట్‌వేర్ రంగంపై మంచి పట్టు సాధించాడు. ప్రయత్నిస్తే పెద్ద కంపెనీలో సులువుగా ఉద్యోగం దొరికి రూ.లక్షల్లో జీతం వచ్చేది. కానీ.. ప్రతిభ పక్కదారి పట్టింది. హ్యాకర్‌గా మారి రూ.కోట్లను కొల్లగొట్టాడు. బెంగళూరు పోలీస్ కమిషనర్ బి.దయానంద్ మంగళవారం తెలిపిన వివరాల ప్రకారం.. చిత్తూరుకు చెందిన లక్ష్మీపతి (27) అనే యువకుడు రివార్డ్స్ పాయింట్స్ వెబ్‌సైట్‌ను హ్యాక్ చేసి రూ.కోట్ల విలువైన బంగారు నగలు, ఖరీదైన వస్తువులను కొనుగోలు చేశాడు. నిందితుడి నుంచి రూ.4 కోట్ల 16 లక్షల విలువ చేసే 5.2 కేజీల బంగారు నగలు, 27 కేజీల వెండి, రూ.11.13 లక్షల నగదు, రూ.12 లక్షల విలువైన 7 ద్విచక్ర వాహనాలు, రూ.26 లక్షల విలువైన ఫ్లిప్‌కార్ట్ వ్యాలెట్లు, 2 ల్యాప్‌టాప్‌లు, 3 మొబైల్స్ తదితరాలను స్వాధీనం చేసుకున్నామని పోలీస్ కమిషనర్ తెలిపారు.

బీటెక్ పూర్తి చేసి..: ఒంగోలు ట్రిపుల్ ఐటీలో బీటెక్ పూర్తిచేసిన లక్ష్మీపతికి ఐటీ రంగంపై పట్టు ఉంది. దుబాయ్ వెళ్లి కొంతకాలం పనిచేసి తిరిగి బెంగళూరుకు వచ్చాడు. కాలేజీ రోజుల్లో నేర్చుకున్న హ్యాకింగ్ ద్వారా సైబర్ నేరాలు చేసి విలాసవంతమైన జీవితం గడిపేవాడు. రివార్డ్స్ 360 కంపెనీ వెబ్‌సైట్‌ను హ్యాక్‌చేసి ఓచర్లు కొట్టేసి ఈ–కామర్స్ కంపెనీల ద్వారా కోట్లాది రూపాయల విలువచేసే బంగారు, వెండి, ద్విచక్ర వాహనాలు, ఎల్రక్టానిక్ వస్తువులను ఆన్‌లైన్ ద్వారా కొనుగోలు చేసినట్టు తేలింది. రివార్డ్స్ 360 కంపెనీ డైరెక్టర్ తమ కస్టమర్లకు అందించే ఓచర్లను ఇంకా లబ్ధిదారులకు అందజేయకముందే ఎవరో హ్యాక్‌చేసి వినియోగిస్తున్నట్టు బెంగళూరు ఆగ్నేయ విభాగం సీఈఎన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు ఇది హ్యాకర్ల పని అని నిర్ధారించి సాంకేతికత సాయంతో దర్యాప్తు జరిపి లక్ష్మీపతిని అరెస్ట్ చేశారు. కేసు విచారణలో ఉందని కమిషనర్ తెలిపారు.

క్లుప్తంగా...

ఎట్టకేలకు స్వదేశానికి పయనమైన ట్రూడో

న్యూఢిల్లీ: కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడో ఎట్టకేలకు తన విమానంలో స్వదేశానికి తిరుగుపయనమయ్యారు. జీ20 శిఖరాగ్రంలో పాల్గొనేందుకు ట్రూడో శుక్రవారం ఢిల్లీకి చేరుకున్నారు. ఆదివారమే ఆయన తిరిగి వెళ్లాల్సి ఉంది. విమానంలో సాంకేతిక లోపం తలెత్తడంతో రెండు రోజులుగా ఆయనతోపాటు, కెనడా ప్రతినిధి బృందం ఢిల్లీలోనే ఉండిపోయింది. మంగళవారం మధ్యాహ్నం సాంకేతిక నిపుణులు విమానంలో లోపాన్ని సరిచేశారు. ప్రధాని కార్యాలయం అధికారులు విమాన ప్రయాణానికి ఓకే చెప్పారు. దీంతో మంగళవారం మధ్యాహ్నం ట్రూడో తిరిగి స్వదేశానికి బయలుదేరారు. కెనడా ప్రధాని ట్రూడోకు మధ్యాహ్నం 1.10 గంటలకు విమానాశ్రయంలో వీడ్కోలు పలికినట్లు కేంద్రమంత్రి రాజీవ్ చంద్రశేఖర్ సామాజిక వేదిక 'ఎక్స్'లో తెలిపారు.

జీ20 అతిథులకు ఘనమైన కానుకలు

న్యూఢిల్లీ: దేశ రాజధాని ఢిల్లీలో రెండు రోజులపాటు అట్టహాసంగా జరిగిన జీ20 సదస్సు శిఖరాగ్ర సదస్సుకు కూటమి దేశాల అధినేతలు, ప్రతినిధులు హాజరయ్యారు. భారత ప్రభుత్వం వారికి ఘనమైన కానుకలు అందించింది. భారతీయ సంస్కృతీ సంప్రదాయాలను ప్రతిబింబించే హస్త కళాకృతులు, వస్తువులు, ఉత్పత్తులను కానుకలుగా అందించినట్లు అధికారులు మంగళవారం వెల్లడించారు. కశ్మీరీ కుంకుమ పువ్వు, నీలగిరి టీ పొడి, అరకు కాఫీ, కశ్మీరీ శాలువాలు, సుందర్బన్స్ తేనె, జిఘ్రానా అత్తర్ నూనె, జీ20 స్మారక నాణేలతో కూడిన చిన్న పెట్టెలు, శీషాం చెక్క పెట్టెలు, డార్జీలింగ్ టీ ఆకులు, ఖాదీ స్కార్ఫ్‌లు తదితరాలను జీ20 అతిథులకు బహూకరించినట్లు తెలియజేశారు.

నిఫా వైరస్ కలకలం.. ఇద్దరు మృతి

న్యూఢిల్లీ: ప్రమాదకర నిఫా వైరస్ బారినపడి కేరళలో ఇద్దరు చనిపోయినట్లు కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి మన్‌సుఖ్ మాండవీయ చెప్పారు. కోజికోడ్‌కు చెందిన ఇద్దరు జ్వర లక్షణాలతో చనిపోయారని, నిఫా వైరసే కారణమని పరీక్షల్లో తేలిందని చెప్పారు. మృతుల్లో ఒకరి బంధువుకు ఇవే లక్షణాలు కనిపించడంతో ప్రభుత్వ ఆస్పత్రికి చెందిన ఐసీయూలో చికిత్స అందిస్తున్నారన్నారు. ఆ రాష్ట్రానికి చెందిన మరో నలుగురి శాంపిళ్లను సేకరించి పుణేలోని వైరాలజీ ల్యాబ్‌కు పంపించారన్నారు. నిఫా వైరస్ వ్యాప్తిని ఎదుర్కోవడంలో రాష్ట్ర ప్రభుత్వానికి సాయపడేందుకు కేంద్ర అధికారుల బృందాన్ని అక్కడికి పంపించామన్నారు. ముందు జాగ్రత్తగా ప్రజలు మాస్కులు ధరించాలని కోజికోడ్ ఆరోగ్య శాఖ కోరింది.

అమెరికాకు వ్యతిరేకంగా చేతులు కలిపిన రష్యా, ఉత్తర కొరియా.. త్వరలో పుతిన్, కిమ్ భేటీ
ఉత్తర కొరియా నుంచి ఆయుధాలు సమకూర్చుకోనున్న రష్యా
బదులుగా ఆహార ధాన్యాలు, అత్యాధునిక టెక్నాలజీ బదిలీ



కరడుగట్టిన నియంతగా పేరుగాంచిన ఉత్తర కొరియా అధ్యక్షుడు కిమ్ జోంగ్ ఉన్ ప్రత్యేక రైలులో మిత్రదేశం రష్యా చేరుకున్నారు. రష్యా అధినేత వ్లాదిమిర్ పుతిన్‌తో కిమ్ భేటీకి రంగం సిద్ధమైనట్లు తెలుస్తోంది. నేడో రేపో చర్చలు జరగనున్నాయి. అగ్రరాజ్యం అమెరికాపై ఉన్న ఉమ్మడి శత్రుత్వం వల్ల రష్యా–ఉత్తర కొరియా సన్నిహితంగా మారాయని చెప్పొచ్చు. రెండు దేశాలూ అంతర్జాతీయ సమాజం నుంచి తీవ్రమైన ఆంక్షలను ఎదుర్కొంటున్నాయి. రష్యా, ఉత్తర కొరియాలను దుష్ట దేశాలుగా అమెరికా అభివర్ణిస్తోంది. అమెరికా మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఉత్తర కొరియా పట్ల కొంత ఉదారంగానే వ్యవహరించారు. ప్రస్తుత అధ్యక్షుడు జో బైడెన్ మాత్రం కిమ్ పట్ల కఠిన వైఖరి అవలంబిస్తున్నారు. ఈ నేపథ్యంలో కిమ్–పుతిన్ తాజా సమావేశంపై ప్రపంచమంతటా ఆసక్తి నెలకొంది. ఈ భేటీ వల్ల ప్రపంచ భౌగోళిక–రాజకీయ పరిస్థితుల్లో మార్పులు చోటుచేసుకోవచ్చని నిపుణులు అంచనా వేస్తున్నారు. - సాక్షి, నేషనల్ డెస్క్

ఎవరికెంత లాభం!

ఆయుధమే కీలకం..

పుతిన్–కిమ్ భేటీతో ఎవరికి ఎంత లాభం? అనేదానిపై చర్చ మొదలైంది. కిమ్ రాజ్యంలో భారీస్థాయిలో ఆయుధ పరిశ్రమ వర్ధిల్లుతోంది. ఆయుధాల ఉత్పత్తి సామర్థ్యం అధికంగా ఉంది. మరోవైపు ఉక్రెయిన్‌పై సుదీర్ఘ కాలంగా యుద్ధం కొనసాగిస్తున్న రష్యా వద్ద ఆయుధ నిల్వలు నిండుకున్నాయి. పైగా ఉక్రెయిన్ నుంచి ఎదురు దెబ్బలు తగులుతున్నాయి. అమెరికా సహా పశ్చిమ దేశాలు ఇస్తున్న ఆయుధాలతో ఉక్రెయిన్ సైన్యం రష్యాపై విరుచుకుపడుతోంది. రష్యాకు ఇతర దేశాల నుంచి ఇప్పటికిప్పుడు ఆయుధాలు అందే పరిస్థితి లేదు. అందుకే ఉత్తర కొరియా నుంచి ఆయుధాల సేకరణపై పుతిన్ దృష్టి పెట్టారు. ఉత్తర కొరియా నుంచి రష్యాకు ఆయుధాల ఎగుమతిపై ఇరుదేశాల నడుమ ఇప్పటికే ఫలవంతమైన చర్చలు జరిగినట్లు అమెరికా అనుమానిస్తోంది. తుది ఒప్పందం కోసమే కిమ్ రష్యాకు వెళ్లినట్లు చెబుతోంది. అయితే, దీనిపై రష్యా ఇప్పటిదాకా అధికారికంగా స్పందించలేదు. ఆయుధాల కొనుగోలును నిర్ధారించలేదు. కానీ, రక్షణ రంగంలో ఇరు దేశాల మధ్య సహకారాన్ని మరింత బలోపేతం చేసుకోవాలని రష్యా, ఉత్తర కొరియా తీర్మానించుకున్నాయని చెప్పడానికి ఎన్నో దృష్టాంతాలు కనిపిస్తున్నాయి. రష్యా రక్షణ శాఖ మంత్రి సెర్గీ షోయిగు ఈ ఏడాది జూలైలో ఉత్తర కొరియాలో పర్యటించారు. అక్కడ ఆయుధాల ప్రదర్శనను తిలకించారు. ఆయుధాల ఫ్యాక్టరీలను సైతం సందర్శించినట్లు వార్తలొచ్చాయి. ఉత్తర కొరియాతో కలిసి ఉమ్మడిగా సైనిక విన్యాసాలు చేపడతామని సెర్గీ ప్రకటించారు. అప్పట్లో సెర్గీకి కిమ్ జోంగ్ ఉన్ 'టూర్ గైడ్'గా పనిచేశారు. దగ్గరుండి తమ ఆయుధాలను చూపించారు.

సంతకాన్ని రద్దు చేసుకుంటే!

ఉత్తరకొరియా నుంచి ఆయుధాలు చేతికి అందిన తర్వాత ఉక్రెయిన్‌పై పూర్తిస్థాయి యుద్ధం మొదలవుతుందని పుతిన్ సంకేతాలిస్తున్నారు. అమెరికా కనుసన్నల్లో నడుస్తున్న ప్రపంచ క్రమం(వరల్డ్ ఆర్డర్) మారుతుందని అంటున్నారు. తమ లక్ష్య సాధనకు ఉత్తర కొరియాతో సైనిక సహకారం సైతం కుదుర్చుకోవాలని భావిస్తున్నారు. ఇదిలా ఉండగా, అణ్వస్త్ర ప్రయోగాలు కొనసాగిస్తున్న ఉత్తర కొరియాపై ఐక్యరాజ్య సమితి భద్రతా మండలి ఇటీవల ఆంక్షలు విధించింది. ఉత్తర కొరియాతో ఎవరూ ఆయుధ వ్యాపారం చేయరాదని ఆదేశించింది. ఈ తీర్మానంపై రష్యా కూడా సంతకం చేసింది. తమ సంతకాన్ని రద్దు చేసుకొనే అవకాశం లేకపోలేదని అధికార వర్గాలు తాజాగా తేల్చిచెప్పాయి. భద్రతా మండలిలో శాశ్వత సభ్యదేశమైన రష్యా వెనక్కి తగ్గితే ఉత్తర కొరియాపై ఆంక్షలు బలహీనమవుతాయి. అప్పుడు ఉత్తర కొరియా నుంచి యథేచ్ఛగా ఆయుధాలు కొనుగోలు చేసుకోవచ్చు.

ప్రతిఫలం అదేనా?

రష్యా సంగతి సరే మరి ఉత్తరకొరియాకు దక్కే ప్రయోజనమేంటి?రష్యాకు ఆయుధాలు ఇచ్చి, తిరిగి పొందే ప్రతిఫలం ఏమై ఉంటుంది? కిమ్ రాజ్యంలో ప్రస్తుతం తీవ్ర ఆహార కొరత వేధిస్తోంది. పౌష్టికాహారం అనేది కలలో మాటగా మారింది. అందుకే మానవతా సాయం పేరిట రష్యా నుంచి భారీగా ఆహార ధాన్యాలను తీసుకోవాలని కిమ్ ప్రభుత్వం నిర్ణయానికొచ్చింది. అలాగే సైన్యానికి ఉపయోగ పడే శాటిలైట్లు, అణ్వస్త్ర సహిత జలాంతర్గాములు తయారు చేసే అత్యాధునిక టెక్నాలజీ ఉత్తర కొరియా వద్ద లేదు. ఇలాంటి సాంకేతికతలో రష్యా ముందంజలో ఉంది. ఆయుధాలకు ప్రతిఫలంగా ఈ టెక్నాలజీని రష్యా నుంచి సొంతం చేసుకోవాలని కిమ్ ప్రభుత్వం నిర్ణయానికొచ్చినట్లు సమాచారం. అందుకు పుతిన్ సుముఖంగా ఉన్నట్లు తెలుస్తోంది. స్థూలంగా చెప్పాలంటే పుతిన్ తనకు అవసరమైన ఆయుధాలను ఉత్తర కొరియా నుంచి తీసుకుంటారు. బదులుగా ఆహార ధాన్యాలు, ఆధునిక టెక్నాలజీని కిమ్‌కు అందజేస్తారు. ఇద్దరికీ లాభమేనన్న మాట! ఇక ఒప్పందాలపై సంతకాలు చేయడమే మిగిలి ఉంది.

ట్రంప్‌పై కేసులు రాజకీయ ప్రేరేపితం

వ్లాడివోస్తోక్: అమెరికా మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌పై ఉన్న క్రిమినల్ కేసులన్నీ రాజకీయంగా ప్రతీకారం తీర్చుకునేందుకు పెట్టినవేనని రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ చెప్పారు. అమెరికా వ్యవస్థల పతనానికి ఇది నిదర్శనమన్నారు. అలాంటి దేశం ఇతరులకు ప్రజాస్వామ్యంపై పాఠాలు చెప్పడం మానేయాలన్నారు. అమెరికా అధ్యక్ష పదవిలో ఎవరున్నా రష్యా పట్ల ఆ దేశ వైఖరిలో పెద్దగా మార్పులేవీ రావని కూడా మీడియా సమావేశంలో పుతిన్ అభిప్రాయం వ్యక్తం చేశారు. 2024లో అమెరికాలో అధ్యక్ష ఎన్నికలు జరుగనుండగా ఆయనీ వ్యాఖ్యలు చేయడం ప్రాధాన్యం సంతరించుకుంది. 2024 అధ్యక్ష ఎన్నికలకు గాను ప్రతిపక్ష రిపబ్లికన్ పార్టీ నుంచి బలమైన పోటీదారుగా ఆయన కొనసాగుతున్నారు. ట్రంప్ సైతం రష్యాకు, పుతిన్‌కు సానుకూలంగా మాట్లాడుతుంటారు. మళ్లీ అధ్యక్ష పదవి చేపట్టిన పక్షంలో ఉక్రెయిన్ సంక్షోభాన్ని కొద్ది రోజుల్లోనే పరిష్కరిస్తానని కొద్ది రోజుల క్రితమే ట్రంప్ అన్నారు.

రష్యా గడ్డపై కిమ్

సియోల్: ఉత్తర కొరియా అధినేత కిమ్ జోంగ్ ఉన్ మంగళవారం రష్యాలో అడుగు పెట్టారు. పటిష్టమైన భద్రత మధ్య విలాసవంతమైన బుల్లెట్ ప్రూఫ్ రైలులో సుదీర్ఘంగా ప్రయాణించి రష్యాకు చేరుకున్నారు. ఆయన ఆదివారం మధ్యాహ్నం ఉత్తర కొరియా రాజధాని ప్యాంగ్‌యాంగ్ నుంచి రైలులో బయలుదేరారు. ఉత్తర కొరియా సరిహద్దుకు సమీపంలో రష్యా భూభాగంలో ఉన్న వ్లాదివోస్తోక్ నగరానికి ఉత్తర దిక్కున 60 కిలోమీటర్ల దూరంలోని ఉసురియస్క్ అనే ప్రాంతానికి ఈ రైలు చేరుకున్నట్లు దక్షిణ కొరియా వార్తా సంస్థ వెల్లడించింది. ఈ ప్రాంతంలో కొరియన్ల జనాభా చెప్పుకోదగ్గ సంఖ్యలోనే ఉంది. అయితే, కిమ్ గమ్యస్థానం ఏమిటన్నదానిపై సస్పెన్స్ కొనసాగుతోంది. రష్యా అధ్యక్షుడు పుతిన్‌తో కిమ్ సమావేశం కాబోతున్నారు. ఈ భేటీ ఎప్పుడు, ఎక్కడ జరుగుతుందనేది ఇంకా తెలియరాలేదు. 2019లో ఇరువురు నేతలు వ్లాదివోస్తోక్‌లోనే సమావేశమయ్యారు. ఈసారి కూడా భేటీ అక్కడే జరిగే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. కిమ్ రష్యాకు చేరినట్లు క్రెమ్లిన్ అధికార ప్రతినిధి దిమిత్రీ పెస్కోవ్ నిర్ధారించారు. పశ్చిమ దేశాల ఆంక్షల వల్ల ఒంటరిగా మారిన కిమ్ జోంగ్ ఉన్ రష్యా సహాయాన్ని అర్థిస్తున్నారు.



ఉసురియస్క్‌కు చేరుకున్న కిమ్



కిమ్ ప్రయాణించిన బుల్లెట్ ప్రూఫ్ రైలు

పార్లమెంట్ ఉద్యోగులకు కొత్త యూనిఫామ్!

భారతీయత ఉట్టిపడేలా డ్రెస్‌లు

న్యూఢిల్లీ: పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలకు సమయం సమీపిస్తోంది. ఈ నెల 18 నుంచి 22వ తేదీ వరకూ ఐదురోజులపాటు ఈ సమావేశాలు పార్లమెంట్‌లో నూతన భవనంలో జరుగుతాయి. మొదటి రోజు పాత భవనంలోనే సమావేశం నిర్వహించి, రెండో రోజు (ఈ నెల 19న) వినాయక చవితి సందర్భంగా పూజా కార్యక్రమాలు నిర్వహించి, కొత్త భవనంలోకి లాంఛనంగా అడుగుపెడతారు. కొత్త భవనానికి తరలివెళ్తున్న నేపథ్యంలో పార్లమెంట్ ఉద్యోగులు, సిబ్బంది ధరించే యూనిఫామ్‌ను మార్చాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించినట్లు తెలుస్తోంది. అసలు సిసలైన భారతీయత ఉట్టిపడేలా ఈ దుస్తులు ఉంటాయని సమాచారం. నెహ్రూ జాకెట్లు, ఖాకీ రంగు ప్యాంట్లు ఉంటాయని అధికారులు చెబుతున్నారు. నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫ్యాషన్ టెక్నాలజీ(నిఫ్ట్) నిపుణులు ఈ యూనిఫామ్‌లను డిజైన్ చేస్తున్నారు. ఉన్నతాధికారులు ధరించే నెహ్రూ జాకెట్ ముదురు గులాబీ రంగులో కమలం పువ్వు డిజైన్‌తో ఉంటుందని సమాచారం. ఉభయ సభల మార్షల్స్ డ్రెస్‌ను కూ డా మారుస్తున్నారు. వారు మణిపురి తలపాగాలు ధరిస్తారు.



సెక్యూరిటీ సిబ్బంది ధరించే సఫారీ సూట్లలోనూ మార్పులుంటాయి. సైని కులు ధరించే డ్రెస్ లాంటిది వారికి ఇవ్వబోతున్నారు.

ఎన్నికల గుర్తు ముద్రించడం ఏమిటి?: కాంగ్రెస్

పార్లమెంట్ సిబ్బంది యూనిఫామ్‌పై 'కమలం'ను ముద్రించబోతున్నారంటూ వచ్చిన వార్తలపై కాంగ్రెస్ పార్టీ ఎంపీ మాణిక్కం ఠాగూర్ స్పందించారు. జాతీయ జంతువు పులి, జాతీయ పక్షి నెమలి బొమ్మ కాకుండా కమలం గుర్తు ముద్రించడం ఏమిటని కేంద్ర ప్రభుత్వాన్ని నిలదీశారు. బీజేపీ ఎన్నికల గుర్తు కాబట్టే కమలాన్ని ముద్రిస్తున్నారని ఆరోపించారు. ఈ మేరకు 'ఎక్స్'లో పోస్టు చేశారు.

జీ20 నిర్వహణకు రూ.4,100 కోట్లు

- బడ్జెట్ కేటాయింపులు రూ.990 కోట్లు
- ఖర్చేమో 300 శాతం ఎక్కువ
- మోదీ ప్రభుత్వంపై ప్రతిపక్షాల విమర్శలు

న్యూఢిల్లీ: జీ20 శిఖరాగ్ర భేటీని కేంద్ర ప్రభుత్వం విజయవతంగా నిర్వహించింది. అగ్రరాజ్యం అమెరికా సహా ప్రపంచదేశాలు భారత్‌పై ప్రశంసలు కురిపించాయి. ప్రపంచ స్థాయి నేతగా ప్రధాని మోదీ మరోమారు తన స్థానాన్ని పదిలం చేసుకున్నారు. ఇదే సమయంలో, జీ20 భేటీ కోసం బడ్జెట్ కేటాయింపులకు ఏకంగా 300 శాతం ఎక్కువగా రూ.4,100 కోట్లను ప్రభుత్వం ఖర్చు చేయడంపై కాంగ్రెస్, టీఎంసీ వంటి ప్రతిపక్షాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. 'ఇంత డబ్బు ఎక్కడికి పోయింది? మోదీ వ్యక్తిగత ప్రచారం కోసమే ప్రభుత్వం ఇన్ని కోట్లను ఖర్చుచేసింది. ఈ సొమ్మును బీజేపీ ఎందుకు చెల్లించకూడదు? అని పేర్కొన్నాయి. జీ20 భేటీ నిర్వహణ ఖర్చుల వివరాలను ప్రభుత్వం అధికారికంగా వెల్లడించలేదు. ఈ నెల 4న కేంద్ర విదేశాంగ శాఖ సహాయ మంత్రి మీనాక్షి లేఖి కొన్ని వివరాలను సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో ఉంచారు. జీ20 సదస్సు జరిగిన ప్రాంతంలో అభివృద్ధి పనులకు రూ.4,110.75 కోట్లు ఖర్చయినట్లు ఆమె పేర్కొన్నారు. ఇందులో అత్యధికంగా రూ.3,600 కోట్లను ఇండియా ట్రేడ్ ప్రమోషన్ ఆర్గనైజేషన్(ఐటీపీవో) పేరుతో ఖర్చయ్యాయి. మొత్తం ఖర్చులో ఇది 88 శాతం. ప్రగతి మైదాన్‌లోని ఐటీపీవో సముదాయం నిర్మాణానికైన వాస్తవ వ్యయం రూ.3,600 కోట్లు. దీనికే జీ20 శిఖరాగ్రం సందర్భంగా భారత్ మండపం అనే పేరు పెట్టారు. ఇది శాశ్వత నిర్మాణం, జీ20 బడ్జెట్‌తో దీనికి సంబంధం లేదు. 2017లో ఈ భవనం నిర్మాణానికి బడ్జెట్‌లో కేటాయింపులు రూ.2,254 కోట్లు కాగా, రహదారులు, టన్నెళ్ల నిర్మాణానికి మరో వెయ్యి కోట్ల వరకు ఖర్చు చేసినట్లు అంచనా. ఈ రెండింటిని కలుపుకుంటే భారత్ మండపం అభివృద్ధి వ్యయం రూ.3,200 కోట్లు దాటింది. రహదారులు, టన్నెళ్లు పోను భారత్ మండపం కాంప్లెక్స్ అభివృద్ధికి రూ.2,700 కోట్లు వెచ్చించినట్లు ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో(పీఐబీ) జూలై 26న ప్రకటించింది. వీటన్నిటినీ బేరీజు వేసుకుంటూ జీ20 నిర్వహణకు కేంద్ర ప్రభుత్వం రూ.4,100 కోట్లు దుబారా ఖర్చు చేసిందంటూ ప్రతిపక్షాలు విమర్శలు సంధిస్తున్నాయి. ఈ విమర్శలపై చార్టెర్డ్ అకౌంటెంట్ గోపాల్ కేడియా 'ఇండియా టుడే'తో మాట్లాడుతూ శాశ్వత మౌలిక వసతుల కల్పనకైన ఖర్చును జీ20 నిర్వహణ వ్యయంతో కలిపి చెప్పడం సరికాదన్నారు. ఈ నిర్మాణాలు భవిష్యత్తులో జరిగే మరెన్నో కార్యక్రమాలకు ఉపయోగించుకునేందుకు వీలుందన్నారు. జీ20 షెర్పా అమితాబ్ కాంత్ ప్రతిపక్షాల విమర్శలకు స్పందిస్తూ.. బడ్జెట్‌లో కేటాయించిన రూ.990 కోట్ల కంటే చాలా తక్కువగా జీ20 శిఖరాగ్రానికి ఖర్చు చేసినట్లు చెప్పారు. పూర్తి వివరాలను ప్రభుత్వం త్వరలోనే విడుదల చేస్తుందన్నారు.

'రాజద్రోహం'పై పిటిషన్లు రాజ్యాంగ ధర్మాసనానికి..

న్యూఢిల్లీ: రాజద్రోహం(ఐపీసీ 124ఏ) రాజ్యాంగబద్ధతను సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లన్నిటినీ అయిదుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనానికి రెఫర్ చేస్తున్నట్లు సుప్రీంకోర్టు తెలిపింది. వలస పాలన కాలం నాటి ఐపీసీ, సీఆర్‌పీసీ, ఎవిడెన్స్ యాక్ట్‌ల స్థానంలో రూపొందించిన మూడు బిల్లులను నెల క్రితం కేంద్రం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన విషయం తెలిసిందే. వీటిలో రాజద్రోహం చట్టం రద్దు వంటివి కూడా ఉన్నాయి. ప్రస్తుతం శిక్షాస్మృతికి మార్పులు చేపడుతున్నందున రాజ్యాంగ ధర్మాసనానికి ఈ పిటిషన్ల బదిలీ వాయిదా వేయాలన్న కేంద్రం వినతిని మంగళవారం ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ సారథ్యంలోని ధర్మాసనం తోసిపుచ్చింది.



గుహ నుంచి మార్క్‌ను నిపుణుల బృందం సురక్షితంగా బయటకు తీసుకొస్తున్న దృశ్యం. (ఇన్‌సెట్లో) మార్క్

టర్కీ గుహ నుంచి సురక్షితంగా..

ఇస్తాంబుల్: టర్కీలోని ఓ గుహలో అనారోగ్యంతో చిక్కుకుపోయిన అమెరికా గుహాన్వేషకుడిని సురక్షితంగా బయటకు తీసుకువచ్చారు. అమెరికాలోని న్యూయార్క్‌కు చెందిన మార్క్ డికే(40)గుహాన్వేషణ రంగంలో నిపుణుడు. టర్కీలోని టారస్ పర్వతాల్లో ఉన్న అత్యంత లోతైన మోర్కా గుహల సముదాయం మ్యాప్‌ను రూపొందించే బాధ్యతలను ఆయన తీసుకున్నారు. ఇందులో భాగంగా ఎంతో ఇరుగ్గా, నిట్టనిలువుగా అనేక వరుసలుగా ఉండే గుహ లోపలికి ప్రవేశించారు. సుమారు 3 వేల అడుగుల లోతులో ఉండగా మార్క్ ఈనెల 2న అనారోగ్యం పాలయ్యారు. జీర్ణాశయంలో రక్తస్రావం కారణంగా అక్కడే బేస్ క్యాంపులో కదల్లేని స్థితిలో ఉండిపోయారు. విషయం తెలుసుకున్న టర్కీ స్పెలియోలాజికల్ ఫెడరేషన్ ఆయన్ను కాపాడేందుకు అంతర్జాతీయ సాయం అర్థించింది. వివిధ దేశాలకు చెందిన సుమారు 190 మంది నిపుణులు ఆయన్ను కాపాడేందుకు తరలివచ్చారు. స్థానిక కాలమానం ప్రకారం మంగళవారం ఉదయం 9.37గంటలకు ఆయన్ను బయటకు సురక్షితంగా తీసుకువచ్చినట్లు టర్కీ స్పెలియోలాజికల్ ఫెడరేషన్ తెలిపింది. మార్క్ అనారోగ్యానికి కారణాలు తెలియాల్సి ఉంది.

ప్రధాని మోదీకి ఖలిస్తానీ నేత హెచ్చరిక

న్యూఢిల్లీ: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్, హోం మంత్రి అమిత్ షా, ఎన్ఎస్ఏ అజిత్ దోవల్‌లకు కెనడాలో సిఖ్స్ ఫర్ జస్టిస్(ఎస్ఎఫ్‌జే) వ్యవస్థాపకుడు గురుపత్వంత్ సింగ్ పన్నూ తీవ్ర హెచ్చరికలు చేశాడు. భారత్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసినప్పటికీ కెనడాలోని సర్రే, వాంకోవర్‌లలో వేర్పాటువాదులు రెఫరెండం నిర్వహించిన విషయం తెలిసిందే. అంతకుముందు, పన్నూ సుమారు 5 వేల నుంచి 7 మంది వరకు పాల్గొన్న సమావేశంలో భారత్‌కు వ్యతిరేకంగా రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేశాడు. అందుకు సంబంధించిన ఒక వీడియో విడుదలైంది. 'హర్దీప్ సింగ్ నిజ్జర్‌ను చంపిన వారికిదే నా హెచ్చరిక. మిమ్మల్ని ఘోరంగా చంపాలని పిలుపునిస్తున్నాం. మోదీ, జై శంకర్, దోవల్, షా.. మేం మీకోసం వస్తున్నాం' అని పన్నూ హెచ్చరిస్తున్నట్లుగా ఆ వీడియోలో ఉంది. వాంటెడ్ లిస్ట్‌లో ఉన్న నిజ్జర్ ఈ ఏడాది జూన్‌లో సర్రేలో హత్యకు గురైన విషయం తెలిసిందే. భారత వ్యతిరేక శక్తులు కెనడాలో తిష్టవేశాయని స్వయంగా ఆ దేశ ప్రధాని ట్రూడో ఎదుటే ప్రధాని మోదీ ఆందోళన వ్యక్తం చేసిన రోజే పన్నూ ఈ సమావేశం జరిపారు.

హిందూయిజంతో ప్రపంచానికే ప్రమాదం: రాజా

చెన్నై: హిందూమతంపై తమిళనాడులోని అధికార డీఎంకే పార్టీ నేతల వివాదాస్పద వ్యాఖ్యల పరంపర కొనసాగుతోంది. ఇటీవల సనాతన ధర్మంపై మంత్రి ఉదయనిధి స్టాలిన్, ఆ పార్టీకే చెందిన ఎంపీ ఎ.రాజా హిందూమతాన్ని హెచ్ఐవీ, కుష్టు వ్యాధితో పోల్చారు. తాజాగా ఎంపీ రాజా మరోసారి హిందూమతంపై వివాదాస్పద వ్యాఖ్యలు చేసినట్లుగా ఉన్న వీడియోను తమిళనాడు బీజేపీ చీఫ్ అన్నామలై తాజాగా విడుదల చేశారు. 'కులమనే ప్రపంచ వ్యాధికి హిందూమతానిదే బాధ్యత. భారత్ కులం ఆధారంగా ప్రజలను విడదీస్తోంది. సామాజిక అస్థిరత, ఆర్థిక అసమానతలను సృష్టించేందుకు కులాన్ని వాడుకున్నారు. విదేశాల్లో ఉంటున్న భారతీయులు హిందూయిజం పేరుతో కులాన్ని వ్యాప్తి చేస్తున్నారు. భారత్‌కే కాదు, ప్రపంచానికే హిందూమతం ప్రమాదకరం'అని ఆయన అన్నట్లుగా ఆ వీడియోలో ఉంది.

వాళ్ల నాలుక చీరేయాలి.. కళ్లు పెరికేయాలి

సనాతన ధర్మం వ్యతిరేక వ్యాఖ్యలపై కేంద్ర మంత్రి షెకావత్

జైపూర్: సనాతన ధర్మానికి వ్యతిరేకంగా మాట్లాడేవారి నాలుక చీరేయాలి, కనుగుడ్లు పెరికివేయాలంటూ కేంద్ర మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఆయన వ్యాఖ్యల వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. గత వారం రాజస్తాన్‌లోని బర్మేర్ జిల్లాలో జరిగిన ఎన్నికల ర్యాలీలో మంత్రి మాట్లాడారు. సనాతన ధర్మానికి వ్యతిరేకంగా తమిళనాడు మంత్రి ఉదయనిధి చేసిన వ్యాఖ్యలను ఆయన ప్రస్తావిస్తూ.. 'ఇటువంటి సవాళ్లను మనం ఎదుర్కోవాలి. సనాతన్‌కు వ్యతిరేకంగా మాట్లాడేవారి నాలుక చీరేయాలి. వారి కళ్లు పెరికివేయాలి. సనాతనధర్మానికి వ్యతిరేకంగా మాట్లాడుతూ మన చరిత్ర, సంస్కృతులపై దాడికి ప్రయత్నిస్తున్నారు. ఇటువంటి వారికి అధికారం, పదవులు దక్కనివ్వరాదు'అని పేర్కొన్నారు.

పీవోకే భారత్‌లో కలుస్తుంది: మంత్రి వీకే సింగ్

జైపూర్: పాక్ ఆక్రమిత కశ్మీర్(పీవోకే) తనంతట తానే భారత్‌లో విలీనమవుతుందని కేంద్ర మంత్రి వీకే సింగ్ పేర్కొన్నారు. దీనికి ఎంతో సమయం పట్టదని కూడా ఆయన అన్నారు. రాజస్తాన్‌లో దుసాలో మంగళవారం మంత్రి మీడియాతో మాట్లాడారు. ప్రధాని మోదీ సారథ్యంలో రాజధాని ఢిల్లీలో జీ20 శిఖరాగ్రాన్ని విజయవంతంగా నిర్వహించడం ద్వారా భారత్ తన సత్తా చాటుకుందని చెప్పారు.

మణిపూర్‌లో మళ్లీ హింస.. ముగ్గురు గిరిజనుల హత్య

ఇంఫాల్: మణిపూర్‌లో తాజాగా పెచ్చరిల్లిన హింసాకాండలో ముగ్గురు బలయ్యారు. కాంగ్‌పోక్పి జిల్లా పోస్‌లెన్‌కు చెందిన ముగ్గురు గిరిజనులు మంగళవారం ఉదయం కొండప్రాంత రహదారి మీదుగా లెమకోంగ్ వైపు నడిచివెళ్తుండగా ఇరెంగ్ వద్ద వారిని కొందరు సాయుధులు అడ్డగించారు. ముగ్గురినీ ఆటోమేటిక్ తుపాకులతో కాల్చిచంపారు. తుపాకీ కాల్పుల శబ్దం విన్న వెంటనే భద్రతా సిబ్బంది ఆ ప్రాంతానికి చేరుకున్నారు. రక్తం మడుగులో విగతజీవులుగా పడి ఉన్న ముగ్గురు గ్రామస్తులు వారికి కనిపించారు. ఈ దురాగతానికి నిషేధిత ఉగ్రగ్రూపులే కారణమని అధికారులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

లిబియాలో వరద విధ్వంసం

2,800 మందికిపైగా మృతి

- దాదాపు 10,000 మంది గల్లంతు
- డేనియల్ తుపాను ధాటికి వర్షం వల్ల రెండు డ్యామ్‌లు ధ్వంసం
- పలు నగరాలను ముంచెత్తిన వరద నీరు, బురద

కైరో: లిబియాలో భీకర వరదలు పెను విధ్వంసం సృష్టిస్తున్నాయి. ప్రధానంగా తూర్పు లిబియాలోని డెర్నా నగరం, పరిసర ప్రాంతాల్లో ప్రాణ నష్టం, ఆస్తి నష్టం భారీగా నమోదవుతోంది. కూలిపోయిన ఇళ్ల శిథిలాలను మంగళవారం తొలగిస్తుండగా, వందలాది మృతదేహాలు బయటపడ్డాయి. ఎటు చూసినా శవాల దిబ్బలే కనిపించాయి. వరదల వల్ల 2,800 మందికిపైగా మృతి చెందినట్లు అధికార వర్గాలు వెల్లడించాయి. మరో 10,000 మంది గల్లంతయినట్లు తెలియజేశాయి. మృతుల సంఖ్య మరింత పెరిగే పరిస్థితి కనిపిస్తోంది. కానీ, ఇప్పటిదాకా 1,500 మంది మాత్రమే మరణించారని, 2,000 మంది గల్లంతయ్యారని విమానయాన శాఖ మంత్రి హిషామ్ చికియోత్ ప్రకటించారు. చాలా ఏళ్లుగా నిర్వహణ సరిగ్గా లేని డ్యామ్ కూలిపోవడం వల్ల ఈ ఘోరం జరిగిందని అన్నారు.

బీభత్సానికి కారణమేంటి?

మధ్యధరా సముద్రంలో ఏర్పడిన డేనియల్ తుపాను కారణంగా లిబి యాలో భారీ వర్షాలు కురుస్తున్నాయి. పై నుంచి వచ్చిన వర్షంనీరు కారణంగా ఆదివారం రాత్రి డెర్నా నగర శివార్లలోని రెండు డ్యామ్‌లు, ధ్వంసం కావడం వల్ల వరద ముంచెత్తినట్లు స్థానికులు చెప్పారు. నగరంలో నాలుగింట మూడొంతుల మేర వరద ప్రభావానికి గురి కావడం గమనార్హం. వరద ధాటికి చాలా ఇళ్లు కూలిపోయాయి. బురద కొట్టుకురావడంతో రహదారులపై రాకపోకలు నిలిచిపోయాయి. ప్రభుత్వ అధికారులు సహాయక చర్యల్లో నిమగ్నమయ్యారు. తూర్పు లిబియాలోని అల్–బైదా, అల్–మర్జ్, సౌస, తోబ్రుక్, తాకెనిస్, అల్–బయాదా, బత్తాహ్, బెంఘాజీ తదితర నగరాలు, పట్టణాల్లో సైతం విధ్వంసం జరిగింది. లోతట్టు ప్రాంతాల్లో బురద మేటలు వేసింది. చాలా ఇళ్లు బురదలో కూరుకుపోయాయి. పెద్ద సంఖ్యలో వాహనాలు కొట్టుకుపోయాయి. వరదల వల్ల తీవ్రంగా నష్టపోయిన లిబియాకు అండగా నిలుస్తామని అమెరికా, ట్యునీషియా, అల్జీరియా, తుర్కియే, యూఏఈ తదితర దేశాలు ప్రకటించాయి.



డ్యామ్ బద్దలవడంతో వరదలో డెర్నా సిటీలో కొట్టుకుపోయిన ఇళ్లు

అంతర్గత సంఘర్షణలు

లిబియా గత దశాబ్ద కాలంగా అంతర్గత సంఘర్షణలతో అట్టుడుకుతోంది. ప్రభుత్వ పరిపాలన దాదాపు ఆగిపోయింది. మౌలిక సదుపాయాలు దారుణంగా దెబ్బతిన్నాయి. 2011లో దేశంలో తిరుగుబాటు మొదలైంది. అప్పటి పాలకుడు గడాఫీ అనుమానాస్పద స్థితిలో మరణించారు. అనంతరం రెండు ప్రభుత్వాలు ఏర్పాటయ్యాయి. తూర్పు ప్రాంతంలో ఒకటి, పశ్చిమాన మరో ప్రభుత్వం అధికారం చెలాయిస్తున్నాయి. సైన్యం కూడా రెండుగా చీలిపోయింది. ఒక్కో వర్గానికి ఒక్కో చీలిక వర్గం మద్దతిస్తోంది. కొన్ని తీవ్రవాద సంస్థలు కూడా ప్రభుత్వాలతో అంటకాగుతున్నాయి. డెర్నా సిటీ ఉన్న తూర్పు ప్రాంతంలో ఉగ్రవాద సంస్థ ఇస్లామిక్ స్టేట్ మద్దతు ఉన్న ప్రభుత్వం అధికారంలో కొనసాగుతోంది. రాజధాని ట్రిపోలిలో అంతర్జాతీయ సమాజం గుర్తించిన ప్రభుత్వ ఉంది. ఈ ప్రభుత్వానికి తూర్పు ప్రాంతంపై నియంత్రణ లేనప్పటికీ ఆర్థిక సాయం అందిస్తోంది. వరద సహాయక చర్యలు చేపడుతోంది. లిబియాలో గతంలోనే ఎన్నడూ లేని విపత్కర పరిస్థితి నెలకొన్నాయని తూర్పు పరిపాలనా విభాగం అధినేత హమద్ వ్యాఖ్యానించారు.



ముంబైలో సహ్యాద్రి అతిథి గృహంలో మరాఠా రిజర్వేషన్ల అంశంపై అఖిలపక్షం భేటీ తర్వాత మీడియాతో సీఎం శిందే చిత్రంలో డిప్యూటీ సీఎంలు దేవేంద్ర ఫడ్నవీస్, అజిత్ పవార్



ముంబైలోని బాంద్రాలో నీటిసమస్యను పరిష్కరించాలని కోరుతూ ఎంఎంఆర్‌డీఏ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న శివసేన (యూబీటీ) కార్యకర్తలు, స్థానికులు



ముంబైలో మంగళవారం ప్రజా పంపిణీ వ్యవస్థ కింద రేషన్ పంపిణీ చేయాలని కోరుతూ ఆందోళన చేస్తున్న అఖిల భారత ప్రజాస్వామిక మహిళా సంఘం (ఐద్వా) కార్యకర్తలు

క్లుప్తంగా...

ఏసీబీ వలలో ఇద్దరు ట్రాఫిక్ కానిస్టేబుళ్లు

థానే: ఆటోడ్రైవర్ నుంచి లంచం తీసుకుంటూ ఇద్దరు ట్రాఫిక్ కానిస్టేబుళ్లు అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ)కు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడ్డారు. ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించినందుకుగాను మహాపే ట్రాఫిక్ డివిజన్‌కు చెందిన పోలీసులు ఓ ఆటోడ్రైవర్‌ను పట్టుకుని అతడి ఆటోను సీజ్ చేశారు. ఆటోను విడుదల చేయాలంటే రూ.5000 లంచంగా ఇవ్వాలని ఇద్దరు ట్రాఫిక్ కానిస్టేబుళ్లు ప్రవీణ్ రాథోడ్ (33), నామ్‌డియో గధేకర్ (35)లు ఆటోడ్రైవర్‌ను ఒత్తిడి చేశారు. అయితే ఆటోను అక్కడే వదిలి వచ్చేసిన ఆటోడ్రైవర్ ఏసీబీకి సమాచారమిచ్చాడు. దీంతో ఆటోను విడిపించుకునేందుకు ట్రాఫిక్ కానిస్టేబుళ్లతో రూ.2000లకు ఒప్పందం కుదిరినట్లు నాటకమాడాడు. సోమవారం వారికి డబ్బులిస్తుండగా నవీ ముంబైకు చెందిన ఏసీబీ అధికారులు దాడి చేసి ఇద్దరు కానిస్టేబుళ్లను రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు.

ఘనంగా నీలకంఠేశ్వర స్వామి ఊరేగింపు




సోలాపూర్: భవానీపేట్ గొంగడి బస్తీ ప్రాంతంలోని నీలకంఠ సమాజం కులదైవం శ్రీ నీలకంఠేశ్వర స్వామి ఉత్సవమూర్తి ఊరేగింపు రథోత్సవం ఘనంగా నిర్వహించారు. శ్రావణ మాసం చివరి వారం నిమిత్తంగా సమాజానికి చెందిన మహిళలు అధిక సంఖ్యలో కలశాలు నెత్తిన పెట్టుకొని జలకుంభయాత్ర చేపట్టారు. తమ ఆరాధ్యదైవం శ్రీ నీలకంఠేశ్వర స్వామికి జలాభిషేకంతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఉత్సవమూర్తికి పూజలు నిర్వహించి రథోత్సవ ఊరేగింపును నిర్వహించారు. ఈ ఉత్సవానికి హాజరైన మాజీ మేయర్ మహేష్ కోటే స్థానిక కార్పొరేటర్ సురేష్ పాటిల్ పట్టణ బీఆర్ఎస్ కన్వీనర్ దశరథ్ గోపీలను నీలకంఠ సమాజం తరపున బీఆర్ఎస్ నాయకుడు కార్పొరేటర్ నాగేష్ వల్యాల్ ఘనంగా సన్మానించారు. జలకుంభ శోభాయాత్రలో విజయలక్ష్మి బత్తిని ప్రకాష్ బత్తిని మార్గల్ కృష్ణారి చింతలతో సహా నీలకంఠ యోగ సమాజం అధ్యక్షుడు నిఖిల్ బత్తిని భాస్కర్ తదితరులు రథోత్సవ ఊరేగింపులో పాల్గొన్నారు.

హనుమాన్ నగర్లో రేణుక ఎల్లమ్మ బోనాలు



శ్రీ శ్రీ రేణుక ఎల్లమ్మ దేవాలయం ట్రస్టు ఆధ్వర్యంలో హనుమాన్‌నగర్‌లో రేణుక ఎల్లమ్మ అమ్మవారికి బోనాల ఉత్సవాలు నిర్వహించారు. ఈసందర్భంగా హనుమాన్‌నగర్‌లో నివాసముంటున్న తెలుగు ప్రజలు అమ్మవారికి బోనాలను సమర్పించారు. న్యూలింక్ రోడ్డు నుంచి బోనాలను ఊరేగింపుగా తీసుకెళ్లి బంగూర్‌నగర్‌లో ఉన్న రేణుక ఎల్లమ్మ దేవాలయానికి చేరుకున్నారు. అక్కడ కొలువుదీరిన అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అమ్మవారికి బోనాలను సమర్పించారు. పట్టు వస్త్రాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో ట్రస్టు అధ్యక్షుడు కొండ బుచ్చయ్య, కార్యదర్శి బక్క అంజయ్య గౌడ్, కోశాధికారి గాదె మల్లేష్, ఉపాధ్యక్షులు బీమగాని మల్లేష్, తండ రాజు, కొయ్యడ గోపీ తదితరులు పాల్గొన్నారు.

8 నెలలు..685 ఆత్మహత్యలు



- అత్యధికంగా బీడ్ జిల్లాలో రైతుల బలవన్మరణాలు
- మహారాష్ట్రలో కొనసాగుతున్న వర్షాభావ పరిస్థితులు
- పండిన పంటలకు లభించని గిట్టుబాటు ధర
- రాజకీయ నేతలు, రైతులు, అధికారుల్లోనూ పెరుగుతోన్న ఆందోళన

సాక్షి ముంబై: మరాఠ్వాడాలో రైతుల ఆత్మహత్యలు ఆగడంలేదు. వర్షాభావంతోపాటు పంటలు పండకపోవడంతోపాటు పండించిన పంటలకు గిట్టుబాటు ధర లభించక తదితర కారణాల వల్ల రైతులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. ముఖ్యంగా అధికారుల నుంచి అందిన వివరాల మేరకు 2023 జనవరి 1వ తేదీ నుంచి ఆగస్టు 31వ తేదీ వరకు ఒక్క మరాఠ్వాడాలోనే 685 మంది రైతులు ఆత్మహత్యలకు పాల్పడ్డారు. ఈ అంశం మరోసారి అధికారులతోపాటు రాజకీయ నేతల్లో ప్రజల్లో తీవ్ర ఆందోళన కలిగించేల చేసింది. ఇప్పటి వరకు పరిస్థితి ఇలా ఉండగా మరోవైపు రాష్ట్రంలో ఈసారి కూడా వర్షాలు కూడా ఊహించినంత కురవడంలేదు. జూన్‌లో ప్రారంభమయ్యే వర్షాలు ఈసారి ఆలస్యంగా ప్రారంభమయ్యాయి. మరోవైపు ప్రస్తుతం వర్షాలు లేక అనేక ప్రాంతాల్లో ఇప్పటికే నాట్లు రెండోసారి వేశారు. అయితే ఇప్పుడు కూడా వర్షాభావ పరిస్థితులు నెలకొనడంతో రాబోయే రోజుల్లో పరిస్థితి ఇంకెలా ఉండనుందనే విషయంపై రైతులతోపాటు అధికారులలో ఆందోళన వ్యక్తమవుతోంది. వర్షాభావం కారణంగా పలు ప్రాంతాల్లో సాగు నీరే కాదు తాగునీటికి కూడా తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. దీంతో వేసిన పంటలకు నష్టం వాటిల్లి రైతులు అప్పుల్లో కూరుకుపోతున్నారు. దీంతో పశువులతోపాటు రైతు కుటుంబీకుల పోషణ కష్టతరంగా మారింది. దీంతో అనేకమంది కుటుంబాన్ని పోషించలేక, వ్యవసాయం కోసం చేసిన అప్పులు తీర్చలేక, పిల్లల పెళ్లిళ్లు, చదువులు పూర్తిచేయలేక నిరాశకు గురవుతున్నారు. దీంతో రైతులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని చెబుతున్నారు. ఇలాంటి నేపథ్యంలో రైతుల ఆత్మహత్యలకు అడ్డుకునేందుకు ప్రభుత్వం వారిని ఆదుకోవాల్సిన అవసరం ఉంది. వారికోసం ప్రత్యేక ప్రణాళికలు రూపొందించి కరువు నివారణకు తగు చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది.

బీడ్‌లో అత్యధికంగా ఆత్మహత్యలు...

మహారాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి ధనుంజయ్ ముండే సొంత జిల్లా బీడ్ జిల్లాలో అత్యధికంగా రైతులు ఆత్మహత్యలకు పాల్పడ్డారు. మరాఠ్వాడలో గడిచిన ఎనిమిది నెలల్లో మొత్తం 685 మంది రైతులు ఆత్మహత్యలకు పాల్పడగా వీరిలో 186 మంది కేవలం బీడ్ జిల్లాలోని రైతులున్నారు. మరోవైపు బీడ్ జిల్లా తర్వాత 113 మంది ఆత్మహత్యలతో ఉస్మానాబాదు రెండవస్థానంలో ఉంది. ఇలా దాదాపు మరాఠ్వాడాలోని అన్ని జిల్లాల్లో గత ఎనిమిది నెలల్లో 50 మందికిపైగా రైతులు ఆత్మహత్యలకు పాల్పడగా కేవలం హింగోలి జిల్లాలో 22 మంది రైతులు ఆత్మహత్యలకు పాల్పడ్డారు. ఈ సంఘటనలు తీవ్ర ఆందోళనలను రేకెత్తించేలా చేస్తున్నాయి. మరోవైపు గత మూడేళ్లను పరిశీలించినట్టయితే గత మూడేళ్లలో 2,882 మంది ఆత్మహత్యలకు పాల్పడ్డారు. మరోవైపు గతేడాది జనవరి 1వ తేదీ నుంచి డిసెంబరు 31వ తేదీ వరకు మరఠ్వాడాలో 1,022 మంది ఆత్మహత్యలు చేసుకున్నారు. ఇలాంటి నేపథ్యంలో రాబోయే రోజుల్లో వర్షాలు కురవనట్టితే మరోసారి వేసిన పంటలకు నష్టం వాటిల్లే అవకాశాలున్నాయి. వీటిని దృష్టిలో ఉంచుకుని రైతులకు ప్రభుత్వం భరోసా ఇవ్వాలని కోరుతున్నారు.

మరాఠ్వాడాలోని జిల్లాల వారీగా 2023 జనవరి 1 నుంచి ఆగస్టు 31వ తేదీ వరకు రైతుల ఆత్మహత్యల వివరాలు

జిల్లా పేర్లు	ఆత్మహత్యలు చేసుకున్న రైతుల సంఖ్య
బీడ్	186
ఉస్మానాబాద్	113
నాందేడ్	110
ఔరంగబాదు	95
పర్బణీ	58
లాతూరు	51
జాల్నా	50
హింగోలి	22
మొత్తం	685

శరద్‌పవార్‌ను కలసిన ఉద్ధవ్ ఠాక్రే



ముంబై: ఎన్సీపీ వ్యవస్థాపక అధ్యక్షుడు శరద్ పవార్‌ను మంగళవారం శివసేన పార్టీ (యూబీటీ) అధ్యక్షుడు ఉద్ధవ్ ఠాక్రే ముంబైలోని సిల్వర్ ఓక్ నివాసంలో భేటీ అయ్యారు. సుమారు గంటన్నరసేపు వీరిద్దరూ మాట్లాడుకున్నారు. అయితే వీరి భేటీలో ఏయే అంశాలు చర్చించారన్న వివరాలు బయటకు ఇద్దరు నేతలు వెల్లడించలేదు. కాగా, ఎన్సీపీ మహారాష్ట్ర అధ్యక్షుడు జయంత్ పాటిల్, శివసేన (యూబీటీ) రాజ్యసభ సభ్యుడు సంజయ్ రౌత్ కూడా ఈ భేటీలో పాల్గొన్నారు. విపక్షమైన మహా వికాస్ అఘాడీ (ఎంవీఏ)లో ఎన్సీపీ, శివసేన (యూబీటీ), కాంగ్రెస్ పార్టీలు భాగస్వాములేనని తెలిసిందే.

జెడ్పీ ఉద్యోగుల విధుల బహిష్కరణ



సోలాపూర్: ఉపాధ్యాయుల భర్తీ ప్రక్రియ ధనుగర్ రిజర్వేషన్ల మేరకే చేపట్టాలని కోరుతూ ధనుగర్ సమాజానికి చెందిన కార్యకర్తలు సోమవారం సీఈఓ కార్యాలయాన్ని ధ్వసం చేసినందుకు ఇందుకు నిరసనగా మంగళవారం జిల్లా పరిషత్ అధికారులు సిబ్బంది స్వచ్ఛందంగా విధులు బహిష్కరించారు. అదేవిధంగా 11 తాలూకా సమితి కార్యాలయాలు కూడా ఉద్యోగస్తులందరూ నిరసనలో పాల్గొనడం వల్ల విధులు స్తంభించిపోయాయి. ఇదిలా ఉండగా సీఈఓ కార్యాలయాన్ని ధ్వంసం చేసిన నలుగురిని పోలీసులు అరెస్టు చేశారు. ఈ ఘటనలో ఎనిమిది మందిపై కేసులు నమోదు చేశారు. ఉదయం నుంచి ఉద్యోగులందరూ జిల్లా పరిషత్ ఆవరణలోకి చేరుకున్నారు. కానీ, తమ కార్యాలయాలలోకి వెళ్లలేదు. అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రాన్ని సమర్పించారు. దాడికి పాల్పడిన వారిపై అలాగే వారికి అండగా నిలిచిన వారిపై కఠినంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. జెడ్పీ సీఈఓ మనీషా హవాళే నేడు రోజు మాదిరిగానే కార్యాలయంలో పాల్గొని విధులు నిర్వహించారు. కానీ ద్వితీయ శ్రేణి నుంచి కింది స్థాయి సిబ్బంది వరకు ఈ నిరసనలో పాల్గొన్నారు. తరచూ నిత్యం ప్రజలతో సందడిగా ఉండే కార్యాలయాలు నేడు ఉదాసీనంగా దర్శనమిచ్చాయి. మళ్లీ ఇలాంటి దాడులు పునరావృతం అయితే ఆందోళనలు మరింత తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు.

దివ్యాంగులకు రేషన్ కార్డులు

- ఫలించిన లాల్‌బావుట దివ్యాంగ శ్రామిక సంఘటన పోరాటం



మంత్రి భుజ్‌బల్‌కు వినతి పత్రం సమర్పిస్తున్న నర్సయ్య

సోలాపూర్: ప్రభుత్వ పరంగా కేటాయింపు జరిగినప్పటికీ సోలాపూర్ పట్టణం, జిల్లాలోని దివ్యాంగులైన లబ్ధిదారులకు పసుపు రంగు రేషన్ కార్డు లభించడం లేదు. ఇందుకోసం లాల్‌బావుట దివ్యాంగ శ్రామిక సంఘటన గత మూడేళ్లుగా పోరాటాలు చేసింది. ఎట్టకేలకు మంగళవారం మాజీ శాసనసభ్యులు నర్సయ్య ఆడం నేతృత్వంలోని బృందం పౌర సరఫరాల శాఖ మంత్రి చగన్ భుజ్‌బల్ ముంబైలో కలుసుకుని ఈ సమస్యకు పరిష్కారాన్ని చూపించారు. జాతీయ ఆహార భద్రత 2013 అనుసరించి రేషన్ కార్డు ద్వారా ఆహార ధాన్యాలు లబ్ధి పొందే కుటుంబంలో కుటుంబ సభ్యులలో దివ్యాంగు వ్యక్తి కూడా ఉంటాడు. అయితే ఒకే కుటుంబం కనుక దివ్యాంగుడికి ప్రభుత్వం ద్వారా అదనంగా లభించే ఆహార ధాన్యాలు లభించడంలో నిర్లక్ష్యానికి గురవుతున్నారనే ఉద్దేశంతో సమస్యను మంత్రి ముందుకు తీసుకు వెళ్లారు. ప్రభుత్వం జారీ చేసిన జీవో ప్రకారం దివ్యాంగులకు స్వతంత్రంగా రేషన్ కార్డు సమకూర్చాలని, ఆహార ధాన్యాలు అందించాలని ఉన్నప్పటికీ కార్డులు జారీ చేయడంలో అధికారులు నిర్లక్ష్యాన్ని, తదితర సమస్యలను మంత్రికి వివరించారు. గత మూడేళ్లుగా సుమారు రేషన్ కార్డు కావాలని 600 మంది వికలాంగులు దరఖాస్తులు పెట్టుకున్న సంగతి, అవి పెండింగ్‌లో ఉన్న సంగతితో పాటు రూ. 15 వేలలోపు ఆదాయ ధ్రువపత్రం జత పరచనట్లైతే పసుపు రంగు రేషన్ కార్డు జారీ చేయకూడదని జిల్లా పౌరసరఫరాల కార్యాలయం అధికారులు నిబంధన పెట్టారని మంత్రికి తెలిపారు. దీంతో మంత్రి సోలాపూర్ పౌరసరఫరాల జిల్లా అధికారికి ఫోన్ చేసి ఆదాయ ధ్రువపత్రంలో రూ.15 వేల పరిమితిని రూ.59 వేలకు, రూరల్ ప్రాంతాలవారి కోసం రూ.44,000 కి పెంచాలని ఆదేశించారు. అదేవిధంగా లాల్‌బావుట దివ్యాంగ శ్రామిక సంఘటన తరుపున దాఖలు చేసిన 600 లబ్ధిదారుల రేషన్ కార్డులను వెంటనే జారీ చేయాలని కూడా అధికారులను ఆదేశించారు. దీంతో మూడేళ్లుగా పెండింగ్‌లో ఉన్న దివ్యాంగుల సమస్యను మంత్రి పరిష్కరించడంతో నరసయ్య ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. లాల్ బహుట దివ్యాంగ శ్రామిక సంఘటన అధ్యక్షురాలు సునీత అంజికానే కార్యదర్శి ఇలియాస్ సిద్ధికి ఉపాధ్యక్షుడు అసిఫ్ పటాన్, కోశాధికారి అఖిల్ షేక్ సభ్యులు సుధీర్ చికెన్ సునీత హు చే నరేష్ దుగానే తదితరులు పాల్గొన్నారు

నలుగురు ఐసిస్ సానుభూతిపరులపై నగదు రివార్డు

- ప్రకటించిన ఎన్ఐఏ
- ఒక్కొక్కరిపై రూ.3 లక్షలు

ముంబై: పుణె మాడ్యూల్ కేసుకు సంబంధించి తప్పించుకుని తిరుగుతున్న నలుగురు ఐసిస్ ఉగ్రవాద సంస్థ సానుభూతిపరులపై జాతీయ దర్యాప్తు సంస్థ(ఎన్ఐఏ) నగదు రివార్డును ప్రకటించింది. ఒక్కొక్కరి తలపై రూ.3 లక్షలు చొప్పున నగదు రివార్డును ప్రకటించింది. కాగా, తప్పించుకుని తిరుగుతున్న ఈ నలుగురు సానుభూతిపరులను మహమ్మద్ షానవాజ్ షఫీయుజ్మా ఆలం అలియాస్ అబ్దుల్లా, రిజ్వాన్ అబ్దుల్ హాజీ అలీ, అబ్దుల్లా ఫయాజ్ షేక్ అలియాస్ దియాపర్‌వాలా, తల్హా లియాకత్ ఖాన్‌గా అధికారులు గుర్తించారు. కాగా, వీరిని పట్టించినవారికి లేదా వీరి గురించి సమాచారం అందించనవారికి నగదు బహుమతి ఇస్తామని ఎన్ఐఏ అధికారులు మంగళవారం మీడియాకు వెల్లడించారు. అయితే సమాచారం అందించిన వారిని లేదా పట్టించిన వారి గురించి సమాచారాన్ని గోప్యంగా ఉంచుతామని కూడా అధికారులు హామీనిచ్చారు. మహారాష్ట్రలోని పుణెకు సంబంధించి ఐసిస్ ఉగ్రవాద సంస్థ కార్యకలాపాల్లో పాల్గొన్న, దాని భావజాలాన్ని ప్రచారం చేసిన కొంతమంది వ్యక్తులను ఎన్ఐఏ ఇటీవల అరెస్టు చేసింది. ఈ పుణె మాడ్యూల్ కేసుకు పరిశోధనలో భాగంగా ఎన్ఐఏ చేసిన దాడుల్లో పేలుడు పదార్థాలు, కుట్రకు సంబంధించిన ప్రణాళిక పత్రాలను ఎన్ఐఏ స్వాధీనం చేసుకుంది. ఎలాగైనా దేశంలో శాంతిభద్రతలను క్షీణింపచేయాలని ఐసిస్ కుట్రను ఎన్ఏఐ భగ్నం చేసిన సంగతి తెలిసిందే. కాగా, పుణె మాడ్యూల్‌కు సంబంధించిన కేసులో షామిల్ షాక్విబ్ నచన్ అనే వ్యక్తిని అరెస్టు చేయగా అతడి ఇంట్లో ఐసిస్‌కు చెందిన మెటీరియల్ లభ్యమైంది. జుల్ఫికర్ అలీ బారోడవాలా, మహమ్మద్ ఇమ్రాన్ ఖాన్, మహమ్మద్ యునస్ సకి, సిమాబ్ నసీరుద్దీన్ కాజీ, అబ్దుల్ కదిర్ పఠాన్ అనే ఐదుగురు వ్యక్తులతో కలసి నచన్ ఐసిస్‌కు పనిచేస్తున్నట్లు ఎన్ఐఏ అధికారులు తెలిపారు. వీరితోపాటు మరో నలుగురు వ్యక్తులకు కూడా ఐసిస్ సానుభూతిపరులుగా ఎన్ఐఏ గుర్తించింది.

నగరాన్ని వదిలినా..పొగ పెడుతున్నారు



రద్దీ నుంచి దూరంగా...

భివండీ : ఠాణే, ముంబై తదితర పరిసర ప్రాంతాల నుండి చెత్తను భివండీలోని అంజూర్ దివా గ్రామ శివారుల్లో డంపింగ్ చేసి తగలపెడుతుండటంతో వాయు కాలుష్యం పెరిగిపోతోంది. అక్కడ్నుంచి వెలువడుతున్న పొగతో స్థానిక ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. ఈ కాల్యుషానికి సంబంధించి స్థానిక ప్రజలు కేంద్ర పంచాయతీరాజ్ శాఖ సహాయక మంత్రి కపిల్ పాటిల్‌తో పాటు కాలుష్య నియంత్రణ మండలి, స్థానిక గ్రామ పంచాయతీ, పోలీస్ శాఖకు లిఖితపూర్వకంగా నివేదిక నిచ్చినప్పటికీ ప్రభుత్వయంత్రాంగం ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తపరుస్తున్నారు.

ఇక్కడే ఇళ్ల కొనుగోలు...

భివండీలోని అంజూర్ దివా గ్రామ పరిధిలో ప్రకృతి వనాలు, మహామార్గం వసతి ఉండటం వల్ల ఇక్కడికి పెద్దపెద్ద బిల్డర్లు హౌసింగ్ ప్రాజెక్టులను చేపడుతున్నారు. ఈ ప్రాంతాన్ని అప్పర్ ఠాణేగా పిలువబడే లోధా హౌసింగ్ ప్రాజెక్ట్ రావడంతో ఇందులో భివండీతో పాటు చుట్టుప్రక్కల ఉన్న బడా వ్యాపారస్తులు, సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు, డాక్టర్లు, ఉద్యోగస్తులు భారీ డబ్బులు చెల్లించి ఇళ్లు కొనుక్కొని ఇక్కడే స్థిరపడ్డారు. గ్రామంలోని కొన్ని సంఘాల అభ్యర్థులు తమ ఆర్థిక ప్రయోజనాల కోసం చెత్తను హౌసింగ్ ప్రాజెక్ట్ ముందు డంప్ చేస్తుండటంతో ఈ ప్రదేశంలో చెత్తకుప్పలు భారీస్థాయిలో ఏర్పడ్డాయి. వీటికి నిప్పటించడంతో గ్రామ పరిసర ప్రాంతంలో గల పాఠశాలలకు, అప్పర్ ఠాణే ప్రాజెక్ట్ వైపు పొగ వ్యాపిస్తోంది. తద్వారా ప్రజలు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు. రద్దీ నుంచి, కాలుష్యరహితంగా ఉండేందుకు ఠాణా, ముంబైలాంటి ప్రాంతాలను నుంచి బయటకు వచ్చి ఖరీదైనప్పటికీ అందమైన ప్రకృతి ప్రదేశంలో స్థిర పడటానికి అంజూర్ దివాలో ఇళ్లు కొనుక్కున్నామని స్థానిక ప్రజలు చెబుతున్నారు. అయితే కొంతమంది ప్రజలు బయట ప్రాంతాల నుంచి చెత్తను అక్రమంగా గ్రామ శివార్లలో వేయడంతో దుర్గంధంతో పాటు పొగ కాలుష్యంతో తీవ్రంగా ఇబ్బంది పెడుతోంది. దీనిపై ప్రభుత్వ యంత్రాంగంతో పాటు గ్రామ పంచాయతీ, పోలీసు విభాగం, కాలుష్య విభాగం, స్థానిక కేంద్రమంత్రికి విన్నతి పత్రాలను అందించినప్పటికీ ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇక్కడి ప్రజారోగ్య సమస్యలు తలెత్తుతున్నాయని లోధా అప్పర్ ఠాణే హౌసింగ్ ప్రాజెక్ట్ నివాసి సంతోశ్ నార్వేకర్ పేర్కొన్నారు. ఇప్పటికైనా డంపింగ్‌పై చర్యలు తీసుకోవలసిందిగా కోరుతున్నారు.

విగ్రహాలపై ముద్ర నిర్ణయం రద్దు: బీఎంసీ



దాదర్: వినాయకుడి విగ్రహం ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ (పీఓపీ)తో లేదా మట్టితో తయారు చేసిందో లేదో గుర్తించేందుకు విగ్రహం వెనుకభాగంలో స్టాంప్ వేయాలన్న నిర్ణయాన్ని బృహన్ముంబై మున్సిపల్ కార్పొరేషన్ (బీఎంసీ) ఉపసంహరించుకుంది. ఈ మేరకు బీఎంసీ అధికారులు మంగళవారం మీడియాకు వెల్లడించారు. గణేశోత్సవాలు సమీపిస్తున్న నేపథ్యంలో విగ్రహాల వెనుక ముద్ర వేయాలని బీఎంసీ తీసుకున్న నిర్ణయంపై సర్వత్రా వ్యతిరేకత రావడంతో బీఎంసీ ఈ నిర్ణయాన్ని తీసుకుంది. దీంతో బీఎంసీ తాజా నిర్ణయం పట్ల విగ్రహ తయారీదారులు, భక్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యం..

పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యతనిస్తూ గణేశోత్సవాలు జరుపుకోవాలని గతంలోనే బీఎంసీ ఇళ్లలో విగ్రహాలు ప్రతిష్ఠించుకునే భక్తులకు, సార్వజనిక గణేశోత్సవ మండళ్ల పదాధికారులకు సూచించింది. అందులోభాగంగా పీఓపీతో తయారుచేసిన విగ్రహాల వినియోగాన్ని తగ్గించాలని మట్టితో తయారుచేసిన విగ్రహాలను ప్రతిష్ఠించుకోవాలని స్పష్టం చేసింది. దశలవారీగా పీఓపీతో తయారుచేసిన విగ్రహాలపై నిషేధం విధిస్తూ వస్తోంది. కానీ ఇప్పటికి అనేక వర్క్‌షాపుల్లో పీఓపీతో విగ్రహాలు చేయారు చేస్తున్నారు. మట్టితో తయారుచేసిన విగ్రహాలతో పోలిస్తే పీఓపీతో తయారుచేసిన విగ్రహాలు చాలా చౌక ధరకే లభిస్తాయి. దీంతో భక్తులు కూడా చౌక ధరకు లభించే పీఓపీతో తయారుచేసిన విగ్రహాలనే ఎక్కువ శాతం కొనుగోలు చేస్తున్నారు. కానీ, సముద్రంలో నిమజ్జనం చేసిన తర్వాత మట్టితో తయారుచేసిన విగ్రహాలు కొన్ని గంటల్లోనే కరిగిపోతాయి. పీఓపీతో తయారుచేసిన విగ్రహాలు కరిగిపోవడానికి కొన్ని రోజుల సమయం పడుతుంది. అంతేగాకుండా పర్యావరణానికి హాని కూడా జరుగుతుందని గ్రహించిన బీఎంసీ మట్టితో తయారైన విగ్రహాలకే ప్రాధాన్యతనివ్వాలని సూచించింది. వర్క్‌షాపుల్లో పీఓపీతో, మట్టితో తయారుచేసిన విగ్రహాలు చూడటానికి ఒకే విధంగా ఉంటున్నాయి. ఏది పీఓపీ, ఏది మట్టితో తయారుచేసిన విగ్రహమో తెలుసుకోలేకపోతున్నారు. దీంతో భక్తులు మోసపోయే ప్రమాదం కూడా ఉంది. దీంతో విగ్రహం వెనుకభాగంలో ముద్ర వేయాలని బీఎంసీ ఇటీవల అన్ని వర్క్‌షాపు యజమానులకు ఆదేశాలు జారీ చేసింది. కానీ బీఎంసీ తీసుకున్న నిర్ణయం భక్తుల మనోభావాలు దెబ్బతీసే విధంగా ఉన్నాయంటూ సాధారణ భక్తులు, బృహన్ముంబై సార్వజనిక గణేశోత్సవ సమన్వయ సమితి, ఇతర రంగాల నుంచి తీవ్ర వ్యతిరేకత వచ్చింది. మొదటి పూజలందకునే పవిత్రమైన గణేశ్ విగ్రహానికి ముద్రవేయడమేంటని కొందరు ప్రశ్నిస్తున్నారు. విగ్రహం పీఓపీ లేదా మట్టితో తయారైందా..? గుర్తించడానికి మరో ప్రత్యామ్నాయమార్గాన్ని అన్వేషించాలని కొందరు భక్తులు బీఎంసీకి సూచించారు. కానీ ఈ వివాదం మరింత ముదరకముందే బీఎంసీ తన నిర్ణయాన్ని పునః సమీక్షించింది.

బ్రహ్మోత్సవాలకు సీఎం జగన్‌కు ఆహ్వానం



సాక్షి, అమరావతి/తిరుమల: తిరుమలలో ఈ నెల 18 నుంచి 26 వరకు జరగనున్న శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాలకు హాజరుకావాలని సీఎం జగన్‌ను టీటీడీ ఆహ్వానించింది. తాడేపల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రిని డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ, టీటీడీ చైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి, ఈవో ఏవీ ధర్మారెడ్డి కలిసి బ్రహ్మోత్సవాల ఆహ్వాన పత్రికను, శ్రీవారి శేషవస్త్రం, ప్రసాదాలను అందజేశారు. అనంతరం సీఎంకు వేద పండితులు ఆశీర్వచనమిచ్చారు.

సీఐడీ కేసు కొట్టేయండి

హైకోర్టులో చంద్రబాబు పిటిషన్.. నేడు విచారణ

సాక్షి, అమరావతి: స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ కుంభకోణానికి సంబంధించి సీఐడీ తనపై నమోదు చేసిన కేసును కొట్టేయాలని కోరుతూ మాజీ సీఎం చంద్రబాబు మంగళవారం హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. సీఐడీ నమోదు చేసిన కేసు ఆధారంగా తనకు రిమాండ్ విధిస్తూ ఏసీబీ ప్రత్యేక న్యాయస్థానం ఇచ్చిన ఉత్తర్వులను సైతం కొట్టేయాలని అభ్యర్థించారు. ఈ వ్యాజ్యం తేలేంత వరకు స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణంపై ఏసీబీ కోర్టులో విచారణను నిలిపేస్తూ మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వాలని కూడా కోరారు. ఈ వ్యాజ్యంపై న్యాయమూర్తి జస్టిస్ కొనకంటి శ్రీనివాసరెడ్డి బుధవారం విచారణ జరపనున్నారు. మంగళవారం హైకోర్టు విచారణ మొదలు కాగానే చంద్రబాబు తరపున న్యాయవాది దమ్మాలపాటి శ్రీనివాస్ న్యాయమూర్తి జస్టిస్ శ్రీనివాసరెడ్డి ముందు ఈ వ్యాజ్యం గురించి ప్రస్తావించారు. అవినీతి నిరోధక చట్టంలోని సెక్షన్ 17ఏ ప్రకారం పబ్లిక్ సర్వెంట్‌పై కేసు నమోదు చేయాలన్నా, విచారణ జరపాలన్నా గవర్నర్ నుంచి ముందస్తు అనుమతి తప్పనిసరని, అలాంటి అనుమతి లేకుండానే కేసు నమోదు చేసి సీఐడీ అధికారులు చంద్రబాబును అరెస్ట్ చేశారని ఆయన కోర్టుకు నివేదించారు. సీఐడీ చట్టవిరుద్ధంగా వ్యవహరించిందన్నారు. అందువల్ల ఈ వ్యవహారంపై అత్యవసరంగా విచారణ జరపాలని, లంచ్‌మోషన్ రూపంలో అత్యవసర పిటిషన్ దాఖలుకు అనుమతినివ్వాలని కోరారు. న్యాయమూర్తి స్పందిస్తూ, ఈ వ్యాజ్యంపై బుధవారం విచారణ జరుపుతానని స్పష్టం చేశారు.

ఏసీబీ కోర్టు న్యాయమూర్తికి భద్రత పెంపు

సాక్షి, అమరావతి : ఏసీబీ కోర్టు న్యాయమూర్తి జస్టిస్ బి.హిమబిందుకు ప్రభుత్వం భద్రత పెంచింది. స్కిల్ కుంభకోణంపై నమోదైన కేసులో టీడీపీ అధినేత చంద్రబాబుకు రిమాండ్ విధించగా.. హౌస్ రిమాండ్ పిటిషన్‌ను తోసిపుచ్చారు. ఈ నేపథ్యంలో.. జస్టిస్ హిమబిందుకు 4+1 భద్రత కల్పించారు.

మా పేరుతో.. పచ్చి మోసం

'స్కిల్' 100% ఫ్రాడ్.. ఈ-మెయిల్‌లో తేల్చేసిన 'సీమెన్స్'

- మేం ఒప్పందమే చేసుకోలేదు... అసలు మాకు సంబంధం లేదు
- మా పేరును వాడుకుంటూ మోసపూరిత ఒప్పందం
- కుట్రతోనే రూ.3,300 కోట్ల ప్రాజెక్ట్‌గా చూపించారని వెల్లడి
- కొల్లగొట్టాం... కానీ అవినీతి కాదంటూ టీడీపీ అడ్డగోలు వాదన
- బాబు దోపిడీపై బుకాయించబోయి అడ్డంగా దొరికిన వైనం.. ప్రజాధనం లూటీని ఆధారాలతో నిగ్గు తేల్చిన సీఐడీ



షెల్ కంపెనీల ద్వారా బాబుకు డబ్బులు చేరాయిలా..

- టీడీపీ ప్రభుత్వం పుణెకు చెందిన డిజైన్ టెక్ కంపెనీకి రూ.371 కోట్లు చెల్లించింది.
- డిజైన్ టెక్ నుంచి పుణెలోని పీవీఎస్‌పీ అనే షెల్ కంపెనీకి రూ.238.29 కోట్లు, ఢిల్లీలోని ఏసీఐ కంపెనీకి రూ.2.71 కోట్లు అంటే మొత్తం రూ.241 కోట్లు తరలించారు.
- పీవీఎస్‌పీ కంపెనీ నుంచి మళ్లీ ఢిల్లీ, ముంబై, అహ్మదాబాద్‌లో ఉన్న వివిధ షెల్ కంపెనీలతోపాటు దుబాయ్, సింగపూర్‌లోని కంపెనీలకు నిధుల తరలింపు ఇలా సాగింది...

ఏసీఐ: రూ.56 కోట్లు, నాలెడ్జ్ పోడియమ్: రూ.45.28 కోట్లు, ఈటా: రూ.14.1 కోట్లు, పాట్రిక్స్: రూ.3.13 కోట్లు, ఐటీ స్మిత్: రూ.3.13 కోట్లు, భారతీయ గ్లోబల్: రూ.3.13 కోట్లు, ఇన్‌వెబ్: రూ.1.56 కోట్లు, పోలారిస్: రూ.2.2 కోట్లు, కాడెన్స్ పార్టనర్స్: రూ.12 కోట్లు

- మొత్తం రూ.140.53 కోట్లను ఆ కంపెనీల బ్యాంకు ఖాతాల నుంచి యోగేశ్ గుప్తా డ్రా చేసి మనోజ్ వాసుదేవ్ పార్థసానికి అందించాడు. మనోజ్ పార్థసాని ఆ నగదు మొత్తాన్ని చంద్రబాబు పీఎస్ పెండ్యాల శ్రీనివాస్‌కు హైదరాబాద్‌లో ముట్టజెప్పాడు. అంటే ఆ రూ.140.53 కోట్లను చివరకు చంద్రబాబు బంగ్లాకు చేర్చారు.
- ఇక మిగిలిన రూ.100.47 కోట్లను పీవీఎస్‌పీ కంపెనీ దుబాయి, సింగపూర్‌లోని కంపెనీలకు మళ్లించింది. ఆ నిధులను మళ్లీ హవాలా మార్గంలో హైదరాబాద్‌కు తరలించారు. అక్కడ మనోజ్ పార్థసాని ద్వారా చంద్రబాబు పీఎస్ పెండ్యాల శ్రీనివాస్‌కు అందించారు. అనంతరం చంద్రబాబు బంగ్లాకు చేర్చారు.
- అవినీతి నెట్‌వర్క్ ద్వారా ఇలా రూ.241 కోట్లు గుట్టు చప్పుడు కాకుండా చంద్రబాబు బంగ్లాకు చేరిపోయాయి.

సాక్షి, అమరావతి: రాష్ట్ర స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఏపీఎస్ఎస్‌డీసీ) పేరుతో చంద్రబాబు సర్కారు సీమెన్స్, డిజైన్‌టెక్ కంపెనీలతో కుదుర్చుకున్నట్టు చెబుతున్న ఒప్పందంలో కుతంత్రం బట్టబయలైంది. తమ పేరుతో కుదుర్చుకున్నట్లు చెబుతున్న ఒప్పందం గురించి తమకు ఏమాత్రం సంబంధం లేదని, అసలు ఆ ఒప్పందం గురించే తమకు తెలియదని సీమెన్స్ కంపెనీ వెల్లడించింది. గ్రాంట్ ఇన్ ఎయిడ్ కింద తాము 90 శాతం నిధులను సమకూరుస్తామని చెప్పలేదని స్పష్టం చేసింది. మోసపూరితంగా తమ కంపెనీ పేరును వాడుకుంటూ దీన్ని రూ.3,300 కోట్ల ప్రాజెక్ట్‌గా చూపారని తెలిపింది. ఈమేరకు జర్మనీలోని సీమెన్స్ కంపెనీ ప్రధాన కార్యాలయం ఏపీఎస్ఎస్‌డీసీకి పంపిన ఈ-మెయిల్‌తో వాస్తవాలు నిర్ధారణ అయ్యాయి. ఈ నేపథ్యంలో సీమెన్స్, డిజైన్ టెక్ కంపెనీలతో కుదుర్చుకున్న ఒప్పందంలో ఎలాంటి అవినీతి జరగలేదని బుకాయించేందుకు ఓ పత్రికా ప్రకటన జారీ చేసిన టీడీపీ అడ్డంగా దొరికిపోయింది. గత ప్రభుత్వం విడుదల చేసిన రూ.370 కోట్లలో రూ.70 కోట్లతో సాఫ్ట్‌వేర్ కొనుగోలు చేశారని అందులో పేర్కొంది. మరి మిగిలిన రూ.300 కోట్లు ఏమయ్యాయో వెల్లడించకపోవడం ద్వారా ఆ నిధులు కొల్లగొట్టినట్లు పరోక్షంగా అంగీకరించింది. ప్రభుత్వ వాటాగా 10 శాతం నిధులను విడుదల చేశామని పేర్కొన్న టీడీపీ మరి 90 శాతం కింద సీమెన్స్, డిజైన్‌టెక్ కంపెనీలు నిధులు ఎందుకు సమకూర్చలేదనే విషయాన్ని మాత్రం దాటవేయడం గమనార్హం. షెల్ కంపెనీల ద్వారా చంద్రబాబు సర్కారు నిధులు కొల్లగొట్టిన విషయాన్ని సీఐడీతోపాటు ఈడీ కూడా నిర్ధారించిన విషయాన్ని కప్పిపుచ్చేందుకు, దర్యాప్తును పక్కదారి పట్టించేందుకు టీడీపీ చేసిన యత్నాలు ఫలించలేదు.

90 శాతం నిధులా..? వంద శాతం మోసమే

మాజీ సీఎం చంద్రబాబు కుట్రపూరితంగా సీమెన్స్ కంపెనీ ముసుగులో ఒప్పందం పేరిట భారీ అవినీతికి పాల్పడినట్లు ఆ కంపెనీ పంపిన ఈ - మెయిల్‌తో స్పష్టమైంది. ఏపీఎస్ఎస్‌డీసీకి పంపిన ఈ - మెయిల్‌లో సీమెన్స్ ఇంకా ఏం చెప్పిందంటే..

ఆ ఒప్పందంలో మేం భాగస్వాములం కాదు

'ఏపీఎస్ఎస్‌డీసీ ప్రాజెక్టు ఒప్పందం గురించి మాకు ఎలాంటి సమాచారం లేదు. అందుకు మేం బాధ్యత వహించం. ఆ ప్రాజెక్టు వ్యయంలో 90 శాతం నిధులను గ్రాంట్ ఇన్ ఎయిడ్‌గా సమకూరుస్తామని మేం ఎక్కడా చెప్పలేదు. మా కంపెనీ పేరుతో సుమన్ బోస్‌తోపాటు జీవీఎస్ భాస్కర్, భావనా గుప్తా, ప్రతాప్ బొంతా, రాహుల్ సెహ్‌గల్, ఆశీష్ శర్మ, సతీశ్ కురుప్ తదితరులు ఏపీ ప్రభుత్వంతో కుదుర్చుకున్న ఒప్పందంతో మాకు ఎలాంటి సంబంధం లేదు. 90 శాతం నిధులను సమకూరుస్తామని వారు ఏపీ ప్రభుత్వంతో చేసుకున్న ఒప్పందానికి సీమెన్స్ కంపెనీ బాధ్యత వహించదు. డిజైన్ టెక్ కంపెనీతో కలసి సుమన్ బోస్ దురుద్దేశపూరితంగా వ్యవహరించారు. మోసపూరితంగా రూ.3,300 కోట్ల ప్రాజెక్టుగా పేర్కొన్నారు. సీమెన్స్ కంపెనీ 90 శాతం గ్రాంట్ ఇన్ ఎయిడ్ కింద నిధులు సమకూరుస్తుందని సుమన్ బోస్, డిజైన్ టెక్ కంపెనీ, ఏపీ ప్రభుత్వం ఒప్పందం చేసుకోవడం పూర్తిగా మోసపూరితం. ఆ ఒప్పందంలో మేం భాగస్వాములం కాము. మాకు సంబంధం లేదు.'

గంటా సుబ్బారావు దరఖాస్తే చేయలేదు

ఏపీఎస్ఎస్‌డీసీ ఎండీగా ఉన్న గంటా సుబ్బారావు గ్రాంట్ ఇన్ ఎయిడ్ కోసం మా కంపెనీకి ఎలాంటి దరఖాస్తూ చేయలేదు. సీమెన్స్ కంపెనీ అనుబంధ సంస్థ అయిన ఎస్ఐఎస్‌డబ్ల్యూ భారత్‌లో మా సాఫ్ట్‌వేర్ విక్రయాలను పర్యవేక్షిస్తుంది. కానీ ఆ కంపెనీ భారత్‌లో కార్పొరేట్ సామాజిక బాధ్యత కింద ఎలాంటి కార్యక్రమాలను చేపట్టడం లేదు. కాబట్టి మేం 90 శాతం నిధులు సమకూరుస్తామనే ఒప్పందం పూర్తిగా బోగస్.

సుమన్ బోస్ చాటింగ్, ఈ మెయిల్స్ ఇవిగో..

మా కంపెనీ ముసుగులో సుమన్ బోస్, ఇతరులు డిజైన్ టెక్‌తో జరిపిన ఈమెయిల్స్, వాట్సాప్ చాటింగ్, బ్రౌజింగ్ హిస్టరీని డిలీట్ చేశారు. వాటిని మేం రిట్రీవ్ చేసి నాలుగు డ్రైవ్‌లలో మీకు అందిస్తున్నాం. మా కంపెనీ ముసుగులో చేసిన మోసం కేసు దర్యాప్తునకు పూర్తిగా సహకరిస్తాం.

అయితే మాత్రం అరెస్టులా..?

స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణంలో ఎలాంటి అవినీతి జరగలేదని కప్పిపుచ్చేందుకు ప్రయత్నించిన ప్రతిపక్ష టీడీపీ అడ్డంగా దొరికిపోయింది. 'ఔను నిధులు కొల్లగొట్టాం.. అయితే మాత్రం కేసు పెడతారా..? అరెస్టులు చేస్తారా..? అలాగైతే అది వేధించడమే...!' అనే తరహాలో వితండవాదం చేస్తుండటం విస్మయం కలిగిస్తోంది. అంశాలవారీగా టీడీపీ వాదనలో డొల్లతనం ఇదీ...

రూ.300 కోట్లు లూటీని ఒప్పుకున్న టీడీపీ

చంద్రబాబు ప్రభుత్వ హయాంలో రూ.3,300 కోట్లతో సీమెన్స్, డిజైన్ టెక్ కంపెనీతో త్రైపాక్షిక ఒప్పందం కుదుర్చుకున్నామని, అందులో 90 శాతం నిధులను సీమెన్స్, డిజైన్ టెక్ సంస్థలు ఇవ్వాలని, 10 శాతం రాష్ట్ర ప్రభుత్వ వాటాగా సమకూర్చాలన్నది ఒప్పందమని టీడీపీ పేర్కొంది. గత ప్రభుత్వం తన వాటాగా జీఎస్టీతో కలిపి రూ.370 కోట్లు విడుదల చేసినట్లు కూడా అంగీకరించింది. అందులో సీమెన్స్ కంపెనీ నుంచి డిజైన్ టెక్ కొనుగోలు చేసిన సాఫ్ట్‌వేర్ కోసం రూ.70 కోట్లు చెల్లించినట్లు తెలిపింది. (వాస్తవానికి డిజైన్ టెక్ రూ.56 కోట్లే చెల్లించింది. ఆ విషయాన్ని సీమెన్స్ కంపెనీ ఈ మెయిల్‌లో వెల్లడించింది. టీడీపీ వాదనను పరిగణనలోకి తీసుకుని రూ.70 కోట్లు చెల్లించారని భావించినా మిగిలిన రూ.300 కోట్లు ఏం చేశారన్న దానిపై మాత్రం సమాధానం చెప్పకుండా దాటవేయడం గమనార్హం. అంటే ఆ రూ.300 కోట్లను కొల్లగొట్టినట్లు ఆ పార్టీనే పరోక్షంగా ఒప్పుకుంది.

90 శాతం నిధులతో సాఫ్ట్‌వేర్ ఎక్కడ?

సీమెన్స్, డిజైన్ టెక్ కంపెనీలు గ్రాంట్ ఇన్ ఎయిడ్ కింద 90 శాతం నిధులు సమకూర్చాయన్నది ఒప్పందం అని టీడీపీ పేర్కొంది. మరి ఆ మొత్తాన్ని సీమెన్స్, డిజైన్ టెక్ కంపెనీలు వెచ్చించాయా? లేదా? అన్న విషయాన్ని మాత్రం టీడీపీ వెల్లడించ లేదు. 90 శాతం రాయితీతో సాఫ్ట్‌వేర్‌ను సీమెన్స్ సంస్థ రూ.70 కోట్లకు సమకూర్చిందని చెబుతోంది. మరి అలాంటప్పుడు ప్రాజెక్టు వ్యయాన్ని రూ.3,300 కోట్లుగా ఎందుకు చూపినట్లు..? అందులో ప్రభుత్వ వాటా కింద 10 శాతాన్ని జీఎస్టీతో కలిపి రూ.371 కోట్లు ఎందుకు చెల్లించినట్లు? నిధులు కొల్లగొట్టేందుకే రూ.70 కోట్ల ప్రాజెక్టును ఏకంగా రూ.3,300 కోట్లుగా కాగితాలపై చూపించి అడ్డగోలుగా ప్రజాధనాన్ని కాజేసినట్లు టీడీపీ ప్రకటనే చెబుతోంది.

బాబు ఆదేశాలతో నిబంధనలకు విరుద్ధంగా నిధులు

స్కిల్ స్కామ్‌లో నిధుల విడుదలకు అప్పటి సీఎం చంద్రబాబు, మంత్రులది బాధ్యత కాదని టీడీపీ చెప్పడం విడ్డూరంగా ఉంది. అప్పటి ఆర్థిక శాఖ అధికారులు అభ్యంతరాలు వ్యక్తం చేసినా నాటి సీఎం చంద్రబాబు ఆదేశించడంతోనే నిధులను విడుదల చేస్తున్నట్లు నోట్ ఫైళ్లలో స్పష్టంగా ఉంది. అప్పటి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఐవైఆర్ కృష్ణారావు, ఆర్థిక శాఖ కార్యదర్శి సునీతతోపాటు పలువురు అధికారులు, ఇతరులను విచారించిన అనంతరం సీఐడీ వాస్తవాలను నిగ్గు తేల్చింది.

సీఐడీతోపాటు ఈడీ కూడా నిర్ధారించింది..

అసలు నిధులను ఎక్కడ మళ్లించారని టీడీపీ ప్రశ్నిస్తోంది. షెల్ కంపెనీల ద్వారా నిధులను మళ్లించారని సీఐడీతోపాటు కేంద్ర దర్యాప్తు సంస్థ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) ఆధారాలతో సహా నిర్ధారించాయి. షెల్ కంపెనీలు ఏసీఐ, నాలెడ్జ్ పోడియమ్, ఈటా, పాట్రిక్స్, ఐటీ స్మిత్, భారతీయ గ్లోబల్, ఇన్‌వెబ్, పోలారిస్, కాడెన్స్ పార్ట్‌నర్స్ ద్వారా నిధులను తరలించినట్లు నిగ్గు తేల్చాయి. ఈ కేసులో సీఐడీ ఇప్పటివరకు చంద్రబాబుతో సహా 9 మందిని అరెస్ట్ చేసింది. వారిలో నలుగురిని ఈడీ అరెస్ట్ చేయడంతోపాటు ఆ షెల్ కంపెనీల బ్యాంకు ఖాతాలను అటాచ్ చేసింది. ఈ ప్రాజెక్టులో రూ. 355 కోట్ల ప్రజాధనం దుర్వినియోగమైనట్లు కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్(కాగ్) సైతం నిర్ధారించింది.

విదేశాలకు పరారయ్యారు కదా...

ఈ కేసులో విచారణకు హాజరు కావాలని సీఐడీ నోటీసులు ఇవ్వగానే చంద్రబాబు పీఎస్ పెండ్యాల శ్రీనివాస్‌తోపాటు నిధులు తరలింపులో పాత్రధారిగా వ్యవహరించిన మనోజ్ పార్థసాని రాత్రికి రాత్రే విదేశాలకు పరారయ్యారు. దీనిపై స్పందించకుండా వారికి అప్పుడు నోటీసులు జారీ చేయడం ఏమిటని టీడీపీ ప్రశ్నించడం విడ్డూరంగా ఉంది. దర్యాప్తు కొనసాగుతున్న కొద్దీ లభించిన ఆధారాలను బట్టి విచారణ అధికారులు నోటీసులు జారీ చేస్తారు. ఈ కేసులో సీఐడీ కూడా అదే చేసింది. చంద్రబాబు ఆదేశాలతోనే వారు విదేశాలకు పరారైనట్లు స్పష్టంగా తెలిసిపోతోంది. చంద్రబాబు ఏ స్థాయిలో సాక్షులను ప్రభావితం చేయగలరో, దర్యాప్తును పక్కదారి పట్టించగలరో ఈ ఉదంతమే రుజువు చేస్తోంది. ఈ క్రమంలో సీఐడీ చంద్రబాబును అరెస్ట్ చేసింది.

దర్యాప్తు సాగేకొద్దీ సూత్రధారులు తెరపైకి..

స్కిల్ డెవలప్‌మెంట్, ఇన్నోవేషన్ పేరిట ఏర్పాటైన కొత్త శాఖలో అన్ని వ్యవహారాలు అధికారులే చూశారని, అప్పటి సీఎం చంద్రబాబు, మంత్రి అచ్చెన్నాయుడు కేవలం పర్యవేక్షించారని టీడీపీ పేర్కొంది. ఈ కేసులో అచ్చెన్నాయుడును ఇరికించేందుకు సీఐడీ ప్రయత్నిస్తోందని ఆరోపించింది. కానీ కేసు దర్యాప్తు సాగుతున్న కొద్దీ లభిస్తున్న ఆధారాలతో ఈ కుంభకోణం అసలు సూత్రధారులు ఎవరన్నది బయటపడుతోంది. ఆ ఆధారాలతోనే చంద్రబాబు, అచ్చెన్నాయుడు ఈ కుంభకోణంలో కీలక భూమిక పోషించారని వెల్లడైంది. నోట్ ఫైళ్లు మాయమైనా అధికారులు అందుబాటులో ఉన్నారని, వారిని విచారించాలని టీడీపీ వాదిస్తోంది. అంటే నోట్ ఫైళ్లను మాయం చేశామని ఆ పార్టీ అంగీకరించినట్లే కదా! అందుబాటులో ఉన్న అధికారులను విచారించి, ఇతర అంశాలను నిగ్గు తేల్చి పూర్తి ఆధారాలతోనే సీఐడీ కేసు దర్యాప్తును ఓ కొలిక్కి తెచ్చింది.

అన్నిటికి సూత్రధారి, లబ్ధిదారు చంద్రబాబే

స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ కుంభకోణంతోపాటు ఇన్నర్ రింగ్ రోడ్డు, రాజధాని మాస్టర్ ప్లాన్ కుంభకోణాల్లో చంద్రబాబు పాత్రను వెలుగులోకి తేవటాన్ని చూసి టీడీపీ బెంబేలెత్తుతోంది. ఇప్పటికే ఈ మూడు కేసుల్లో సీఐడీ కీలక ఆధారాలను సేకరించి ఎఫ్ఐఆర్ నమోదు చేసింది. ఇన్నర్‌రింగ్ రోడ్ అలైన్‌మెంట్‌ను మూడు సార్లు మార్చిన వైనం, ఆ అలైన్‌మెంట్‌ను ఆనుకుని వందలాది ఎకరాలను ఎలా సేకరించారు?.. ఎస్సీ, ఎస్టీ, బీసీ రైతులను బెదిరించి బినామీల ద్వారా అసైన్డ్ భూములు ఎలా కొల్లగొట్టారు? లింగమనేని రమేశ్‌తో క్విడ్ ప్రోకోకు ఎలా పాల్పడ్డారు.. తదితరాలన్నీ బట్టబయలయ్యాయి. ఆ కేసుల్లో ఏ-1గా చంద్రబాబు, ఏ-2గా నారాయణ, ఏ-6గా లోకేశ్‌పై ఇప్పటికే ఎఫ్ఐఆర్‌ను నమోదు చేసింది. తమ అవినీతి బాగోతం సాక్ష్యాధారాలతో రుజువు కావడంతో ఎల్లో మీడియా సహకారంతో టీడీపీ కుయుక్తులు పన్నుతోంది.

అవినీతి నెట్‌వర్క్ గుట్టు రట్టు

స్కిల్ డెవలప్‌మెంట్ ముసుగులో చంద్రబాబు ఖజానా నుంచి విడుదల చేసిన రూ.371 కోట్లు ఎక్కడకు వెళ్లాయన్నది ఈ కేసులో కీలకంగా మారింది. ఆ నిధులన్నీ షెల్ కంపెనీల ద్వారా చివరకు చంద్రబాబుకే చేరినట్లు సీఐడీ దర్యాప్తులో ఆధారాలతోసహా వెల్లడైంది. షెల్ కంపెనీల కమీషన్లు పోనూ రూ.241 కోట్లను అవినీతి నెట్‌వర్క్ ద్వారా చంద్రబాబు నివాసానికి చేరినట్లు గుర్తించారు. మరోవైపు అమరావతిలో తాత్కాలిక నిర్మాణాలు, టిడ్కో ఇళ్ల ప్రాజెక్ట్‌ల కాంట్రాక్టు కేటాయింపులలోనూ చంద్రబాబు భారీగా అవినీతికి పాల్పడ్డారు.

చంద్రబాబుతో కుటుంబ సభ్యుల ములాఖత్

- రాజమండ్రి జైల్లో కలిసిన భార్య భువనేశ్వరి, కుమారుడు లోకేశ్, కోడలు బ్రాహ్మణి
- చంద్రబాబు కట్టించిన బిల్డింగ్‌లోనే ఆయన్ని కట్టిపడేశారన్న భువనేశ్వరి
- నంబర్ వన్ సౌకర్యాలు లేవని ఆవేదన



చంద్రబాబుతో ములాఖత్ అనంతరం వస్తున్న భువనేశ్వరి, లోకేశ్, బ్రాహ్మణి

సాక్షి, రాజమహేంద్రవరం: స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణంలో అరెస్టయి రాజమండ్రి కేంద్ర కారాగారంలో జ్యుడీషియల్ రిమాండ్‌లో ఉన్న చంద్రబాబుతో కుటుంబ సభ్యులు మంగళవారం సాయంత్రం ములాఖత్ అయ్యారు. బాబును కలిసేందుకు జైలు అధికారులు ముగ్గురికి అనుమతి ఇచ్చారు. దీంతో చంద్రబాబు భార్య భువనేశ్వరి, కోడలు బ్రాహ్మణి తొలుత రాజమండ్రి విద్యానగర్‌లో లోకేశ్ ఏర్పాటు చేసుకున్న క్యాంప్ వద్దకు చేరుకున్నారు. అక్కడి నుంచి లోకేశ్‌తో కలిసి సాయంత్రం 4 గంటలకు సెంట్రల్ జైల్‌కు సొంత వాహనంలో చేరుకున్నారు. భువనేశ్వరి, లోకేశ్, బ్రాహ్మణి 30 నిమిషాల పాటు బాబుతో మాట్లాడారు.

చంద్రబాబు ఆరోగ్యం బాగానే ఉంది : నారా భువనేశ్వరి

చంద్రబాబు ఆరోగ్యం బాగానే ఉందని, ధైర్యంగా ఉన్నారని ఆయన భార్య నారా భువనేశ్వరి చెప్పారు. చంద్రబాబుతో ములాఖత్ అనంతరం ఆమె మీడియాతో మాట్లాడారు. చంద్రబాబు కట్టించిన బ్లాక్‌లోనే ఆయన్ని కట్టిపడేశారని అన్నారు. ఆయనకు నంబర్ వన్ సౌకర్యాలు కల్పించాల్సి ఉన్నా ఆ పరిస్థితి అక్కడ లేదన్నారు. బాబు భద్రతపై ఆందోళన వేస్తోందన్నారు. చన్నీళ్లతో స్నానం చేయాల్సి వస్తోందని చెప్పారు. ప్రజల స్వేచ్ఛ, హక్కుల కోసం ఆలోచించే బాబు కోసం పోరాడాలని ప్రజలకు పిలుపునిచ్చారు.

రెండో రోజు జైలులో ఇలా..

ఇదిలా ఉంటే బాబు జైలు జీవితం మంగళవారం రెండో రోజుకు చేరింది. తొలి రోజులాగే రెండో రోజు సైతం వీఐపీ ఖైదీకి అందించే సదుపాయాలన్నీ అందించారు. బాబు తొలి రోజు యోగా మాత్రమే చేశారు. మంగళవారం ఉదయం 4 గంటలకే నిద్ర లేచి యోగాతో పాటు వాకింగ్ కూడా చేసినట్లు సమాచారం. అనంతరం మూడు ప్రధాన పత్రికలు తెప్పించుకుని చదివారు. ఆ తర్వాత అల్పాహారం, టీ తాగినట్లు తెలిపింది. మధ్యాహ్నం, సాయంత్రం పుల్కా, కర్డ్ రైస్ తీసుకుంటున్నారు.

చంద్రబాబుకు జైలే భద్రం..

- రాజమహేంద్రవరం సెంట్రల్ జైల్లో పూర్తిస్థాయి భద్రత
- ఆయనకే ప్రత్యేకంగా పూర్తి బ్లాక్ కేటాయింపు
- సాయుధ సిబ్బందితో భద్రత
- సీసీ కెమెరాల్లో పర్యవేక్షణ
- ప్రత్యేక వైద్యబృందం
- న్యాయస్థానానికి నివేదించిన జైళ్ల శాఖ

సాక్షి, అమరావతి: స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ కుంభకోణంలో అరెస్టై రాజమహేంద్రవరం సెంట్రల్ జైల్లో రిమాండ్ ఖైదీగా ఉన్న చంద్రబాబుకు పూర్తిస్థాయిలో భద్రత కల్పించామని రాష్ట్ర జైళ్ల శాఖ పేర్కొంది. ఆయన భద్రతకు ఎలాంటి ముప్పు లేదని స్పష్టంచేసింది. సెంట్రల్ జైల్లో తనకు భద్రత, ఆరోగ్యపరమైన ప్రమాదం ఉన్నందున హౌస్ రిమాండ్‌కు అనుమతించాలని కోరుతూ చంద్రబాబు న్యాయస్థానంలో పిటిషన్ వేశారు. ఈ నేపథ్యంలో చంద్రబాబుకు రాజమహేంద్రవరం సెంట్రల్ జైలులో కల్పించిన భద్రత, వైద్య ఏర్పాట్లను వివరిస్తూ రాష్ట్ర జైళ్ల శాఖ డీజీ హరీశ్‌కుమార్ గుప్తా లిఖితపూర్వకంగా ఇచ్చిన సమాచారాన్ని అదనపు అడ్వొకేట్ జనరల్ విజయవాడ ఏసీబీ న్యాయస్థానానికి సమర్పించారు. ఆ వివరాల ప్రకారం రాజమహేంద్రవరం సెంట్రల్ జైల్లో చంద్రబాబుకు కల్పించిన భద్రత, వైద్యపరమైన ఏర్పాట్లు ఇలా ఉన్నాయి.

- రాజమహేంద్రవరం సెంట్రల్ జైల్లో చంద్రబాబుకు ప్రత్యేకంగా ఒక బ్లాక్‌లో వార్డ్ (గది) కేటాయించారు. ఆ బ్లాక్ ప్రధాన జైలుకు విడిగా ప్రత్యేకంగా ఉంటుంది.
- ఆ బ్లాక్‌ను, చంద్రబాబు ఉండే గదిని పూర్తిగా శానిటైజ్ చేసి శుభ్రపరిచారు.
- చంద్రబాబు ఉండే గది బయట సాయుధులైన సిబ్బందితో భద్రత కల్పించారు. 24 గంటలు భద్రతా సిబ్బంది విధులు నిర్వర్తిస్తున్నారు. ఆ ప్రాంతానికి అనుమతి లేకుండా ఎవరినీ అనుమతించడం లేదు.



- చంద్రబాబు సమ్మతిస్తేనే ఆయన్ని కలిసేందుకు ఎవరినైనా అనుమతిస్తున్నారు.
- సెంట్రల్ జైలు సూపరింటెండెంట్‌తోపాటు సీనియర్ అధికారులు భద్రతా ఏర్పాట్లను స్వయంగా పర్యవేక్షిస్తున్నారు.
- ఆ గది బయట, చుట్టూ సీసీటీవీలు ఏర్పాటు చేసి 24 గంటలు భద్రతను నిశితంగా పర్యవేక్షిస్తున్నారు.
- ఆ ప్రత్యేక గదికి సమీపంలోనే వైద్యబృందం 24 గంటలు అందుబాటులో ఉంది.
- న్యాయస్థానం ఆదేశాలమేరకు చంద్రబాబుకు పూర్తి భద్రత కల్పించి, తగిన వైద్యసేవలను అందుబాటులో ఉంచారు.

ఇల్లు కాదు జైలే..

▶ మొదటి పేజీ తరువాయి

సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది సిద్దార్థ లూథ్రా, సీఐడీ తరఫున అదనపు అడ్వొకేట్ జనరల్ (ఏఏజీ) పొన్నవోలు సుధాకర్‌రెడ్డి వాదనలు వినిపించారు. వాదనలు విన్న ఏసీబీ కోర్టు తన తీర్పును వాయిదా వేసిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో మంగళవారం సాయంత్రం న్యాయస్థానం తన నిర్ణయాన్ని వెలువరించింది. హౌస్ రిమాండ్ పిటిషన్‌ను కొట్టేస్తున్నట్లు తీర్పు వెలువరించింది. కొట్టివేయటానికి కారణాలు ఏమిటో కూడా కోర్టు వివరించింది. ఈ సమయంలో చంద్రబాబు తరపు న్యాయవాది జోక్యం చేసుకుంటూ తమకేమీ కారణాలు వివరించాల్సిన అవసరం లేదని పేర్కొనగా, కారణాలను వెల్లడించాల్సిన బాధ్యత తమపై ఉందని కోర్టు స్పష్టం చేసింది. హౌస్ రిమాండ్ పిటిషన్ తిరస్కరణకు కారణాలను వివరించింది.

జ్యుడీషియల్, పోలీసు రిమాండ్ మాత్రమే ఉన్నాయి..: మాజీ సీఎం చంద్రబాబు కోరుతున్న హౌస్ రిమాండ్ అసాధారణ అభ్యర్థన అని సోమవారం వాదనల సందర్భంగా అదనపు అడ్వొకేట్ జనరల్ పొన్నవోలు సుధాకర్‌రెడ్డి కోర్టుకు నివేదించారు. ఈ ప్రస్తావన ఏ చట్టంలో కూడా లేదని, అందువల్ల హౌస్ రిమాండ్ మంజూరు చేయడానికి వీల్లేదని వాదించారు. చంద్రబాబుకు ప్రస్తుతం ఉన్న భద్రత కంటే జైలులో ఇంకా ఎక్కువ భద్రత ఉందని వివరించారు. జైలులో చంద్రబాబు భద్రతకు అన్ని రకాల చర్యలు తీసుకున్నామన్నారు. జైలులో చంద్రబాబు భద్రతకు వచ్చిన ముప్పేమీ లేదని తెలిపారు. చట్టంలో కేవలం జ్యుడీషియల్ రిమాండ్, పోలీసు రిమాండ్ మాత్రమే ఉన్నాయని కోర్టుకు నివేదించారు. ఏసీబీ కోర్టు తీర్పు సందర్భంగా ఈ వాదనలను పరిగణలోకి తీసుకుంది.

బెయిల్ పిటిషన్ అంటూ హల్‌చల్..: మాజీ సీఎం చంద్రబాబు తరపున బెయిల్ పిటిషన్ దాఖలు చేస్తున్నానంటూ ఏసీబీ కోర్టులో మంగళవారం ఓ న్యాయవాది హడావుడి సృష్టించారు. చంద్రబాబు తరపున ఓ టీడీపీ కార్యకర్త పేరుతో తాను బెయిల్ పిటిషన్ దాఖలు చేస్తున్నట్లు ఆ న్యాయవాది కోర్టు దృష్టికి తెచ్చారు. ఈ పిటిషన్‌పై విచారణ జరపాలని కోరారు. అయితే చంద్రబాబు వకాలత్ ఇవ్వకుండా ఆయన తరపున ఎలా బెయిల్ పిటిషన్ దాఖలు చేస్తారని కోర్టులో ఉన్న న్యాయవాదులు చర్చించుకున్నారు. ఆ న్యాయవాది తీరును గమనించిన న్యాయస్థానం ఈ విషయాన్ని చంద్రబాబు తరపున గత మూడు రోజులుగా వాదనలు వినిపిస్తున్న న్యాయవాదుల దృష్టికి తెచ్చింది. చంద్రబాబు ఎలాంటి బెయిల్ పిటిషన్ దాఖలు చేయలేదని వారు కోర్టుకు తెలియచేయడంతో ఆ విషయాన్ని అక్కడితో వదిలేసింది.

సుదీర్ఘ వాదనలు.. సందేహాల నివృత్తి తరువాతే తీర్పు

మాజీ సీఎం చంద్రబాబు దాఖలు చేసిన హౌస్ రిమాండ్ పిటిషన్‌పై ఇరుపక్షాల సుదీర్ఘ వాదనలను ఏసీబీ కోర్టు ఎంతో ఓపికగా విన్నది. దాదాపు మూడు గంటలకు పైగా చంద్రబాబు పిటిషన్‌పైనే విచారణ జరిపింది. ఇరుపక్షాల న్యాయవాదులు తమ వాదనలు వినిపించేందుకు ఎంత సమయం తీసుకున్నా వారిని ఏ దశలోనూ కోర్టు నిలువరించలేదు. అటు చంద్రబాబు తరపున సీనియర్ న్యాయవాది వినిపించిన ప్రతీ వాదననూ సావధానంగా ఆలకించింది. ఆయన కోర్టు దృష్టికి తెచ్చిన ప్రతీ తీర్పునూ నిశితంగా పరిశీలించింది. వాటి విషయంలో తనకున్న సందేహాలను సైతం ఏసీబీ కోర్టు నివృత్తి చేసుకుంది. అలాగే సీఐడీ తరపు న్యాయవాది చేసిన వాదనలను సైతం అదే రీతిలో ఆలకించింది. సీఐడీ న్యాయవాదిని కూడా ప్రశ్నించి తన సందేహాలను ఏసీబీ కోర్టు నివృత్తి చేసుకుంది. చివరకు సీఐడీ న్యాయవాది వాదనలతో ఏకీభవిస్తూ తీర్పును వెలువరించింది. చంద్రబాబుకు హౌస్ రిమాండ్ ఎందుకు ఇవ్వడం లేదో కోర్టు హాలులోనే చాలా స్పష్టంగా వివరించింది. తమకేమీ కారణాలను చెప్పాల్సిన అవసరం లేదని చంద్రబాబు తరపు న్యాయవాది గట్టిగా వ్యాఖ్యానించినా కూడా, తన బాధ్యత మేరకు కారణాలను వెల్లడిస్తున్నట్లు స్పష్టం చేసింది. గత మూడు రోజులుగా చంద్రబాబు తరపు న్యాయవాదులు వరుసగా పిటిషన్ల మీద పిటిషన్లు వేస్తున్నా, తీవ్రమైన పని భారం ఉన్నప్పటికీ అన్ని పిటిషన్లను ఏసీబీ కోర్టు చాలా ఓపికగా విచారించింది. ఎక్కడా కూడా ఎలాంటి తొందరపాటుకు ఆస్కారం లేకుండా విచారణ జరుపుతూ వస్తోంది. న్యాయవాదులతో, ఇతరులతో (చంద్రబాబుకు చెందిన వ్యక్తులు) కోర్టు హాలు కిక్కిరిపోయినప్పటికీ ఏ దశలోనూ ఒత్తిడికి లోనుకాకుండా ఏసీబీ కోర్టు తన బాధ్యతలను నిర్వర్తించింది.

రాష్ట్రీయం

కౌలు రైతులపై ప్రభుత్వ నిర్లక్ష్యం

రైతు స్వరాజ్య వేదికలో వక్తల ధ్వజం

హిమాయత్‌నగర్ (హైదరాబాద్): కౌలు రైతుల పట్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మొండి వైఖరిని ప్రదర్శిస్తున్నాయని, వారి విషయంలో ఏళ్ల తరబడి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు. వ్యవసాయంలో పెట్టుబడులు పెరిగిపోవడం వల్ల కౌలు ధరలు కూడా పెరిగాయని, వీటి కారణంగా రాష్ట్రం ఏర్పడే నాటికి రాష్ట్రవ్యాప్తంగా కౌలు రైతుల ఆత్మహత్యలు తారస్థాయికి చేరాయన్నారు. మంగళవారం బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో 'రైతు స్వరాజ్య వేదిక ఆధ్వర్యంలో 'కౌలు రైతు సమస్యల బహిరంగ విచారణ' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్రంలోని పలు ప్రాంతాల నుంచి విచ్చేసిన కౌలు రైతులు వారు ఎదుర్కొంటున్న సమస్యలను ఈ వేదికలో చెప్పారు. బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ, తెలంగాణ ప్రభుత్వం 2011 లైసెన్సు పొందిన సాగుదారుల చట్టాన్ని అమలు చేయకపోవడం సిగ్గుచేటన్నారు. సీపీఎం పార్టీ రాష్ట్ర కమిటీ నాయకుడు నరసింహారావు, సీపీఐ పార్టీ రాష్ట్ర కమిటీ నాయకురాలు పశ్య పద్మ, సీపీఐ-ఎంఎల్ ప్రజాపంథా రాయల చంద్రశేఖర్, టీజేఎస్ అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాం, ప్రొఫెసర్ నవీన్, తెలంగాణ పీపుల్స్ జాయింట్ యాక్షన్ కమిటీ కో-కన్వీనర్ అంబటి నాగయ్య, ప్రజా జ్యూరీ సభ్యులు యోగేంద్ర యాదవ్ ప్రసంగించారు.

సీతమ్మసాగర్ పనుల కొనసాగింపుపై కేంద్రం సీరియస్

సాక్షి, హైదరాబాద్: పర్యావరణ అనుమతులు పొందకుండానే సీతమ్మసాగర్ బ్యారేజీ నిర్మాణ పనులు చేపట్టడంపట్ల కేంద్ర పర్యావరణ, అటవీ మంత్రిత్వ శాఖ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. పనులు నిలిపివేయాలని జాతీయ హరిత ట్రిబ్యునల్ (ఎన్జీటీ) జారీ చేసిన ఉత్తర్వులను ధిక్కరించడంపై రాష్ట్ర నీటిపారుదల శాఖకు ఇటీవల షోకాజ్ నోటీసు జారీ చేసింది. 15 రోజుల్లోగా సంజాయిషీ ఇవ్వనిపక్షంలో న్యాయపర చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది.

సాక్షి
ఫ్యామిలీ
ముంబై
బుధవారం ॥ 13-9-2023






వాలెంటీనా మిశ్రా

ఫ్యాషన్ నా పాషన్

'మనలోని రకరకాల భయాలే అపజయాలకు కారణాలు అంటారు' వాలెంటీనా మిశ్రా.

ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్నం వాసి అయిన వాలెంటీనా జాతీయ, అంతర్జాతీయ బ్యూటీ కాంటెస్ట్‌లో పాల్గొనే కిడ్స్, మిస్, మిస్టర్ అండ్ మిసెస్ కి పద్దెనిమిదేళ్లుగా గ్రూమింగ్ సెషన్స్ నిర్వహిస్తున్నారు. మనలోని ఆత్మవిశ్వాసమే కోరుకున్న శిఖరాలను అధిరోహించేలా చేస్తుంది అని చెబుతున్న వాలెంటీనా శాస్త్రీయ నృత్యకారిణి కూడా. ఇద్దరు పిల్లలకు తల్లి. మిస్ అండ్ మిస్టర్ గ్రాండ్ సీ వరల్డ్ బల్గేరియా పోటీలకు వైస్ ప్రెసిడెంట్‌గా, 15 అంతర్జాతీయ పోటీలకు నేషనల్ డైరెక్టర్‌గా, 12 దేశాలలో జరిగిన పోటీలకు 50 కి పైగా పోటీదారులను తీర్చిదిద్దిన వాలెంటీనా మిశ్రా ఫ్యాషన్ నా పాషన్ అంటూ ఆ రంగంలోకి తన పయనాన్ని ఈ విధంగా వివరించారు.



''పద్దెనిమిదేళ్ల ఈ ప్రయాణంలో ప్రపంచవ్యాప్తంగా ఎంతోమందిని కలిశాను. ముఖ్యంగా మహిళలను. ఒక మహిళ మాత్రమే మరో మహిళను శక్తిమంతంగా మార్చగలదు అనేది నేను బలంగా నమ్ముతాను. సుస్మితా సేన్, ఐశ్వర్యారాయ్ బ్యూటీ కాంటెస్ట్‌లో పాల్గొని గెలుపొందిన రోజుల్లో ప్రతి ఒక్క అమ్మాయి తనూ మిస్ ఇండియా, మిస్ యూనివర్స్ కావాలనుకుంది. అలాగే నేనూ అనుకున్నాను. లైట్స్, కెమెరా ఫ్లాష్‌లు, స్టేజ్, చప్పట్ల మోతలు.. ఇవన్నీ అమ్మాయిలకు ఒక అద్భుతంగా ఉంటుంది. నన్ను నేను అలాంటి స్టేజ్‌పైన చూసుకోవాలనుకున్నాను. అదృష్టవశాత్తు చిన్నప్పుడు శాస్త్రీయ నృత్యం నేర్చుకున్నాను. గ్రూప్ సాంగ్ పోటీల్లోనూ చురుగ్గా ఉండేదాన్ని. స్టేజ్ ఫియర్ అస్సలు ఉండేది కాదు. ఇండస్ట్రియల్ రిలేషన్స్ పర్సనల్ మేనేజ్‌మెంట్‌లో డిగ్రీ చేశాను. కానీ, నాకు నచ్చిన రంగం ఫ్యాషన్ అండ్ బ్యూటీ ఇండస్ట్రీ.

పోటీలు నిర్వహించాను..

ఫ్యాషన్ ఇండస్ట్రీలో ఉండటం వల్ల గ్రూమింగ్ అవకాశాలు వచ్చాయి. గ్రూమింగ్ అంటే ఒక క్యాట్‌వాక్ ఒక్కటే కాదు, మాట్లాడటం, బాడీ లాంగ్వేజ్, సెల్ఫ్ కాన్ఫిడెన్స్, వ్యక్తిత్వం, ఐక్యూ లెవల్స్.. అన్నీ కలిసి ఉంటాయి. సాధారణంగా మోడల్స్ 18 నుంచి 25 వరకు ఇండస్ట్రీలో ఉంటారు. ఆ తర్వాత కొత్తవారు వస్తుంటారు. పెళ్లికి ముందు వరకు మెరుస్తారు. ఆ తర్వాత మాయమవుతారు. నా ఎక్స్‌పీరియన్స్‌లో ఇవన్నీ చూశాను. చాలా మందిని కలవడం వల్ల కూడా గ్రూమింగ్ సెషన్స్‌వైపు దారితీసేలా చేసింది. ఫ్యాషన్ ఇండస్ట్రీలో కొనసాగుతూనే గ్రూమింగ్ సెషన్స్ ఇవ్వడం మొదలుపెట్టాను. కేరళలో జరిగే మిస్ సౌత్ ఇండియా, మిస్ క్వీన్ ఆఫ్ ఇండియా ఈ రెండు పోటీలకు గ్రూమర్‌గా నా కెరియర్ స్టార్ట్ చేశాను. అక్కడ నుంచి దేశ, అంతర్జాతీయ పోటీలకు గ్రూమర్‌గా వర్క్ చేస్తున్నాను. నా అనుభవాన్నంతా కలిపి 'డీలా వాలెంటీనా' అని నా సొంత కంపెనీ స్టార్ట్ చేశాను.

పిల్లలతో కాంటెస్ట్..

ఈ రోజుల్లో పిల్లలకు ఎక్స్‌పోజర్ చాలా ఎక్కువైపోయింది. పిల్లల తల్లిదండ్రులు తమ పిల్లలను తీసుకువస్తుంటారు. చాలా కంప్లైంట్స్ చెబుతుంటారు. కానీ, పిల్లలకు గ్రూమింగ్ చేస్తున్నప్పుడు వారితో నాకు చాలా అద్భుతంగా అనిపించింది. ఇంటర్నేషనల్ పేజెంట్స్‌తోనూ కలిసి వర్క్ చేశాను. ఇండియన్ కిడ్స్, గర్ల్, బాయ్స్‌ని టీమ్స్‌గా ఎంపిక చేసి, 25 దేశాల్లో వారి ప్రతిభను పరిచయం చేశాను. దేశవ్యాప్తంగా వచ్చిన ఎంట్రీల నుంచి కొంతమందిని ఎంపిక చేసుకొని, ముందు ఇంటర్వ్యూ చేసి, షార్ట్ లిస్ట్ చేసుకుంటాం. ఎవరైనా కాన్ఫిడెంట్ కాస్త లో ఉంది అనిపించినా వారిని ప్రిపేర్ చేస్తుంటాను. ప్రతి ఒక్కరిలో కొన్ని నెగిటివ్ పాయింట్స్ ఉంటాయి. వాటిలో సన్నగా లేదా లావుగా ఉన్నాను అనో, రంగు తక్కువ ఉన్నాననో.. ఇలాంటి భయాలను గుర్తించి, వారి ఆలోచనలను పాజిటివ్‌గా మారుస్తుంటాను.

పెళ్లి తర్వాత...

నేను ఎప్పుడూ నేర్చుకుంటూ ఉంటాను. నన్ను నేనే కాదు ఎదుటివారిని ప్రోత్సహించడానికి సిద్ధంగా ఉంటాను. గతం వదిలేయాలి, భవిష్యత్తులో కాకుండా ప్రస్తుతంలో జీవించాలి.. అనుకుంటాను. నాకు 21 ఏళ్ల వయసులో పెళ్లి అయ్యింది. పెళ్లి తర్వాత ఫ్యాషన్ ఇండస్ట్రీ గురించి ఆలోచన అవసరమా.. అనే క్వశ్చన్ మార్క్ వస్తుంది. కానీ, మా అమ్మానాన్నలు, మా వారు నన్ను ప్రోత్సహించారు. మా వారు రవికుమార్ నేవీ ఆఫీసర్. ఇద్దరు పిల్లలు. అబ్బాయి నేషనల్ డిఫెన్స్ అకాడమీలో ఉన్నాడు, మా అమ్మాయి 12వ తరగతి చదువుతుంది. తను కూడా కిడ్స్ గ్రూప్‌లో పదేళ్ల వయసు టీమ్‌లో సౌత్ ఆఫ్రికాలో జరిగిన బ్యూటీ కాంటెస్ట్‌లో పాల్గొంది. ఒక వ్యక్తిత్వం సంతరించుకున్నాక ఏమీ చేయలేం అంటారు. కానీ, ఏ దశలోనైనా మానసిక స్థితిని మెరుగుపరుచుకోవచ్చు. ఏ కష్టం లేకుండా రాత్రికి రాత్రి విజయాలు రావు. ఈ పద్దెనిమిదేళ్ల టైమ్‌లో నా ఎక్స్‌పీరియన్స్, హార్డ్ వర్క్‌తోనే సక్సెస్ అయ్యాను.

నాకోసం కొంత సమయం..

పిల్లలు, పెద్దలు, ఆడ–మగ ఎవ్వరైనా.. ఫిజిక్‌ను కాపాడుకోవాలంటే అది ఫ్యాషన్ ఇండస్ట్రీయే కానక్కర్లేదు. గ్రూమర్‌గా రాణించనక్కర్లేదు. సెల్ఫ్ కాన్ఫిడెన్స్ లెవల్స్ పెంచుకుంటూ హార్డ్ వర్క్ చేస్తేనే విజయం సొంతం అవుతుంది. ఇంటి పని చేసే గృహిణి అయినా, ఉద్యోగి అయినా తమ కోసం తాము ఓ అరగంట కేటాయించుకోవాలి. ప్రతి ఒక్కరూ తమ కోసం ఏదైనా ఆరుబయట ఆడే ఆటలు, వాక్, యోగా, జుంబా, జిమ్... ఏదైనా చేయండి. ఒక అరగంట చాలు. అలాగే పోషకాహారం తీసుకోవడంలో శ్రద్ధ పెట్టాలి. కూరగాయలు, పండ్లు... ఏవైనా రొటీన్‌గా కాకుండా మార్చుకుంటూ తీసుకోవాలి. మన పొట్ట ఒక బెలూన్. ఎంత తింటే అంత పెరుగుతుంటుంది. బరువు పెరిగాక బాడీని వెనక ఫిట్‌నెస్‌కి తీసుకురావలని కష్టపడేకన్నా ముందే సరైన జాగ్రత్తలు తీసుకోవడం మంచిది'' అని వివరించారు ఈ బ్యూటీ అండ్ గ్రూమర్.

– నిర్మలారెడ్డి

యూత్ పల్స్



థర్డ్ ఐ
ది పవర్ ఆఫ్ క్రియేటివిటీ

అద్భుత దృశ్యాలను వర్ణించడానికి... 'రెండు కళ్లు సరిపోవు' అంటాం. అద్భుత దృశ్యాలను సృష్టించడానికి రెండు కళ్లతోపాటు మూడోకన్ను కూడా అవసరం. దాని పేరే... క్రియేటివ్ ఐ బూమింగ్ మార్కెట్ యానిమేషన్, వీఎఫ్ఎక్స్‌లో ఇన్వెస్ట్‌మెంట్ పెరగడం ఒక కోణం అయితే, ఉపాధి అవకాశాలు పెరగడం, యువతరం క్రియేటివిటీకి విశాలమైన వేదిక దొరకడం అనేది మరో కోణం...

ఉత్తరప్రదేశ్‌లోని ఘజియాబాద్‌కు చెందిన ఇరవై ఏడు సంవత్సరాల అభినవ్ భరద్వాజ్ ఫ్యాషన్ బ్లాగర్, డిజిటల్ కంటెంట్ క్రియేటర్. వీఎఫ్ఎక్స్, యానిమేషన్‌లో డిగ్రీ పూర్తి చేసిన అభినవ్‌కు ఎన్నో పురాణ పాత్రలపై అవగాహన ఉంది. ఇరవై సంవత్సరాల వయసులో ఆర్ట్, డిజైనింగ్‌ను కెరీర్‌గా చేసుకున్న అభినవ్ లాక్‌డౌన్ సమయంలో ట్రెండింగ్ టాపిక్స్‌పై లెక్కలేనన్ని డిజైన్‌లను తన ఇన్‌స్టాగ్రామ్ పేజీలో సృష్టించాడు. వాటికి మంచి స్పందన రావడం ఒక ఎత్తయితే పాపులర్ బ్రాండ్‌ల నుంచి అవకాశాలు రావడం మరో ఎత్తు.

'మనకు ఉన్న రెండు కళ్లతోపాటు క్రియేటివ్ ఐ అనే మూడో కన్ను కూడా ఉండాలి. అది ఉన్నప్పుడే బ్రాండ్ డిజైనింగ్ నుంచి సినిమా వీఎఫ్ఎక్స్ వరకు రాణించగలం' అంటాడు అభినవ్.

కలర్స్ నుంచి డ్రెస్సింగ్ సెన్స్ వరకు అతడి యూనిక్ స్టైల్ స్టేట్‌మెంట్‌కు యువతలో ఎంతోమంది అభిమానులు ఉన్నారు. ఆ అభిమానుల్లో బెంగళూరుకు చెందిన శ్రీతేజస్వి ఒకరు.



డిగ్రీ రెండోసంవత్సరం చదువుతున్న తేజస్వి వీఎఫ్ఎక్స్‌కు ప్రాధాన్యత ఉన్న చిత్రాలను విడుదలైన మొదటి రోజే చూస్తుంది. ఆ సాంకేతికత గురించి తన అభిప్రాయాలను ఫేస్‌బుక్‌లో రాస్తుంది. వినోద రంగంలో యానిమేషన్, వీఎఫ్ఎక్స్ టెక్నాలజీకి ఇది బంగారు కాలం. యానిమేషన్, విజువల్ ఎఫెక్ట్ స్టూడియోల సంఖ్య పెరుగుతోంది. ముంబై, చెన్నై, బెంగళూరు... మొదలైన నగరాలు యానిమేషన్ కంపెనీలు, అకాడమీలకు కేంద్రాలుగా మారాయి. మన దేశానికి పెద్ద ఎంటర్‌టైన్‌మెంట్ మార్కెట్ ఉంది. ఒక అధ్యయనం ప్రకారం ఈ రంగంలో 2025 కల్లా 75,000 నుంచి 1,25,000 ఉద్యోగ అవకాశాలు ఏర్పడనున్నాయి.

కమర్షియల్స్, వెబ్ సిరీస్, మూవీస్, ఓటీటీకి హై–క్వాలిటీ మెటీరియల్ కావాలి. ఈ నేపథ్యంలో యానిమేషన్, వీఎఫ్ఎక్స్‌లకు ప్రాధాన్యత పెరిగింది. యానిమేషన్, వీఎఫ్ఎక్స్ బిజినెస్ కాంబినేషన్ యువతను ఆకర్షిస్తుంది. కొత్త ఆలోచనలకు అవకాశం కల్పిస్తుంది. ఎంటర్‌టైన్‌మెంట్ ఇండస్ట్రీ యానిమేషన్‌కు డిమాండ్‌ను పెంచే కథలను సిద్ధం చేస్తోంది.

'వీఎఫ్ఎక్స్, యానిమేషన్‌లకు గత కొన్ని సంవత్సరాలుగా డిమాండ్ పెరిగింది. అంచనాలకు అందని విధంగా ఈ రంగం చాలా అడ్వాన్స్‌డ్‌గా ఉంది. వీఎఫ్ఎక్స్ అనేది సాంకేతికత మాత్రమే కాదు. అంతకంటే ఎక్కువ. కథాసంవిధానంలో భాగం' అంటున్నాడు వీఎఫ్ఎక్స్ నిపుణుడు రాజీవ్ కుమార్.

స్కూల్ రోజుల నుంచే వీఎఫ్ఎక్స్ అంటే రాజీవ్‌కు ఆసక్తి. అయితే దాన్ని కెరీర్‌గా ఎలా చేసుకోవాలనే దానిపై స్పష్టత ఉండేది కాదు. పుణెలో మాస్ కమ్యూనికేషన్ పూర్తి చేసిన రాజీవ్ ముంబైకి వెళ్లి వీఎఫ్ఎక్స్ ఇండస్ట్రీతో ప్రయాణం మొదలుపెట్టి భారీ విజయం సాధించాడు.

మలయాళ చిత్రం కందిట్టుండు (అది చూడు) బెస్ట్ యానిమేషన్ షార్ట్ ఫిల్మ్‌గా జాతీయ అవార్డ్ గెలుచుకుంది. 25 సంవత్సరాల అదితి క్రిష్ణదాస్ ఈ చిత్రానికి దర్శకురాలు.



అ కథలు మళ్లీ ఇప్పుడు

మనకు తరతరాల కథల సంపద ఉంది. అమ్మమ్మలు, నానమ్మల నోటి నుంచి కథలు వినే దృశ్యాలు అరుదై పోయాయి. ఈ నేపథ్యంలో యానిమేషన్‌కు ప్రాధాన్యత పెరిగింది. మరుగున పడిన ఎన్నో కథలను పిల్లలకు ఆకట్టుకునేలా చెప్పవచ్చు. యానిమేషన్ ఫిల్మ్స్ అంటే ఫన్నీ కార్టూన్స్‌ను మాత్రమే కాదు.

– అదితి క్రిష్ణదాస్, డైరెక్టర్

అహ్మదాబాద్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డిజైన్స్ (ఎన్ఐడీ) లో యానిమేషన్ కోర్సు చేసిన అదితి క్రిష్ణదాస్ తొలి చిత్రంతోనే జాతీయ అవార్డ్ అందుకుంది.

విజువల్ ఎఫెక్ట్స్ ప్రొడ్యూసర్‌గా మంచి పేరు తెచ్చుకుంది చెన్నైకి చెందిన ప్రియాంక సుబ్రమణియన్. లండన్ ఫిల్మ్ స్కూల్‌లో చదువుకునే రోజుల్లో ఒక ఫ్రెండ్ ద్వారా మూవింగ్ పిక్చర్ కంపెనీకి తరచు వెళ్లేది. ఇండస్ట్రీ ధోరణులను అర్థం చేసుకోవడం కోసం ఎందరో కళాకారులతో మాట్లాడేది. పుస్తకాలు చదివేది. స్టూడియోలలో అవసరమైన వారికి టీ, కాఫీలు, వోల్డ్ టేప్‌లు, హార్డ్ డిస్క్‌లు అందించేది. వ్యాపారవేత్తల కుటుంబానికి చెందిన ప్రియాంక సొంతంగా ఏదైనా వ్యాపారం చేయాలని కలలు కనేది. వీఎఫ్ఎక్స్ స్టూడియో రూపంలో తన కలను సాకారం చేసుకుంది.

మీ శక్తి వృథా చేయవద్దు

వీఎఫ్ఎక్స్ ప్రొడ్యూసర్‌గా ప్రయాణం మొదలుపెట్టిన కొత్తలో ఎన్నో నిద్రలేని రాత్రులు గడపాల్సి వచ్చింది. అప్పుడు పడిన కష్టానికి ఇప్పుడు ఫలితం దక్కింది. యవ్వనంలో ఉన్నప్పుడు ఎంత కష్టమైనా చేసే శక్తి ఉంటుంది. ఆ శక్తి నిరుపయోగం కాకుండా చూసుకోవాలి.

– ప్రియాంక సుబ్రమణియన్
విజువల్ ఎఫెక్ట్స్ ప్రొడ్యూసర్

బ్యూటిప్స్

పటికతో రోజంతా తాజాదనం

శరీరం నుంచి రోజంతా దుర్వాసన లేకుండా ఉండాలంటే...



- స్నానం చేసే నీటిలో పటికముక్కలను వేసి రెండు గంటలపాటు నానబెట్టాలి. పటిక మొత్తం కరిగిన తరువాత ఆ నీటితో స్నానం చేయాలి. స్నానం తరువాత శరీరాన్ని తడిలేకుండా శుభ్రంగా తుడుచుకోవాలి. ఇలా స్నానం చేస్తే రోజంతా దుర్వాసన లేకుండా తాజాగా ఉంటారు. వీలైతే రాత్రంతా పటికను నానబెట్టుకుని ఉదయాన్నే ఆ నీటితో స్నానం చేస్తే మరీ మంచిది.
- అరటిపండు, బ్రకోలి, సిట్రస్ జాతి పండ్లను ఆహారంలో అధికంగా చేర్చుకుంటే... చర్మం జిడ్డుతనం తగ్గి ఆరోగ్యంగా తయారవుతుంది.



పడుకునే ముందు ముఖం కడుగుతున్నారా?



- రాత్రి పడుకునే ముందు ముఖాన్ని కడుక్కుంటే మీ ముఖం మరింత కాంతిమంతంగా తయారవుతుందని నిపుణులు చెబుతున్నారు. అవేంటో చూసేయండి.
- సాధారణ నీటితో ముఖాన్ని శుభ్రంగా కడిగి, కాటన్ వస్త్రంతో తడిలేకుండా తుడిచి ఆ తరువాత పడుకోవాలి.
- రోజూ పడుకునేముందు ఇలా చేయడం వల్ల ముఖం మీద పేరుకుపోయిన మురికి, మట్టి వదిలి చర్మం ఆరోగ్యంగా ఉంటుంది.
- చర్మం మీద ఉండే సూక్ష్మ రంధ్రాలు చక్కగా శ్వాసిస్తాయి. దీనివల్ల ముడతలు తగ్గి చర్మం కాంతిమంతంగా, యవ్వనంగా కనిపిస్తుంది.
- మొటిమల ముప్పు తగ్గుతుంది.
- పడుకునే ముందు ముఖాన్ని కడగడం వల్ల చర్మానికి తేమ అంది పొడిబారకుండా ఉంటుంది. పొడిచర్మం ఉన్నవారు రోజూ పడుకునేముందు ముఖం కడుక్కోవడం అలవాటు చేసుకుంటే మంచిది.



చర్మం మీద ముడతలు, కాలిన గాయాలు, మొటిమలు, బ్లాక్‌హెడ్స్, వైట్ హెడ్స్,గీతలు, మచ్చలు తగ్గాలంటే పచ్చి బంగాళాదుంపను తురిమి ముఖం మీద ప్యాక్‌వేయాలి లేదా మర్దన చేయాలి. ప్రతిరోజూ క్రమం తప్పకుండా నెల రోజులుచేస్తే మంచి ఫలితం ఉంటుంది.



క్యాన్సర్ రోగులకు సౌకర్యాల వేర్

సుకన్య




సంధ్యారావు



సాధారణంగా రిటైర్మెంట్‌కు దగ్గర్లో ఉన్న వారెవరైనా... 'ఇన్నాళ్లూ పనిచేసి అలసిపోయాం, ఇక విశ్రాంతి తీసుకుందాం' అనుకుంటారు. అయితే సుకన్య, సంధ్యారావులు మాత్రం ఇలా అనుకోలేదు. రిటైర్మెంట్ తరువాత కొత్త వ్యాపారం చేయాలనుకున్నారు. అరవై ఏళ్లకు దగ్గరలో ఉన్నా వారిలోని హుషారు, ఉత్సాహం ఏమాత్రం తగ్గలేదు. అక్క సుకన్య ఎమ్మెస్సీ చేసింది. దానికితోడు టీచింగ్, ఫార్మా, ఆడిటింగ్, ఆర్ట్స్ విభాగాల్లో పనిచేసిన అనుభవం ఉంది. టెక్స్‌టైల్ టెక్నాలజీ ఇంజినీర్ జాతీయ అంతర్జాతీయ బ్రాండ్స్‌లో పనిచేసిన అనుభవం వాటికి తోడైంది. అయితే అనుకోకుండా ఎదురైన ఒక సంఘటన వల్ల వారు క్యాన్సర్ రోగులకు ముఖ్యంగా స్త్రీలకు అవసరం అయిన ప్రత్యేక తరహా దుస్తులను రూపొందిస్తూ తమ వైవిధ్యాన్ని కూడా చాటుకుంటున్నారు.

అత్తయ్య అవస్థలు చూసి...

దుస్తుల పరిశ్రమలో ఇరవై ఏళ్లపాటు పనిచేసిన సంధ్య తనకు తనే బాస్ కావాలి అనుకునేది. ఈ క్రమంలోనే ఏదైనా దుస్తుల తయారీ కంపెనీ పెడితే బాగుంటుందని అనుకున్నారు అక్కాచెల్లెళ్లు. వీరు ఇలా ఆలోచిస్తున్న సమయంలో... వీరిద్దరికీ ఎంతో ఇష్టమైన వీరి మేనత్తకు రొమ్ము క్యాన్సర్ ఉన్నట్లు తెలిసింది. సుకన్య, సంధ్యలకు మంచి స్నేహితురాలిలా ఉండే మేనత్త క్యాన్సర్‌తో బాధపడడం వారిని కలచి వేసింది.

ఒకపక్క క్యాన్సర్ బాధిస్తుంటే మరోపక్క ఆమె ధరించే దుస్తులు ఆమెకు సౌకర్యంగా లేకపోవడాన్ని ఇద్దరూ గమనించారు. క్యాన్సర్‌తో బాధపడే ఎంతోమంది రోగులు కూడా ఈ సమస్యను ఎదుర్కొంటున్నారు. క్యాన్సర్ రోగులు ధరించడానికి వీలుగా ఉండే దుస్తులు రూపొందిస్తే వందలాది మంది క్యాన్సర్ రోగులకు సాయం చేసినట్లే అనుకుని 'వీకీ వేర్' పేరిట క్యాన్సర్ రోగులకు దుస్తులు తయారు చేయడం ప్రారంభించారు.

సలహాలు... సూచనలతో...

ఆంకాలజిస్టులు, క్యాన్సర్ రోగుల సలహాలు, సూచనలు తీసుకుని 2017లో తలకు పెట్టుకునే టోపీని రూపొందించారు. కాటన్‌తో తయారు చేసిన ఈ టోపీని కీమోథెరపీ చేయించుకునేటప్పుడు ధరించడానికి అనుకూలంగా తయారు చేశారు. తరువాత మాస్టెక్టమీ బ్రాలను రూపొందించారు. చర్మానికి సౌకర్యంగా ఉండే బ్రాలను మార్కెట్ ధర కంటే తక్కువ ధరకే అందుబాటులోకి తీసుకొచ్చారు. ఇలా క్యాన్సర్ రోగులకు అవసరమైన వాటిని స్వయం సహాయక గ్రూపులతో తయారు చేయిస్తూ సాటి మహిళలకు ఉపాధి కల్పిస్తున్నారు. వీరి వీకీ వేర్ ఉత్పత్తులు ఇతర దేశాలకు కూడా ఎగుమతి అవుతున్నాయి.

రోగులకు ఇలా...

వీకీ వేర్ ఉత్పత్తులు తయారయ్యాక క్యాన్సర్ రోగులకు టెస్టింగ్ కోసం పంపించి, వారికి అన్నివిధాల సౌకర్యంగా ఉన్నాయన్న నిర్ధారణ అయిన తరువాత మార్కెట్లో విక్రయిస్తున్నారు. క్యాన్సర్ కేర్ ఆసుపత్రుల్లోని డాక్టర్లను కలిసి వీకీ వేర్ గురించి చెప్పడం, క్యాన్సర్‌తో ధైర్యంగా పోరాడుతున్న రోగులకు వాటిని ఇవ్వడం ద్వారా వీకీ వేర్ రోగులకు చేరుతున్నాయి. వీకీ వేర్ వెబ్‌సైట్, సోషల్ మీడియా, ఈ కామర్స్ సైట్ల ద్వారా ఉత్పత్తులు విక్రయిస్తున్నారు సుకన్య, సంధ్యారావులు.

''మీ కలలను ఎప్పటికీ వదులుకోవద్దు. మిమ్మల్ని మీరు నమ్ముకోండి. మీరు కంటోన్న కల మీద నమ్మకం ఉంచండి. అది తీరడానికి సుదీర్ఘ కాలం పట్టవచ్చు. అయినా వెనక్కి తగ్గవద్దు. కలను నిజం చేసుకునే క్రమంలో ఎవరినైనా సాయం అడగడానికి సిగ్గుపడవద్దు. ఇలా నిజాయితీగా ముందుకు సాగితే వ్యాపారం ఏదైనా రాణించగలుగుతారు'' అని సుకన్య, సంధ్యలు యువతరానికి ధైర్యాన్ని నూరిపోస్తున్నారు.

కిచెన్‌టిప్స్



- ఇడ్లీ, దోశ పిండి త్వరగా పాడు కాకుండా ఉండాలంటే... ఇడ్లీ, దోశ పిండికోసం నానబెట్టే పప్పు, బియ్యం, రవ్వలను కడిగేటప్పుడు కొద్దిగా ఉప్పువేసి కడగాలి. ఇలా కడిగి రుబ్బిన పిండి నాలుగైదు రోజులపాటు పులవకుండా ఉంటుంది.
- కిచెన్ షెల్ఫులు,తలుపులు రోజూ శుభ్రం చేస్తున్నా కూడా జిడ్డు పడుతుంటాయి. నెలకొకసారి లీటరు వేడి నీటిలో ఒక టేబుల్ స్పూన్ అమోనియా, రెండు టేబుల్ స్పూన్ల వెనిగర్ కలిపి స్ప్రే బాటిల్‌లో పోసుకుని జిడ్డుగా ఉన్న ప్రదేశాలలో స్ప్రే చేసి తడి పీల్చుకునే పొడి వస్త్రంతో తుడవాలి.



భారత బాస్కెట్‌బాల్ జట్టులో ఆర్యన్

ఆసియా కప్ అండర్–16 బాస్కెట్‌బాల్ చాంపియన్‌షిప్‌లో పాల్గొనే భారత జట్టులో తెలంగాణకు చెందిన ఆర్యన్ శర్మకు చోటు లభించింది. ఈ టోర్నీ ఈనెల 17 నుంచి 24 వరకు ఖతర్ రాజధాని దోహాలో జరుగుతుంది. హైదరాబాద్‌లోని ఢిల్లీ పబ్లిక్ స్కూల్ విద్యార్థి అయిన ఆర్యన్ శర్మ భారత కోచ్ పీఎస్ సంతోష్ ఆధ్వర్యంలో కీస్టోన్ బాస్కెట్‌బాల్ అకాడమీలో శిక్షణ తీసుకుంటాడు. ఈ టోర్నీలో రాణిస్తే భారత జట్టు వచ్చే ఏడాది జూలైలో తుర్కియేలో జరిగే ప్రపంచకప్ అండర్–17 టోర్నమెంట్‌కు అర్హత సాధిస్తుంది.



అంకిత రైనా పరాజయం

జపాన్ ఓపెన్ డబ్ల్యూటీఏ–250 టెన్నిస్ టోర్నీలో భారత నంబర్‌వన్ అంకిత రైనా పోరాటం తొలి రౌండ్‌లోనే ముగిసింది. ఒసాకాలో మంగళవారం జరిగిన మహిళల సింగిల్స్ మొదటి రౌండ్ మ్యాచ్‌లో ప్రపంచ 181వ ర్యాంకర్ అంకిత 4–6, 2–6తో ప్రపంచ 174వ ర్యాంకర్ మొయుక ఉచిజుమా (జపాన్) చేతిలో ఓడిపోయింది. 80 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో అంకిత తన సర్వీస్‌ను మూడుసార్లు కోల్పోయింది. తొలి రౌండ్‌లో ఓడిన అంకితకు 2,804 డాలర్ల (రూ. 2 లక్షల 32 వేలు) ప్రైజ్‌మనీ లభించింది.

లంకను గెలిచి...

- ఆసియా కప్ ఫైనల్లో భారత్ • శ్రీలంకపై 41 పరుగులతో విజయం
- రాణించిన రోహిత్, కుల్దీప్ • వెలలాగె ఆల్‌రౌండ్ ప్రదర్శన వృథా

ఆసియా కప్‌లో వరుసగా మూడో రోజూ భారత్‌దే... సోమవారం పాక్‌పై విజయానందాన్ని కొనసాగిస్తూ మంగళవారం కూడా మరో విజయాన్ని టీమిండియా తమ ఖాతాలో వేసుకొని ఫైనల్లోకి అడుగు పెట్టింది. బౌలింగ్‌కు బాగా అనుకూలించిన పిచ్‌పై శ్రీలంక స్పిన్నర్ల ధాటికి తడబడి 213 పరుగులకే పరిమితమైనా... మన బౌలింగ్ బలగంతో ఆ స్వల్ప స్కోరును కూడా కాపాడుకోగలిగింది. కొంత వరకు పోరాడగలిగినా చివరకు లంకకు ఓటమి తప్పలేదు.



కుల్దీప్ యాదవ్

కొలంబో: సూపర్–4 దశలో వరుసగా రెండో విజయంతో భారత జట్టు ఆసియా కప్ టోర్నీలో ఫైనల్‌కు అర్హత సాధించింది. మంగళవారం జరిగిన మ్యాచ్‌లో భారత్ 41 పరుగుల తేడాతో శ్రీలంకను ఓడించింది. టాస్ గెలిచి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన భారత్ 49.1 ఓవర్లలో 213 పరుగులకే ఆలౌటైంది. రోహిత్ శర్మ (48 బంతుల్లో 53; 7 ఫోర్లు, 2 సిక్స్‌లు) అర్ధ సెంచరీ సాధించగా... కేఎల్ రాహుల్ (44 బంతుల్లో 39; 2 ఫోర్లు), ఇషాన్ కిషన్ (61 బంతుల్లో 33; 1 ఫోర్, 1 సిక్స్) రాణించారు. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' దునిత్ వెలలాగె (5/40) కెరీర్‌లో అత్యుత్తమ బౌలింగ్ ప్రదర్శన నమోదు చేయగా, అసలంకకు 4 వికెట్లు దక్కాయి. వరుసగా 14వ వన్డేలోనూ శ్రీలంక జట్టు ప్రత్యర్థిని ఆలౌట్ చేయగా... భారత జట్టు మొత్తం 10 వికెట్లను స్పిన్నర్లకే చేజార్చుకోవడం ఇదే తొలిసారి కావడం గమనార్హం. అనంతరం లంక 41.3 ఓవర్లలో 172 పరుగులకు ఆలౌటైంది. దునిత్ వెలలాగె (46 బంతుల్లో 42 నాటౌట్; 3 ఫోర్లు, 1 సిక్స్), ధనంజయ డిసిల్వా (66 బంతుల్లో 41; 5 ఫోర్లు) రాణించారు. నాలుగు పాయింట్లతో ఫైనల్ బెర్త్‌ను ఖరారు చేసుకున్న భారత్ తమ చివరి సూపర్–4 మ్యాచ్‌లో శుక్రవారం బంగ్లాదేశ్‌తో తలపడుతుంది. రెండు పాయింట్లతో ప్రస్తుతం శ్రీలంక, పాకిస్తాన్ సంయుక్తంగా రెండో స్థానంలో ఉన్నాయి. ఈ రెండు జట్ల మధ్య గురువారం జరిగే మ్యాచ్‌లో గెలిచిన జట్టు ఆదివారం జరిగే ఫైనల్లో భారత్‌తో తలపడుతుంది. ఒకవేళ శ్రీలంక, పాకిస్తాన్ మ్యాచ్ వర్షం కారణంగా రద్దయితే మెరుగైన రన్‌రేట్ ఉన్న శ్రీలంక (–0.200) పాకిస్తాన్ (–1.892)ను వెనక్కి నెట్టి ఫైనల్ చేరుతుంది.

ఆదుకున్న రాహుల్, కిషన్...

గత మ్యాచ్ తరహాలోనే ఓపెనర్ రోహిత్ జట్టుకు శుభారంభం అందించాడు. శుబ్‌మన్ గిల్ (25 బంతుల్లో 19; 2 ఫోర్లు) కాస్త నెమ్మదిగా ఆడినా రోహిత్ దూకుడుతో భారత్ దూసుకుపోయింది. షనక ఓవర్లో రోహిత్ 4 ఫోర్లతో చెలరేగాడు. తొలి వికెట్‌కు 67 బంతుల్లోనే 80 పరుగులు జతచేరాయి. అయితే వెలలాగె జట్టును దెబ్బ తీశాడు. తన తొలి మూడు ఓవర్లలో అతను వరుసగా గిల్, కోహ్లి (12 బంతుల్లో 3), రోహిత్‌లను అవుట్ చేయడంతో 11 పరుగుల వ్యవధిలో జట్టు 3 వికెట్లు కోల్పోయింది. ఈ దశలో కిషన్, రాహుల్ కలిసి పరిస్థితికి తగినట్లుగా జాగ్రత్తగా ఆడుతూ జట్టును ఆదుకున్నారు. వీరిద్దరు నాలుగో వికెట్‌కు 63 పరుగులు జత చేశాక రాహుల్ వికెట్ కూడా వెలలాగె ఖాతాలో చేరింది. కిషన్‌ను అసలంక వెనక్కి పంపగా, తర్వాతి 16 పరుగుల వ్యవధిలో భారత్ మరో 4 వికెట్లు చేజార్చుకుంది. చివర్లో అక్షర్ పటేల్ (36 బంతుల్లో 26; 1 సిక్స్) కీలక పరుగులు జోడించి స్కోరును 200 దాటించాడు. గత మ్యాచ్ ఆడిన శార్దుల్ స్థానంలో అక్షర్‌ను భారత్ తుది జట్టులోకి తీసుకుంది.

పోరాడినా...

శ్రీలంకలాగే మనమూ స్పిన్నర్లతో దెబ్బ కొట్టేందుకు సిద్ధమైనా... దానికి ముందే పేసర్లు వారి పని పట్టారు. బుమ్రా, సిరాజ్ ధాటికి 25 పరుగులకే తొలి 3 వికెట్లు కోల్పోయిన లంక ఆ తర్వాత తక్కువ వ్యవధిలో మరో 3 వికెట్లు చేజార్చుకొని ఓటమి దిశగా పయనించింది. అయితే ఈ దశలో ధనంజయ, వెలలాగె భాగస్వామ్యం లంక విజయంపై ఆశలు రేపింది. భారత బౌలర్లను సమర్థంగా ఎదుర్కొంటూ వీరిద్దరు పరుగులు సాధించారు. ఏడో వికెట్‌కు ఈ జోడీ 75 బంతుల్లో 63 పరుగులు జోడించింది. ఎట్టకేలకు జడేజా ఈ భాగస్వామ్యాన్ని విడదీయడంతో భారత్ ఊపిరి పీల్చుకుంది.

రోహిత్ @10,000



భారత కెప్టెన్ రోహిత్ శర్మ వన్డేల్లో అరుదైన మైలురాయిని అధిగమించాడు. లంకతో మ్యాచ్‌లో రజిత బౌలింగ్‌లో సిక్సర్‌తో 23 పరుగులకు చేరుకోగానే రోహిత్ 10 వేల పరుగులు పూర్తి చేసుకున్నాడు. భారత్ తరఫున ఈ ఘనత సాధించిన ఆరో బ్యాటర్‌గా నిలిచిన రోహిత్ ఓవరాల్‌గా 15వ ఆటగాడు. తన 241వ ఇన్నింగ్స్‌లో తాజా రికార్డు అందుకున్న అతను ఈ జాబితాలో కోహ్లి (205 ఇన్నింగ్స్) తర్వాత రెండో స్థానంలో నిలిచాడు.



వెలలాగె

స్కోరు వివరాలు

భారత్ ఇన్నింగ్స్: రోహిత్ శర్మ (బి) వెలలాగె 53; గిల్ (బి) వెలలాగె 19; కోహ్లి (సి) షనక (బి) వెలలాగె 3; ఇషాన్ కిషన్ (సి) వెలలాగె (బి) అసలంక 33; రాహుల్ (సి అండ్ బి) వెలలాగె 39; హార్దిక్ పాండ్యా (సి) మెండిస్ (బి) వెలలాగె 5; జడేజా (సి) మెండిస్ (బి) అసలంక 4; అక్షర్ పటేల్ (సి) సమరవిక్రమ (బి) తీక్షణ 26; బుమ్రా (బి) అసలంక 5; కుల్దీప్ (సి) ధనంజయ (బి) అసలంక 0; సిరాజ్ (నాటౌట్) 5; ఎక్స్‌ట్రాలు 21; **మొత్తం (49.1 ఓవర్లలో ఆలౌట్) 213. వికెట్ల పతనం:** 1–80, 2–90, 3–91, 4–154, 5–170, 6–172, 7–178, 8–186, 9–186, 10–213. **బౌలింగ్:** రజిత 4–0–30–0, తీక్షణ 9.1–0–41–1, షనక 3–0–24–0, పతిరణ 4–0–31–0, వెలలాగె 10–1–40–5, ధనంజయ 10–0–28–0, అసలంక 9–1–18–4.

శ్రీలంక ఇన్నింగ్స్: నిసాంక (సి) రాహుల్ (బి) బుమ్రా 6; కరుణరత్నే (సి) గిల్ (బి) సిరాజ్ 2; మెండిస్ (సి) (సబ్) సూర్యకుమార్ (బి) బుమ్రా 15; సమరవిక్రమ (స్టంప్డ్) రాహుల్ (బి) కుల్దీప్ 17; అసలంక (సి) రాహుల్ (బి) కుల్దీప్ 22; ధనంజయ (సి) గిల్ (బి) జడేజా 41; షనక (సి) రోహిత్ (బి) జడేజా 9; వెలలాగె (నాటౌట్) 42; తీక్షణ (సి) (సబ్) సూర్యకుమార్ (బి) పాండ్యా 2; రజిత (బి) కుల్దీప్ 1; పతిరణ (బి) కుల్దీప్ 0; ఎక్స్‌ట్రాలు 15; **మొత్తం (41.3 ఓవర్లలో ఆలౌట్) 172. వికెట్ల పతనం:** 1–7, 2–25, 3–25, 4–68, 5–73, 6–99, 7–162, 8–171, 9–172, 10–172. **బౌలింగ్:** బుమ్రా 7–1–30–2, సిరాజ్ 5–2–17–1, పాండ్యా 5–0–14–1, కుల్దీప్ 9.3–0–43–4, జడేజా 10–0–33–2, అక్షర్ 5–0–29–0.

గాయత్రి–ట్రెసా జోడీ శుభారంభం

హాంకాంగ్ ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నీ



కౌలూన్: హాంకాంగ్ ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్–500 బ్యాడ్మింటన్ టోర్నీ మహిళల డబుల్స్ విభాగంలో భారత నంబర్‌వన్ జోడీ పుల్లెల గాయత్రి–ట్రెసా జాలీ శుభారంభం చేసింది. మంగళవారం జరిగిన మెయిన్ 'డ్రా' తొలి రౌండ్‌లో గాయత్రి–ట్రెసా జాలీ ద్వయం 54 నిమిషాల్లో 21–15, 16–21, 21–16తో జిలీ డెబోరా–చెరిల్ సీనెన్ (నెదర్లాండ్స్) జంటపై నెగ్గి ప్రిక్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లింది. గురువారం జరిగే ప్రిక్వార్టర్ ఫైనల్లో ఏడో సీడ్ అప్రియాని రహాయు–సితీ ఫాదియా సిల్వా (ఇండోనేసియా)లతో గాయత్రి–ట్రెసా తలపడతారు. మహిళల సింగిల్స్ క్వాలిఫయింగ్ నుంచి మాళవిక బన్సోద్ మెయిన్ 'డ్రా'కు అర్హత పొందగా... పురుషుల సింగిల్స్ క్వాలిఫయింగ్ నుంచి కిరణ్ జార్జి, రవి చివరి రౌండ్ మ్యాచ్‌ల్లో ఓడిపోయి మెయిన్ 'డ్రా'కు చేరుకోలేకపోయారు. మిక్స్‌డ్ డబుల్స్ విభాగంలో సుమీత్ రెడ్డి–అశ్విని పొన్నప్ప (భారత్) ద్వయం మెయిన్ 'డ్రా'కు చేరింది. క్వాలిఫయింగ్ మ్యాచ్‌లో సుమీత్–అశ్విని జోడీ 21–15, 21–14తో అల్విన్ మొరాదా–అలీసా (చెక్ రిపబ్లిక్) జంటను ఓడించింది. మహిళల డబుల్స్ క్వాలిఫయింగ్‌లో అశ్విని పొన్నప్ప–తనీషా క్రాస్టో జోడీ 21–16, 21–14తో సిక్కి రెడ్డి–ఆరతి జంటపై గెలిచి మెయిన్ 'డ్రా'కు అర్హత సాధించింది.

థాయ్‌లాండ్‌తో భారత్ తొలి పోరు

మహిళల హాకీ ఆసియా చాంపియన్స్ ట్రోఫీ



రాంచీ: భారత్ వేదికగా తొలిసారి జరగనున్న మహిళల ఆసియా చాంపియన్స్ ట్రోఫీ హాకీ టోర్నీ షెడ్యూల్‌ను మంగళవారం ప్రకటించారు. అక్టోబర్ 27 నుంచి నవంబర్ 5 వరకు జరిగే ఈ టోర్నీకి రాంచీ ఆతిథ్యమివ్వనుంది. భారత్, చైనా, జపాన్, దక్షిణ కొరియా, థాయ్‌లాండ్, మలేసియా జట్లు తమ అదృష్టాన్ని పరీక్షించుకుంటాయి. అక్టోబర్ 27న థాయ్‌లాండ్ జట్టుతో భారత్ తమ టైటిల్ వేటను ప్రారంభిస్తుంది. అనంతరం 28న మలేసియాతో, 30న చైనాతో, 31న జపాన్‌తో, నవంబర్ 2న కొరియాతో భారత్ ఆడుతుంది. రౌండ్ రాబిన్ లీగ్ మ్యాచ్‌లు ముగిశాక టాప్–4లో నిలిచిన జట్లు సెమీఫైనల్ చేరుకుంటాయి. సెమీఫైనల్స్ నవంబర్ 4న, ఫైనల్స్ నవంబర్ 5న జరుగుతాయి. 2010 నుంచి ఇప్పటి వరకు ఆసియా మహిళల చాంపియన్స్ ట్రోఫీ ఆరుసార్లు జరిగింది. భారత్ 2016లో టైటిల్ గెలిచింది. 2010లో మూడో స్థానం పొందగా.. 2013, 2018లో రన్నరప్‌గా నిలిచింది.

హాలెప్‌పై నాలుగేళ్ల నిషేధం



లండన్: డోపింగ్ నిబంధనలను అతిక్రమించినందుకు... రొమేనియా టెన్నిస్ స్టార్, ప్రపంచ మాజీ నంబర్‌వన్ సిమోనా హాలెప్‌పై ఇంటర్నేషనల్ టెన్నిస్ ఇంటిగ్రిటీ ఏజెన్సీ (ఐటీఐఏ) నాలుగేళ్లపాటు నిషేధం విధించింది. 31 ఏళ్ల హాలెప్ 2022 యూఎస్ ఓపెన్ సందర్భంగా డోపింగ్ పరీక్షలో విఫలమైంది. దాంతో ఆమెపై 2022 అక్టోబర్‌లో తాత్కాలిక నిషేధం విధించారు. ఐటీఐఏ ప్యానెల్ విచారణలో హాలెప్ ఉద్దేశపూర్వకంగానే డోపింగ్ నియమావళిని ఉల్లంఘించిందని తేలింది. దాంతో ఆమెపై నిషేధాన్ని అక్టోబర్ 2026 వరకు పొడిగించారు. 2017లో ప్రపంచ నంబర్‌వన్‌గా అవతరించిన హాలెప్ రెండు గ్రాండ్‌స్లామ్ (2018లో ఫ్రెంచ్ ఓపెన్, 2019లో వింబుల్డన్) సింగిల్స్ టైటిల్స్ సాధించింది. మరోవైపు ఐటీఐఏ విధించిన నిషేధాన్ని కోర్ట్ ఆఫ్ ఆర్బిట్రేషన్ ఫర్ స్పోర్ట్‌లో సవాలు చేస్తానని హాలెప్ తెలిపింది.

సినిమా



• వరుణ్ తేజ్

అక్టోబరులో ఆరంభం

వరుణ్ తేజ్ హీరోగా 'పలాస' ఫేమ్ కరుణకుమార్ దర్శకత్వంలో 'మట్కా' చిత్రం రూపొందుతున్న సంగతి తెలిసిందే. మీనాక్షీ చౌదరి, నోరా ఫతేహీ హీరోయిన్లుగా నటిస్తున్నారు. ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ అక్టోబరు మొదటివారంలో హైదరాబాద్‌లో ప్రారంభం కానుందని, ఈ తొలి షెడ్యూల్ దాదాపు ఇరవై రోజుల పాటు హైదరాబాద్‌లోని విభిన్నమైన లొకేషన్స్‌లో జరుగుతుందని సమాచారం. వైజాగ్ నేపథ్యంలో 1958 – 1982 టైమ్ పీరియడ్‌లో జరిగిన వాస్తవ ఘటనల ఆధారంగా 'మట్కా' చిత్రం తెరకెక్కనుంది. కథానుగుణంగా అప్పటి వైజాగ్‌ను తలపించేలా సెట్‌ను నిర్మించాలనే ఆలోచనలో ఉన్నారట యూనిట్. ఈ చిత్రం వచ్చే ఏడాది విడుదల కానుంది.



• రాశీ ఖన్నా

కాస్త ఆలస్యంగా రూల్స్ రంజన్

కిరణ్ అబ్బవరం, నేహా శెట్టి జంటగా నటించిన చిత్రం 'రూల్స్ రంజన్'. రత్నం కృష్ణ దర్శకత్వంలో ఏఎం. రత్నం సమర్పణలో దివ్యాంగ్ లవానియా, మురళీ కృష్ణ వేమూరి నిర్మించిన చిత్రం ఇది. కాగా ఈ సినిమాను ఇటీవల ఈ నెల 28న విడుదల చేస్తున్నట్లుగా చిత్ర యూనిట్ ప్రకటించింది. అయితే అక్టోబరు 6న రిలీజ్ చేయనున్నట్లు మంగళవారం ప్రకటించారు మేకర్స్. మెహర్ చాహల్, 'వెన్నెల' కిషోర్, సుబ్బరాజు, హైపర్ ఆది, 'వైవా' హర్ష కీలక పాత్రల్లో నటించిన ఈ చిత్రానికి సంగీతం: అమ్రిష్ గణేష్.



• నేహా శెట్టి, కిరణ్ అబ్బవరం

పాటలు.. నా సామి రంగ



• నాగార్జున

కొత్త సినిమా కోసం మ్యూజిక్ ఆన్ చేశారు నాగార్జున. కొరియోగ్రాఫర్ విజయ్ బిన్నిని దర్శకుడిగా పరిచయం చేస్తూ, నాగార్జున హీరోగా నటించనున్న చిత్రం 'నా సామిరంగ'. పవన్‌కుమార్ సమర్పణలో శ్రీనివాసా చిట్టూరి ఈ సినిమాను నిర్మించనున్నారు. త్వరలోనే ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ ఆరంభం కానుంది. ప్రస్తుతం ఈ సినిమాకు సంబంధించిన మ్యూజిక్ సిట్టింగ్స్ జోరుగా సాగుతున్నాయి. సంగీత దర్శకుడు ఎమ్ఎమ్ కీరవాణి, లిరిక్ రైటర్ చంద్రబోస్, విజయ్ బిన్ని ఈ మ్యూజిక్ సిట్టింగ్స్‌లో పాల్గొంటున్నారు. యాక్షన్ ఫిల్మ్‌గా తెరకెక్కనున్న 'నా సామిరంగ' చిత్రాన్ని వచ్చే ఏడాది సంక్రాంతి సందర్భంగా విడుదల చేయనున్నట్లు చిత్ర యూనిట్ ప్రకటించిన సంగతి తెలిసిందే.

అమెరికా.. రష్యా యుద్ధంతో...



• సిల్వెస్టర్ స్టాలోన్

యాక్షన్ స్టార్ సిల్వెస్టర్ స్టాలోన్ లీడ్ రోల్‌లో నటించిన తాజా చిత్రం 'ఎక్స్‌పెండబుల్స్ 4'. స్కాట్ వా దర్శకత్వం వహించిన అమెరికన్ యాక్షన్ చిత్రమిది. మల్టీ విజన్ మల్టీ మీడియా ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ సమర్పణలో వస్తున్న ఈ సినిమాని తెలుగు, ఇంగ్లిష్, తమిళ, హిందీ భాషల్లో ఈ నెల 22 విడుదల చేస్తున్నట్లు మేకర్స్ ప్రకటించారు. ''అమెరికా, రష్యా మధ్య యుద్ధాన్ని నివారించడానికి డేర్–డెవిల్ ది ఎక్స్‌పెండబుల్స్ జట్టు ఏం చేసింది? అనే అద్భుతమైన మిషన్‌తో 'ఎక్స్‌పెండబుల్స్ 4' సాగుతుంది'' అన్నారు మేకర్స్. జాసన్ స్టాథమ్, డాల్ఫ్ లండ్‌గ్రెన్, మేగన్ ఫాక్స్, జాక్సన్, టోనీ జా తదితరులు నటించిన ఈ చిత్రానికి కెమెరా: టిమ్ మారిస్–జోన్స్, సంగీతం: గ్విలేమ్ రొసెల్.



అప్పుడు కామెడీ సులభమే - కార్తీక్ రత్నం

'కేరాఫ్ కంచరపాలెం, నారప్ప'.. ఇలా నటుడిగా ఇప్పటివరకూ చాలా ఇంటెన్స్ క్యారెక్టర్స్ చేసిన నేను 'ఛాంగురే బంగారురాజా'లో తొలిసారి ఓ కామెడీ రోల్ చేశాను. కామెడీ చేయడం కష్టం అంటుంటారు. కానీ మంచి స్క్రిప్ట్ ఉంటే కామెడీ చేయడం సులభమేనని నాకు అనిపించింది' అన్నారు కార్తీక్ రత్నం. సతీష్ వర్మ దర్శకత్వంలో కార్తీక్ రత్నం, గోల్డీ నిస్సీ జంటగా నటించిన చిత్రం 'ఛాంగురే బంగారురాజా'. ఫ్రేమ్ బై ఫ్రేమ్ పిక్చర్స్‌తో కలిసి హీరో రవితేజ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 15న విడుదల కానుంది. ఈ సందర్భంగా కార్తీక్ రత్నం మాట్లాడుతూ– ''రంగస్థల నటుడిగా వందకుపైగా నాటకాలను ప్రదర్శించాను. మొదటి నాటకానికే నంది అవార్డు వచ్చింది. నాలా ఇండస్ట్రీకి వచ్చే కొత్త వారికి రవితేజ, నానీగార్లే స్ఫూర్తి. అలాంటిది రవితేజగారు నేను హీరోగా నటించిన సినిమాను నిర్మించడం చాలా సంతోషంగా ఉంది. కొన్ని కొండ ప్రాంతాల్లో లభించే విలువైన రంగు రాళ్ల నేపథ్యంలో ఈ సినిమా కథనం ఉంటుంది. ఇందులో మెకానిక్ బంగారు రాజా పాత్ర చేశాను. దర్శకుడు సతీష్‌వర్మగారికి రైటింగే బలం. స్పాట్‌లో ఆయన స్క్రిప్ట్‌ను ఇంప్రూవ్ చేస్తుంటారు. నేను నటించిన 'శ్రీరంగ నీతులు' విడుదలకు సిద్ధంగా ఉంది. అలాగే ప్రకాశ్‌రాజ్, దర్శకుడు ఏఎల్ విజయ్‌లు కలిసి నిర్మిస్తున్న ఓ ద్విభాషా (తెలుగు, తమిళం) చిత్రం ఒప్పుకున్నాను. మరో ఎగ్జైటింగ్ ప్రాజెక్ట్‌ను త్వరలోనే ప్రకటిస్తాను'' అన్నారు.

ప్రేమకు గ్రీన్ సిగ్నల్!

ఉత్తరాది అమ్మాయి రాశీ ఖన్నా హీరోయిన్‌గా దక్షిణాదిలో ఎక్కువ సినిమాల్లో నటించి స్టార్ లిస్ట్‌లో ఉన్నారు. రచ్చ గెలిచిన రాశీ ఖన్నా ఇప్పుడు ఇంట అంటే ఉత్తరాదిలో నటిగా నిరూపించుకోవాలని అనుకుంటున్నట్లున్నారు. ఇప్పటికే సిద్ధార్థ్ మల్హోత్రా హీరోగా నటిస్తున్న 'యోధ' చిత్రంలో ఓ హీరోయిన్‌గా నటిస్తున్నారు. దిశా పటానీ మరో హీరోయిన్‌గా నటిస్తున్న ఈ చిత్రం డిసెంబరులో విడుదల కానుంది. తాజాగా రాశీ మరో కొత్త సినిమాకు పచ్చ జెండా ఊపారని బాలీవుడ్ సమాచారం. నూతన దర్శకుడు బోధయన్ రాయ్ హీరో విక్రాంత్ మెస్సీతో ఓ ప్రేమకథా చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. ఈ కథను ఇటీవల రాశీకి వినిపించారట. ఈ ప్రేమకథతో ప్రేమలో పడ్డారట ఈ బ్యూటీ. దాంతో ఈ సినిమాలో విక్రాంత్ మెస్సీకి ప్రేయసిగా నటించేందుకు రాశీ ఖన్నా గ్రీన్ సిగ్నల్ ఇచ్చారని బీటౌన్ సమాచారం. వీలైనంత త్వరగా షూటింగ్ పూర్తి చేసి, వచ్చే ఏడాది ప్రారంభంలో ఈ సినిమాను విడుదల చేయాలనుకుంటోందట చిత్ర యూనిట్.

బడ్జెట్ కాదు.. ప్రతిభే బలం - విశ్వక్ సేన్



• విశ్వక్ సేన్, అభయ్ నవీన్

'చరిత్ర సృష్టించే సినిమాలకు బడ్జెట్ ఇంత ఉండాలనే అవసరం లేదని 'పెళ్ళి చూపులు, అర్జున్ రెడ్డి, బలగం, మసూద, ఫలక్‌నుమా దాస్' వంటి ఎన్నో చిత్రాలు నిరూపించాయి. సినిమాకు ఎంత బడ్జెట్ పెట్టామనేది చూస్తుంటారు చాలామంది. కానీ ఆ చిత్రంలో పనిచేస్తున్న వాళ్లు ఎంత ప్రతిభావంతులు అనేది చూస్తే అదే సినిమాకు అసలైన బలం. 'రామన్న యూత్' చిత్రానికి అలాంటి మ్యాజిక్ జరగాలి. ప్రేక్షకులకు తప్పకుండా నచ్చుతుంది'' అని హీరో విశ్వక్ సేన్ అన్నారు. అభయ్ నవీన్ హీరోగా నటించి, దర్శకత్వం వహించిన చిత్రం 'రామన్న యూత్'. అమూల్య రెడ్డి హీరోయిన్‌గా చేశారు. ఫైర్ ఫ్లై ఆర్ట్స్ సంస్థ నిర్మించిన ఈ సినిమా ఈ నెల 15న విడుదలవుతోంది. హైదరాబాద్‌లో జరిగిన ఈ సినిమా ప్రీ రిలీజ్ వేడకకి విశ్వక్ సేన్, నటులు ప్రియదర్శి, తిరువీర్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ''ప్రేక్షకులకు చిన్న సినిమానా? పెద్ద సినిమానా? అనేది తెలియదు. మంచి కథ ఉంటే ఆ చిత్రాన్ని తప్పకుండా చూస్తారు. 'రామన్న యూత్'ని థియేటర్ లో చూసి ప్రోత్సహించాలి'' అన్నారు అభయ్ నవీన్.

వాస్తవ ఘటనతో...



• ప్రమోద్, అనుశ్రీ

రఘు, ఆర్. ప్రమోద్ హీరోలుగా, అనుశ్రీ, మోహన హీరోయిన్లుగా కొత్త సినిమా ప్రారంభమైంది. పాలిక్ దర్శకత్వంలో భోగి సుధాకర్, రావుల రమేష్ నిర్మిస్తున్నారు. ముహూర్తపు సన్నివేశానికి నిర్మాత ప్రసన్న కుమార్ కెమెరా స్విచాన్ చేయగా, నిర్మాత దామోదర్ ప్రసాద్ క్లాప్ ఇచ్చారు. నిర్మాత టి. రామసత్యనారాయణ స్క్రిప్ట్‌ని అందించగా, దర్శకుడు–నటుడు గూడ రామకృష్ణ గౌరవ దర్శకత్వం వహించారు. ''పాలిక్‌గారి దర్శకత్వంలో నేను నిర్మించిన తొలి చిత్రం 'రౌద్ర రూపాయ నమః' చిత్రాన్ని అక్టోబర్‌లో రిలీజ్ చేస్తాం'' అన్నారు రావుల రమేష్. ''ములుగు, వరంగల్, అరకు ప్రాంతాల్లో ఈ మూవీ షూటింగ్ చేస్తాం'' అన్నారు భోగి సుధాకర్. ''1960–1980 మధ్య తెలంగాణలో జరిగిన వాస్తవ ఘటనతో తీస్తున్న ఈ చిత్రంలో లవ్, సస్పెన్స్, థ్రిల్లింగ్ అంశాలుంటాయి'' అన్నారు పాలిక్.

అందాల రాణి



• సంయుక్తా మీనన్

రవివర్మ కుంచె నుంచి జాలువారిన చిత్రమా.. ఎల్లోరా శిల్పమా.. అన్నట్లుగా విగ్రహం రూపంలో సంయుక్తా మీనన్ ఆకట్టుకున్నారు. మంగళవారం ఈ బ్యూటీ పుట్టినరోజు. ఈ సందర్భంగా 'స్వయంభూ' చిత్రంలో సంయుక్త లుక్‌ని విడుదల చేసింది యూనిట్. ఒక పెద్ద కోట బ్యాక్‌డ్రాప్‌లో, నిండైన ఆభరణాలు, యువరాణిని తలపించే వస్త్రధారణ, చేతిలో పక్షితో సంయుక్త లుక్ ఆకట్టుకునే విధంగా ఉంది. నిఖిల్, సంయుక్తా మీనన్ జంటగా భరత్ కృష్ణమాచారి దర్శకత్వం వహిస్తున్న 'స్వయంభూ' ఇటీవల ప్రారంభమైంది. ఇందులో యువరాణి తరహా పాత్రను పోషిస్తున్నారు సంయుక్త. ఈ మూవీలో చేస్తున్న యోధుడి పాత్ర కోసం శిక్షణ తీసుకోవడానికి వియత్నాం వెళ్లారు నిఖిల్. ఠాగూర్ మధు సమర్పణలో భువన్, శ్రీకర్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు.

నెలాఖరులో వ్యాక్సిన్



• నానా పటేకర్

'ది కశ్మీరీ ఫైల్స్' వంటి హిట్ మూవీ తర్వాత దర్శకుడు వివేక్ రంజన్ అగ్నిహోత్రి తెరకెక్కించిన తాజా చిత్రం 'ది వ్యాక్సిన్ వార్'. నానా పటేకర్, అనుపమ్ ఖేర్, పల్లవి జోషి, సప్తమి గౌడ, పరితోష్ సాండ్, స్నేహ మిలాండ్, దివ్య సేథ్ నటించారు. పల్లవి జోషి నిర్మించారు. అభిషేక్ అగర్వాల్ ఆర్ట్స్ అభిషేక్ అగర్వాల్ కూడా ఈ ప్రాజెక్ట్‌లో భాగమయ్యారు. ఈ నెల 28న ఈ చిత్రం విడుదల కానుంది. మంగళవారం హిందీ ట్రైలర్‌ను విడుదల చేశారు. ''భారతదేశపు మొట్టమొదటి బయో–సైన్స్ చిత్రమిది. కోవిడ్ వ్యాక్సిన్‌ను అభివృద్ధి చేయడానికి శాస్త్రవేత్తలు ఎదుర్కొన్న సవాళ్లు ఏంటి? అన్నదే ఈ చిత్ర కథ'' అని యూనిట్ పేర్కొంది. కాగా 'వ్యాక్సిన్ వార్' చిత్రం తెలుగు, హిందీ, ఇంగ్లిష్, గుజరాతీ, పంజాబీ, భోజ్‌పురి, బెంగాలీ, మరాఠీ, తమిళ, కన్నడ, ఉర్దూ, అస్సామీ భాషల్లో విడుదల కానుంది.

సాక్షి బిజినెస్
బుధవారం
13-9-2023

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▲	94	67,221
నిఫ్టీ ▼	3	19,993

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (సోమవారం ముగింపు)			
నాస్‌డాక్	13,833	▼	85
డోజోన్స్	34,810	▲	146
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,528	▲	31
డాక్స్	15,715	▼	85
షాంఘై	3,138	▼	6
నికాయ్	32,776	▲	309

• అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

బులియన్ (రూ.లలో) — ముంబై

బంగారం (99.9 స్వచ్ఛత)	58,865	▼	236
బంగారం (99.5 స్వచ్ఛత)	58,629	▼	205
వెండి (కేజీ)	70,900	▼	128

ఫారెక్స్ రేట్లు (రూ.లలో)

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	82.18	83.85
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	102.10	105.47
€	యూరో	ఎస్‌బీఐ	87.47	90.58
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	55.83	57.56
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	52.18	54.52
S$	సింగపూర్ డాలర్	ఎస్‌బీఐ	59.96	61.90
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	21.19	22.81
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	21.71	23.50
¥	చైనా యువాన్	థామస్‌కుక్	10.26	12.33

జీవితకాల గరిష్టాల వద్ద లాభాల స్వీకరణ

- నిఫ్టీకి నష్టం, సెన్సెక్స్‌కు లాభం
- చిన్న, మధ్య తరహా షేర్లు క్రాష్



ముంబై: అధిక వాల్యుయేషన్ల ఆందోళనలతో ఇన్వెస్టర్లు అప్రమత్తత వహిస్తూ గరిష్ట స్థాయిల వద్ద లాభాల స్వీకరణకు పాల్పడ్డారు. ఫలితంగా ఆరంభ లాభాల్ని కోల్పోయిన స్టాక్ సూచీలు మంగళవారం మిశ్రమంగా ముగిశాయి. ఇంట్రాడేలో 412 పాయింట్లు పెరిగి 67,539 వద్ద జీవితకాల గరిష్టాన్ని నమోదు చేసిన సెన్సెక్స్ చివరికి 94 పాయింట్ల లాభంతో 67,221 వద్ద ముగిసింది. నిఫ్టీ 114 పాయింట్లు ఎగసి 20,110 వద్ద కొత్త ఆల్‌టైం హైని అందుకుంది. చివరికి 3 పాయింట్లు నష్టపోయి 19,993 వద్ద నిలిచింది. యుటిలిటీ, పవర్, టెలికం, రియల్టీ, ఆటో, ఆయిల్‌అండ్‌గ్యాస్, మౌలిక రంగ షేర్లు అమ్మకాలు ఒత్తిడికి లోనయ్యాయి. ఐటీ, బ్యాంకులు, టెక్ షేర్లకు స్వల్ప కొనుగోళ్ల మద్దతు లభించింది. చిన్న, మధ్య తరహా షేర్లలో భారీగా లాభాల స్వీకరణ చోటు చేసుకోవడంతో బీఎస్‌ఈ స్మాల్ క్యాప్ సూచీ 4%, మిడ్ క్యాప్ ఇండెక్స్ 3% చొప్పున నష్టపోయాయి. ఇరు సూచీలకు ఈ ఏడాది అతిపెద్ద పతనం కావడం గమనార్హం.

■ చివరి రోజు నాటికి ఈఎంఎస్ లిమిటెడ్ ఐపీఓ 75.28 రెట్లు సబ్‌స్క్రైబ్ అయ్యింది. ఐపీఓలో భాగంగా కంపెనీ 1.07 కోట్ల షేర్లను జారీ చేయగా, 81.21 కోట్ల షేర్లకు బిడ్లు వచ్చాయి. రిటైల్ ఇన్వెస్టర్ల కోటా 29.79 రెట్లు సబ్‌స్క్రిప్షన్ సాధించాయి.

ఐఫోన్ 15 వచ్చేసింది!



4 వెర్షన్లలో లభ్యం • ధర 799-1199 డాలర్లు • యాపిల్ వాచ్ 9 సిరీస్ కూడా • ఇక టైప్-సి కేబుల్



న్యూయార్క్: టెక్నాలజీ దిగ్గజం యాపిల్ తాజాగా ఐఫోన్ 15 మోడళ్ల మొబైళ్లతోపాటు.. 9 సిరీస్ స్మార్ట్ వాచీని విడుదల చేసింది. ఐఫోన్ 15 మోడళ్ల చార్జింగ్‌కు టైప్ సీ కేబుల్‌ను ప్రవేశపెట్టింది. దీంతో ఇతర యాపిల్ గాడ్జెట్లను సైతం టైప్ సీ ద్వారా చార్జింగ్ చేసుకునే వీలు కల్పిస్తున్నట్లు కంపెనీ పేర్కొంది. ఐఫోన్ 15, 15 ప్లస్ మోడళ్లకు ఏ 16 చిప్‌ను వినియోగించింది. వాచీ మోడళ్లకు రీసైకిల్డ్ మెటీరియల్‌తో రూపొందించిన విభిన్న స్ట్రాప్స్‌ను ప్రవేశపెట్టింది. ఇక ఐఫోన్ 15 ప్రో, 15 ప్రో మ్యాక్స్ మోడళ్ల కేసు తయారీలో టైటానియంను వినియోగించింది. ఏ17 చిప్‌ను వినియోగించింది. తద్వారా అత్యంత వేగవంత, మన్నికైన, తేలికపాటి ఫోన్లను రూపొందించినట్లు యాపిల్ తెలియజేసింది. ఐఫోన్ 15 ధర 799 డాలర్లు, 15 ప్లస్‌కు 899 డాలర్లు చొప్పున నిర్ణయించింది. ఇక ఐఫోన్ 15 ప్రో ధర 999 డాలర్లు కాగా, ప్రో మ్యాక్స్ ధర 1199 డాలర్లుగా ప్రకటించింది. కొత్త ఐఫోన్ మోడళ్లన్నీ 48 ఎంపీ ప్రధాన కెమెరాతో విడుదలయ్యాయి. 6.1, 6.7 అంగుళాల స్క్రీన్ పరిమాణంలో ప్రవేశపెట్టింది. స్టోరేజీ 128 జీబీ, 256 జీబీతో విడుదల చేసింది.





హెరిటేజ్ షేరుకు షాక్!

- చంద్రబాబు అరెస్టుతో ఇన్వెస్టర్ల సెంటిమెంట్‌పై ప్రభావం
- రెండు రోజుల్లో దాదాపు 20% డౌన్
- కంపెనీలో ప్రమోటర్ల వాటా 41.58%
- ఇన్వెస్టర్ల సంపద రూ.450 కోట్లకు పైగా ఆవిరి



హైదరాబాద్: స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ స్కామ్ కేసులో మాజీ సీఎం చంద్రబాబు నాయుడు అరెస్ట్‌తో హెరిటేజ్ ఫుడ్స్ వాటాదారులకు షాక్ తగిలింది. చంద్రబాబు కుటుంబం కంపెనీ ప్రధాన ప్రమోటర్ కావడంతో షేరు కుప్పకూలింది. శనివారం చంద్రబాబును అరెస్ట్ చేసిన తర్వాత రెండు ట్రేడింగ్ సెషన్లలో హెరిటేజ్ ఫుడ్స్ షేరు ధర దాదాపు 19 శాతం క్రాష్ అయ్యింది. మంగళవారం ఒక్కరోజే 12.5 శాతం (రూ.32) క్షీణించి రూ.221 వద్ద ముగిసింది. భారీ వాల్యూమ్‌తో (దాదాపు 24 లక్షల షేర్లు చేతులు మారాయి) షేరు పడిపోవడం చూస్తే ఇన్వెస్టర్ల సెంటిమెంట్‌పై తీవ్ర ప్రభావం ఉన్నట్లు కనబడుతోందని మార్కెట్ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. అరెస్టుకు ముందు, అంటే శుక్రవారం (సెప్టెంబర్ 8న) ట్రేడింగ్ ముగింపు నాటికి షేరు ధర దాదాపు రూ.272 వద్ద ఉంది. షేరు కుప్పకూలడంతో ఇన్వెస్టర్ల సంపద కూడా భారీగా ఆవిరవుతోంది. గత రెండు రోజుల్లో కంపెనీ మార్కెట్ క్యాపిటలైజేషన్ (విలువ) ఏకంగా రూ.450 కోట్ల మేర కరిగిపోయింది. మంగళవారం ట్రేడింగ్ ముగింపు నాటికి ఇది రూ.2,073 కోట్లకు దిగొచ్చింది. కాగా, హెరిటేజ్ ఫుడ్స్ షేరు ఏడాది గరిష్ట స్థాయి రూ.287 కాగా, కనిష్ట స్థాయి రూ.135గా నమోదైంది. కంపెనీలో ప్రమోటర్లకు (చంద్రబాబు కుటుంబం) సుమారు 41.58 శాతం వాటా ఉంది.

'ఇన్నర్ రింగ్ రోడ్డు' అక్రమాల్లో హెరిటేజ్...

చంద్రబాబు హయాంలో జరిగిన కుంభకోణాలపై ఏపీ సీఐడీ విచారణ జోరు పెంచడం, వీటిలో బాబు కుటుంబంతో పాటు హెరిటేజ్ కంపెనీకి కూడా ప్రత్యక్షంగా ప్రమేయం ఉన్నట్లు బయటపడటంతో ఇన్వెస్టర్లు బెంబేలెత్తుతున్నారు. ఒకపక్క, 'స్కిల్' స్కామ్‌లో ఇప్పటికే చంద్రబాబు అరెస్టయ్యి రిమాండ్‌లో ఉన్నారు. ఇదే తరుణంలో అమరావతి 'ఇన్నర్ రింగ్ రోడ్డు' ప్రాజెక్టులో సైతం బాబు అండ్ కో అందినకాడికి దోచుకున్నారన్న పక్కా ఆధారాలతో సీఐడీ ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) చంద్రబాబును విచారించేందుకు పీటీ వారంట్ కోసం ఏసీబీ కోర్టును ఆశ్రయించింది. ఈ కేసులోనూ బాబును అరెస్ట్ చేసే అవకాశం కనిపిస్తోంది. ఈ స్కామ్‌లో హెరిటేజ్ ఫుడ్స్ కూడా ఇన్నర్ రింగ్ రోడ్ అలైన్‌మెంట్ వెంబడి భూములు కొనుగోలు చేసినట్లు ఇప్పటికే సీఐడీ దర్యాప్తులో వెలికితీయడం గమనార్హం. వీటన్నింటి ప్రభావంతో రానున్న రోజుల్లో హెరిటేజ్ ఫుడ్స్ ఇన్వెస్టర్లకు కంటిమీద కునుకులేకుండా చేసే అవకాశం ఉందని పరిశీలకులు పేర్కొంటున్నారు. దీంతో షేరు మరింత కుప్పకూలే అవకాశం ఉందనేది వారి విశ్లేషణ.

యాత్రా ఆన్‌లైన్ @ రూ. 135-142

ఈ నెల 15–20 మధ్య ఐపీవో

ముంబై: ఆన్‌లైన్ ట్రావెల్ సర్వీసుల కంపెనీ యాత్రా ఆన్‌లైన్ పబ్లిక్ ఇష్యూకి రూ. 135–142 ధరల శ్రేణిని ప్రకటించింది. ఇష్యూ ఈ నెల 15న ప్రారంభమై 20న ముగియనుంది. ఐపీవోలో భాగంగా రూ. 602 కోట్ల విలువైన ఈక్విటీని తాజాగా జారీ చేయనుంది. వీటికి జతగా మరో 1,21,83,099 షేర్లను ప్రమోటర్లు, ప్రస్తుత ఇన్వెస్టర్లు విక్రయానికి ఉంచనున్నారు. వెరసి ఇష్యూ ద్వారా రూ. 775 కోట్లు సమీకరించనుంది. కాగా.. ఇటీవల షేరుకి రూ. 236 ధరలో చేపట్టిన రైట్స్ ఇష్యూ ద్వారా రూ. 62 కోట్లు సమకూర్చుకుంది. రైట్స్‌లో భాగంగా 26.27 లక్షల షేర్లను జారీ చేసింది. రిటైలర్లు కనీసం 105 షేర్ల(ఒక లాట్)కు దరఖాస్తు చేయవలసి ఉంటుంది. ఈక్విటీ జారీ నిధుల్లో రూ. 150 కోట్లను వ్యూహాత్మక పెట్టుబడులు, ఇతర సంస్థల కొనుగోళ్లు తదితరాలకు వినియోగించనుంది. 2023 మార్చికల్లా కంపెనీ రూ. 380 కోట్ల ఆదాయం సాధించింది.



ఆర్థిక గణాంకాల ఉత్సాహం..

- జూలై పారిశ్రామికోత్పత్తి వృద్ధి 5.7%
- ఐదు నెలల గరిష్టం
- ఆగస్టులో రిటైల్ ద్రవ్యోల్బణం 6.83%



న్యూఢిల్లీ: భారత్ ఆర్థిక రంగానికి సంబంధించి మంగళవారం వెలువడిన వినియోగ ధరల సూచీ (సీపీఐ) ఆధారిత ఆగస్టు రిటైల్ ద్రవ్యోల్బణం, జూలై పారిశ్రామిక ఉత్పత్తి సూచీ (ఐఐపీ) కొంత ఊరటనిచ్చాయి. ఆగస్టు వినియోగ ద్రవ్యోల్బణం 6.83 శాతంగా నమోదయ్యింది. అంటే గత ఏడాది ఆగస్టు ధరలతో పోల్చితే తాజా సమీక్షా నెల్లో సీపీఐ బాస్కెట్‌లోని ఉత్పత్తుల ధరలు 6.83 శాతం పెరిగాయన్నమాట. జూలైతో పోల్చితే (7.44 శాతం) ఆగస్టులో ధరల స్పీడ్ కొంత తక్కువగా ఉండడం గమనార్హం. ఇక జూలై పారిశ్రామిక ఉత్పత్తి పెరుగుదల 5.7 శాతంగా నమోదయ్యింది. ఇది 5 నెలల గరిష్ట స్థాయి. తాజా సమీక్షా నెల జూలైలో తయారీ, మైనింగ్, విద్యుత్ రంగాలు మంచి పనితనాన్ని ప్రదర్శించాయి. ఇదిలాఉండగా ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ నుంచి జూలై మధ్య ఐఐపీ వృద్ధి రేటు 4.8%. గత ఏడాది (2022) ఇదే కాలంలో ఈ వృద్ధి రేటు ఏకంగా 10%గా ఉంది. 2021లో కరోనా ప్రభావంతో లో బేస్ దీనికి ప్రధాన కారణం.

జూలైలో మౌలిక రంగం ఓకే...

కాగా, ఎనిమిది రంగాల భారత్ మౌలిక పరిశ్రమ జూలైలో మంచి పనితీరును కొనసాగించింది. 8 శాతం వృద్ధి రేటును నమోదుచేసుకుంది. బొగ్గు, క్రూడ్ ఆయిల్, సహజ వాయువు, స్టీల్, సిమెంట్, విద్యుత్, రిఫైనరీ ప్రొడక్టులు, ఎరువుల రంగాలు వీటిలో ఉన్నాయి. మొత్తం పారిశ్రామిక ఉత్పత్తి సూచీ (ఐఐపీ)లో వీటి వెయిటేజ్ 40.27 శాతం. ఇక ఏప్రిల్ నుంచి జూలై వరకూ మౌలిక పరిశ్రమ వృద్ధి రేటు 6.4 శాతంగా ఉంది.

దిగొచ్చిన రిటైల్ ద్రవ్యోల్బణం

ఆర్‌బీఐ ద్రవ్య పరపతి విధాన సమీక్షకు ప్రాతిపదిక అయిన వినియోగ ధరల సూచీ ఆధారిత రిటైల్ ద్రవ్యోల్బణం జూలైలో 15 నెలల గరిష్ట స్థాయిలో 7.44 శాతం ఉంటే, ఆగస్టులో 6.83 శాతానికి తగ్గింది. ఇదే కాలంలో ఒక్క ఫుడ్ బాస్కెట్ ద్రవ్యోల్బణం 11.51 శాతం నుంచి 9.94 శాతానికి దిగిరావడం దీనికి ప్రధాన కారణం. ఒక్క కూరగాయల ధరల పెరుగుదల చూస్తే, 2023 జూలైలో పరుగు 37.4 శాతం ఉంటే, ఆగస్టులో 26.14 శాతానికి తగ్గింది. అయితే ఇంకా రేటు ఆర్‌బీఐకి కేంద్రం నిర్దేశిత స్థాయి (6 శాతం) ఎగువనే ఉండడం గమనార్హం.

జాబ్ పాయింట్

ఏపీ సివిల్ సప్లైస్, ఎన్టీఆర్ జిల్లాలో 507 పోస్టులు

విజయవాడలోని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పౌర సరఫరాల కార్పొరేషన్ లిమిటెడ్, జిల్లా కార్యాలయం.. ఎన్టీఆర్ జిల్లాలో ధాన్య సేకరణకు సంబంధించి రెండు నెలల కాలానికి ఒప్పంద ప్రాతిపదికన ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» మొత్తం పోస్టుల సంఖ్య: 507
» పోస్టుల వివరాలు: టెక్నికల్ అసిస్టెంట్–169, డేటా ఎంట్రీ ఆపరేటర్–169, హెల్పర్–169.

అర్హతలు:
» టెక్నికల్ అసిస్టెంట్: బీఎస్సీ(అగ్రికల్చర్/మైక్రో బయాలజీ/బయోకెమిస్ట్రీ /బయోటెక్నాలజీ)/ బీఎస్సీ(బీజెడ్‌సీ)/బీఎస్సీ(లైఫ్ సైన్సెస్)/డిప్లొమా(అగ్రికల్చర్) ఉత్తీర్ణులై ఉండాలి.
» డేటాఎంట్రీ ఆపరేటర్: ఏదైనా డిగ్రీతో పాటు పీజీడీసీఏ ఉత్తీర్ణులై ఉండాలి. » హెల్పర్: ఎనిమిదో తరగతి నుంచి పదో తరగతి ఉత్తీర్ణులై ఉండాలి.
» వయసు: టీఏ/డీఈవో పోస్టులకు 21 నుంచి 40 ఏళ్లు,హెల్పర్‌కు 18నుంచి 35ఏళ్ల మధ్య ఉండాలి
» ఎంపిక విధానం: అకడమిక్ మార్కులు, పని అనుభవం, అదనపు విద్యార్హతల (టీఏ/డీఈవో పోస్టులకు) ఆధారంగా ఎంపికచేస్తారు.
» దరఖాస్తు విధానం: సంబంధిత ధ్రువపత్రాల నకళ్లను జతచేసి రిజిస్టర్ పోస్టు ద్వారా లేదా వ్యక్తిగతంగా జిల్లా పౌర సరఫరాల మేనేజర్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పౌర సరఫరాల కార్పొరేషన్ లిమిటెడ్, గవర్నర్‌పేట, విజయవాడ జిల్లా చిరునామకు పంపించాలి.
» దరఖాస్తులకు చివరితేది: 18.09.2023.
» వెబ్‌సైట్: ntr.ap.gov.in

ఏపీ సివిల్ సప్లైస్, ప్రకాశం జిల్లాలో 75 పోస్టులు

ఒంగోలులోని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పౌర సరఫరాల కార్పొరేషన్ లిమిటెడ్, జిల్లా కార్యాలయం.. ప్రకాశం జిల్లాలో ధాన్య సేకరణకు సంబంధించి రెండు నెలల కాలానికి ఒప్పంద ప్రాతిపదికన ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» మొత్తం పోస్టుల సంఖ్య: 75
» పోస్టుల వివరాలు: టెక్నికల్ అసిస్టెంట్–25, డేటా ఎంట్రీ ఆపరేటర్–25, హెల్పర్–25.

అర్హతలు:
» టెక్నికల్ అసిస్టెంట్: బీఎస్సీ(అగ్రికల్చర్/మైక్రో బయాలజీ/బయోకెమిస్ట్రీ /బయోటెక్నాలజీ)/ బీఎస్సీ(బీజెడ్‌సీ)/బీఎస్సీ(లైఫ్ సైన్సెస్)/డిప్లొమా(అగ్రికల్చర్) ఉత్తీర్ణులై ఉండాలి.
» డేటాఎంట్రీ ఆపరేటర్: ఏదైనా డిగ్రీతోపాటు పీజీడీసీఏ ఉత్తీర్ణులై ఉండాలి. » హెల్పర్: ఎనిమిదో తరగతి నుంచి పదో తరగతి ఉత్తీర్ణులై ఉండాలి.
» వయసు: టీఏ/డీఈవో పోస్టులకు 21 నుంచి 40 ఏళ్లు,హెల్పర్‌కు 18నుంచి 35ఏళ్ల మధ్య ఉండాలి.
» ఎంపిక విధానం: అకడమిక్ మార్కులు, పని అనుభవం, అదనపు విద్యార్హతలు (టీఏ/డీఈవో పోస్టులకు) ఆధారంగా ఎంపికచేస్తారు.
» దరఖాస్తు విధానం: సంబంధిత ధ్రువపత్రాల నకళ్లను జతచేసి రిజిస్టర్ పోస్టు ద్వారా లేదా వ్యక్తిగతంగా జిల్లా పౌర సరఫరాల మేనేజర్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పౌర సరఫరాల కార్పొరేషన్ లిమిటెడ్, సంతపేట, ఒంగోలు, ప్రకాశం జిల్లా చిరునామకు పంపించాలి.
» దరఖాస్తులకు చివరితేది: 21.09.2023.
» వెబ్‌సైట్: prakasam.ap.gov.in

ఏపీ హైకోర్టు లీగల్ సర్వీసెస్‌లో ఉద్యోగాలు

అమరావతిలోని ఏపీ హైకోర్టు లీగల్ సర్వీసెస్ కమిటీ.. డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ప్రాతిపదికన వివిధ ఉద్యోగాల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» మొత్తం పోస్టుల సంఖ్య: 05
» పోస్టుల వివరాలు: సీనియర్ అసిస్టెంట్–01, జూనియర్ అసిస్టెంట్–01, స్టెనో కమ్ టైపిస్ట్–02, ఆఫీస్ సబార్డినేట్–01.
» అర్హత:పోస్టును అనుసరించి ఏడో తరగతి,డిగ్రీ, ఇంగ్లిష్ టైప్ రైటింగ్ హయ్యర్ గ్రేడ్ సర్టిఫికేట్, ఇంగ్లిష్ షార్ట్ హ్యాండ్ హయ్యర్ గ్రేడ్ సర్టిఫికేట్.
» వయసు: 01.09.2023 నాటికి 18 నుంచి 42 ఏళ్ల మధ్య ఉండాలి.
» ఎంపిక విధానం: పోస్టును అనుసరించి రాతపరీక్ష, ఇంటర్వ్యూ, స్కిల్ టెస్ట్ ఆధారంగా.
» దరఖాస్తు విధానం: ఆఫ్‌లైన్ ద్వారా.
» ఆఫ్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:14.09.2023
» వెబ్‌సైట్: apslsa.ap.nic.in

ఇండియన్ నేవీలో 46 అసిస్టెంట్ కమాండెంట్ పోస్టులు

ఇండియన్ నేవీ ఆధ్వర్యంలోని ఇండియన్ కోస్ట్ గార్డ్.. అర్హులైన స్త్రీ, పురుష అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

» మొత్తం పోస్టుల సంఖ్య: 46
» పోస్టుల వివరాలు: జనరల్ డ్యూటీ–25, టెక్నికల్–20, లా–01.
» విభాగాలు: జనరల్ డ్యూటీ, టెక్నికల్(ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్/ఎలక్ట్రానిక్స్), లా.
» అర్హత: ఖాళీలను అనుసరించి సంబంధిత స్పెషలైజేషన్‌లో డిగ్రీ/ఇంజనీరింగ్ డిగ్రీ/లా డిగ్రీ ఉత్తీర్ణులవ్వాలి. వేతనం:నెలకు రూ.56,100 చెల్లిస్తారు.
» ఎంపిక విధానం: పరీక్షలో మెరిట్ ఆధారంగా.
» పరీక్ష విధానం: ఇంగ్లిష్, రీజనింగ్, న్యూమరికల్ ఎబిలిటీ,జనరల్ సైన్స్ అండ్ మ్యాథమేటికల్ ఆప్టిట్యూడ్,జనరల్ నాలెడ్జ్ నుంచి ప్రశ్నలు అడుగుతారు. పరీక్షకు రెండు గంటల సమయం ఉంటుంది.
» దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా.
» ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది: 15.09.2023
» వెబ్‌సైట్: joinindiancoastguard.cdac.in

విద్యారుణం.. ఇలా సులువు!

విద్యారుణం కోసం ఒకే వేదిక ద్వారా పలు బ్యాంకులకు దరఖాస్తు చేసుకోవచ్చు. రుణ దరఖాస్తు నుంచి మంజూరు వరకూ.. అంతా ఆన్‌లైన్‌లోనే! లోన్ మంజూరయ్యాక నిర్దేశిత బ్రాంచ్‌కు వెళ్లి సంబంధిత డాక్యుమెంట్లు సమర్పిస్తే సరిపోతుంది. వీటన్నింటికీ మార్గం వేస్తోంది.. విద్యాలక్ష్మి పోర్టల్!! కేంద్ర ఆర్థిక, విద్యా శాఖలు, ఇండియన్ బ్యాంక్స్ అసోసియేషన్ సంయుక్తంగా రూపొందించిన ఈ విద్యాలక్ష్మి పోర్టల్ ద్వారా సులువుగా విద్యా రుణాలకు దరఖాస్తు చేసుకునే అవకాశం ఉంది. దేశ విదేశాల్లో ఉన్నత విద్య కోర్సుల విద్యార్థులకు విద్యాలక్ష్మి పోర్టల్‌తో ప్రయోజనాలు, విద్యా రుణం విధి విధానాలపై ప్రత్యేక కథనం..

యువతలో ఉన్నత విద్యను అభ్యసించాలనే ఆసక్తి పెరుగుతోంది. అదే సమయంలో ఫీజుల భారం నుంచి ఉపశమనం పొందేందుకు ఎడ్యుకేషన్ లోన్ సౌకర్యం అందుబాటులోకి వచ్చింది. కానీ.. బ్యాంకింగ్ సంస్థలు అనుసరించే నిబంధనల కారణంగా దరఖాస్తుకు సుదీర్ఘ సమయం వెచ్చించాలనే అభిప్రాయం నెలకొంది. ఇప్పుడు వీటన్నింటికి ఫుల్‌స్టాప్ పెట్టేసి.. వన్ స్టాప్ సొల్యూషన్‌గా విద్యాలక్ష్మి పోర్టల్ ద్వారా విద్యా రుణాలకు ఇంటి నుంచే దరఖాస్తు చేసుకోవచ్చు.

కేంద్రం ఆధ్వర్యంలో విద్యాలక్ష్మి

విద్యా రుణాలకు దరఖాస్తు, మంజూరులో విద్యార్థులకు ఎదురవుతున్న సమస్యలకు పరిష్కారంగా కేంద్ర ప్రభుత్వం విద్యాలక్ష్మి పేరుతో ప్రత్యేక పోర్టల్‌ను అందుబాటులోకి తెచ్చింది. అభ్యర్థులు ఈ పోర్టల్‌లో లాగిన్ అయి.. కామన్ ఎడ్యుకేషనల్ లోన్ అప్లికేషన్ ఫామ్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. దీనిద్వారా గరిష్టంగా మూడు బ్యాంకులకు దరఖాస్తు చేసుకునే అవకాశముంది. ఇలా ఆన్‌లైన్‌లో వచ్చిన దరఖాస్తులను.. అభ్యర్థులు ప్రాథమ్యంగా పేర్కొన్న బ్యాంకులకు పంపిస్తారు. సదరు బ్యాంకులు దరఖాస్తును పరిశీలించి సంతృప్తి చెందితే.. తదుపరి దశలో ఏ బ్రాంచ్‌లో సంప్రదించాలి, ఏ ఏ పత్రాలు తీసుకెళ్లాలి అనే వివరాలను విద్యార్థులకు తెలియజేస్తారు.

దరఖాస్తు ప్రక్రియ ఇలా

- ముందుగా విద్యాలక్ష్మి పోర్టల్‌లో ఆన్‌లైన్ ద్వారా తమ వివరాలు నమోదు చేసుకోవాలి. ఇందుకోసం లాగిన్ ఐడీ, పాస్‌వర్డ్ క్రియేట్ చేసుకోవాలి.
- ఆ తర్వాత కామన్ ఎడ్యుకేషన్ లోన్ అప్లికేషన్ ఫామ్‌ను పూర్తి చేయాలి.
- ఈ దరఖాస్తును పూర్తి చేసుకునే సమయంలో అభ్యర్థులు గరిష్టంగా మూడు బ్యాంకులను ఎంచుకోవచ్చు.
- తర్వాత సదరు బ్యాంకులు ఆన్‌లైన్‌లోనే దరఖాస్తు వివరాలను పరిశీలిస్తాయి.
- నిబంధనలకు అనుగుణంగా రుణ మంజూరుపై నిర్ణయం తీసుకుంటాయి.

» ఎడ్యుకేషన్ లోన్‌కు ఉమ్మడి వేదిక విద్యాలక్ష్మి పోర్టల్
» దరఖాస్తు నుంచి మంజూరు వరకు అంతా ఆన్‌లైన్‌లోనే
» నిర్దేశిత ధ్రువపత్రాలు అప్‌లోడ్ చేయడం తప్పనిసరి

- రుణ మంజూరు విషయాన్ని విద్యాలక్ష్మి పోర్టల్ లోనే పొందుపరుస్తారు.
- అలా రుణం పొందిన వారు మంజూరు చేసిన బ్యాంకును సంప్రదించాల్సి ఉంటుంది.

ఉన్నత విద్య కోర్సులు

విద్యా లక్ష్మి పోర్టల్ ద్వారా దాదాపు అన్ని రకాల ఉన్నత విద్య కోర్సుల విద్యార్థులకు రుణాల కోసం దరఖాస్తు చేసుకునే అవకాశం ఉంది. సంప్రదాయ డిగ్రీలు మొదలు టెక్నికల్, ప్రొఫెషనల్ కోర్సుల వరకూ.. ఇలా పలు రకాల కోర్సుల్లో చేరే విద్యార్థులు రుణాలకు దరఖాస్తు చేసుకోవచ్చు.

గుర్తింపు తప్పనిసరి

బ్యాంకులు విద్యా రుణం మంజూరులో నిర్దిష్ట నిబంధనలను అనుసరిస్తున్నాయి. బ్యాంకుల విధి విధానాల ప్రకారం–ఏఐసీటీఈ, యూజీసీ, ఎంహెచ్ఆర్‌డీ, ఆల్ ఇండియా అసోసియేషన్ ఆఫ్ యూనివర్సిటీస్ గుర్తింపు ఉన్న కళాశాలలు, కోర్సులనే విద్యా రుణ మంజూరులో పరిగణనలోకి తీసుకుంటారు. సదరు గుర్తింపు ఉన్న ఇన్‌స్టిట్యూట్‌లలో ప్రవేశం పొందిన విద్యార్థులకే విద్యా రుణం లభించే అవకాశం ఉంటుంది. అంతేకాకుండా కోర్సులో ప్రవేశం ఖరారు చేసుకున్న తీరును కూడా బ్యాంకులు పరిగణనలోకి తీసుకుంటున్నాయి.

ఎంట్రన్స్‌లో ప్రతిభ

ప్రవేశ పరీక్షలో ర్యాంకు సాధించి కన్వీనర్ కోటాలో సీటు పొందిన వారికే బ్యాంకులు విద్యారుణ దరఖాస్తుకు అర్హత కల్పిస్తున్నాయి. సాధారణంగా మేనేజ్‌మెంట్ కోటాలో చేరాలనుకునే వారికి ఈ రుణ దరఖాస్తుకు అర్హత ఉండదు. పలు ప్రైవేట్ బ్యాంకులు మేనేజ్‌మెంట్ కోటాలో ప్రవేశం పొందిన వారికి కూడా దరఖాస్తుకు అవకాశం కల్పిస్తున్నాయి. కాని ప్రభుత్వ రంగ బ్యాంకులు మాత్రం ఎంట్రన్స్‌లో మెరిట్ సాధించి ప్రవేశం పొందిన వారికే విద్యా రుణ మంజూరులో ప్రాధాన్యం ఇస్తున్నాయి.



స్టడీ అబ్రాడ్‌కు రూ.20 లక్షలు

విద్యా రుణాలు స్వదేశంలో కోర్సుల్లో చేరిన వారితోపాటు విదేశీ విద్య అభ్యర్థులకు కూడా అందుబాటులో ఉన్నాయి. మన దేశంలోని ఇన్‌స్టిట్యూట్‌ల్లో అడ్మిషన్ పొందిన విద్యార్థులకు గరిష్టంగా రూ.పది లక్షల వరకూ రుణం మంజూరు చేస్తున్నారు. విదేశీ యూనివర్సిటీల్లో ప్రవేశం ఖాయం చేసుకున్న వారికి గరిష్టంగా రూ.20 లక్షల వరకూ లోన్ లభిస్తోంది.

మూడు శ్లాబ్‌ల్లో రుణాలు

- రుణ మంజూరులో బ్యాంకులు మూడు శ్లాబ్‌ల విధానాన్ని అమలు చేస్తున్నాయి.
- శ్లాబ్–1 మేరకు రూ.4 లక్షలు రుణ మొత్తంగా నిర్ణయించారు. ఈ శ్లాబ్‌లో విద్యార్థులు ఎలాంటి హామీ ఇవ్వక్కర్లేదు.
- శ్లాబ్–2 ప్రకారం–రూ.4 లక్షల నుంచి రూ.7.5 లక్షల వరకు రుణ మొత్తాన్ని కేటాయిస్తున్నారు. ఇందుకోసం తల్లిదండ్రుల హామీ, థర్డ్ పార్టీ గ్యారెంటీ పత్రం ఇవ్వాల్సి ఉంటుంది.
- శ్లాబ్–3లో రూ.7.5 లక్షలకు పైగా రుణ మొత్తం ఉంటోంది. ఈ మొత్తానికి సరిపడే కొల్లేటరల్ సెక్యూరిటీ(స్థిరాస్తి పత్రాలను)ఇవ్వాల్సి ఉంటుంది.

మార్జిన్ మనీ నిబంధన

విద్యార్థులు రుణ మొత్తంలో కొంత మార్జిన్ మనీగా సమకూర్చుకోవాల్సి ఉంటుంది. రూ.4 లక్షల వరకు ఎలాంటి మార్జిన్ మనీ అవసరం లేదు. కాని రూ.4 లక్షలు దాటిన రుణ దరఖాస్తులకు స్వదేశంలో చదివే విద్యార్థులు అయిదు శాతం, స్టడీ అబ్రాడ్ విద్యార్థులు 15 శాతం మార్జిన్ మనీని సమకూర్చుకోవాలి.

రుణం లభించే వ్యయాలు

ట్యూషన్ ఫీజు, హాస్టల్ ఫీజు, ఎగ్జామినేషన్/లైబ్రరీ/లేబొరేటరీ ఫీజు; విదేశీ విద్య అభ్యర్థులు ప్రయాణ ఖర్చులు, పుస్తకాలు, యూనిఫామ్, ఇతర అకడమిక్ సంబంధిత పరికరాల కొనుగోలుకు అయ్యే వ్యయం, కంప్యూటర్ కొనుగోలు వ్యయం, కోర్సు పరంగా అవసరమైన స్టడీ టూర్స్, ప్రాజెక్ట్ వర్క్స్ తదితరాలకు అయ్యే ఖర్చులు, ఇన్‌స్టిట్యూట్‌లు వసూలు చేసే కాషన్ డిపాజిట్, బిల్డింగ్ ఫండ్, రిఫండబుల్ డిపాజిట్‌లకు రుణం మంజూరు చేస్తారు. ఇవి నిర్దేశిత ట్యూషన్ ఫీజు మొత్తంలో 10 శాతానికి మించకుండా ఉండాలి. కంప్యూటర్ కొనుగోలు వ్యయం, స్టడీ టూర్స్, ప్రాజెక్ట్ వర్క్స్ కోసం ఇచ్చే మొత్తం ట్యూషన్ ఫీజులో 20 శాతానికి మించకుండా ఉంటుంది.

ప్రతిష్టాత్మక ఇన్‌స్టిట్యూట్స్

ఐబీఏ మార్గనిర్దేశకాల ప్రకారం–గరిష్ట రుణ మొత్తం విషయంలో నిర్దిష్ట నిబంధనలు ఉన్నప్పటికీ.. విద్యార్థులు ప్రతిష్టాత్మక ఇన్‌స్టిట్యూట్‌లలో ప్రవేశం పొందితే ఆ గరిష్ట రుణ మొత్తాన్ని పెంచే విచక్షణాధికారాన్ని బ్యాంకులకు కల్పించింది. ఉదాహరణకు ఐఐఎంలు, ఐఐటీలు వంటి ప్రతిష్టాత్మక ఇన్‌స్టిట్యూట్‌లలో రూ.పది లక్షల కంటే ఎక్కువ ఫీజులు చెల్లించాల్సి ఉంటుంది. ఇలాంటి ఇన్‌స్టిట్యూట్‌లలో ప్రవేశం పొందిన వారికి గరిష్ట రుణ పరిమితిలో సడలింపు ఇచ్చే అవకాశం ఉంది.

అకడమిక్ ప్రతిభపై సమీక్ష

విద్యా రుణం మంజూరైన విద్యార్థికి సంబంధించిన ఫీజులను బ్యాంకులు నేరుగా సంబంధిత ఇన్‌స్టిట్యూట్‌కే పంపుతాయి. ఒకవేళ తొలి దశలో విద్యార్థులు సొంతంగా ఫీజు చెల్లిస్తే సంబంధిత రశీదుల ఆధారంగా ఆ ఫీజును విద్యార్థికి అందిస్తాయి. ఆ తర్వాత దశ నుంచి ఇన్‌స్టిట్యూట్‌కే అందజేస్తాయి. అదే విధంగా రుణ మొత్తాన్ని ప్రతి ఏటా విద్యా సంవత్సరం ప్రారంభంలో నిర్దేశిత గడువు లోగా ఇన్‌స్టిట్యూట్‌కు పంపిస్తాయి. ఆ క్రమంలో అంతకుముందు సంవత్సరంలో సదరు విద్యార్థి అకడెమిక్ ప్రతిభను సమీక్షిస్తున్నాయి. దీని ఆధారంగా మిగతా రుణం మంజూరుపై నిర్ణయం తీసుకుంటున్నాయి.

ఈ పత్రాలు తప్పనిసరి

విద్యా రుణానికి దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు విద్యాలక్ష్మి పోర్టల్‌లో కొన్ని డాక్యుమెంట్లను అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. అవి..ప్రవేశ ధ్రువీకరణ పత్రం, అకడమిక్ అర్హతల సర్టిఫికెట్ కాపీలు, కుటుంబ వార్షికాదాయ ధ్రువీకరణ పత్రం, కోర్సు వ్యయానికి సంబంధించి ఇన్‌స్టిట్యూట్‌ల నుంచి అధీకృత లెటర్స్.

- పూర్తి వివరాలకు వెబ్‌సైట్: www.vidyalakshmi.co.in/Students/index

సమాజాభివృద్ధికి వ్యాపారం తోడ్పడాలి

హెచ్ఐసీసీలో హైబీజ్ టీవీ బిజినెస్ ఎక్స్‌లెన్స్ అవార్డ్స్ 2023



వరప్రసాద్‌రెడ్డి నుంచి లెజెండరీ అవార్డును అందుకున్న ఎం.రవీందర్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్/మాదాపూర్: వ్యాపారంతో సంపద పెంచుకోవడమే కాకుండా సమాజాభివృద్ధికి తోడ్పడాలని పద్మభూషణ్ అవార్డు గ్రహీత వరప్రసాద్‌రెడ్డి తెలిపారు. మాదాపూర్‌లోని హెచ్ఐసీసీలో వివిధ వ్యాపార రంగాల్లో సేవలు అందిస్తున్న వ్యక్తులు, సంస్థలను గుర్తించి హైబీజ్ టీవీ బిజినెస్ ఎక్స్‌లెన్స్ అవార్డ్స్– 2023 సోమవారంరాత్రి అందజేశారు. ఈ కార్యక్రమాన్ని శాంతాబయోటిక్ చైర్మన్ డాక్టర్ కె.ఐ.వరప్రసాద్‌రెడ్డి, టీఎస్ఐసీసీ వైస్‌చైర్మన్ నర్సింహారెడ్డి ప్రారంభించారు. వివిధ రంగాల్లో రాణించిన సంస్థలు, వ్యాపారవేత్తలకు 60 అవార్డులు అందజేశారు. వ్యాపార రంగంలో అరుదైన సేవలకుగాను 10 మంది లెజెండ్లకు అత్యుత్తమ పురస్కారాలు ఇచ్చారు. లెజెండ్స్ కేటగిరీలో భారతి సిమెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ మార్కెటింగ్ డైరెక్టర్ ఎం.రవీందర్‌రెడ్డి, ప్రపంచ ప్యాకేజింగ్ గ్లోబల్ అంబాసిడర్ చక్రవర్తి ఏవీపీఎస్, మానేపల్లి జ్యువెలరీ చైర్మన్ మానేపల్లి రామారావుకు అందజేశారు.

ఎన్‌టీపీసీకి రెండు హైబిజ్ బిజినెస్ అవార్డులు

'హైబిజ్' సంస్థ ప్రకటించిన బిజినెస్ అవార్డ్స్‌లో కేంద్ర ప్రభుత్వరంగ సంస్థ ఎన్‌టీపీసీ రెండు అవార్డులు దక్కించుకుంది. బెస్ట్ ఎంప్లాయీ ఎంగేజ్‌మెంట్ అండ్ వర్క్‌ప్లేస్ కల్చర్ ఆఫ్ ది ఇయర్ అవార్డుతోపాటు కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబులిటీ ఆఫ్ ది ఇయర్ అవార్డును సంస్థ తరఫున అందుకున్నారు. ఎన్‌టీపీసీ జీఎం (హెచ్ఆర్) ఎస్.ఎన్. పాణిగ్రాహి, కార్పొరేట్ కమ్యూనికేషన్స్ మేనేజర్ ప్రియాంక భుయాన్ ఈ అవార్డులను అందుకున్నారు.

పలు రైళ్ల రద్దు.. మళ్లింపు

సాక్షి, హైదరాబాద్: నాన్ ఇంటర్‌లాకింగ్ పనుల దృష్ట్యా పలు రైళ్లను రద్దు చేయడంతోపాటు మరికొన్నింటిని దారిమళ్లించనున్నట్లు దక్షిణమధ్య రైల్వే సీపీఆర్వో సీహెచ్.రాకేశ్ తెలిపారు. సికింద్రాబాద్ డివిజన్‌లోని మాకుడి–సిర్పూర్‌టౌన్ మధ్య 3వ లైన్ విద్యుదీకరణతో పాటు నాన్ ఇంటర్‌లాకింగ్ పనులను చేపట్టినట్లు పేర్కొన్నారు. ఈ మేరకు దానాపూర్–సికింద్రాబాద్ (03225/03226) ఎక్స్‌ప్రెస్ ఈ నెల 21, 24 తేదీల్లో రద్దు కానుంది. హైదరాబాద్–రెక్సాల్ (07051/07052) ఈ నెల 23, 26 తేదీల్లో, హైదరాబాద్–గోరఖ్‌పూర్ (02575/02576) ఎక్స్‌ప్రెస్ రైళ్లు ఈ నెల 22, 24 తేదీల్లో రద్దు కానున్నాయి. చెన్నై సెంట్రల్–అహ్మదాబాద్, యశ్వంత్‌పూర్–నిజాముద్దీన్ రైళ్లను మళ్లించనున్నారు.

పల్లె జీవితాలపై పిడుగు..



➤ పిడుగుపాటు జీవితాల్ని ఎలా ఛిద్రం చేస్తుందో చెప్పే చిత్రమిది. 2021 సెప్టెంబర్ 3న ఆసిఫాబాద్ మండలం కౌటాల పరిధిలోని ముత్తంపేటలో పున్నయ్య (52), పద్మ (40), శ్వేత పత్తి చేనులో పనులు ముగించుకుని ఎడ్లబండిపై ఇంటి బాట పట్టారు. ఇంతలో ఉరు ములు, మెరుపులతో వర్షం మొదలైంది. అకస్మాత్తుగా ఓ పిడుగు నిప్పులు కురి పించింది. అంతే బండెద్దులతో పాటు పున్నయ్య, పద్మ, శ్వేత అక్కడి కక్కడే దుర్మరణం పాలయ్యారు. ప్రకృతి పగబట్టిన ఈ ఘటనలో విపత్తు సాయం నయా పైసా కూడా బాధిత కుటుంబాలకు అందలేదు.

- తెలంగాణలో గణనీయంగా పెరిగిన పిడుగుల సంఖ్య
- పిడుగుపాట్లకు గురై మరణిస్తున్న వారి సంఖ్యలోనూ పెరుగుదల
- 2022–23లో రాష్ట్రంలో ఏకంగా 2,19,477 పిడుగులు
- ప్రాణాలు కోల్పోతున్న ప్రజలు
- ఎక్కువగా రైతులు, రైతు కూలీలే మరణిస్తున్నారంటున్న నిపుణులు
- 2018 నుంచి ఇప్పటివరకు 316 మంది దుర్మరణం
- అప్రమత్తం చేసే టెక్నాలజీ వచ్చినా పట్టింపే లేని యంత్రాంగం
- బాధిత కుటుంబాలకు అందని విపత్తు సాయం

శ్రీగిరి విజయ్‌కుమార్‌రెడ్డి

'పచ్చని పల్లె జీవితాల్లో పిడుగులు తీరని శోకాన్ని మిగుల్చుతున్నాయి. కోట్ల వోల్టుల శక్తితో దూసుకొస్తూ ప్రాణాలు తీస్తున్నాయి. వాతావరణ మార్పుల కారణంగా భూమిపై పడుతున్న పిడుగుల (క్లౌడ్‌టూ గ్రౌండ్) సంఖ్య ఇటీవలి కాలంలో గణనీయంగా పెరిగింది. అదే స్థాయిలో మరణాలూ పెరిగాయి. తెలంగాణలోనూ ఇదే పరిస్థితి నెలకొంది. మృతుల్లో రైతులు, రైతు కూలీలే ఎక్కువగా ఉంటున్నారని నిపుణులు చెబుతున్నారు. గడిచిన నాలుగున్నర ఏళ్లలో ఏకంగా 316 మంది పిడుగుపాటు కారణంగా చనిపోయారు. ప్రతి ఏటా మే నుంచి అక్టోబర్ వరకు ఉమ్మడి ఆదిలాబాద్, మహబూబ్‌నగర్, వరంగల్ జిల్లాల్లోనే లక్షకు పైగా పిడుగులు పడుతున్నట్లు భారత లైటనింగ్ రిపోర్ట్ 2022–23 తాజా నివేదిక వెల్లడించింది. అయితే పిడుగుపాటు మరణాలు జాతీయ విపత్తు జాబితాలో లేకపోవటంతో మృతుల కుటుంబాలకు ఎలాంటి సాయం అందడం లేదు. పరిహారం అందించే అంశం అధికారులు, ప్రజాప్రతినిధుల దయాదాక్షిణ్యాలపై ఆధారపడి ఉంటోంది. దీంతో బాధిత కుటుంబాలకు పూర్తి స్థాయిలో పరిహారం అందని పరిస్థితి నెలకొంది.

ఉమ్మడి ఆదిలాబాద్, మహబూబ్‌నగర్, వరంగల్ జిల్లాల్లో ఏటా సగటున లక్షకు పైగా పిడుగులు

➤ పొట్టకూటి కోసం మిరపనారు నాటేందుకు వెళ్లిన ఇద్దరు మహిళా కూలీలను పిడుగు కబళించింది. మిరప నారు నాటుతుండగా ఉన్నట్టుండి పిడుగు పడింది. మరుక్షణంలోనే చిలివేరు సరిత (30), నేర్పాటి మమత (32) మృత్యువాత పడ్డారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా చిట్యాల మండలం శాంతినగర్ శివారులో గత మంగళవారం ఈ పిడుగుపాటు సంభవించింది. ఆ ఇద్దరు మహిళల కుటుంబాల్లో చీకట్లు నింపింది.

సాంకేతికత వినియోగంలో విఫలం..

➤ పిడుగుపాటు మరణాలు భారీగా పెరుగుతున్నా జాతీయ, రాష్ట్ర విపత్తు నివారణ సంస్థలు కనీస చొరవ తీసుకోవటం లేదని పర్యావరణవేత్తలు విమర్శిస్తున్నారు. వాస్తవానికి పిడుగులు పడే సమాచారాన్ని ముందే పసిగట్టే సాంకేతికతను (లైటనింగ్ డిటెక్షన్ నెట్‌వర్క్) ఐఐటీ మహారాష్ట్ర ఇప్పటికే అందుబాటులోకి తెచ్చింది. దీంతో 20 నుంచి 40 కి.మీ. పరిధిలో పిడుగుపడే ప్రాంతాలను ముందుగానే గుర్తించి అప్రమత్తం చేయొచ్చు. ఒడిశా, నాగాలాండ్, ఆంధ్రప్రదేశ్ తదితర రాష్ట్ర విపత్తు నివారణ సంస్థలు అందివచ్చిన సాంకేతికతను వినియోగిస్తూ వివిధ మాధ్యమాల్లో ప్రజలను అప్రమత్తం చేస్తున్నాయి. దీంతో ఆయా రాష్ట్రాల్లో గతంలో కంటే మరణాల సంఖ్య తగ్గినట్లు లైటనింగ్ రెసిలెంట్ ఇండియా సంస్థ పేర్కొంది.

పిడుగుల వాన..పిల్లల చదువుకు బ్రేక్



మహబూబ్‌నగర్ జిల్లా గండీడ్ పరిధిలోని పెద్దవార్వాల్‌కు చెందిన కటిక బాలరాజ్(52) ఈ ఏడాది జూన్ 11న రోజు మాదిరిగానే భార్య జమునతో కలిసి మేకలు మేపేందుకు వెళ్లాడు. ఒక్కసారిగా కురిసిన పిడుగుల వర్షంతో 30 మేకలు సహా బాలరాజ్ అక్కడికక్కడే చనిపోగా, జమున తీవ్ర అస్వస్థతకు గురైంది. తండ్రి మరణంతో ఏర్పడిన ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఆయన కూతుళ్లు గౌరేశ్వరి (డిగ్రీ), చందన (ఇంటర్) చదువులు ఆకస్మికంగా ఆగిపోయే పరిస్థితి నెలకొంది.

14వ స్థానంలో తెలంగాణ

మేఘం నుంచి భూమిపై (క్లౌడ్‌టూ గ్రౌండ్) పడే పిడుగుల సంఖ్య ఇటీవలి కాలంలో పెరుగుతోంది. 2022–23లో అత్యధికంగా మధ్యప్రదేశ్ 9,41,663 పిడుగులతో దేశంలో మొదటి స్థానంలోలో ఉండగా, తర్వాతి స్థానాల్లో మహారాష్ట్ర (6,85,893), ఛత్తీస్‌గఢ్ (5,16,504) ఉన్నాయి. తెలంగాణ (2,19,477) ఈ జాబితాలో 14వ స్థానంలో ఉంది.



తెలంగాణలో పిడుగుపాట్లు ఇలా..

సంవత్సరం	పిడుగులు
2019 -20	1,72,503
2020-21	1,47,811
2021-22	1,49,336
2022-23	2,19,477

తెలంగాణలో పిడుగుపాటు మరణాలు ఇలా..

2018	68
2019	21
2020	36
2021	66
2022	72
2023 (ఆగస్ట్ 31)	53

జాతీయ విపత్తులుగా పరిగణించాలి..



పిడుగుపాటుతో అత్యధికంగా మరణిస్తున్నది రైతు కూలీలే. దేశంలో పిడుగుపాటు మరణాలు పెరిగిపోతున్న తీరు ఆందోళనకరంగా మారింది. పిడుగుపాట్లను జాతీయ విపత్తులుగా పరిగణించాలి. బాధిత కుటుంబాలకు పరిహారం అందించాలి. పిడుగులు పడే ప్రాంతాలను ముందుగానే గుర్తించేందుకు, ఆపై ప్రచారం చేసేందుకు కావాల్సిన సాంకేతికత ఇప్పుడు అందుబాటులో ఉంది. కానీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల చొరవ ఆశించిన స్థాయిలో లేకపోవటంతో ఏటా వందల మరణాలు చోటుచేసుకుంటుండటం దురదృష్టకరం.

– కల్నల్ సంజయ్ శ్రీవాత్సవ, లైటనింగ్ రెసిలియెంట్ ఇండియా, న్యూఢిల్లీ

త్వరలో కార్యాచరణ మొదలుపెడతాం



తెలంగాణలోనూ పిడుగుపాటు మరణాలు సంభవిస్తున్నాయి. దీనిపై త్వరలో కార్యాచరణ మొదలుపెడతాం. సాంకేతికతను ఎలా ఉపయోగించుకోవాలి, యంత్రాంగాన్ని ఏ మేరకు సిద్ధం చేయాలన్న అంశంపై త్వరలో సమావేశం ఏర్పాటు చేస్తాం. పిడుగుపాటు మరణాలు, నష్టాలను కూడా జాతీయ విపత్తు జాబితాలో చేర్చాలని కేంద్రాన్ని కోరతాం.

– బి.వినోద్‌కుమార్, ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు

వచ్చే మూడు రోజులు వర్షాలు

సాక్షి, హైదరాబాద్: బంగాళాఖాతంలోని మధ్య భాగం, దాని పరిసరాల్లోని ఉత్తర బంగాళాఖాతంలో ఆవర్తనం నెలకొంది. దీని ప్రభావం వల్ల రాగల 24 గంటల్లో వాయవ్య, పరిసరాల్లోని పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉంది. తరువాత ఇది బలపడి పశ్చిమ వాయవ్య దిశగా కదులుతూ దక్షిణ ఒడిశా, ఉత్తరాంధ్రప్రదేశ్ తీరాలకు చేరుకునే అవకాశం ఉంది. మంగళవారం మరో ఆవర్తనం బంగాళాఖాతంలోని మధ్య భాగం, దాని పరిసరాల్లోని ఉత్తర బంగాళాఖాతం నుండి ఉత్తర ఆంధ్రప్రదేశ్ తీరం వరకు కొనసాగింది. దీంతో కిందిస్థాయిలోని గాలులు తెలంగాణ రాష్ట్రం వైపు వీస్తున్నాయి. ఈ ప్రభావంతో రాగల మూడు రోజులు అక్కడక్కడ కొన్ని తూర్పు, ఈశాన్య తెలంగాణ జిల్లాల్లో వర్షాలు కురిసే అవకాశముందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది.

నెలాఖరులోగా త్రైమాసిక, వార్షిక ఆడిట్ నివేదికలు

రియల్టర్లకు 'రెరా' చైర్మన్ సత్యనారాయణ ఆదేశం



సాక్షి, హైదరాబాద్: రియల్ ఎస్టేట్ రెగ్యులేటరీ అథారిటీ చట్టం కింద రిజిస్ట్రేషన్ పొందిన రియల్ ఎస్టేట్ ప్రమోటర్లు, బిల్డర్లు ఈ నెలాఖరులోగా త్రైమాసిక, వార్షిక ఆడిట్ నివేదికలు తప్పనిసరిగా సమర్పించాలని 'రెరా' చైర్మన్ ఎన్.సత్యనారాయణ ఒక ప్రకటనలో కోరారు. బిల్డర్లు, ప్రమోటర్లు.. తమ రియల్ ఎస్టేట్ ప్రాజెక్టు త్రైమాసిక నివేదికను సెక్షన్ 11(1)(b) ప్రకారం ప్రమోటర్ లాగిన్ ద్వారా 'రెరా' వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాలని ఆదేశించారు. వార్షిక అకౌంట్ ఆడిట్ నివేదికలను సెక్షన్ 4 (2) (l) (D) ప్రకారం ఏటా విధిగా ప్రొవిజన్ 3 ద్వారా వెబ్‌సైటులో అప్‌లోడ్ చేయాలని సూచించారు. త్రైమాసిక నివేదికలు ఏటా ఏప్రిల్ 15, జూలై 15, అక్టోబర్ 15, జనవరి 15 లోగా సమర్పించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. నివేదికలు పంపని ప్రాజెక్టులపై రెరా' చట్టంలోని నిబంధనల మేరకు తగు చర్యలు తప్పవని సత్యనారాయణ హెచ్చరించారు.

తూర్పు సింధూరం

- ప్రతాపసింగారం వద్ద 250 ఎకరాలతో హెచ్ఎండీఏ లే అవుట్
- బోగారం వద్ద మరో 170 ఎకరాల్లో వెంచర్‌కు ప్రణాళికలు
- ఇప్పటికే రైతుల నుంచి భూముల సేకరణ చేపట్టిన హెచ్ఎండీఏ
- త్వరలో లే అవుట్ ఏర్పాటుకు కార్యాచరణ
- వివిధ ప్రాంతాల్లో మొత్తం వెయ్యి ఎకరాల సేకరణపై కసరత్తు

మరో టౌన్‌షిప్‌కు శ్రీకారం



సాక్షి, హైదరాబాద్: హైదరాబాద్ మహానగరానికి తూర్పు వైపున మరో భారీ లే అవుట్‌కు హెచ్ఎండీఏ కసరత్తు చేపట్టింది. అన్ని వైపులా నగరం శరవేగంగా విస్తరిస్తోంది. ఇటీవల కోకాపేట్, మోకిలా, బుద్వేల్, తదితర ప్రాంతాల్లో హెచ్ఎండీఏ సొంత స్థలాల్లో నిర్వహించిన ఆన్‌లైన్ బిడ్డింగ్‌కు అనూహ్యమైన స్పందన లభించిన సంగతి తెలిసిందే. గతంలో ఉప్పల్ భగాయత్‌లోనూ కొనుగోలుదారులు పెద్దసంఖ్యలో పోటీపడ్డారు. ఇక్కడ మూడు దఫాలుగా బిడ్డింగ్ నిర్వహించి ప్లాట్‌లను విక్రయించారు. తాజాగా ఉప్పల్ భగాయత్ తరహాలోనే ప్రతాప సింగారంలో భారీ లే అవుట్‌ను వేసేందుకు హెచ్ఎండీఏ చర్యలు చేపట్టింది. ఇందుకోసం రైతుల నుంచి భూసేకరణ చేపట్టింది. ఇప్పటి వరకు సుమారు 250 ఎకరాల భూములను సేకరించినట్లు అధికారులు తెలిపారు. రైతులకు, హెచ్ఎండీఏకు మధ్య ఒప్పందం కుదిరితే త్వరలోనే ఇక్కడ లే అవుట్ ఏర్పాటు చేయనున్నారు. రైతుల నుంచి సేకరించిన భూములను అభివృద్ధి చేసి వెంచర్ చేసిన తరువాత రైతులకు 60 శాతం చొప్పున తిరిగి ఇస్తారు. 40 శాతం భూములను హెచ్ఎండీఏ తీసుకుంటుంది. ఈ లెక్కన ప్రతాపసింగారంలో 250 ఎకరాలను ఇచ్చేందుకు రైతులు ముందుకు వచ్చారు. అలాగే కీసర సమీపంలోని బోగారంలోనూ మరో 170 ఎకరాల వరకు లే అవుట్‌కు సిద్ధంగా ఉందని అధికారులు పేర్కొన్నారు. రైతులతో చర్చలు తుది దశకు చేరుకున్నాయని, త్వరలోనే రెండు చోట్ల ప్లాట్‌లను అమ్మకానికి సిద్ధం చేయనున్నట్లు ఒక అధికారి వివరించారు.

తూర్పు వైపు విస్తరణపై దృష్టి...

హెచ్ఎండీఏ ఆధ్వర్యంలో నగరానికి అన్ని వైపులా సొంత భూములతోపాటు రైతుల నుంచి సేకరించిన భూములను అభివృద్ధి చేసి విక్రయిస్తున్నప్పటికీ ఇటీవల కాలంలో పడమటి వైపున రియల్టర్లు, బిల్డర్ల నుంచి పెద్ద ఎత్తున స్పందన లభిస్తోంది. ఐటీ సంస్థలు, పలు అంతర్జాతీయ సంస్థలు సైతంపడమటి వైపే విస్తరించుకొని ఉండడం, హైరైజ్ భవనాల నిర్మాణానికి అనుమతులు లభించడంతో కొనుగోలుదారులు సైతం ఇటు వైపు ఆసక్తి చూపుతున్నారు. కోకాపేట్ చుట్టుపక్కల ప్రాంతాల తరువాత బుద్వేల్ హాట్‌కేక్‌గా మారింది. ప్రస్తుతం ఈ రెండు చోట్ల విక్రయాలు పూర్తి కావడంతో హెచ్ఎండీఏ తూర్పు వైపున దృష్టి సారించింది. గతంలో మేడిపల్లి, బోడుప్పల్, తొర్రూరు తదితర చోట్ల స్థలాలను విక్రయించారు. సొంత ఇళ్ల నిర్మాణానికి ఈ లే అవుట్‌లు అనుకూలంగా ఉండడంతో మధ్యగతరగతి వర్గాలు,ఎన్నారైలు ఎక్కువగా కొనుగోలు చేశారు. ఈ క్రమంలోనూ మరోసారి తూర్పు వైపున కొనుగోలుదారులను ఆకట్టుకొనేందుకు ఈ భారీ లే అవుట్‌లను ఏర్పాటు చేయనున్నట్లు అధికారులు చెప్పారు. ప్రతాప సింగారం వద్ద 250 ఎకరాల్లో, బోగారంలోని 170 ఎకరాల్లోనూ సామాన్య, మధ్యతరగతి వర్గాలకు అందుబాటులో ఉండేందుకు అనుగుణంగా బహుళ ప్రయోజనకరంగా ప్లాట్‌లను ఏర్పాటు చేయనున్నారు. కనిష్ఠంగా 250 గజాల నుంచి గరిష్ఠంగా వెయ్యి గజాల వరకు ప్లాట్లు ఉంటాయి. రైతుల నుంచి భూ సేకరణ ప్రక్రియ తాజాగా తుది దశకు వచ్చిన దృష్ట్యా దసరా నాటికి లే అవుట్‌లను అభివృద్ధి చేసి విక్రయానికి సిద్ధం చేయనున్నట్లు ఒక అధికారి వివరించారు.

వెయ్యి ఎకరాల అభివృద్ధికి ప్రణాళికలు...

ప్రతాపసింగారం, బోగారంలతో పాటు కుర్మల్‌గూడ, దండుమల్కాపురం, లేమూరు, ఇన్ముల్‌నెర్వ, కొర్రెములు, నాదర్‌గుల్ తదితర ప్రాంతాల్లో నిరుపయోగంగా ఉన్న సుమారు వెయ్యి ఎకరాల భూములను గుర్తించారు. ఇప్పటికే ఇన్ముల్‌నెర్వలోని 96 ఎకరాలు, లేమూరులో మరో 83 ఎకరాల భూములలో రోడ్లు, తదితర మౌలిక సదుపాయాల ఏర్పాటు కోసం చర్యలు చేపట్టారు.మిగతా చోట్ల కుర్మల్‌గూడలో 92 ఎకరాలు, దండుమల్కాపురంలో మరో 355 ఎకరాల చొప్పున భూమి అందుబాటులో ఉంది. ఇప్పటి వరకు వివిధ ప్రాంతాల్లో 924 ఎకరాలకు పైగా భూములను గుర్తించగా, ఈ భూముల సేకరణ పూర్తయ్యేనాటికి మరికొంతమంది రైతులు ముందుకు వచ్చే వచ్చే అవకాశం ఉంది. దీంతో సుమారు వెయ్యి ఎకరాల వరకు సేకరించి అభివృద్ధి చేయనున్నారు. హెచ్ఎండీఏ వెంచర్‌లలో ప్లాట్‌లు హాట్‌కేకుల్లా అమ్ముడు కావడం వల్లనే అటు కొనుగోలుదారులతో పాటు, ఇటు రైతులు కూడా హెచ్ఎండీఏ పట్ల ఆసక్తి చూపుతున్నారు. లే అవుట్‌ల అభివృద్ధి కోసం హెచ్ఎండీఏ అన్ని ఖర్చులను భరించి అభివృద్ధి చేసి ఇవ్వడంతో రైతులు స్వచ్ఛందంగా ముందుకు రావడం గమనార్హం.

మరిన్ని పెలికాన్ సిగ్నళ్లు

పాదచారుల సమస్యలకు ప్రాధాన్యం ఇవ్వాలి

- జీహెచ్ఎంసీ కమిషనర్ సూచన
- ట్రాఫిక్ సిగ్నల్స్‌పై సమీక్ష


సాక్షి, హైదరాబాద్: గ్రేటర్ నగరంలో ఇప్పటికే ఉన్న ఏరియాలతో పాటు మరికొన్ని ప్రాంతాల్లో పెలికాన్ సిగ్నల్స్ ఏర్పాటుకు తగిన చర్యలు తీసుకోవాలని జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్‌రాస్ అధికారులకు సూచించారు. పాదచారుల భద్రతకు అవి అవసరమన్నారు. నగరంలో సిగ్నల్ వ్యవస్థ మెరుగుపరిచేందుకు తీసుకోవాల్సిన చర్యలపై మంగళవారం జీహెచ్ఎంసీ ఇంజినీరింగ్, పోలీసు, విద్యుత్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, జీహెచ్ఎంసీ, పోలీసుశాఖల సమన్వయంతో ఏటీఎస్‌సీ (అడాప్టివ్ ట్రాఫిక్ కంట్రోల్‌సిస్టమ్), పెలికాన్‌సిగ్నల్స్ తదితరమైనవి వెరసి మొత్తం 404 ప్రాంతాల్లో సిగ్నళ్లు ఉన్నాయన్నారు. వీటిల్లో ఏటీఎస్‌వి పాతవి 169, కొత్తగా ఏర్పాటు చేసినవి 113 వెరసి మొత్తం 282 జంక్షన్లలో ఉన్నాయన్నారు. పాదచారుల భద్రత కోసం వారు ప్రమాదాల బారిన పడకుండా ఉండేందుకు 78 పెలికాన్ సిగ్నల్స్ ఏర్పాటు చేసినట్లు చెప్పారు. పాదచారుల అవసరాలకు ఇవి సరిపోవడం లేవని, ట్రాఫిక్ రద్దీ అధికంగా ఉన్న పలు ప్రాంతాల్లో వారు ఇబ్బందులు పడుతున్నారంటూ మరిన్ని ప్రాంతాల్లో పెలికాన్ సిగ్నల్స్ ఏర్పాటు చేయాలన్నారు.

నాలుగు విధాలుగా సిగ్నలింగ్ సిస్టం

ప్రస్తుతం నగరంలో నాలుగు విధాలుగా సిగ్నలింగ్ సిస్టమ్ పనిచేస్తోందని అధికారులు తెలిపారు. వాటిలో...1.ఫిక్స్‌డ్ టైమ్‌తో పనిచేసేవి, 2.మాన్యువల్‌గా పనిచేసేవి, 3. వెహికల్ యాక్టివ్ కంట్రోల్ (వీఏసీ)అంటే జంక్షన్‌లో వాహన రద్దీని బట్టి వాహనాలు ఎక్కువ ఉన్న వైపు గ్రీన్, లేని వైపు రెడ్ లైట్ ఆటోమేటిక్‌గా పడుతుంది. ఈమూడు లోకల్ సిస్టమ్‌తో పనిచేసేవి. నాల్గవది ఏటీఎస్‌సీ కమాండ్ కంట్రోల్ సెంటర్ ద్వారా జంక్షన్లలోని వాహనరద్దీని బట్టి పనిచేస్తుంది. వీటిల్లో వీఏసీని ఎక్కువ ప్రాంతాల్లో వినియోగిస్తే సమయం కలిసి వస్తుందని సమావేశంలో అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. సమావేశంలో పోలీస్ అడిషనల్ కమిషనర్ (ట్రాఫిక్) సుధీర్‌బాబు, ఈఎన్‌సీ జియావుద్దీన్, ఎలక్ట్రికల్ ఎస్ఈ శ్రీనివాస్, ఈఈ మమత, ట్రాఫిక్ సిగ్నల్స్ నిర్వహిస్తున్న ఏజెన్సీ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఆర్ఓబీ పనులు వెంటనే చేపట్టాలి

నగరంలో రవాణా వ్యవస్థను మెరుగు పరచడానికి చేపట్టిన రైల్వే ఓవర్ బ్రిడ్జి (ఆర్ఓబీ) పనులను వెంటనే చేపట్టాలని కమిషనర్ రోనాల్డ్ రోస్ రైల్వే అధికారులను కోరారు. ఫలక్‌నుమా, శాస్త్రి పురం ఆర్ఓబీలు, యాకుత్‌పురా ఆర్‌యూబీ పనులు ఇంకా చేపట్టక పోవడం వల్ల ట్రాఫిక్ కు అంతరాయం కలుగుతోందన్నారు.ఫలక్‌నుమా, శాస్త్రీపురం ప్రాంతాల్లో పర్యటించిన కమిషనర్ ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఆ పనులు వెంటనే చేపట్టాలన్నారు. పాతబస్తీలో రోడ్ల వెడల్పు పనులు చేపట్టనున్న ప్రాంతాలను కూడా పరిశీలించారు. రోడ్ల వెడల్పు చేయాల్సిన ప్రాంతాల్లో భూసేకరణ పనులు వేగవంతంగా పూర్తిచేయాలని టౌన్‌ప్లానింగ్ అధికారులను ఆదేశించారు.



సమావేశంలో పాల్గొన్న కమిషనర్ రొనాల్డ్ రాస్

త్వరితగతిన ఫతేనగర్ ఎస్టీపీ

సాక్షి, హైదరాబాద్: ఫతేనగర్ ఎస్టీపీ నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేసి ప్రారంభానికి సిద్ధం చేయాలని జలమండలి ఎండీ దానకిశోర్ అధికారులను ఆదేశించారు. జలమండలి ఎస్టీపీ ప్రాజెక్టులోని ప్యాకేజీ– 3 లో భాగంగా నిర్మిస్తున్న ఫతేనగర్ ఎస్టీపీని మంగళవారం ఆయన సందర్శించారు. ఈ సెప్టెంబరు నెలాఖరుకి పూర్తి చేసేందుకు అనుసరించాల్సిన విధానాలు, తీసుకోవాల్సిన చర్యల గురించి నిర్మాణ సంస్థల ఉన్నత స్థాయి ప్రతినిధులతో చర్చించారు. ఈ సందర్భంగా ఎండీ మాట్లాడుతూ 133 ఎంఎల్డీల సామర్థ్యం కలిగిన ఈ ఎస్టీపీని ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని పనులు పూర్తిచేయాలని సూచించారు. దీనికి సంబంధించిన సివిల్ పనులు ఇప్పటికే పూర్తయి..యంత్రాల బిగింపు పనులు కొనసాగుతున్నాయని అధికారులు ఆయనకు తెలిపారు. మరోవైపు అంతర్గత రహదారులు, సీసీ రోడ్ల నిర్మాణ పనుల్లో వేగం పెంచాలని పేర్కొన్నారు. విద్యుత్తు సరఫరా కోసం ట్రాన్స్ ఫార్మర్, కేబులింగ్ పనుల్నీ తొందరగా పూర్తి చేయాలని సూచించారు. సుందరీకరణ కోసం గార్డెనింగ్, ల్యాండ్ స్కేప్ పనులు చేపట్టాలన్నారు. పనులు జరిగే ప్రదేశంలో కార్మికుల రక్షణకు కచ్చితమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో ఈడీ డా.ఎం. సత్యనారాయణ, ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీధర్ బాబు, ఎస్టీపీ సీజీఎం రఘు, జీఎం, ఇతర అధికారులు, నిర్మాణ సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.



తృటిలో తప్పిన ముప్పు





ఎంటేరు వాగుపై కల్వర్టు వద్ద అదుపుతప్పిన స్కూలు బస్సు(ఇన్‌సెట్‌లో) బస్సును జేసీబీతో తీస్తున్న దృశ్యం

- అదుపు తప్పి వరద నీటిలోకి దూసుకెళ్లిన స్కూలు బస్సు
- డ్రైవర్ నిర్లక్ష్యంతోనే జరిగిందని స్థానికుల ఫిర్యాదు
- చిన్నారులు క్షేమం

శంషాబాద్ రూరల్: ఓ ప్రైవేటు స్కూలు బస్సు అదుపుతప్పి వాగుపక్కన వరద నీటిలోకి దూసుకెళ్లింది. తృటిలో పెద్ద ప్రమాదం తప్పింది. మండలంలోని సుల్తాన్‌పల్లి–కేబీ దొడ్డి గ్రామాల మధ్యలో ఉన్న ఎంటేరు వాగులో వర్షాల కారణంగా వరదనీరు పారుతోంది. వాగుపై సుల్తాన్‌పల్లి శివారులో చిన్న కల్వర్టు ఉంది. ఏడాది కిందట ఈ కల్వర్టు పూర్తిగా దెబ్బతిని రెండు చోట్ల భారీ గుంతలు పడ్డాయి. ఇదిలా ఉండగా.. మంగళవారం వాగులో వరద పెరగడంతో రాకపోకలను నిలిపివేశారు. ఇరు వైపులా గ్రామాల శివారులో పోలీసులు బారికేడ్లు పెట్టారు. ఉదయం ఓ ప్రైవేట్ స్కూలు బస్సు కేబీ దొడ్డి వద్ద ఆరుగురు విద్యార్థులను ఎక్కించుకుని ఎంటేరువాగు మీదుగా సుల్తాన్‌పల్లి వైపు వెళ్తుండగా.. వాగులో వరద ఎక్కువగా ఉందని అటు వైపు వెళ్లవద్దని స్థానికులు బస్సు డ్రైవర్‌కు సూచించారు. ఇవేవి లెక్క చేయకుండా డ్రైవర్ బారికేడ్లను తొలగించి బస్సుతో ఎంటేరువాగు వద్దకు చేరుకున్నాడు. కల్వర్టు సమీపంలోకి రాగానే వరద నీళ్లలో దారి కనిపించక బస్సు అదుపుతప్పి రోడ్డు కిందకు దిగింది. ఈ క్రమంలో బస్సు ఓ వైపు ఒరిగిపోవడంతో భయంతో విద్యార్థులు కేకలు వేశారు. గమనించిన స్థానికులు వెళ్లి విద్యార్థులను జాగ్రతగా బయటకు తీసుకొచ్చారు. బస్సు మరింత ముందుకు వెళ్లి ఉంటే వరదనీటిలో కొట్టుకుపోయేదని విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేశారు.

జేసీబీతో బస్సు తొలగింపు..

రోడ్డు పక్కన ఇరుక్కుపోయిన స్కూలు బస్సును స్థానికులు జేసీబీతో అక్కడి నుంచి తొలగించారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని వాహనాల రాకపోకలను పూర్తిగా నిలిపివేశారు.

Published and printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published from Vishnu Motor Plaza,2nd Floor, 31-A, Jawaharlal Nehru Road, Ekkattuthangal, Chennai -600 032 and Printed at Dangat Media Pvt Ltd.,22 Dighe MIDC, Navi Mumbai, Maharashtra- 400708, MNS Printers Private Limited, Survey no. 76/1, Noombal Village, Velappanchavadi, Poonamallee High Road, Chennai - 600 077. Jagati Publications Limited, Survey No.172, Vegata Village, Jadigenalhalli, Hoskote Taluk,Bangaluru Rural Dist, Impression Printing & Packaging Limited, C-18-19-20, Sector -59, Noida, Uttar Pradesh-201 301. Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) RNI No:TNTEL/2008/25943